# జానపద సాహిత్యం

## ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

### సెమిస్టర్-III, పేపరు-III

### పాఠ్య రచయితలు


**డా॥ ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**ఆచార్య మన్నవ సత్యనారాయణ,**
ఎం.ఏ., పిహెచ్.డి.
పూర్వ ఆచార్యులు
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ కె. లలిత కుమారి,**
ఎం.ఏ., ఎం.ఏ., పిహెచ్.డి.
అతిథి అధ్యాపకులు
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ కె. బలరాం**
ఎం.ఏ., ఎం.ఫిల్, పిహెచ్.డి., ఎం.ఇడి.
అతిథి అధ్యాపకులు
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.

**డా॥ పి. వాసు,**
ఎం.ఏ., పిహెచ్.డి.
అతిథి అధ్యాపకులు,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


### *సంపాదకులు & సమన్వయకర్త*


**డా॥ ఇరపని మాధవి,**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్.


### *డైరక్టర్*


**డా॥ నాగరాజు బట్టు,**
**ఎం.హెచ్.ఆర్.ఎం., ఎం.బి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. (సై.), ఎం.ఏ (సో.), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.**

**దూర విద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్-522 510.
ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్: www.anucde.info ఇ-మెయిల్: anucdedirector@gmail.com

# ఎం.ఏ. తెలుగు - జానపద సాహిత్యం

First Edition: 2023

No. of Copies:

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. TELUGU - JANAPADA SAHITYAM**, Semester III, Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only.

**Published by:**

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Printed at:**

## ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యాకేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యాకేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**సిలబస్**

# ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

## సెమిస్టర్-III, పేపరు-III

## 303TL21-జానపద సాహిత్యం

1. జానపద విజ్ఞాన వర్గీకరణ ప్రయోజనాలు- ప్రాచ్య పాశ్చాత్యుల కృషి
2. జానపద, శిష్ట సాహిత్యాలు - తులనాత్మకత
3. జానపద గేయ లక్షణాలు - వర్గీకరణ - శ్రామిక, బాంధవ్య, బాలగేయాలు - వేడుక పాటలు - స్త్రీల పాటలు, శృంగార, కరుణ, హాస్య గేయాలు- భక్తి గీతాలు
4. జానపద కథా గేయాలు - లక్షణాలు - వర్గీకరణ, పౌరాణిక - అద్భుత-కరుణ రస కథా గేయాలు - ఊర్మిళాదేవి నిద్ర - లక్ష్మణ దేవర నవ్వు - ధర్మరాజు జూదం - శ్రీకృష్ణ జననం - బాల నాగమ్మ - లక్ష్మమ్మ, వీర గాథలు - స్వరూప స్వభావాలు - పల్నాటి వీర చరిత్ర - కాటమరాజు కథ - బొబ్బిలి యుద్ధం - సర్వాయి పాపని కథ
5. జానపద గద్యాఖ్యానాలు - వర్గీకరణ - పురాగాథాలు - ఐతిహ్యాలు - జానపద కథలు (అద్భుత కథలు - వినోదాత్మక కథలు - నీతి కథలు - సమస్యాత్మక కథలు) - సామెతలు - పొడుపు కథలు - వర్గీకరణ లక్షణాలు.

**ఆధార గ్రంథాలు:**


1. తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు.
2. జానపద గేయ వాఙ్మయ పరిచయము - హరి ఆదిశేషు.
3. జానపద వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం.
4. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం.
5. జానపద విజ్ఞాన వ్యాసావళి - జి.యస్. మోహన్.
6. తెలుగు వీరగాథా కవిత్వం - టి.వి. సుబ్బారావు.
7. తెలుగు జానపద గేయ కథలు - నాయని కృష్ణ కుమారి.
8. తెలుగు సామెతలు - జన జీవనం - పి. నరసింహా రెడ్డి.
9. చిత్తూరు జిల్లా జానపద గేయాలు - కె.మునిరత్నం.
10. జానపద శృంగార గేయాలు - పేట శ్రీనివాసులు రెడ్డి.

# విషయ సూచిక

## జానపద సాహిత్యం


| సంఖ్య | పాఠం | పుట |
|---|---|---|
| 1. | జానపద విజ్ఞానం | 1.1 - 1.8 |
| 2. | జానపద విజ్ఞానధ్యయనంలో ప్రాచ్య పాశ్చాత్యుల కృషి | 2.1 - 2.12 |
| 3. | శిష్ట సాహిత్యం-జానపద సాహిత్యం-తులనాత్మక అధ్యయనం | 3.1 - 3.5 |
| 4. | జానపద గేయ సాహిత్యం | 4.1 - 4.17 |
| 5. | భక్తి గేయాలు-కన్నీటి పాటలు | 5.1 - 5.15 |
| 6. | హాస్య గీతాలు, శృంగార గీతాలు | 6.1 - 6.20 |
| 7. | జానపద కథా గేయాలు - లక్షణాలు - వర్గీకరణ | 7.1 - 7.6 |
| 8. | జానపద పౌరాణిక, అద్భుత, కరుణ రస కథా గేయాలు | 8.1 - 8.22 |
| 9. | జానపద వీరగాథలు | 9.1 - 9.15 |
| 10. | గద్యాఖ్యానాలు | 10.1 - 10.20 |
| 11. | సామెతలు-పొడుపు కథలు | 11.1 - 11.18 |

## పాఠం - 1

# జానపద విజ్ఞానం

### 1.0. లక్ష్యం:

విద్యార్థులు జానపద విజ్ఞాన నిర్వచనం, భాగాలు, స్వభావాలను మరియు ప్రయోజనాల గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**


1.1. ఉపోద్ఘాతం

1.2. ప్రవేశిక

1.3. జానపద విజ్ఞానం – నిర్వచనం

1.4. జానపద విజ్ఞానం – ప్రధాన భాగాలు

1.5. జానపద సాహిత్యం – స్వరూప స్వభావాలు (లక్షణాలు)

1.6. జానపద విజ్ఞానం వల్ల ప్రయోజనాలు

1.7. నమూనా ప్రశ్నలు

1.8. ఆధార గ్రంథాలు


**జానపద విజ్ఞానం నిర్వచనం – వర్గీకరణ – ప్రయోజనాలు:**

### 1.1. ఉపోద్ఘాతం:

"జనానామ్ పదమ్ జానపదమ్" అని జానపద శబ్దానికి నిర్వచనం చెప్పబడింది. జానదపం, జనపదం, జానపదుడు అనేది తెలుగు సాహిత్యంలో జానపద వాఙ్మయాన్ని గురించి చెప్పేటప్పుడు ప్రయోగించటం కలదు. జన సామాన్యంలో జానపదమన్నా, జనపదమన్నా ఒక్కటే అర్థం ఉచరణలో ఉంది. జానపదం అంటే పల్లెటూరు లేదా గ్రామం అనే అర్థం ప్రచారంలో వుంది. జనపదంలో ఉండే వారు జానపదులు. ఆ జనపదులకు సంబంధించినదియే జానపదం అంటారు. జానపదత్వంతో కూడినది ఏదైనా... అది ప్రదర్శన రూపమైనా, భావరూపంలో వున్నా, వస్తు రూపంలో వున్నా, అదంతా జానపదత్వంతో కూడుకుని ఉండటం వల్ల అది జానపదం అవుతుంది.

### 1.2. ప్రవేశిక:

ఈ జానపద విషయాన్ని నైఘంటి కార్థంలో పరిశీలించి చూస్తే జానపద, జనపద అనే శబ్దాలకు గ్రామం, పల్లె లేకపోతే జనులుండుతావు అని అర్థాలు సూచించబడుతున్నాయి. అంటే ఇదిమిద్దంగా జానపదుడు అనే శబ్దానికి మనుష్యుడు, గ్రామ వాసి, పల్లె యందుండు వాడు అనే అర్థాలు మనకు నిఘంటువు అర్థాలుగా కనిపిస్తాయి.

జానపద విజ్ఞానం అనే మాటను అంగ్ల భాషలోని Folk Lore అనే పదానికి సమానార్థకంగా వాడుతున్నాం. జానపదులకు సంబంధించిన ఆచారాలు, నమ్మకాలు, కథా గేయాలు, సామెతలు మొదలైన వానికి చెందిన విజ్ఞానాన్ని జానపద విజ్ఞానం అనవచ్చు.

### 1.3. జానపద విజ్ఞానం – నిర్వచనం:

వివిధ నిఘంటువులు Folk Lore అంటే జానపద విజ్ఞానం అని నిర్వచించాయి. జానపదం అనే పదానికి పట్టణానికి

భిన్నమైనదని, జానపదుడు అంటే నాగరికునికి భిన్నమైన వాడని నిఘంటువుల వలన అర్ధమౌతుంది. దీనిని బట్టి అక్షర జ్ఞానం లేని పల్లెటూరి వారికి సంబంధించిన విషయాలను జానపద విజ్ఞానంగా చెప్పుకోవచ్చు.

జానపదులంటే కేవలం గ్రామవాసులే కానవసరం లేదని, సమాన ధర్మాలు కలిగిన ఏ జన సమూహన్నయినా జానపదులుగా భావించవచ్చని అలెన్ డండస్ అభిప్రాయపడ్డాడు. సమాన ధర్మం అంటే ఒకే జాతికి లేదా మతానికి లేదా వృత్తికి సంబంధించిన వారు కావచ్చు అని అలెన్ డండస్ చెప్పాడు.

"జానపద మనస్తత్వం కలిగిన జన సమూహంలో సాంప్రదాయకంగా గానీ, మౌఖికంగా గానీ, అభ్యాసం వల్ల గాని, పరోక్షంగా గానీ, ప్రసారం పొందే వివిధ పాఠాలు కలిగిన సంస్కృతి సంబంధమైన విషయాలను జానపద విజ్ఞానం అనవచ్చు" అని ఆర్.వి.ఎస్. సుందరం గారు నిర్వచించారు. ఇది బ్రూస్ బ్రాండ్ చెప్పిన నిర్వచనానికి దగ్గరగా ఉంది.

జానపద విజ్ఞానం సంస్కృతిలోని, జీవితంలోని అన్ని విషయాలను తనలో ఇముడ్చుకోగలిగినంత విశాలమైనది కాబట్టి దానిని నిర్వచించడం కష్టంతో కూడిన పని.

## 1.4. జానపద విజ్ఞానం – ప్రధాన భాగాలు:

జానపద విజ్ఞానంలో వాగ్రూప జానపద విజ్ఞానం (Verbal Folk Lore) వాగ్రూపేతర జానపద విజ్ఞానం (Non Verbal Folk Lore) అని రెండు ప్రధాన భాగాలు ఉన్నాయి. మౌఖికంగా ఉండేది మొదటి భాగం. నమ్మకాలు, ఆచారాలు, దుస్తులు, అలంకారాలు మొదలైనవి రెండో భాగం.

జానపద విజ్ఞానాన్ని Richard M. Dorsan అనే పండితుడు నాలుగు శీర్షికల క్రింద వర్గీకరించారు. అవి:

1) మౌఖిక సాహిత్యం 2) సాంఘీక జానపద ఆచారాలు

3) వస్తు సంస్కృతి 4) జానపద ప్రదర్శన కళలు.

**1.4.1. మౌఖిక సాహిత్యం:** దీన్ని ఆంగ్లంలో Oral Literature అంటారు. ముఖోద్గతంగా వెలువడే పాట, మాట మొదలైనవి మౌఖిక సాహిత్యంలోకి వస్తాయి. జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఐతిహ్యాలు, వచన రూపంలోని కథలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవి – మౌఖిక సాహిత్యంలో భాగాలు అవుతాయి.

ముఖం నుండి వెలువడినదంతా వాగ్రూపంలో ఉండకపోవచ్చు. ఆశ్చర్యార్థకాలు, సంభోదనలు, మెచ్చుకోళ్ళు, అరుపులు, కేకలు, సంజ్ఞలు, పిలుపులు, మచ్చిక కూతలు, శోకాలాపాలు మొదలయినవి వాగ్రూపంలో లేకపోయినా ముఖం నుండి వెలువడతాయి. కాబట్టి అవి మౌఖిక సాహిత్యం అవుతాయి. సాంప్రదాయ బలంతో వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్నవన్నీ మౌఖిక సాహిత్యంగా చెప్పుకోవచ్చు ఇది జానపద విజ్ఞానంలో ఒక భాగం.

**1.4.2. సాంఘీక జానపద ఆచారాలు:** దీనిని ఆంగ్లంలో Social Folk Customs అంటారు. సాంఘిక ఆచారాలకు సంబంధించిన జననం, మరణం, వివాహం, పురుడు, వీనికి చెందిన ఆచారాలు, కుటుంబ సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వేడుకలు, వినోదాలు, ఆటలు, ప్రభలు, మంత్రతంత్రాలు, మందులు, మాయలు, కట్టుబోట్టు విద్యలు, దిగదుడుపులు, దిష్టి తీయడం, దానం, ధర్మం, పూజలు, విన్యాసాలు, శకునాలు, పందెములు, భూతవైద్యం, మూలికా వైద్యం, రాక్షస వైద్యం, తీర్థాలు, విభూతి, మతం మొదలైనవి జానపద సాంఘిక ఆచారాలు అనే విభాగానికి చెందుతాయి. ఇది జానపద విజ్ఞానంలో ఒక

భాగం.

**1.4.3. వస్తు సంస్కృతి:** దీనిని ఆంగ్లంలో Material Culture అంటారు. భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులు, అన్ని విషయాలు ఈ విభాగంలో చేరుతాయి. వివిధ రకాలైన వృత్తులు-కుటీర పరిశ్రమలకు సంబంధించిన నేర్పు, వంటలు, వార్పులు, పానీయాలకు సంబంధించిన పాక కళ, నిర్మాణ వాస్తు విజ్ఞానం, నేత, అల్లిక, కుట్టు పని, వ్యవసాయ పద్ధతులు, వివిధ వృత్తులకు సంబంధించిన సాధనాలు, వాహనాలు, అలంకరణలు, ఆభరణాలు, పూజా సామాగ్రి, విగ్రహాలు, ముగ్గులు, మూలాకార విద్య, జలచర వేట, భూచర వేట, ఖేచరాల వేట మొదలైనవన్నీ ఈ విభాగంలోని అంశాలే, ఇది జానపద విజ్ఞానంలోని ఒక భాగం.

**1.4.4. జానపద ప్రదర్శన కళలు:**

దీనిని ఆంగ్లంలో Performing Folk Arts అని అంటారు. వ్యక్తిగత నృత్యాలు, బృంద నృత్యాలు, గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాట, బుట్ట బొమ్మలాట యక్షగానం, వీధి నాటకం, గొల్ల భాగవతం, చిందు భాగవతం, కొరవంజి, భజన, పగటి వేషం, పులి వేషం, భంగిమ, కోలాటం, గారడి విద్య, మోది, గుర్రపు నాట్యం మొదలైనవి ప్రదర్శించడానికి యోగ్యమైన కళలు అన్ని ఈ విభాగంలో చేరుతాయి. జానపద కళల్లో చేరవలసిన శిల్పం, చిత్రకళ వస్తు సంస్కృతిలో చేర్చడం సమంజసంగా లేదు. ఇది జానపద విజ్ఞానంలోని ఒక విభాగం.

డార్సన్ చేసిన ఈ విభజన శాస్త్రీయంగా ఉన్నా అందులో కొన్ని అతి వ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయి. R.S. Boggs జానపద విజ్ఞానాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడానికి వీలుగా సూక్మాతి సూక్ష్మ విశ్లేషణ చేశాడు. వీరు జానపద విజ్ఞానంలోని ముఖ్య విభాగాలను గ్రూప్ అనే పేరుతో విభజించి వాటికి గుర్తులుగా ఇంగ్లీషులోని ABCD అనే అక్షరాలను సూచించాడు.

- సాధారణ జానపద విజ్ఞానం [General Folk Lore]
- గద్యాఖ్యానం [Prose Narrative]
- కథా గేయం, గేయం, నృత్యం, ఆట, సంగీతం, గద్యం [Ballered, Song, Dance, Game, Music, Verse]
- నాటకం [Drama]
- ఆచారం, ఉత్సవం [Custom, Festival]
- భూగోళం [Geography]
- భాష [Language]
- కళ, చేతి పనులు, వాస్తు [Arts, Craft, Architecture]
- ఆహారం, పానీయం [Food, Drink]
- నమ్మకం [Belief]
- వాక్కు [Speech]
- సామెత [Proverb]
- పొడుపు కథ [Riddle]

పై గ్రూపు నుండి R.S. Boggs కొన్ని వర్గాలుగా విభాగం చేశాడు. ఉదాహరణకు B గణం గద్యాఖ్యానాన్ని పురాణం, ఐతిహ్యం, కథ అని విభజించాడు. దీనిని మళ్ళీ Types (మాదిరులుగా) మాదిరిని Form (ప్రక్రియలుగా), ప్రక్రియలను Division (విభాగాలు, విభాగాలనుగా) Sub-Divisions (ఉప విభాగాలుగా) విభజించాడు. ఇలా విభాగాలుగా చేయడం వల్ల ఎంతటి సూక్ష్మ అంశాన్నైనా సులభంగా గుర్తించవచ్చు.

జానపద విజ్ఞానాన్ని విభాగాలుగా చేయడం వల్ల అది ఏ దేశానికి, ఏ భాషకు సంబంధించిందో శాస్త్రీయంగా విశ్లేషించే అవకాశం కలిగింది. అప్పుడే మరింత స్పష్టంగా జానపద విజ్ఞానంలోని అంశాలకు సంబంధించిన స్వరూప స్వభావాలు తెలుస్తాయి.

## 1.5. జానపద సాహిత్యం-స్వరూప స్వభావాలు (లక్షణాలు):

జానపదుల వ్యవహారంలో ఉన్న సాహిత్యాన్ని జానపద సాహిత్యం అని చెప్పుకోవచ్చు. ఈ జానపద సాహిత్యమే శిష్ట సాహిత్యానికి మాతృక వంటిది. జానపద సాహిత్య స్వరూపాలు జానపద సాహిత్యంలోని అన్ని శాఖలకు ఒకే విధంగా వర్తించవు. అయితే జానపద సాహిత్యానికి వర్తించే కొన్ని సార్వత్రిక లక్షణాలను మనం గుర్తించవచ్చు. అవి:

### 1.5.1. అజ్ఞాత కర్తృత్వం:

శిష్ట సాహిత్యానికి ప్రత్యేకంగా రచయితలు, కవులు ఉంటారు. వారి పేర్లు తెలుస్తాయి. కాని జానపద సాహిత్యానికి కర్తలు ఎవరో తెలియదు. వారి పేర్లు కూడా తెలియవు. అందుకే జానపద సాహిత్యం అజ్ఞాత కర్తృత్వం లేక సామూహిక కర్తృత్వం అయింది. జానపద సాహిత్యం తొలి రోజుల్లో వైయుక్తికాలే అయినా అవి గ్రంథస్థాలు కాక పోవడం వల్ల ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి అందించబడుతూ సామూహిక కర్తృత్వాలు అవుతాయి. జానపద రచన నలుగురి నోళ్ళలో నాని, వానికి నాలుగు మాటలు అదనంగా చేరితేనే అది జానపదమవుతుంది.

జానపద సాహిత్యంలో జానపద రచయిత, కవి ఎప్పుడూ ప్రాధాన్యం లేనివారే ఎవరయినా ఈ సాహిత్యం నాది అని చెప్పగలిగే స్థితిలో ఉంటే అది జానపద సాహిత్యం కాదు. గుడులు, గోపురాలు కట్టి పోయిన అజ్ఞాత శిల్పులు ఎట్లాంటి వారో జానపద రచయితలు అట్లాంటి వారే. శిష్టకవి ఒకడే రచన చేస్తాడు. అది అతని పేరుతో వ్యవహరింపబడుతుంది. కాని జానపదుడు భావావేశంతో చెప్పిందో, పాడిందో విని నలుగురు దానిని తిరిగి పాడడం వల్ల అది శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆ సాహిత్యం తమది అని అందరూ అనుకోవాలి. దానిపై ఏ ఒక్కరికి అధికారం ఉండదు. జానపద సాహిత్యం జన వ్యవహారంలో జీవిస్తుంది.

### 1.5.2. మౌఖిక ప్రచారం:

శిష్ట సాహిత్యానికి కలం, కాగితం ఉంటాయి, పుస్తకాలు తయారవుతాయి. కాని జానపద సాహిత్యానికి వినడమే సాధనం. ఒకడు గేయం పాడితే మరొకరు వింటారు. ఒకరు కథ చెబితే మరొకరు అలకిస్తారు. ఆ గేయం, ఆ కథ ఒక నోటి నుండి ఇంకొక నోటికి, ఒక చెవి నుండి మరొక చెవికి చేరుతుంది. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పయనిస్తుంది. అనుశ్రుతంగా ప్రచారం జరిగే ఈ కారణం వల్ల జానపద సాహిత్యంలో మార్పులు, చేర్పులు కలుగుతుంటాయి. ఒక తరం నుండి మరొక తరానికి మౌఖికంగా ప్రచారం జరిగేటప్పుడు జానపద సాహిత్యం వ్యాప్తి చెందుతుంది. మౌఖిక ప్రచారం జానపదుల జ్ఞాపక శక్తి మీద, వినికిడి శక్తి మీద ఆధారపడి వ్యాప్తి చెందుతుంటుంది.

**1.5.3. అనిర్ణీత రచనాకాలం:** శిష్ట సాహిత్యంలో కవి తన గురించి తన వంశం గురించి తమ సమకాలికులను గురించి ప్రస్తావించడం వలన ఆ రచన ఏ కాలం నాటిలో స్పష్టంగా తెలుసుకునే ఆధారం ఉంటుంది. కొన్నిసార్లు చారిత్రక ఆధారాలు కూడా రచనా కాలాన్ని కొంత వరకు తెలియచేస్తాయి. జానపద సాహిత్యం మౌఖికంగా వ్యాప్తి చెందేది కాబట్టి, ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. కనుక దాని కాలం గురించి తెలుసుకోవడం కష్టమైన పని అవుతుంది. జానపద సాహిత్యం నిరంతరం నవ చైతన్యంతో మార్పులు చెందుతుంది. కాబట్టి పాత దానికి కొత్త రూపు రేఖలు అదనంగా సమకూరుతుంటాయి. అందుచేత జానపద సాహిత్యంలో రచనా కాలం స్పష్టంగా ఉండే అవకాశం లేదు.

**1.5.4. విభిన్న పాఠాంతార సమన్వితం:** శిష్ట సాహిత్యంలో ఒక రచనకు దాని కర్త రూపు రేఖలు దిద్దుతారు. తప్పులు సవరిస్తారు. దానితో అది నిర్దిష్ట స్వరూపాన్ని పొందుతుంది. అయితే జానపద సాహిత్యం ఒక్కొక్కరి నోట ఒక్కొక్క రూపం పొందుతుంది. ఒక వ్యక్తి దానిని తగ్గిస్తే, మరొక వ్యక్తి దానిని పెంచుతాడు. ఒకొక్క చోట కొత్త మాండలికాలు చోటు చేసుకుంటాయి. కొత్త పలుకుబడులు చేరుతాయి. ఈవిధంగా జానపద సాహిత్యం పాడేవారి లేదా చెప్పుకునే వారి అభిరుచిని బట్టి, మనో భావాలను బట్టి మారిపోతుంది. అందుచేత దానికి నిర్ణీత స్వరూపం ఉండే అవకాశం ఉండదు.

**1.5.5. సహజశైలి:** జానపద సాహిత్యం నందలి శైలిలో సహజత్వంతో పాటు సరళత్వం నవనవోన్మేషత కనిపిస్తాయి. వీనిలో బాహ్య సౌందర్యం, అంతర సౌందర్యం ఉంటాయి. ప్రజల నిత్య జీవితంలో సహజ భాగాలైన నుడికారాలు సామెతలు మొదలైనవి జానపద సాహిత్యంలో చోటు చేసుకుంటాయి. జానపద శైలి సహజంగా, స్వచ్ఛంగా, సరళంగా, మనోహరంగా ఉంటుంది.

**1.5.6. రస ప్రధానం:** జానపద సాహిత్యం రసప్రధానంగా ఉంటుంది. గద్యాఖ్యానాలు సామెతలు మొదలైన వాటిలో శృంగారం, కరుణ, అద్భుతం, వీరం, భక్తి, హాస్యం, కనిపిస్తాయి. వినే వారికి రసానందం కలిగిస్తాయి.

**1.5.7. నియమిత లేదా పరిణిత స్వరూప రాహిత్యం:** జానపద గేయాలకు నియమిత స్వరూపం ఉండదు. ఒక్కొక్కరి నోటిలో ఒక్కొక్క రూపాన్ని దిద్దుకుంటుంది. ఒక నోటిలో తరిగిపోతుంది. మరొకరి నోటిలో పెరిగిపోతుంది. ఇంకొకరి నోటిలో కొత్త మాండలికాన్ని, కొత్త పలుకుబడిని సంతరించుకుంటుంది. పాడుకునే వారి అభిరుచిని బట్టి సృజనాత్మక శక్తిని బట్టి గేయ రూపం మారిపోతుంది. శిష్ట సాహిత్యంలో లాగా రచయిత దానికి నియమిత రూపాన్ని ఇవ్వడు గనుక పరిణిత స్వరూప రాహిత్యం దాని లక్షణమవుతుంది.

**1.5.8. గాన యోగ్యత:** జానపద గేయాలు పాడుకోడానికి తగినట్లుగా ఉంటాయి. అప్రయత్నంగా జానపదుని నోటి వెంట వెలువడేది గనుక అది లయబద్ధంగా ఉంటుంది. లయ విన్యాసం లేకపోతే జానపదునికి ఊపురాదు. నాట్యానికి ఉండే తాళ లయలు గేయానికి కూడా ఉంటాయి. ఈ గేయాల్లో అక్కడక్కడ ఒక చరణం మళ్ళీ మళ్ళీ వస్తుంది. దీన్ని Refrain అంటారు. ఇది పాటకు పల్లవి వంటిది. ఇది గేయం పాడడానికి ఉపయోగపడుతుంది. జానపద గేయాలు శిష్ట సాహిత్యానికి పునాది అయినట్లే జానపద గేయాల్లో వినిపించే సంగీతం పరిణామం చెంది శాస్త్రీయతను సంతరించుకొని, గొప్ప కళగా మారిపోయినదని కూడా చెప్పవచ్చు.

**1.5.9. పునరావృత్తి:** జానపద గేయాల్లో గేయం మొదట గాని, చివర గాని అక్కడక్కడ ఒక పదం గాని, పాదం గాని, చరణం గాని మళ్ళీ మళ్ళీ పాడబడుతుంది. ఇలా మళ్ళీ మళ్ళీ పాడడాన్ని పునరావృత్తి అంటారు. ఇది జానపద గేయ లక్షణం.

పునరావృత్తి జానపదులు విషయంలో అత్యవసరం. జానపదుల భాష ప్రాచుర్యం పొందడానికి లయబద్ధమైన శబ్ధాలు పునరావృత్తి అవుతాయి. అది దోషం కాదు. దీనినే పాశ్చాత్యులు Refrian అంటారు. సంగీతం అభివృద్ధి అయిన తరువాత ఈ పునరావృత్తి పల్లవి, అను పల్లవిగా మార్పు చెందాయి.

**1.5.10. ఆశురచన:** ఆశు కవిత్వం అంటే కలం, కాగితం అవసరం లేకుండా వేగంగా చెప్పే కవిత్వం. జానపదులు చదువు సంధ్యలు లేని వాళ్ళు, కాబట్టి చెప్పదలచిన విషయాన్ని లయకు సరిపోయేటట్లు, శబ్ధాన్ని విరిచి పొట్టిదిగానో, పెంచి పెద్దదిగానో ఉచ్చరిస్తారు. దాని తప్పొప్పులు పట్టించుకోరు. తాము చెప్పేది అర్ధవంతంగా, చక్కగా ఉందా, లేదా అనేది వాళ్ళకు ముఖ్యం కాదు. లయబద్ధంగా ఉండే విధంగా పాడుకుంటారు.

**1.5.11. జన సామాన్య పరిచిత వస్తువు:** జానపద గేయాల్లో వస్తువు జన సామాన్యానికి సంబంధించినదై ఉంటుంది. సామాన్యుల ఆశయాలు, అభిరుచులు, అలవాట్లు, కష్టనష్టాలు, చావు, పుట్టుకలు, పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్ళూ, పేరంటాలు, పూజలు, పునస్కారాలు, చలి, ఎండ, గాలి – ఇలా ఏదయినా జానపదులకు కవితా వస్తువే. దీనితో పాటు పురాణగాధలు, ఇతిహాస కథలు, వీరుల వృత్తాంతాలు వస్తువులుగా చేసుకొని పాడుబడతాయి. వస్తువును ఎక్కడి నుండి గ్రహించిన దానిని సామాన్య ప్రజల మనస్తత్వానికి అనుగుణంగా తమకు ఇష్టమైన రీతిలో మార్చుకోవడం జానపదుల లక్షణం వాళ్ళకు శిష్ట సాహిత్యంలో లాగా నియమాలు ఉండవు.

## 1.6. జానపద విజ్ఞానం వల్ల ప్రయోజనాలు:

ప్రాచీన కాలంలోని విభిన్న జాతులకు సంబంధించిన, సంస్కృతీ వికాసాలను గుర్తించడానికి, వాళ్ళ ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను, నమ్మకాలను, కళలను సాహిత్య స్వరూపాన్ని గమనించడానికి జానపద విజ్ఞానం ఎక్కువగా దోహదపడుతుంది. పాశ్చాత్య దేశాల్లో 18వ శతాబ్ది చివరి భాగంలో ప్రారంభమైన జానపద విజ్ఞానానికి సంబంధించిన కృషి మన దేశంలో 20వ శతాబ్దిలో ప్రారంభమైంది. దీనిమీద దేశ విదేశాల్లో జరిగిన పరిశోధనల ఆధారంగా జానపద విజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవచ్చు.

జానపద విజ్ఞానాన్ని ప్రయోజనాత్మక దృష్టితో చూసే వాళ్ళు ప్రకర్యాత్మక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. బెనడిక్ట్ అనే విద్వాంసురాలు జానపద విజ్ఞానం అనేక సందర్భాల్లో సాంస్కృతిక నియమావళిని ఉల్లంఘిస్తుందని అభిప్రాయపడింది. విలియం బేస్కమ్ జానపద ప్రక్రియలు సంచలనాత్మకంగా ఉంటాయని చెప్పాడు. ఒక్కొక్క జానపద ప్రక్రియకు ఒక్కొక్క నిర్ధిష్ట ప్రయోజనంతో పాటు మరికొన్ని ప్రయోజనాలు కూడా ఉంటాయి.

**1.6.1. రాజకీయపరంగా ఉపయోగపడటం:** రాజకీయపరంగా జానపద విజ్ఞానాన్ని ఉపయోగించుకోవటం హిట్లర్ కాలం నుండే ప్రారంభమయింది. రష్యా కమ్యూనిజాన్ని ప్రచారం చేయడానికి జానపద విజ్ఞానాన్ని ఉపయోగించుకుంది. వర్గ సంఘర్షనకు జానపద విజ్ఞానం ఒక ఆయుధం వంటిదని సోకోలోవ్ అభిప్రాయపడ్డాడు. ఆంధ్రదేశంలో రాజకీయ పార్టీలు మత ప్రచారానికి బుర్ర కథలను, ఒగ్గు కథలను ఉపయోగిస్తున్నారు. జానపద ప్రక్రియలను అనేక ఉద్యమాల్లో కూడా ఉపయోగిస్తున్నారు.

**1.6.2. జానపద విజ్ఞానం ఉల్లాసాన్ని ఆనందాన్ని కలిగిస్తుంది:** కథా గేయాలు, కథలు, మొదలూ సాహిత్య ప్రక్రియలు ఆనందాన్ని కలిగిస్తాయి. పనిపాటలు శ్రమను తగ్గించి ఉల్లాసంగా ఉంచడానికి ఉపయోగపడతాయి. భాందవ్య గీతాలు

కుటుంబంలోని వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలను, ఆత్మీయ అనురాగాలను తెలుపుతాయి. పిల్లల ఆట పాటల వల్ల దైహిక వ్యాయామంతో పాటు మానసికమైన వ్యాయామం కూడా లభిస్తుంది. లాలి పాటలు, జోల పాటలు, పిల్లలను నిద్ర పుచ్చుతాయి. వేడుక పాటల వలన ఆనందం, శృంగార గీతల వలన మానసిక ఆనందం, ఉత్సాహం, ఉత్తేజం కలుగుతాయి. హాస్య గీతాల వల్ల సంతోషం, రోగ నివారణ కలుగుతాయి. భక్తి గీతాలు మనస్సుకు ఏకాగ్రతను కలిగిస్తాయి.

వీర గాథలు వినే వాళ్ళకు ఆనందం, ఉత్సాహం, ఉద్రేకం, పౌరుషం కలిగిస్తాయి. కొన్ని కథలు నీతిని ప్రభోదిస్తాయి. మరికొన్ని కథలు ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. అద్భుత లోకాలకు తీసుకుని వెళతాయి. కనుక మనుష్యులలో ఐకమత్యం కలుగుతుంది. చిత్రకళ, శిల్పం కంటికి ఆనందం ఇస్తే, ప్రదర్శన కళలు కంటికి, చెవికి ఆనందాన్ని కలిగిస్తాయి.

**1.6.3. సంస్కృతి పరిరక్షణ:** సంస్కృతికి సంబంధించిన పలు విషయాలు కాలగర్భంలో కలిసి పోకుండా జానపద విజ్ఞానం రక్షిస్తుంది. మామూలుగా పాటలు పాడడానికి సిగ్గుపడే వాళ్ళు కూడా పెళ్ళిళ్ళు, వ్రతాలు, పండుగలు జరిగినప్పుడు నలుగురితో కలిసి పాడతారు. అందుచేత జానపద గీతాల వల్ల సంస్కృతి రక్షించబడుతుంది. అలాగే తలపాగా చుట్టుకోవడం, పంచె కట్టుకోవడం, వంకీలు, జడబిళ్ళ మొదలైనవి ధరించటం ఇష్టం చూపని వాళ్ళు కూడా పెళ్ళికి, తిరునాళ్ళకు, పండుగకు వాటిని ధరిస్తారు. ఈ విధంగా జానపద విజ్ఞానం సంస్కృతిని పరిరక్షిస్తుంది.

**1.6.4. విద్యాభ్యాసానికి తోడ్పాటునందిస్తుంది:** పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో చదివే చదువు మనిషికి పరిపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించలేవు. సరైన విద్యావంతులు కావటానికి జానపద విజ్ఞానం తోడ్పడుతుంది. ప్రశ్నోత్తరాల రూపంలో ఉండే ఈ పిల్లల పాట జ్ఞాన సముపార్జనకు తోడ్పడుతుంది.

పిట్టమ్మ పిట్ట / ఏమి పిట్ట / చిలక పిట్ట / ఏమి చిలుక / తెలుపు చిలుక

పై గాయంలోని ముక్త పద గ్రస్తాలు జ్ఞాపక శక్తిని పెంపుచేస్తాయి.

పూర్వకాలంలో కొందరు తల్లులు వినిపించిన వీరగాథల వారి పిల్లలు ఉత్తేజాన్ని పొంది వీరులుగా మారారని చరిత్ర నిరూపించింది. అంటే పిల్లలను వీరులుగా చేయడానికి జానపద విజ్ఞానం తోడ్పడుతుంది. ఆట పాటలు, ప్రదర్శన కళలు, శరీరానికి, పొడుపు కథలు బుద్ధి వికాసానికి సహాయపడతాయి.

జీవితానుభవాల నుండి పుట్టిన సామెతలు జానపదులకు అనేక సందర్భాలలో పాఠాలను గుణ పాఠాలను చెబుతాయి. ఉదాహరణ: కాలు జారితే తీసుకోవచ్చు – నోరు జారితే తీసుకోలేము – (గలమా... ?)

ఈ సామెత వ్యక్తికి, వ్యక్తి మధ్య ఉండవలసిన సంబంధాన్ని సమాజంలో మనిషి మెలగవలసిన విధానాన్ని తెలియజేస్తుంది.

"మాల పోయినా మాను పోయినా తిరిగిరాదు"

"మాట పోయినా మనం పోయినా ఒకటే".

ఇలాంటి మాటలు కూడా మనిషి జీవితంలో మాటకు ఉండే విలువను తెలియజేస్తాయి. మాట విలువను తెలిపే కథలు మన ప్రాచీన సాహిత్యంలో కనిపిస్తాయి. అందుచేత సామెతలు మానవ జీవన విధానానికి దారి చూపుతాయని చెప్పవచ్చు.

**1.6.5. నిషిద్ధమైన వాటికి అవకాశం కల్పించటం:** ప్రతి సంస్కృతి లోనూ కొన్ని నియమాలు ఉంటాయి. మత్తు పదార్థాలు

సేవించకూడదు. బహుభార్యత్వం మంచిది కాదు. నలుగురిలో తిట్లు, అరుపులు ఉండరాదు. ఇట్లాంటి వాటిని నిషిద్ధాలు అంటారు. కానీ ఈ నిషిద్ధాలు మానవ - సహజాలు. జానపద విజ్ఞానం ఈ నిషిద్ధాలను స్వేచ్ఛగా ఉపయోగించే వెసులుబాటును కల్పిస్తుంది.

ఉదాహరణకు పదిమందిలో బూతు మాట్లాడకూడదు. అయితే జానపద గేయాల్లో బూతుమాటలను ఎలాంటి జంకు గొంకూ లేకుండా వాడుకోవచ్చు. సామెతల్లో, పొడుపు కథల్లో ఉపయోగించవచ్చు. సామాన్యంగా తాగి బూతులు తిడితే ఊరకోరు గానీ గంగ జాతర్లో అది నిషిద్ధం కాదు. ఈ విధంగా జానపద విజ్ఞానం నిషిద్ధమైన ఎన్నో విషయాలకు జీవం పోస్తుంది.

పైన పేర్కొన్న ప్రయోజనాలతో పాటు జానపద సంగీతం, నృత్యం, నాటకం నేర్చుకుని రాణిస్తే అది జీవనోపాధి కూడా అవుతుంది. జానపద వీధి నాటకాలు, భిన్న వ్యక్తుల సంబంధాలను, మంచి చెడులను, నీతి నియమాలను, పాప కృత్యాలను తెలియజేస్తాయి. జానపద విజ్ఞానాన్ని కూలంకుషంగా అధ్యయనం చేస్తే మరెన్నో ప్రయోజనాలు గుర్తించే అవకాశం లేకపోలేదు.

**1.7. నమూనా ప్రశ్నలు:**

1) జానపద సాహిత్యం స్వరూప స్వభావాలను వివరింపుము?

2) జానపద విజ్ఞానంలోని ప్రధాన భాగాలను గురించి రాయండి?

**1.8. ఆధార గ్రంథాలు:**


1) జానపద గేయ సాహిత్యం - బిరుదు రాజు రామరాజు

2) జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి

3) జానపద విజ్ఞానాధ్యయనం - జి.యస్. మోహన్

4 జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం

5) తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

6) జానపద వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం.


**- డా॥ పిల్లి వాసు.**

పాఠం - 2

# జానపద విజ్ఞానాధ్యయనంలో ప్రాచ్య పాశ్చాత్యుల కృషి

**2.0. లక్ష్యం:**

విద్యార్థులు జానపద విజ్ఞాన అధ్యయనంలో ప్రాచ్య పాశ్చాత్యులు, ప్రాచ్యులు చేసిన కృషిని గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**

**2.1. జానపద విజ్ఞాన అధ్యయన రంగంలో ప్రాచ్య పాశ్చాత్యులు చేసిన కృషి**

**2.2. జానపద విజ్ఞాన అధ్యయనంలో ప్రాచ్యుల కృషి**

**2.3. నమూనా ప్రశ్నలు**

**2.4. ఆధార గ్రంథాలు**

## 2.1. జానపద విజ్ఞాన అధ్యయన రంగంలో ప్రాచ్య పాశ్చాత్యులు చేసిన కృషి:

జానపద విజ్ఞాన అధ్యయన రంగంలో కృషి చేసిన ప్రాచ్య పాశ్చాత్యులను గురించి పరిశీలిస్తే 1846వ సంవత్సరంలో "Folk Lore" అన్న పదాన్ని W.J. Thoms 'Popular Antiquities' అన్న పదానికి బదులుగా ప్రయోగించిన తరవాత జానపద విజ్ఞానం శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి దోహదం చేసింది. నాటి నుండి నేటిదాకా జానపద విజ్ఞానాన్ని తమ అధ్యయన క్షేత్రంగా చేసుకుని కృషి చేసిన ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసులు ఎందరో ఉన్నారు. అలాంటి వాళ్ళలో కొంతమందిని గురించి తెల్సుకోవడం ముఖ్యం. జానపద కథా క్షేత్రంలో అద్వితీయమైన కృషి చేసిన విద్వాంసులలో గ్రీమ్ సోదరులు ఒకరు.

**గ్రీమ్ సోదరులు:**

విల్ హెల్మ్ కార్ల్ గ్రిమ్

జాకబ్ లుడ్విన్ కార్ల్ గ్రిమ్

జానపద కథామూలాన్ని అన్వేషించడానికి ప్రప్రథమంగా ప్రయత్నించినవారు గ్రిమ్ సోదరులు. వీరు 1819వ సంవత్సరంలో "Kinder-und Hausmarchen" అనే గ్రంథాన్ని ప్రచురించినప్పుడు కథల అంతరిక సమస్యల గురించి చర్చ జరిగింది. ఆ తరువాత ప్రపంచమంతటా అనేక జానపద కథా సంకలనాలు వెలువడ్డాయి. ప్రకటించబడ్డ కథల్లో సామ్యం కన్పించింది. ఇలా ప్రపంచంలోని కథల్లో కన్పించే ఈ సామ్యానికి ఏదో ప్రబల కారణం వుండవచ్చునన్న సంశయం వీళ్ళల్లో కలిగి వెతకడం మొదలుపెట్టారు. గ్రిమ్ సోదరులు కేవలం జానపద విద్వాంసులే కాదు, ప్రముఖ భాషా శాస్త్రవేత్తలు కూడా. వీళ్ళు ఇండో యూరోపియన్ భాషా కుటుంబాల మీద కృషి చేయడం వల్ల జానపద కథ ఏదేని ఒక స్థలంలో ఒక కాలంలో మౌఖిక రూపంలో వుండి విశ్వ వ్యాప్తి చెందుతుందని నిర్ధారించారు. వీరు అధ్యయనం చేసిన జానపద కథలు ఇండో యూరోపియన్ భాషా కుటుంబంలో అధిక ప్రచారంలో ఉండటం వల్ల జానపద కథకు ఏదేని మూలం ఉన్నట్లయితే అది ఒక నిర్దిష్ట భాషే అయివుంటుందని, భాషా మూలాన్నే కథ మూలానికి అన్వయించడం వల్ల ప్రపంచంలోని అన్ని జానపద కథలు ఇండో యూరోపియన్ భాషల్ని మాట్లాడే ప్రజల నుండే వచ్చియుండవచ్చుననే అంతిమ నిర్ణయానికి వచ్చాడు. ఇలా గ్రిమ్ సోదరులు అప్పటికే ఇండో యూరోపియన్ భాషల మీద జరిగిన తలనాత్మక భాషాధ్యయాన్ని తమ సిద్ధాంత ప్రతిపాదనకి

ఉపయోగించుకున్నారు వీళ్ళ సిద్ధాంతం ఇలా ఉంది.

1. సమాన ధర్మాలున్న జానపథ కథా చక్రాలు ఇండో – యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినది. ఇది ఇండో – యూరోపియన్ భాషల ప్రాచీన రూపాల నుండి విస్తరింపబడ్డాయి. ఇదే ఇండో యూరోపియన్ సిద్ధాంతం.
2. పురాణాలు విడగొట్టబడి ముక్కలై కథలకి మూలమైందని వీరి సిద్ధాంతం. దీనినే పురాణ మూల సిద్ధాంతం (Brokedown Myth Theory) అంటారు.

గ్రిమ్ సోదరులు ఇలా భాష. ప్రజలు, ప్రాంతం, సామ్యాలను దృష్టిలో ఉంచుకొని తమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అనేకంగా, జానపద విద్వాంసుల్ని ఆకర్షించారు. వీళ్ళ సమకాలికులు ఈ సిద్ధాంతాన్ని సమర్థించారు. గ్రిమ్ సోదరుల చేత ఇలా ప్రారంభమైన ఈ సిద్ధాంతం 19వ శతాబ్దానికి ఇంగ్లాండ్ దేశపు విద్వాంసుల్ని ఆకర్షించింది. వీళ్ళలో మాక్స్‌ముల్లర్ పేర్కొనదగినవాడు. ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించిన వాళ్ళలో ఆండ్రూల్యాంగ్ ముఖ్యుడు.

**విలియం జాన్‌థామ్స్ (1803–1885):** Folk Lore శబ్ద బ్రహ్మగా విశ్వ విఖ్యాతి చెందిన విలియం జాన్ థామ్స్ 1803వ సంవత్సరంలో లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ ప్రాంతంలో జన్మించాడు. ఈయన తండ్రి నథానియల్ థామ్స్ తండ్రి లాగే విలియమ్ కూడా ఒక గూమాస్తాగా పని చేసేవాడు. కేవలం గుమాస్తా లాగానే బ్రతికి జీవనం గడపడానికి విలియం గ్రంథ సూచి అధ్యయనం మీద ప్రత్యేకమైన అభిమానాన్ని చూపెట్టేవాడు. Foreign Quartely Review మొదలైన ప్రతికలకి వ్యాసాలు వ్రాసేవాడు. రచనలకి అవసరమైన సహకారాన్ని ప్రాచీనాన్వేషకుడయిన అమ్యోట్ అనే అతన్ని ఆశ్రయించాడు. ఆయన ద్వారా ఫ్రాన్సిస్ డౌస్ అనే సాహిత్యాభిమానిని పరిచయం ఏర్పడింది. విలియం థామ్స్‌లో అధ్యయనా శక్తిని పురికొల్పడమే కాక తన గ్రంథాలయంలోని వ్రాత ప్రతుల్ని పుస్తకాలను ఇచ్చేవాడు డౌస్ 1827–28 ప్రాంతంలో మూడు సంపుటాల్లో థామ్స్ సంపాదకత్వంలో వెలువడ్డ "Early Prose Romanees" అనే గ్రంథనామం వున్న జానప్రియ కథా సంకలానికి డౌస్ తన సంపూర్ణ సహాయ సహకారాలను అందించారు. ఇది థామ్స్ మొట్టమొదటి విశిష్టమైన కృతి.

విలియం థామ్స్ రచించిన మరో రెండు ప్రధాన కృతులు Lays (Songs) and Legends of France Spain, Tratary and Ireland అనే పెద్ద శీర్షికలో రెండు సంపుటాల్లో ఆయా దేశాల జానపద గేయాలు, ఐతిహ్యాలకు సంబంధించిన గ్రంథాన్ని 1834వ సంవత్సరంలో లండన్ నుండి ప్రకటించారు. అలాగే మరో గ్రంథం Lays and Legends of Germancy ఈ గ్రంథాలు ప్రచురణ కావడానికి ముందే థామ్స్ 1832వ సంవత్సరంలో The Original అనే పత్రికకి సంపాదకత్వాన్ని వహించడం ఒక విశేషం.

1838వ సంవత్సరంలో విలియం థామ్స్ Society of Antiquaries కి సభ్యుడిగా ఎన్నుకోబడ్డారు. అదే సంవత్సరం Camiden Society అనబడే మరొక సాహిత్య సంఘానికి కార్యదర్శిగా నియమించబడ్డారు. 1838వ సంవత్సరం లోనే The Book of the Court అనే మరో గ్రంథాన్ని విలియం ప్రచురించాడు. 1845వ సంవత్సరంలో విలియం థామ్స్‌ని House of Lords లో గుమాస్తాగా నియమించడం జరిగింది. ఆ సమయానికే విలియం థామ్స్ గొప్ప ప్రాచీనాన్వేషకుడు, విజ్ఞాని అని పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రాచీన మానవుల నడవడికలు, పద్ధతులు, కట్టుబాట్లు, ఆచారాలు మొదలైన వాటి అధ్యయనం ఒక శాస్త్రంగా అభివృద్ధి చెంది ఆ శాస్త్రానికి ఆంగ్లంలో "Folk Lore" అనే పేరును విలియం సృష్టించి శాస్త్రీయపరమైన జానపద విజ్ఞానాధ్యయనానికి దోహదం చెయ్యటం మరో ఎత్తు.

1846వ సంవత్సరంలో జాన్‌థామ్స్ “ది అథీనియర్” అనే పేరున్న సాహిత్య కళలను గూర్చిన పత్రికకి ఒక ఉత్తరం రాస్తూ Folk Lore అనే పదాన్ని అంతకుముందు వాడుకలో ఉన్న Popular Antiquities అనే పదానికి మారుగా ఆంగ్లంలో సూచించాడు. Ambrose Merton అనే కలం పేరుతో థామ్స్ 1846వ సంవత్సరంలో ఆగష్టు 12వ వ్రాసిన ఈ ఉత్తరం అదే నెల 26వ తేది నాటి "The Alhaenqeum" 982వ సంచికలో ప్రచురించబడింది. ఇలా Folk Lore అన్న పదం నాటి నుండి నేటి దాకా అందరి సమ్మతిని పొంది వాడుకలో నిలిచిపోయింది.

1849వ సంవత్సరంలో విలియం జాన్ థామ్స్ Notes and Queries అనే నియత కాలికాన్ని (Periodical) ప్రారంభించి 1872వ సంవత్సరం దాకా దాని సంపాదకుడుగా వ్యవహరించాడు. ఆరేళ్ళ తరువాత Folk Lore Society ఏర్పడగా దానికి నిర్దేశకుడయ్యాడు. ఈ సంఘ నియమ నిబంధనలని రూపొందించడంలో విలియం పాత్ర చాలా గొప్పది. ఈ సంఘ ఉద్దేశాలను కార్య విధానాలను 1888వ సంవత్సరంలో ప్రారంభమైన American Folk Lore Society అనుసరించడం ఒక విశేషం.

ఇలా విలియం జాన్ థామ్స్ Folk Lore పద సృష్టికర్తగా పేరు పొందడమే కాక 1846వ సంవత్సరం నుండి మరో నలభై సంవత్సరాల దాకా యూరప్ అమెరికా ఖండాల ప్రాచీనాన్వేషకుల్లో ఆసక్తిని పెంపొందించి 19వ శతాబ్ది విశ్వ ప్రాచీనాన్వేషకులందరికి మార్గనిర్దేశకుడిగా ప్రసిద్ధి పొందాడు. జానపద విజ్ఞానానికి గురుప్రాయుడిగా స్తుతింపబడుతున్నాడు.

**రిచర్డ్ ఎమ్ డార్సన్:** వీరు ప్రసిద్ధ అమెరికా జానపద విజ్ఞానవేత్త చరిత్ర మరియు జానపద విజ్ఞానాల ఆచార్యులు ప్రస్తుతం American Folk Lore Society అధ్యక్షులు. రిచర్డ్ ఎం. డార్సన్ సంపాదకత్వంలో వెలువడ్డ "Folk Lore and Folk Life" అన్న గ్రంథం జానపద విజ్ఞానం, జానపద జీవనానికి సంబంధించి తలెత్తిన అనేక సందేహాలకు, సమస్యలకు సమాధానాన్నిస్తుంది. ఈ గ్రంథం 1972వ సంవత్సరంలో ప్రచురించబడింది.

డార్సన్ గారి గ్రంథం ప్రప్రథమంగా జానపద విజ్ఞానానికి సంబంధించిన అనేక విషయాలను వివరణపూర్వకంగా అందిస్తుంది. “జానపద విజ్ఞానానికి సంబంధించిన జానపద జీవనం” అన్న పదంతో ఏవిధంగా వ్యత్యాసాన్ని కలిగి ఉందో ఈ గ్రంథం స్పష్టం చేస్తుంది. జానపద విజ్ఞానాన్ని జానపద జీవనాన్ని 4 వర్గాలుగా పరిశీలించవచ్చునని డార్సన్ సూచించారు.

డార్సన్ గారి ఈ గ్రంథంలోని మొదటి భాగంలో మౌఖిక జానపద విజ్ఞానం సాంఘిక జానపద ఆచారం, వస్తు సంస్కృతి, జానపద కళలకు సంబంధించి జానపద జీవనంలోని నాలుగు ప్రధాన విభాగాలుగా చర్చించబడ్డాయి. రెండో భాగంలో క్షేత్ర కార్యం అవలంభించాల్సిన పద్ధతులు మొదలైన విషయాలు వివరించబడ్డాయి. ఆయా వ్యాస రచయితల వ్యాసాంతాలలో ఆధార గ్రంథాలను పరిశీలించదగ్గ గ్రంథాలను పేర్కొనడం వల్ల పాఠకులు అసంబంధమైన విషయాలను మరికొంత క్షుణ్ణంగా పరిశీలించడానికి వీలు కల్పించారు.

అమెరికా జానపద విజ్ఞానవేత్తల గురి, సాధన, జానపద విజ్ఞానాధ్యయన అవశ్యకత, మొదలైన అంశాలు కూలంకుషంగా చర్చించబడ్డాయి. ఈ గ్రంథానికి డార్సన్ వ్రాసిన ఉపోద్ఘాతం అమూల్యమైనది. ఇందులో జానపద విజ్ఞానవేత్తలు ప్రతిపాదించిన వివిధ సిద్ధాంతాలను డార్సన్ పరిశీలించడం జరిగింది.

అమెరికా జానపద విజ్ఞానం, చరిత్రల గురించి జపాన్ దేశపు ఐతిహ్యాల గురించి పరిశోధన గావిస్తున్న డార్సన్ జానపద విజ్ఞాన అధ్యయన రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రఖ్యాత జానపద విజ్ఞాని.

**అలెన్ డండస్:**

ప్రసిద్ధ అమెరికా జానపద విజ్ఞానవేత్త, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో మానవశాస్త్రం. జానపద విజ్ఞానాల ఆచార్యులు.

అలెన్ డండస్ 1956వ సంవత్సరంలో "The study of Folk Lore" అనే గ్రంథాన్ని 1975వ సంవత్సరంలో "Analytic Essays in Folk Lore" అన్న గ్రంథాన్ని "Urban Folk Lore from the Paper - Work, Empire అన్న గ్రంథాన్ని 1983వ సంవత్సరంలో "Cindrella-A Case Book" అన్న గ్రంథాన్ని ప్రచురించారు.

డండస్ సాంస్కృతిక మానవ శాస్త్రానికి, జానపద విజ్ఞాన శాస్త్రానికి ఉన్న సంబంధాన్ని తమ "The study of Folk Lore" అన్న గ్రంథంలో నిరూపించారు. ఆయన ఈ గ్రంథంలో జానపదులంటే ఎవ్వరో ఇలా వివరిస్తారు. "ఏదైనా ఒక్క విషయంలో భావసామ్యం ఉన్న జనుల సమాహారం జానపదులు. వాళ్ళు ఒకే భాషకు చెందిన వాళ్ళు కావచ్చు. ఒకే ప్రదేశంలో నివసిస్తున్న వాళ్ళు కావచ్చు. 'ఫోక్' అనిపించుకోవాలంటే కనీసం ఇద్దరైనా ఉండాలి. అయితే ప్రత్యేకమైన సాధారణమైన, సామూహికమైన గుర్తింపు పొందే లక్షణాన్ని వాళ్ళు కలిగి ఉండాలి. ఇదే 'జానపదత్వం' అవుతుంది. ఈ లక్షణాలున్న పట్టణవాసులు కూడా జానపదులే అవుతారు. జానపద విజ్ఞానం నగరాల్లో కూడా నిత్యమూ సృష్టింపబడుతుందనీ, వికాసాన్ని పొందే ఒక విజ్ఞాన శాస్త్రమనీ, పలు దృష్టాంతాలమూలంగా వివరించారు.

**సి.పి. బ్రౌన్:** తెలుగు సాహిత్యానికి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ చేసిన సేవ అమోఘం అపారం, అనిర్వచనీయం. ఈస్టిండియా కంపెనీలో ఉద్యోగం చేస్తూ తెలుగు సాహిత్యం పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంపొందించుకొన్నాడు. 1842వ సంవత్సరంలో ఒక జంగమ వ్యక్తిని నెలరోజుల పాటు తమ ఇంట్లో ఉంచుకొని అతని చేత కుమార రాముని కథ, బొబ్బిలి కథ, కామమ్మ కథ, మొదలైన గేయ గాథల్ని పాడించుకున్నాడు. అంతేగాక పెక్కు జానపద గేయాల్ని, యక్షగానాల్ని సేకరించి ఆంధ్రులకి అందించాడు. పల్నాటి వీరగాథలు కాటమరాజు కథలకు సంబంధించి తాళపత్ర గ్రంథాల్ని సేకరించాడు.

బ్రౌన్ సేకరించి భద్రపరిచిన పల్నాటి వీరకథా చక్రం పింగళి లక్ష్మీ కాంతం అవసరాల సూర్యరావుల సంపాదకత్వంలో పరిష్కరించబడి 1961వ సంవత్సరంలో ప్రచురించబడింది.

బ్రౌను తెలుగు జానపద సాహిత్యం గొప్పదనాన్ని గురించి Asiatic Journal లో వ్యాసం ప్రచురించారు. మొట్టమొదటి సారిగా తెలుగు జానపద సాహిత్యం గొప్పదనాన్ని గుర్తించి ఆ గేయ సాహిత్యాన్ని సేకరించిన మహానుభావుడు బ్రౌను.

**జె.ఎ. బోయల్:** తెలుగు సాహిత్యానికి ఆంగ్లేయులు చేసిన సేవ అమోఘం. బ్రౌను పండితుడు తెలుగు సాహిత్యోద్ధరణ చేసినట్లు గానే, తెలుగు జానపద గీతాల వైశిష్ట్యాన్ని గుర్తించి లోకానికి వెల్లడించిన ఘనత బోయల్ మహాశయుడిది. ఉద్యోగ నిమిత్తం 1874వ సంవత్సరంలో రాయలసీయలో రాజకీయోద్యోగిగా నియమించబడ్డ జె.ఎ. బోయల్ తెలుగు జానపద సాహిత్యాభిమాని. తన అధికారిక పర్యటనల కాలంలో గ్రామ సీమల్ని దర్శించినప్పుడు రాత్రి సమయాల్లో పల్లీయుల పాడే పాటల్లోని సంగీతాన్ని వింటూ మైమరచేవారట సంగీతంలోని మాధ్యుర్యాన్నే కాక, భాష రాకపోయినా ఆ గేయాల్లో తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి, చెందిన విశేషాలు ఉన్నాయని గ్రహించాడు. చార్లెస్ ఇ. గోవర్ 1871వ సంవత్సరంలో తన "Folk Songs of South India" లో దక్షిణ భారతదేశానికి చెందిన జానపద గేయాలను ప్రచురించాడు. కానీ అందులో తెలుగు జానపద గీతాలకు బదులు వేమన పద్యాలు ఉండటం బోయల్‌ని కలత పరచింది. అందువల్ల "Indian Antiquary" లో Telugu Ballad

Poetry" పేరుతో వ్యాసాలు వ్రాస్తూ, ఒక వ్యాసంలో చార్లెస్ ఇ. గోవర్ తెలుగు జానపద గేయాలను తన గ్రంథాలలో పేర్కొనక పోవడాన్ని ఆక్షేపించారు. లోపాన్ని ఎత్తి చూపించి తెలుగు జానపద సాహిత్య వైశిష్ట్యాన్ని వెల్లడి చేశారు.

బోయల్ మొత్తం ఆరు జానపద గేయాల్ని సేకరించాడు. అందులో ఒకటి చారిత్రక గేయం. తక్కినవి శృంగార గేయాలు ఈ చారిత్రక గేయం ఏర్పాటు పాపడికి సంబంధించిది. బోయల్ దీన్ని బళ్ళారిలో సేకరించాడు. బళ్ళారిలో సేకరించడం వల్ల ఈ గేయం. రాయలసీమకు చెందినదనీ, పాపడు రాయలసీయ వాడనీ అభిప్రాయపడ్డారు. అయితే పాపడు తెలంగాణా ప్రాంతం వాడు. ఈ విషయాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు తమ పరిశోధనలో తేల్చి చెప్పడం జరిగింది. ఏమయినా బోయల్ మహాశయుడికి తెలుగు జానపద గీతల మీద ఉన్న ఆసక్తి ఒక చారిత్రక మహాశయుడిని లోకానికి చాటడానికి దోహదం చేసింది. డా. రామరాజు గారు తెలుగు జానపద సాహిత్యంలో పేర్కొన్న బోయల్ సేకరించిన ఒక పాట

। యెదురింటి యెఱ్ఱపాప - చూతమన్న కానరాదు

పాపిష్టి తల్లి దండ్రి - బైలెల్ల నివ్వరు -

బహుశ ఈ పాట కపిలిపాట అయివుంటుంది. కపిలి పాటలు ముక్తకాలుగా వుంటాయి. పాటలో రెండు చరణాలు వుంటాయి. భావాలన్నీ శృంగార భావాలే బోయల్ సేకరించిన ఐదు గేయాలు శృంగార రసాత్మకాలే కనుక పై పాట కూడా శృంగార రసాత్మకంగా ఉంటుంది.

తెలుగు జానపద సాహిత్య విలువల్ని గ్రహించి, జానపద గీతాల మాధుర్యాన్ని చవిచూపించిన బోయల్ మహాశయుని స్మరించుకోవడం మన విధి.

**వి.జె. ప్రాప్:** ఇతను రష్యన్ విజ్ఞాన శాస్త్రవేత్త వి.జె. ప్రాప్ 1928వ సంవత్సరంలో 'Morphology of Folktale' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో రష్యా దేశంలో ఉన్న వంద కథల్ని విశ్లేషించడం జరిగింది. రష్యన్ భాషలో ఉన్న ఈ గ్రంథం 1958వ సంవత్సరంలో ఆంగ్లంలోకి అనువదించబడింది. ఆ తర్జుమా తర్వాతే జానపద కథల అధ్యయనాలలో ఒక కొత్త మలుపు తిరిగినట్లు చెప్పవచ్చు.

Morphology అనే పదం వృక్ష శాస్త్రానికి సంబంధించినది. దీన్ని ఆధారంగా చేసుకొని అన్వయిస్తూ ప్రాప్ జానపద కథల్ని విశ్లేషించారు. ప్రాప్ సిద్ధాంతం కథా స్వరూప పరిశీలనకు ఉపకరించేది జానపద కథల్లో ఒక్కొక్క సందర్భంగా నిర్మితాలైన కథా ప్రవృత్తులు ఒకే విధంగా ఉంటాయి. అంటే కథలోని పాత్రలు మారినా ప్రవృత్తుల్లో వ్యత్యాసం ఉండదు. కథా నిర్మాణంలో సౌమ్యం కన్పిస్తుంది.

అర్నె-థాంసన్‌లు తయారు చేసిన కథా వర్గీకరణ విధానంలో లోపాలున్నాయని గ్రహించిన ప్రాప్, అన్ని జానపద కథలకు అన్వయించే వర్గీకరణ విధానాన్ని కనిపెట్టడం కోసమే కథల్ని అధ్యయనం చేశారు. ప్రాప్ దృష్టిలో జానపద కథలకు ఒక నిర్దిష్టమైన నిర్మాణం ఉంది. ఈ నిర్మాణం ఆయా కథల మాదిరులని సూచిస్తుంది. కథలో స్థిరంగా ఉండే అంశం క్రియ. అయితే పాత్రలు, వస్తు వివరాలు మారుతూ ఉంటాయి. ఒక క్రియ మరొక క్రియని నిర్ధిష్ట విధానంలో వెంబడిస్తుంది. కథాగతిలో ఆ క్రియల్ని వాటి స్థానం విశిష్టతలకి అనుగుణంగా వింగడించిన ప్రాప్, వీటి నిర్ధిష్ట విధానమే ఆయా కథల రచనాత్మక రూపం అని స్పష్టం చేశాడు.

ప్రాప్ తన అధ్యయనంలో కథను గురించిన ఎలాంటి తాత్విక నిర్ణయాన్ని మనకు అందించడం కథ ఎందుకు

పుట్టిందన్న విషయాన్ని గురించి ఆలోచించడం అనేది నిశిత దృష్టి అయినప్పటికీ సార్వత్రికంగా అన్వయమయ్యే సూత్రాలను రూపించి వర్గీకరణ కార్యం మరింత నిర్దిష్టమయ్యేట్టు చేసిన ఖ్యాతి ప్రాప్‌కు చెందుతుంది.

## 2.2. జానపద విజ్ఞాన అధ్యయనంలో ప్రాచ్యుల కృషి:

జానపద విజ్ఞాన పరిశోధనలో కృషి చేసిన వారిలో అనేక మంది ఆంధ్రులు కలరు. వారిలో ముఖ్యులు:

**నేదునూరి గంగాధరం:** అపూర్వమయిన జానపద సాహిత్యాన్ని అపారంగా అందించిన జానపద సాహిత్యోద్ధారకులు కీ.శే. నేదునూరి గంగాధరం గారు. 04-07-1904 లో రాజమండ్రిలో జన్మించారు. తమ జీవితాన్ని జానపద సాహిత్యానికే అంకితం చేసి ఆరువేలకు పైగా జానపద గీతాలను సేకరించి ప్రచురించారు. శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారి ప్రేరణతో ఊరూరు తిరిగి ప్రాచీన పద్యాలు, శాసనాలు, తాటాకు గ్రంథాలు సేకరించారు. అలాగే శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావు గారి ప్రేరణతో పాత పాటల్ని సేకరించి భారతి, గృహలక్ష్మి, ఆంధ్రభూమి, కృష్ణా పత్రికల్లో ప్రచురించారు. చింతా దీక్షితులు గారి ఆదేశాన్ని అనుసరించి స్త్రీల పాటలు, కథా గేయాలు సేకరించారు. శ్రీ పాద గోపాల కృష్ణమూర్తి సూచనలను అనుసరించి కట్టు కథలు, పొడుపు కథలు, యుక్తి లెక్కలు మొదలైన వాటిని సేకరించారు. ఇలా ప్రముఖుల సలహాలను స్వీకరించి జానపద వాఙ్మయంలోని ప్రతి అంశాన్ని సేకరించి తర్వాతి సేకర్తలకు మార్గదర్శకులయ్యారు. ఆధ్యాత్మిక వృత్తిలో ఉంటూ జానపద సాహిత్యానికి సంబంధించిన సమస్త విషయాలను సేకరించిన ధన్య జీవి నేదునూరి గంగాధరం గారు.

జానపద వాఙ్మయోద్ధరణకు తమ పొలాన్ని 50 కాసుల బంగారాన్ని, తమకు లభించే జీతాన్ని వెచ్చించి జానపద సాహిత్యాన్ని సేకరించడమే కాకుండా వాటిని అచ్చు వేయించారు. సాహిత్య సంస్థలు, అకాడమీలు సేకరించి ప్రచురించాల్సిన ఈ పనిని తామొక్కరే సేకరించి ప్రచురించడం శ్లాఘించదగ్గ విషయం. వీరి ప్రచురణలో జానపద గేయాలే కాకుండా కథా గేయాలు, వీర గాథలు, సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు, మారుమూల పదాలు, పలుకుబళ్ళు, కిటుకు మాటలు, జమిలి పదాలు, నోముల కథలు, క్రీడలు - వినోదాలు, పండుగలు - పబ్బాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు - మూఢ విశ్వాసాలు, వైద్యం, కళలు, చేతి పనుల మొదలైన జానపద విజ్ఞానాంశాలు చోటు చేసుకున్నాయి. నేటి జానపద విజ్ఞానులందరూ వీరి సేకరణ అంశాలనూ ఆధారంగా తీసుకున్నారు. పదివేల పుటలకు పైగా సేకరింపబడ్డ ఈ జానపద సాహిత్య సంపదలో ఆణిముత్యాల్లాంటి గ్రంథాలెన్నో కలవు.

**డా॥ బిరుదురాజు రామరాజు:** తెలుగులో జానపద విజ్ఞాన పరిశోధనకి అంకురార్పణ గావించిన వారు ఆచార్య బిరుదురాజు రామరాజు గారు. వీరు తెలుగు జానపద విజ్ఞాన క్షేత్రంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించినారు. విశ్వవిద్యాలయాల్లో జానపద విజ్ఞానానికి పఠన, పరిశోధనార్హమైన స్థానాన్ని సంపాదించి పెట్టిన డా॥ రామరాజు గారు 1956వ సంవత్సరంలో తెలుగులో జానపద సాహిత్యానికి సంబంధించి మొట్టమొదటి సారిగా పిహెచ్.డి. చేసిన జానపద విజ్ఞాని. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం గారి మార్గదర్శకత్వంలో 1952-55 మధ్య కాలంలో తెలుగు జానపద గేయ సాహిత్యం మీద పరిశోధన చేశారు. వీరి పరిశోధనా గ్రంథంలో తెలుగు జానపద గేయాలకు, కథా గేయాలకు సంబంధించి పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, మత సంబంధ గేయాలు, పారమార్థిక గేయాలు, స్త్రీల పాటలు, శ్రామిక గేయాలు, పిల్లల పాటలు, శృంగార గేయాలు, అద్భుత రస గేయాలు, కరుణ రస గేయాలు, హాస్యపు పాటలు మొదలగునవి 17 ప్రకరణాల్లో నిశితంగా పరిశీలించబడ్డాయి. అంతేగాక గేయాల్లోని భాషా పౌరసత్వాలు, సాంఘిక విషయాలు జానపద గేయాల వరుసలు

వివరింపబడడమే కాకుండా, జానపద గాయకుల పరిచయం చేయబడింది. జానపద విజ్ఞానం జానపద సాహిత్యం, జానపద గేయం వీటి నిర్వచన లక్షణం, వర్గీకరణం ప్రస్తావించబడడమే కాకుండా, జానపద విజ్ఞాన క్షేత్రంలో జరిగిన కృషి సమీక్షింపబడింది. ఒక్క మాటలో చెప్పాలంటే వీరి గ్రంథం నేటి జానపద విజ్ఞాన పరిశోధకులకు మార్గదర్శకమయిన అత్యుత్తమ గ్రంథం.

1960వ సంవత్సరంలో 'తెలంగాణ పల్లె పాటలు' అన్న సంకలన గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో పిల్లల పాటలు, జాబిలి పాటలు, కాముని పాటలు, బతుకమ్మ పాటలు, కోలాటములు, స్త్రీల పాటలు, శృంగార గేయాలు అన్న శీర్షికలున్నాయి. మొత్తం 227 పాటల్ని స్వయంగా సేకరించి ప్రచురించిన గ్రంథం ఇది 1964వ సంవత్సరంలో "Moharrum Folk Songs" అన్న ఆంగ్ల గ్రంథాన్ని ప్రచురించారు.

"జానపద గేయాలు - సాంఘిక చరిత్ర" అనే గ్రంథంలో జానపద గేయ గాథలు సేకరించి ప్రకటించబడడమే కాకుండా ఆగేయ గాథలు వెనుక ఉన్న సంస్కృతి చరిత్ర, సాంఘిక స్వరూపం పీఠిక రూపంలో చక్కగా వివరింపబడ్డాయి. కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతంలోని జానపద గేయాలను త్రివేణి సంగమంగా 1960వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ వారు త్రివేణి పేరుతో ప్రచురించారు. ఇందులో తెలంగాణ పాటలను రామరాజు గారు సేకరించి ప్రకటించారు.

భారతదేశంలో అనేక విశ్వవిద్యాలయాల్లో నేషనల్ ప్రొఫెసర్‌గా పర్యటించి జాతీయ ఉపన్యాసాలు ఇవ్వడంతో పాటు, అనేక సెమినార్లలో పాల్గొని తెలుగు జానపద సాహిత్యానికి సంబంధించి అనేక పరిశోధనాత్మక వ్యాసాలను సమర్పించారు. సోవియట్ రష్యా ఆహ్వానం మేరకు ఆదేశానికి వెళ్ళి ఆంధ్ర జానపద సాహిత్యాన్ని గురించి వివరించి, వారి మన్ననలను పొందారు. "జానపద గేయ స్రవంతి కూడా ఇప్పటికి చాలా భాగము మనకు దక్కకుండా పోయినది ఉన్న దానినైనా జాగ్రత్తగా భద్రపరిచి ఉపయోగించుట తెలుగు వారి కర్తవ్యము".. అంటూ భోధించడం కాక జానపద పరిశోధనే జీవిత పరమావధిగా భావించి ఆ రంగంలో కృషి చేయడమే కాక, పరిశోధన చేయిస్తున్న నిరంతర అధ్యయన శీలి, పల్లెవాసుల జీవన మాధుర్యాన్ని, బుద్ధి దీప్తిని ప్రపంచ మానవ జీవిత నేపథ్యంగా నిలిపే కృషిలో నిరంతర కృషి చేస్తున్న ఉత్తమ పరిశోధకులు.

**ఆచార్య నాయని కృష్ణకుమారి:** తెలుగు జానపద విజ్ఞానంపై విశిష్టమైన కృషి చేసిన వారిలో కృష్ణకుమారి గారు ముఖ్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. చేశారు. ఈ సిద్ధాంత వ్యాసాన్ని రాయడం కోసం అనేక గ్రామాలు తిరిగి పురాణ గాథలు ఐతిహాసిక గాథలు, బుర్ర కథలు సేకరించారు. అంతేకాక వీటిలో టోటమికాంశములు, మాతౄరాధనాంశములు వీరారాధనాంశాలను క్షుణ్ణంగా వివరించారు. డా॥ బిరుదురాజు రామరాజు గారితో కలిసి "జానపద గేయాలు సాంఘిక చరిత్ర" అను సంకలన గ్రంథాన్ని ప్రచురించారు.

"నల్లగొండ జిల్లా ఉయ్యాల పాటలు" గ్రంథానికి సంపాదకత్వం వహించి జానపద సాహిత్యానికి సంబంధించిన అనేక వ్యాసాలను వ్రాసి ప్రచురించారు. "కథా నిర్మాణా సూత్రాలు, బాల నాగమ్మ కథా నిర్మాణ విశేషాలు, జానపద కథాంశం, తెలుగు జానపద భాషలో మార్పులు, చేర్పులు, జానపద విజ్ఞానం కొత్త నిర్వచనం, ప్రతిఘటన జానపద గాథా పరిశీలనావశ్యకత, అల్లో నేరళ్ళు, పర్వతాల మల్లన్న, తెలుగు వారి సాంఘిక జీవనం, ఆచార వ్యవహారాలు, తెలుగు సంస్కృతి విశిష్టత-చారిత్రక భూమిక లాంటి అనేక వ్యాసాలు జానపద విజ్ఞానుల ప్రశంసలకు పాత్రమైంది.

వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చదువుకునే రోజుల్లోనే అనేక జానపద గేయాలను సేకరించారు. "రామరాజు జానపద విజ్ఞాన" బహుమతిని ఏర్పాటు చేశారు. ఈ పరిషత్తు తరుపున అనేక మంది రచనలు వెలుగు చూస్తున్నాయి. అప్పట్లో

"జానపద సర్వతి" అనే పత్రికకు సంపాదకులుగా ఉండేవారు. జానపద సాహిత్యానికి సంబంధించిన అనేక గోష్ఠులలో పాల్గొని తెలుగు జానపద సాహిత్య వైశిష్ట్యాన్ని వివరించారు. 1989వ సంవత్సరంలో ఉద్యోగం నుండి నివృత్తులయినా, నిరంతరం జానపద క్షేత్రంలో కృషి చేస్తూ తనదైన విశిష్ట వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు.

**తూమాటి దోణప్ప:** బహుముఖీయమైన ప్రజ్ఞాపాటవాలు పాండితీ ప్రకర్ష, కమనీయమైన భోధనా కౌశలం కలిగిన వారు, ఆచార్య తూమాటి దోణప్ప గారు. 1926వ సంవత్సరంలో ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో జన్మించారు. సంప్రదాయం ప్రకారం సంస్కృత పంచకావ్యాలు, తెలుగు పంచకావ్యాలు, అభ్యసించారు. చిన్నతనంలోనే అనేక నాటకాలలో నటించారు. హైస్కూల్ చదివే కాలం నుండి కవితలు రాసేవారు "తెలుగులో వైకృత పదాలు" అనే అంశంపై పి.హెచ్‌డి. చేశారు.

దోణప్ప గారికి జానపద సాహిత్యం, తెలుగు వ్యాకరణం, మాండలిక భాషా పరిశోధనం, శాసన పఠనం మొదలైనవి అభిమాన విషయాలు, వీరు ఇంత వరకు ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము. భాషా చారిత్రక వ్యాసావళి, తెలుగులో క్రొత్త వెలుగులు, జానపద కళా సంపద, తెలుగు హరి కథా సర్వస్వం అనే ఉత్తమ గ్రంథాలను ప్రకటించారు. ఇందులో మూడింటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి బహుమానాలు వచ్చాయి. వీరి దగ్గర ఇంకా ఎంతో జానపద సాహిత్య సంపద ఉంది. ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలు, జాతీయ అంతర్జాతీయ సదస్సులో సమర్పించిన భాషా సాహిత్య వ్యాసాలు, తెలుగు వైతాళికులను గూర్చి చేసిన ప్రసంగాలు సహస్రాధికంగా ఉన్నాయి. తోలుబొమ్మలాటను గూర్చి, పేర్లను గూర్చి చేసిన పరిశోధన చాలా గొప్పది.

దోణప్ప గారు మార్గదేశి సాహిత్యాల పట్ల, జానపద సాహిత్యం పట్ల తుల్యానురాగం ప్రదర్శించారు. జానపద సాహిత్యాన్ని ఎంతో సేకరించారు. జానపద కళారూప ఆచార వ్యవహారాలు వారికిష్టం. అందుకే శాస్త్రీయ దృష్టితో వారు జానపదుల జీవనాన్ని సమగ్రంగా సమీక్షించారు. వీరికి అనుంచిత కళా ప్రమేయంపై పరిశోధన చేయడమంటే చాలా ఇష్టం ముఖ్యంగా జానపద సాహిత్యావలోకనం వీరికి అభిమాన పాత్రమైన విషయం. తెలుగు హరికథా సర్వస్వం. జానపద కళా సంపద, జానపద విజ్ఞాన పరిశోధనకు ప్రబలోదాహరణలు, హరికథ సర్వస్వాన్ని అమూలాగ్రంగా పరిశీలించి మనకందించారు. హరికథకు ఆయువు పట్టు భక్తి భావమని, భక్తిని ఒక ఉద్యమంగా నాటికీ, నేటికీ సంకీర్తన కారుగా సంప్రదాయ కర్తగా, వాగ్గేయ కారులుగా కొనసాగిస్తూనే ఉన్నారు. హరికథ యాక్షగానానికి పూర్వరూమని నిరూపించారు.

వీరు రచించి ప్రచురించిన మరో ఉత్తమ గ్రంథం తెలుగులో "కొత్త వెలుగులు" ఇందులో జానపద సాహిత్యానికి సంబంధించిన ఐదు వ్యాసాలు ఉన్నాయి. జానపద సాహిత్యంలో ప్రజల కష్టసుఖాలు అనే వ్యాసంలో ఆ సాహిత్యంలోని నిర్మల నిసర్గములై మనోజ్ఞములైన పాటల్లోని పల్లె ప్రజల కష్ట సుఖాల్ని చక్కగా విశ్లేషించారు. కోలాటం పాటల రూపు రేఖలు అనే వ్యాసంలో కోలాటంలోని రకాల్ని వాటితత్త్వాన్ని వివరించారు. "వరస పాటల సరసాలు" లో రహస్యం ఎగతాళిని అందంగా సంతరించే పల్లెపట్టుల గుండె పట్టులను చూపించారు. "జానపద సాహిత్యంలో మేలు కొలుపులు" వ్యాసం వివిధ దేవాలయాల్లోని ఆయా దేవతలకు సంబంధించిన మేలుకొలుపు "ఓ తాత్విక దృష్టితో పరిశీలించారు. కపిలపాటల తీరుతెన్నుల జానపదులు తన గుండె బావులు ఊటల నుండి వెలికి తీసిన అమృత దారులను కపిలపాటలలోని మాధుర్యాన్ని ఎత్తి చూపారు.

వీరు రచించిన మరో గ్రంథం "జానపద కళా సంపద" ఇందులో మొత్తం ఎనిమిది వ్యాసాలున్నాయి. మొదటి వ్యాసంలో జానపద సాహిత్యాన్ని గూర్చిన విశేషాలున్నాయి. జానపద సాహిత్యం తెలుగు సాహిత్యంలో విస్తృతాధ్యాయం

కారాదన్న సూచనను ఈ వ్యాసంలో చెప్పారు. యాక్షగానములు ప్రాచీనాంధ్ర నాటక స్వరూపములో యాక్షగానాల లక్ష్య లక్షణాలను పేర్కొన్నారు. యాక్షగానాలలోని దేశీయాచార వ్యవహారాల్ని సాంఘిక పరిస్థితుల్ని వివరించారు.

రామాయణపు పాటలలోని మానవ జీవిత మార్మికతను ఎత్తి చూపారు. మెఱపలికిగద్య వ్యాసంలో జానపద జీవితంలో ఏరాచికాలు వచనంలో ఎన్నెన్ని రూపాల్లో ఉందో ఉదాహరణ సహితంగా విశదీకరించారు. స్థల పురాణాలు, స్థానిక గాథలు, క్షేత్ర మూర్తుల లేదా విలాసాలను ఈ పాటలలో వివరించడాన్ని వ్యాఖ్యాన పూర్వకంగా వివరించారు. మొహరము గీతికలు, హిందూ మహమ్మదీయ జీవిత సమన్వయ సూత్ర నేపథ్య ప్రస్తావన కావింపబడింది. విసరు రాతి పాటలలో తిరగలి శ్రమ నాంది జీవిత ధన్యతను వెలికి విరజిమ్మే ప్రయత్నం చేశారు. జిట్టిజాము పాటలలో ఆడపిల్లల ఆటల్లోని అక్షర సౌందర్యాన్ని ఎత్తి చూపారు.

దోణప్ప గారు విభిన్న పత్రికలలో ప్రచురించిన వ్యాసాలు అనేకం. కాని బొమ్మలాట పగటి వేషాల వంటి వ్యాసాలు ఏ సంకలనంలోను చేరలేదు. వీరు జానపద సాహిత్య సంపదను సేకరించడంలో భద్రపరచడంలోను వ్యాఖ్యానించడంలో కనబరిచిన దీక్ష ఎన్నదగింది.

**ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు:** సుబ్బారావు గారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి తెలుగు వీరగాథ కవిత్వము అనే సిద్ధాంత వ్యాసాన్ని పొందుపరిచారు. వీరు విశేషంగా క్షేత్ర పర్యటన చేసి 980 వీర గాథలను సేకరిచారు. దీనిలో వీరగాథల పుట్టు పూర్వోత్తరములు, భారతీయ, భారతీయేతర వీరగాధల చరిత్రము. వీరగాధా విభజనము. శక్తి కధా చక్రము, కాటమరాజు కథా చక్రము, బొబ్బిలి వరుస కథలు, పదములు, జంగం కథలు, లఘు వీరగాథలు, వీరగాథాను కరణములు, వీరగాధలందలి రసము, భాష ఛందస్సు, వీర గాథల వైశిష్ట్యము మొదలగు సమాచారమున్న అమూల్య గ్రంధమిది.

సుబ్బారావు గారు అనేక జానదుల సాహిత్య చర్చా గోష్ఠుల్లో పాల్గొనడమే కాకుండా జానపద సాహిత్యానికి సంబంధించిన పెక్కు వ్యాసాలు రాశారు. వీటిలో చౌడమ్మ పాటలు, మారు కథలు, అలరా చమల్లు గారి గురజాడ రాయభారము, నాయకురాలు నాగమ్మ, బుర్ర కథలు, బొబ్బిలి కథ, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథ, బుడ్డా వెంగళరెడ్డి, వీర గాథలు, జానపద కళలు, వేష రచన ఈ పాతికేళ్ళ తెలుగు సాహిత్యము జానపద పరిశోధన మొదలగు వారి వ్యాసాలు భారతి, స్రవంతి మొదలైన పత్రికలలో అచ్చుయినాయి.

“అలిచిప్పలే-ఆణిముత్యాలు” అన్న జానపద గేయ సంకలన గ్రంధ కర్తలలో డా॥ తంగిరాల వారు కూడా ఒకరు. వీరి పర్యవేక్షణలో జానపద సాహిత్యానికి సంబంధించి రెండు పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసాలు మూడు ఎం.ఫిల్. లఘు సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి.

**డా॥ ఆర్వీయస్ సుందరం:** జానపద విజ్ఞా క్షేత్రంలో విశేష కృషి చేసిన వారిలో డా॥ ఆర్వియస్ సుందరం చెప్పుకోదగినవారు. తెలుగు సాహిత్యంలో దేశి కవిత అనే గ్రంధాన్ని రచించి అకాడమీ బహుమతిని పొందారు. తెలుగు కన్నడ జానపద గేయాలు అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టా పొందారు. ఈ గ్రంధంలో తెలుగు, కన్నడ, జానపద గేయాల్లోని పని పాటలు, వలపు పాటలు, హాస్య గీతాలు, కన్నీటి పాటలు తులనాత్మకంగా వివరించబడ్డాయి. ఈ సిద్ధాంత వ్యాసం వల్ల తెలుగు, కన్నడ, జానపదుల జీవితాన్ని సుందరం గారు వెలికి తీసుకొచ్చారు.

వీరి “జానపద సాహిత్య స్వరూపం” అనే గ్రంథంలోని వ్యాసాలు జానపద గేయాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, జానపద గేయాల ప్రచురణకు ఒక పద్ధతిని సూచించాలనే ఉద్దేశ్యంతో “అలి చిప్పలు - ఆణిముత్యాలు” అనే

గ్రంథాన్ని ప్రకటించారు. ఈ గ్రంథంలో జానపద గేయాలను, కథా గేయాలను, సామెతలను, పొడుపు కథలను గూర్చిన ప్రత్యేక పరిశీలన ఉంది.

డా॥ సుందరం అందించిన మరో ఉత్తమ గ్రంథం "ఆంధ్రుల జానపద విజ్ఞానం" పదిహేనేళ్ళ జానపద సాహిత్య కృషి ఫలితంగా వెలువడిన గ్రంథం ఇది. ఈ గ్రంథంలో ఆంధ్రుల జానపద విజ్ఞాన గ్రంథం సంపద ఔన్నత్యాన్ని నేడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో జరుగుచున్న కృషిని దృష్టిలో ఉంచుకుని ఈ పుస్తకం రచించబడింది. జానపద విజ్ఞాన విభజన పరిశీలన శాస్త్రీయంగా జరగడానికి కావలసిన సూచనలు ఇందులో నిర్దేశించబడినాయి. జానపద విజ్ఞానంలోని ప్రత్యేకతల్ని ఈ గ్రంథంలో స్పష్టం చేశారు. అంతేగాక జానపద సాహిత్యానికి సంబంధించి అనేక వ్యాసాలు వ్రాశారు. వాటిలో కొన్ని కౌశిక జానపద నృత్యాలు తెలుగు కన్నడ జానపద సాహిత్యాలు-స్వరూపక-రాయలసీయ జానపద కళలు మొదలగునవి.

**డా॥ జి.యస్. మోహన్:** డా॥ జి.యస్. మోహన్ ద్వి భాషా రచయిత, అనువాదకుడు. ప్రస్తుతం బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నారు. తెలుగు కన్నడ భాషా సాహిత్యాల గురించి తులనాత్మక వ్యాసాలు ప్రచురించారు. 1985వ సంవత్సరంలో తెలుగు "జానపద విజ్ఞాన సూచి" అనే గ్రంథాన్ని ప్రచురించారు. అందులో 1982 దాకా ప్రచురించబడ్డ సేకరణ గ్రంథాల వివరాలను, వ్యాసాల వివరాలను ఇవ్వడం జరిగింది. అలాగే 1993 వ సంవత్సరంలో ప్రసిద్ధ జానపద విజ్ఞావేత్తలు అనే పేరుతో మరో పుస్తకాన్ని ప్రచురించారు. అందులో తెలుగు జానపద సాహిత్యోద్ధారకులను గురించి వివరించడంతో పాటు, 1993వ సంవత్సరం దాకా విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలను పరిశోధకులను తెలియజేయడం జరిగింది.

ముద్రిత రచనలలో కొన్ని జానపద విజ్ఞాన వ్యాసావళి, తెలుగు జానపద విజ్ఞాన సూచి, స్త్రీల పాటలు, సామెతలలో సాంఘిక జీవనం, జానపదుల నమ్మకాలు, తెలుగు జానపద కథలు, జానపదుల తిట్లు పరిశోధన – సామాగ్రి సేకరణ, ప్రసిద్ధ జానపద విజ్ఞాన వేత్తలు, సాంఘిక జానపద ఆచారాలు, తెలుగు కన్నడ సామెతలు – సమానార్థకాలు మొదలగునవి.

వీరు వివిధ పత్రికలలో జానపద విజ్ఞాన ప్రక్రియలకు చెందిన వైవిధ్య పరిశోధన వ్యాసాలను తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషలలో దాదాపు 65 ప్రచురించారు. వాటిలో కొన్ని తెలుగు, కన్నడ జానపద విజ్ఞానం, ఎరుకతలు, మొలక పాటలు, కపిల పాటలు, స్త్రీల పాటలు, వైశిష్ట్యం స్త్రీల పాటల్లోని భాషా విశేషాలు ఇత్యాదివి. వీరు వివిధ జానపద విజ్ఞాన చర్చా గోష్ఠుల్లో పాల్గొని పరిశోధనా వ్యాసాలను సమర్పించారు. వీరి మార్గదర్శకత్వంలో జానపద సాహిత్యానికి సంబంధించి ఇద్దరికి పి.హెచ్‌డి.లు, ఐదుగురికి ఎం.ఫిల్ డిగ్రీలు లభించాయి.

**డా॥ కసిరెడ్డి వెంకటరెడ్డి:** డా॥ కసిరెడ్డి గారు కవిగా, విమర్శకునిగా పేర్కొనదగిన వారు. వీరు జానపద సాహిత్యంలో చేసిన కృషి ఎన్నదగినది. వీరి రచనలు ఎనిమిది గ్రంథాలు, అనేక వ్యాసాలు, పీఠికలు, సృజనాత్మకత కృషిలో భాగంగా అనువర్తిత జానపద సాహిత్యాలు ఉన్నాయి. వీటన్నిటిలో ఉన్నత ప్రమాణాలనిచ్చే గ్రంథం "తెలుగు పొడుపుకథలు" ఈ పొడుపు కథల పుస్తకంలో పొడుపు కథల విశ్వరూపాన్ని చూపగలిగారు. ప్రజా జీవనంతో ఈ కథలు ఎలా సంబంధం కలిగి ఉంటాయో తెలియజేసారు. పొడుపు కథలు, కథాత్మకంగా ఎలా ఉంటాయి, అవి ఎన్ని రకాల కథల్ని సూచిస్తాయో వివరంగా చెప్పగలిగారు.

జానపద పరిశోధనలో వీరి కృషికి మరొక తార్కాణం "జానపద సాహిత్యం అధ్యయనం అనుశీలనం" ఇదొక వ్యాస సంకలన గ్రంథం. దీనిలో వైవిధ్యంతో కూడిన 29 వ్యాసాలున్నాయి. సామెత సామాజిక ప్రయోజనం సాంఘిక చరిత్ర నిర్మాణంలో జానపద గేయం వాటి వ్యాసాలు మనలో ఆలోచనల్ని రేకెత్తింపజేస్తాయి. డా॥ కసిరెడ్డి గారు భిన్న జానపద

సాహిత్య ప్రక్రియలను పెద్ద సంఖ్యలోనే సేకరించారు. రంగారెడ్డి జిల్లా జానపద గేయాలు, పాలమూరు జిల్లా జానపద గేయాలు, వీరి సాహితి రజతోత్సవ సందర్భంగా వెలువడినాయి.

డా॥ కసిరెడ్డి గారు తాను నమ్మిన సిద్ధాంతం కోసం, నమ్మిన సామాజిక వ్యవస్థ కోసం, సమాజంలోని భిన్న సమస్యల పరిష్కారం కోసం, అనువర్తిత జానపద సాహిత్యాన్ని సృష్టించారు. వరకట్న నిషేధం, మధ్యపాన నిషేధం ఆవశ్యకతను, లంచగొండితనం నిర్మూలనాన్ని, మాతృశక్తి చైతన్యాన్ని ప్రభోధించి, 15 పాటలను అందించారు. వీరి ముద్రిత బుర్ర కథలు ముందు ఇవి చాలా మంది మన్ననలకు పాత్రమైంది. దేశానికి గుండెకాయ పల్లె సీమలే. ఈ పల్లె వాసులు ముఖ్య వృత్తి వ్యవసాయం. వ్యవసాయానికి మూలాధారం పశుసంపద. ఆ పశు సంపదను సర్వనాశనం చేసి దేశాన్ని కొల్లగొట్టాలనే ధ్యేయంతో వెలసిన యాంత్రిక పశువధశాల, అవసరాలను గోరక్షణ బుర్ర కథతో చక్కగా వర్ణించారు. గోరక్షణపై వీరు రచించిన జానపద గేయాలు కూడా ఆలోచనల్ని రేకెత్తిస్తాయి. పశువులు లేకపోతే దేశం నిర్వీర్యమైపోయి రైతన్న అప్పులు పాలై పోతాడంటారు. భూమి అరబ్బుల సొంతమవుతుందని, పశువులను రక్షించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఇలా పశువులను కాపాడి దేశం పాడి పంటలతో సమృద్ధి కావాలి. ప్రపంచానికే అన్నం పెట్టి క్షుధార్తిని తీర్చే విధంగా దేశం సుసంపన్నం కావాలంటారు. ఇలా జానపద విజ్ఞానంలో డా॥ కసిరెడ్డి గారి కృషి అభినందనీయం.

**డా॥ రావి ప్రేమలత:** డా॥ రావి ప్రేమలత గారు 1945 వ సంవత్సరంలో పుట్టారు. వీరు బి.యస్సి. చదివి ఆ తరువాత ఎం.ఎ. తెలుగులో ఐచ్ఛికాంశంగా జానపద సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. డా॥ కృష్ణ కుమారి గారి నేతృత్వంలో “జానపద సాహిత్యము-పురాణ గాధలు” అనే అంశంలో పిహెచ్.డి. చేశారు. పురాగాధల స్వరూప స్వభావ నిరూపణాన్ని వాటిలో ప్రస్ఫుటమయ్యే ప్రాచీన మానవ మనస్తత్వాన్ని వెలికి తీయడమే వారి పరిశోధనా లక్ష్యం. తాను సేకరించిన జానపద కథలను విశ్లేషించి, నరజాతి చరిత్రా విశేషాలను వెదికి పట్టుకోవడానికి ప్రయత్నించారు.

తెలుగు “జానపద సాహిత్యం-పురాగాధలు” కోసం వారు తెలుగు నాట అనేక ప్రాంతాలు తిరిగి సేకరించిన పురాగాధల ఆధారంగా వెలువరించిన గ్రంథం ఇది. ఇందులో పురాగాధలన్నింటినీ వర్ణనాత్మకంగానూ, తులనాత్మకంగానూ, చారిత్రకంగానూ విశ్లేషించి ఆరు అధ్యాయాలలో వివరించారు. వీటిలో పురాగాధల స్వరూప స్వభావాలను పాశ్చాత్య విద్వాంసుల విశ్లేషణా పద్ధతులను, సృష్టి సంబంధమైన దేవతా సంబంధమైన, ఆచార సంబంధమైన గాధలనూ జానపద సాహిత్యంలోని భాషా విశేషాలనూ విశ్లేషించారు.

వీరి మరో గ్రంథం “తెలుగు స్త్రీల చిత్ర లిపి” ఈ గ్రంథం రామరాజు జానపద విజ్ఞాన బహుమతి పొందిన గ్రంథం స్త్రీల మనోభావాలకు, ఆచారాలకు, నమ్మకాలకు ముగ్గులు ప్రతీకలు. ప్రతి ముగ్గు ఏదో ఒక నిగూఢమైన భావాన్ని తనలో ఇముడ్చుకొని ఉంటుంది. ఒక సంస్కృతికి అలవాలమైన ఈ ముగ్గులపై ఇంత వరకు పరిశోధన జరగలేదు. ఈ ముగ్గులను వివిధ దృక్కోణాల నుండి పరిశోధించి, అంతర్లీనంగా ఉన్న అర్థాన్ని చాటి చెప్పిన మొదటి పరిశోధన గ్రంథం ఈ “తెలుగు చిత్రలిపి” స్త్రీల జానపద విజ్ఞాన పరిశీలనలను డా॥ ప్రేమలత గారు, డా॥ శ్రీ లక్ష్మీ గారు కలిసి 23 వ్యాసాలతో కూడిన ఒక విమర్శనాత్మక గ్రంధాన్ని వెలువరించారు. ఇందులో డా॥ రావి ప్రేమలత గారివి 13 వ్యాసాలున్నాయి. పదమూడు వ్యాసాలలోను ఏదో ఒక నూతనత్వాన్ని ప్రతిపాదించడానికి ప్రయత్నించారు. మాతృస్వామ్య వ్యవస్థ మతం స్థానంలో స్త్రీ శక్తి ప్రాధాన్యం. జానపద కళల్లోని పురగాధాంశాలు, సామెత, పొడుపు కథ, జానపద కథ వంటి జానపద ప్రక్రియ నిర్మాణ విశ్లేషణ, ద్రౌపది,

తిరునాళ్ళు, బతుకమ్మ పండుగ వంటి జానపద పండుగల పరమార్థం ఈ వ్యాసాలలో చక్కగా విశదీకరించారు. ఇవిగాక తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖ విద్యార్థుల కోసం పాఠాలు రాశారు. వివిధ పత్రికల్లో, సదస్సుల్లో యాభై పైచిలుకు వ్యాసాలను రాశారు. వీరి పర్యవేక్షణలో ఎం.ఫిల్., పిహెచ్.డి.లు చేసిన వారు కూడా ఉన్నారు. వీరు జానపద విజ్ఞాన అధ్యయనంలో నిరంతర కృషి చేస్తున్న పరిశోధకులుగా పరిగణింపబడుతూ ఉన్నారు.

**2.3. నమూనా ప్రశ్నలు:**

1) జానపద విజ్ఞాన అధ్యయనంలో ప్రాచ్యుల కృషిని వివరించండి?

2) జానపద విజ్ఞాన అధ్యయనంలో పాశ్చాత్యుల కృషిని విశదీకరించండి?

**2.4. ఆధార గ్రంథాలు:**

1) జానపద గేయ సాహిత్యం – బిరుదు రాజు రామరాజు

2) జానపద గేయ గాథలు – నాయని కృష్ణకుమారి

3) జానపద విజ్ఞానాధ్యయనం – జి.యస్. మోహన్

4 జానపద విజ్ఞానం – ఆర్.వి.యస్. సుందరం

5) తెలుగు సాహిత్య సమీక్ష – జి. నాగయ్య

6) జానపద వాఙ్మయ వ్యాసావళి – నేదునూరి గంగాధరం.

**- డా॥ పిల్లి వాసు.**

# పాఠం - 3
# శిష్ట సాహిత్యం-జానపద సాహిత్యం-తులనాత్మక అధ్యయనం

## 3.0. లక్ష్యం:

విద్యార్థులకు శిష్ట, జానపద సాహిత్యాలలోని భేదసాదృశ్యాలను తెలియజేయుట.

**విషయసూచిక:**


**3.1.** శిష్ట, జానపద సాహిత్యాల తులనాత్మక పరిశీలన

**3.2.** నమూనా ప్రశ్నలు

**3.3.** ఆధార గ్రంథాలు


## 3.1. శిష్ట, జానపద సాహిత్యాల తులనాత్మక పరిశీలన:

శిష్ట సాహిత్యమైన, జానపద సాహిత్యమైన రెండింటి ప్రయోజనం ఒక్కటే. పాఠకులకు రసానందాన్ని అందించడం, తద్వారా సమాజాన్ని చైతన్య పరచటం రెండింటి ప్రధానాశయం. శిష్ట, జానపద సాహిత్యాలను పరిశీలిస్తే, శిష్ట సాహిత్యం కంటే జానపద సాహిత్యం ఎంతో ప్రాచీనమైందని తెలుస్తుంది.

ఆదికవి వాల్మీకి ఆదికావ్యం రామాయణం. వాల్మీకి తన రామాయణాన్ని గురించి ఇలా ప్రస్తావించారు 'తంత్రిలయ సమన్వితం పాఠ్యే, గేయేచ మధురం'. ఆదికావ్యం రాయడానికి ముందే పాడటం అనేది జన వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తుంది. వాల్మీకి తన రామాయణం చదువుకోవడానికి, పాడుకోవడానికి అనుకూలంగా ఉంటుందని స్వయంగా చెప్పారు. వాల్మీకి రామాయణాన్ని లవకుశలు అయోధ్యలోను, ఇతర జనపదాల్లోను గానం చేసినట్లు తెలుస్తుంది. దీనిని బట్టి జానపద సాహిత్యం ఎంతో ప్రాచీనమైనదని స్పష్టమవుతుంది.

ప్రారంభ దశలో జానపద సాహిత్యం అంతా గేయ రూపంలోనే ఉండేది. పాటనే పదం అని కూడా వ్యవహరించడం పరిపాటి. కాలక్రమంలో పదమే పద్యంగా పరిణమించిందని పరిశోధకుల అభిప్రాయం. జానపదుల జీవన విధానంలో పాటకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఛందోబద్ధమైన పద్య రచనకు పదమే మూలం. జానపదులు గానం చేసే పదాలే పండితుల చేతిలో పడి ఛందోబద్ధమైన పద్యాలుగా రూపాంతరం చెంది, శిష్ట సాహిత్యంగా పరిణమించింది.

తెలుగులో ఆదికవి నన్నయకు పూర్వమే వివిధ రూపాల్లో జానపద సాహిత్యం ప్రచారంలో ఉండేది. కొన్ని కావ్యాలను, ప్రబంధాలను పరిశీలిస్తే వాటిని జానపద సాహిత్యం ఎంతగానో ప్రభావితం చేసినట్లు స్పష్టమవుతుంది. రంగనాథ రామాయణం, భోజరాజీయం, అన్నమాచార్య సంకీర్తనలు, రాజశేఖర చరిత్ర మొదలైనవి ఇందుకుదాహరణలు. రంగనాథ రామాయణంలోని అవాల్మీకి వృత్తాంతాలు, భోజరాజీయంలోని గోవ్యాఘ్ర సంవాదం మొదలైన కథలు, 'కొలని దోపరికి గొబ్బిళ్ళో', 'ఏలే ఏలే మరదలా' మొదలైన అన్నమాచార్యుల సంకీర్తనలు, జానపదుల నుండి శిష్ట సాహిత్యంగా రూపుదిద్దుకున్నాయి. ప్రబంధ యుగానికి చెందిన 'మాదయ్య గారి మల్లన' రచించిన 'రాజశేఖర చరిత్ర' ఇతివృత్తం కూడా జానపద సాహిత్యానికి చెందినదే.

జానపద విజ్ఞానం ఎంతో ప్రాచీనమైంది. జానపద సాహిత్యం దీనిలో ఒక భాగం. సంగీతం, చిత్రలేఖనం, వైద్య విధానం, జానపదుల ఆచార వ్యవహారాలు మొదలైనవి జానపద విజ్ఞానంలోని అంశాలు. నేటి శిష్ట సాహిత్యానికి, శాస్త్రీయ

సంగీతానికి, సంప్రదాయ నాట్యానికి, చిత్రలేఖనానికి, ఆయుర్వేద వైద్య విధానానికి జానపద విజ్ఞానంలో మూలాలున్నట్లు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ మూలాల పరిణామ వికాసమే నేడు వ్యవహరింపబడుతున్న శిష్ట సాహిత్యం, శాస్త్రీయ సంగీతం మొదలైనవి, ఎంతో ప్రాచీనమైన జానపద విజ్ఞానం నిర్లక్ష్యానికి గురికావడం గమనార్హం.

పైన పేర్కొన్న జానపద విజ్ఞానానికి సంబంధించిన వివిధ విభాగాలు, నిరక్షరాస్యులైన అనాగరికులకి చెందినవని వారు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారని విద్యావంతులు, పండితులు భావించారు. ఈ కారణంగా వారికి సంబంధించిన జానపద విజ్ఞానం పట్ల నిరాదరణ ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో వ్యాప్తిలోనున్న జానపద సాహిత్యం (విజ్ఞానం) ఈ నిరాదరణకు గురికావడం విశేషం. 20వ శతాబ్ది ప్రారంభంలో పాశ్చాత్యుల ఆలోచన విధానంలో మార్పు చోటు చేసుకుంది. జానపద విజ్ఞానానికి సంబంధించిన విలువైన అనేక ఆసక్తికర అంశాలెన్నో వెలుగుచూశాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ రంగానికి సంబంధించి ఎన్నో ఆసక్తి కరమైన, నూతనావిష్కరణలు జరిగాయి.

శిష్ట సాహిత్యం ఎంత విస్తృతమైందో, జానపద సాహిత్యం కూడా అంతే విస్తృతమైంది. శిష్ట సాహిత్యంలో వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, యక్ష గానాలు, మొదలైన ప్రక్రియలున్నాయి. ఆధునిక సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రక్రియాపరంగా నవలలు, నాటకాలు, వచనా కవిత్వం, గేయ కవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, మైనారిటీ వాదం, స్త్రీ వాదం, దళిత వాదం మొదలైనవి చోటు చేసుకున్నాయి. ఇదేవిధంగా జానపద సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రక్రియా పరంగా గేయాలు, కథా గేయాలు, గద్య కథలు, ఐతిహ్యాలు, సామెతలు, పొడుపు కథలు మొదలైనవి వున్నట్లు కనిపిస్తాయి.

ఇతివృత్త పరంగా పరిశీలస్తే శిష్ట సాహిత్యంలో రామాయణ, భారత, భాగవతాదులు వివిధ పురాణాంతర్గత ఇతివృత్తాలతో రచింపబడిన కావ్యాలు, ప్రబంధాలు, యక్షగానాలున్నాయి. ఆధునిక సాహిత్య విషయానికొస్తే సంఘ సంస్కరణ సామాజిక స్పృహ ప్రధానేతివృత్తాలుగా వివిధ ప్రక్రియలు విలసిల్లడం గమనార్హం. ఇదే విధంగా జానపద సాహిత్యంలో కూడా ఇతివృత్త ప్రధానంగా పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, పారమార్థిక గేయాలు, శ్రామిక గేయాలు, జోలపాటలు, వేడక పాటలు మొదలైనవి కనిపిస్తాయి.

శిష్ట సాహిత్యంలో ఆయా కవులు శృంగార రసానికే అధిక ప్రాధాన్యతనిచ్చారు. శృంగారాన్ని రసరాజంగా భావించి, తమ కావ్య రచనలు కొనసాగించారు. కరుణ, వీర, రౌద్ర రసాలు ఆయా సందర్భాలకనుగుణంగా మాత్రమే పోషింపబడ్డాయి. ఇందుకు భిన్నంగా జానపద సాహిత్యంలో నవరసాలకు ప్రాధాన్యత కన్పిస్తుంది. శృంగార రస గేయాలు, కరుణ రస గేయాలు, వీర రస గేయాలు, అద్భుత, హాస్య రస గేయాలు మొదలైనవి యిందుకుదాహరణలు. కాని ప్రాచీన సాహిత్యంలో ఎక్కడా హాస్యరసానికి ప్రాధాన్యతనిచ్చినట్లు తోచదు. ప్రాచీన తెలుగు కవులు హాస్యరసాన్ని నిర్లక్ష్యం చేసారన్న విమర్శ కూడా ఉంది. ఇది యదార్థం. ఇందుకు భిన్నంగా జానపదులు హాస్యరసానికి అగ్రతాంబూలమిచ్చారు. జానపద సాహిత్యంలో హాస్యరస గేయాలు ప్రత్యేకతను సంతరించుకోవటం విశేషం.

శిష్ట, జానపద సాహిత్యాల తారతమ్యాన్ని సంక్షిప్తంగా పరిశీలిద్దాం. జానపద సాహిత్యం ప్రధాన లక్షణం అజ్ఞాన కర్తృత్వం. అంటే ఆయా గేయాలను ఎవరు రచించారో తెలియదు. శిష్ట సాహిత్యంలో ఏ కావ్యాన్ని ఎవరు రాశారో స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు శ్రీ కృష్ణ జననం, ఊర్మిళా దేవి నిద్ర, లక్ష్మణ దేవర నవ్వూ మొదలైన గేయాల కర్తలెవరో తెలియదు. శిష్ట సాహిత్యానికి చెందిన ఏ కావ్యాన్నైనా లేదా ఏ ప్రబంధాన్నైనా ఎవరు రాశారో చెప్పగలం. శృంగార నైషదం-శ్రీనాధుడు,

మను చరిత్ర-అల్లసాని పెద్దన, ఆముక్త మాల్యద-శ్రీ కృష్ణ దేవరాయలు మొదలైనవి ఉదాహరణలుగా పేర్కొనవచ్చును.

శిష్ట సాహిత్యాన్ని చదివి ఆనందించే వారి సంఖ్య ఎంతో స్వల్పం. శిష్ట సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి తగిన భాషా పరిజ్ఞానం అవసరం. ఈ సాహిత్యాన్ని చదివేవారు ప్రధానంగా అక్షరాస్యులై ఉండాలి. జానపద సాహిత్యకారులు నిరక్షరాస్యులు. ఈ సాహిత్యాన్ని విని ఆనందించే వారి సంఖ్య ఎంతో ఎక్కువ. అంటే శిష్ట సాహిత్యం ద్వారా అనుభూతి పొందే వారి కంటే జానపద సాహిత్యం ద్వారా అనుభూతి పొంది ఆనందించే వారి సంఖ్య ఎంతో హెచ్చుగా ఉండటం విశేషం.

శిష్ట సాహిత్యంలో పాండిత్య ప్రకర్ష ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. జానపద సాహిత్యంలో భావోద్వేగం ప్రధానమైంది. శిష్ట సాహిత్య స్రష్టలతో పాటు పాఠకులు కూడా భాషా పరంగాను, విషయ గ్రహణ పరంగాను పండితులై ఉండటం అవసరం. జానపద సాహిత్యంలో జానపదుల మనోభావాలు ప్రాధాన్యాన్ని సంతరించుకొని సహజ ధోరణిలో వ్యక్తపరచబడతాయి. జానపద సాహిత్యాన్ని ఆస్వాదించే వారి సంఖ్య ఎక్కువగా ఉండటానికి ఇది కూడా ఒక కారణం.

శిష్ట సాహిత్యంలో అర్థాలంకారాలకు, శబ్దాలంకారాలకు ప్రాముఖ్యతయెక్కువ. అంతేగాక సుదీర్ఘ వర్ణనలెక్కువ. శిష్ట సాహిత్యంలో కృత్రిమత్వం కనిపిస్తుంది. జానపద సాహిత్యం ఈ లక్షణాలకు భిన్నంగా సాగుతుంది. ఈ సాహిత్యం ప్రధానంగా సహజత్వాన్ని సంతరించుకుంటుంది. ఈ సాహిత్యకర్తలు నిరక్షరాస్యులైనందున పాండిత్య ప్రకర్షకు, భాషా భేషజానికి ఏ మాత్రం అవకాశం ఉండదు. జానపద సాహిత్యంలో ఎక్కడైన ఆలంకారికత కనిపించిన అది ఎంతో సహజంగా ఉంటుంది. సుదీర్ఘ వర్ణనలకు ఏ మాత్రం అవకాశముండదు. ఈ సాహిత్యానికి జానపదుల మనో భావాల వ్యక్తీకరణ మాత్రమే ప్రధానం కావటం చేతి కృత్రిమత్వానికి, కల్పనలకు చోటుండదు.

శిష్ట సాహిత్యానికి చెందిన రచనలలో ఏవిధమైన మార్పులు, చేర్పులుండవు. ఆయా కావ్యాలలోని ఆశ్వాసాల సంఖ్యలో గాని, పద్య సంఖ్యలోగాని, ఎలాంటి మార్పులుండవు. జానపద సాహిత్యం యిందుకు భిన్నంగా ఉంటుంది. ప్రాంతాలను బట్టి, కాలానుగుణంగా ఈ సాహిత్యంలో తరచుగా మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ఉదాహరణకు ఒక జానపద గేయంలో, ఒక ప్రాంతంలో నాలుగు చరణాలుంటే, అదే గేయంలో ఆరు చరణాలుంటాయి. అంతేకాక ఆయా ప్రాంతాల మాండలిక పదాలు కూడా చోటు చేసుకుంటాయి. ఈ విధంగా జానపద సాహిత్యంలో, కొన్ని ప్రాంతాలలో పెరగటము, మరికొన్ని ప్రాంతాలలో తరగటము తరచు సంభవిస్తుంది.

శిష్ట సాహిత్యం అంతా గ్రంథస్థమై ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా ఒక తరం నుండి మరొక తరానికి స్థిరంగా సంక్రమిస్తుంది. జానపద సాహిత్యం యిందుకు విరుద్ధంగా ఎన్నో మార్పులకు, చేర్పులకు లోనవుతూ, కొన్ని సందర్భాలలో తన రూపే మార్చుకుంటూ, అస్థిరంగా ముందుకు సాగుతుంది. శిష్ట సాహిత్యమంతా గ్రంథాలలో నిక్షిప్తమైతే, జానపద సాహిత్యం కేవలం మౌఖిక ప్రచారం పైనే మాత్రమే ఆధారపడి తన ఉనికిని కాపాడుకుంటూ ముందుకు సాగుతుంది.

ఇంతకుముందు పేర్కొన్నట్లు శిష్ట సాహిత్యంలో హాస్యరసానికి తగిన ప్రాధాన్యం లేదు. కాని జానపదులు కేవలం హాస్యాన్నే ప్రధాన రసంగా స్వీకరించి ఎన్నో గేయాలు పాడుకున్నారు. కథలు చెప్పుకున్నారు. జానపదులు హాస్య ప్రియులు ప్రధానంగా శ్రామిక గేయాలలోను, వదినామరదళ్ళ, బావా మరదళ్ళ, వరుస పాటల్లోను మంచి హాస్యం కనిపిస్తుంది. శ్రామిక గేయాలలో, కొన్ని సందర్భాలలో, అశ్లీల పదజాలంతో కూడిన మొరటు హాస్యం కన్పించడం గమనించవచ్చు.

శిష్ట సాహిత్యం సంక్లిష్ట సమాసాలతో, ప్రౌఢ శైలీని కల్గి ఉంటుంది. జానపద సాహిత్యం మాత్రం సరళమైన, వ్యావహారిక పదాలతో సహజ సుందరంగా సామాన్య జనాన్ని సైతం ఆకట్టుకొని అలరింపచేస్తుంది. ఇదే దీని ప్రత్యేకత. శిష్ట

సాహిత్యంలో లాగా జానపద సాహిత్యంలో సంక్లిష్టతకు అవకాశం లేదు. జానపద సాహిత్యకారులు నిరక్షరాస్యులు కావడమే యిందుకు ప్రధాన కారణం.

శిష్ట సాహిత్యంలో కవులు తమ కావ్య రచనను ఒక ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తారు. కాని జానపదులు మాత్రం ఎప్పటికప్పుడు తమ మనోభావాలను అలవోకగా గేయ రూపంలో వ్యక్తం చేస్తారు. అందుచేత ఈ గేయాలు ఎంతో సహజంగా ఉంటాయి. శిష్ట సాహిత్యం ఛందోబద్ధంగా, పద్య గద్యాలతో కూడి ఉంటుంది. జానపద సాహిత్యం లయబద్ధంగా సాగుతూ, గాన యోగ్యతను కలిగి అందరికీ అందుబాటులో ఉంటుంది.

జానపద సాహిత్యమంతా ప్రధానంగా ఆశువుగా సాగుతుంది. శిష్ట సాహిత్య కవుల లాగా జానపదులకు ఎలాంటి రచనా ప్రణాళికలుండవు. జానపదులు తమ మనోభావాలను అంటే కష్ట సుఖాలను, ఆనంద విషాదాలను అప్పటికప్పుడు ఆశువుగా వ్యక్తం చేస్తారు. అయితే శిష్ట సాహిత్యంలో కూడా ఆశు కవిత్వం ఉంటుంది. కాని జానపదుల ఆశువుకు, శిష్ట ఆశువుకు ఏ విధమైన సంబంధం లేదు. ఆశు కవిత్వం అవధానాలలో ఒక అంశం. అంతేగాక ప్రత్యేకించి ఆశు కవితా ప్రదర్శనలు కూడా జరుగుతుంటాయి. ఈ విధంగా సాగే ఆశు కవిత్వం ఛందో బద్ధంగా ఉండి, శిష్ట సాహిత్య కోవకు చెందుతుంది. జానపదుల ఆశువు యిందుకు పూర్తి భిన్నంగా సాగుతుంది.

శిష్ట సాహిత్యంలో కవులు తమ రచనలను ముందుగా నిర్ణయించుకున్న ఒక ప్రణాళికా ప్రకారం కొనసాగిస్తారు. ఇక్కడ పునరావృత్తానికి తావు లేదు. జానపద సాహిత్యంలో ముఖ్యంగా గేయాలు పునరావృతమవుతూ ఉంటాయి. నిరక్షరాస్యులైన జానపదులు ఆయా గేయాలలోని చరణాలను అనుభూతిలోను, ఆవేశంతోను మళ్ళీ మళ్ళీ పాడుతుంటారు. ఇది జానపదుల సహజ లక్షణం. ఒక్క మాటలో చెప్పాలంటే శిష్ట సాహిత్యం పునరావృత రహితం, జానపద సాహిత్యం పునరావృత సహితం.

శిష్ట, జానపదుల ఉచ్చారణలో భేదాలు కనిపిస్తాయి. శిష్టులు విద్యావంతులు, జానపదులు నిరక్షరాస్యులు కావడమే యిందుకు నిదర్శనం. ఉదాహరణకు చుక్క-సుక్క, సీసా-చీసా, చొక్కా-సొక్కా. యిక్కడ చకారం సకారం గాను, సకారం చకారం గాను మారడం గమనార్హం. మరికొన్ని ఉదాహరణలు అన్నం-వన్నం, ఎక్కడ-ఏడ, అక్కడ-ఆడ, ఇక్కడ-ఈడ, గేదె-గీదె, గది-గెది, చాలు-సాలు, చాల-చాన, చిలుక-సిలుక, వెన్నెల-ఎన్నల, వేడి-ఏడి, విస్తరి-యిస్తరి, వెండి-ఎండి, కోకిల-కోయిల యిటువంటి ఉదాహరణలు జానపదుల, శిష్టుల ఉచ్చారణలో ఉన్న తేడాలను కోకొల్లలుగా గమనించవచ్చు.

శిష్ట, జానపద సాహిత్యాలలోని కథలు, తెలుగు చలన చిత్రాలను ఎంతగానో ప్రభావితం చేశాయి. రామాయణ, భారత, భాగవతాలలోని కథలు పౌరాణిక చిత్రాలుగా వెలువడి అశేష ప్రజాదరణకు పొందాయి. సీతారామ కళ్యాణం, లవకుశ, పాండవ వనవాసం, నర్తనశాల, భక్త ప్రహ్లాద, భక్త అంబరీష, శ్రీ కృష్ణ తులాభారం, శ్రీ కృష్ణ పాండవీయం, శ్రీ కృష్ణలీలలు, శ్రీ కృష్ణ రాయభారం, శ్రీ కృష్ణార్జున యుద్ధం, దీపావళి, శ్రీ కాళహస్తీశ్వర మహత్మ్యం, భీష్మ మొదలైన చిత్రాలు శిష్ట సాహిత్యానికి చెందిన కథలు ఆధారంగా నిర్మింపబడ్డాయి.

జానపదుల వ్యాప్తిలో ఉన్న కథలు కూడా చిత్రాలుగా రూపొంది ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. కాశీమజిలీ కథలు, మదన కామరాజు కథలు, విక్రమార్క, భేతాళ కథలు మొదలైన వాటి నుండి కొన్ని కథలను స్వీకరించి, కొన్ని మార్పులు, చేర్పులతో చలన చిత్రాలుగా నిర్మించారు. ఉదాహరణకు పాతాళభైరవి, జగదేక వీరుని కథ, బాల రాజు, భట్టి విక్రమార్క, మిడతం బొట్లు, పరమానంద శిష్యుల కథ, భువన సుందరి కథ, గులే బకావళి కథ, పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, బాల నాగమ్మ, లక్ష్మమ్మ కథ, శ్రీ లక్ష్మమ్మ, భక్త కన్నప్ప, కాంభోజ రాజు కథలు మొదలైన చిత్రాలు, జానపద

చిత్రాలుగా గుర్తింపు పొంది నేటికి అలరిస్తూనే ఉన్నాయి. మొత్తం మీద పరిశీలిస్తే పౌరాణిక, జానపద చిత్రాలు తెలుగు చలన చిత్ర చరిత్రలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నాయి.

తెలుగు చిత్ర సీమను సుసంపన్నం చేశాయి. ఇంతవరకు శిష్ట, జానపద సాహిత్యాల తీరు తెన్నులను తులనాత్మకంగా పరిశీలించాం. శిష్ట సాహిత్యం ఉత్తమమైందని, నిరక్షరాస్యులైన జానపదుల సాహిత్యం అధమమైందని భావించకూడదు. ఆయా సందర్భాలను బట్టి దేని ప్రత్యేకత దానిది. దేని స్థాయి దానిదే. బాగా పరిశీలించి చూస్తే వివిధ ప్రక్రియలతో విస్తరించిన శిష్ట సాహిత్యంపై జానపద సాహిత్య ప్రభావం ప్రసరించినది అనటంలో అతి శయోక్తి లేదు. విద్యా వేత్తలను, పండితులను, కవులను కూడా జానపద సాహిత్యం ఎంతగానో అలరిస్తుంది. శిష్ట, జానపద సాహిత్యాల తీరులు వేరైన వాటి లక్ష్యం మాత్రం ఒక్కటే. ప్రజలకు అలరిస్తూ, ఆనందిపజేస్తూ చైతన్య పరచటమే ప్రధాన ఆశయం.

### 3.2. నమూనా ప్రశ్నలు:

1) శిష్ట సాహిత్యమంటే ఏమిటి? వివరించండి?
2) జానపద సాహిత్యం అంటే ఏమిటి? వివరించండి?
3) శిష్ట, జానపద సాహిత్యాల తారతమ్యాలను తెలుపండి?
4) తెలుగు చలన చిత్రాలపై, శిష్ట, జానపద సాహిత్యాల ప్రభావాన్ని సోదాహరణంగా వివరించండి?
5) శిష్ట సాహిత్యంపై జానపద సాహిత్య ప్రభావాన్ని చర్చించండి?

### 3.3. ఆధార గ్రంథాలు:

1) జానపద గేయ సాహిత్యం - బిరుదు రాజు రామరాజు
2) జానపద గేయ గాథలు - నాయని కృష్ణకుమారి
3) జానపద విజ్ఞానాధ్యయనం - జి.యస్. మోహన్
4 జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం
5) తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
6) జానపద వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం.

**- ఆచార్య మన్నవ సత్యనారాయణ**

**పాఠం - 4**

# జానపద గేయ సాహిత్యం

## 4.0. లక్ష్యం:

విద్యార్థులకు జానపద గేయం యొక్క పుట్టుక, లక్షణాలు, నిర్వచనంతో పాటు సాహిత్యం, వర్గీకరణల గురించి తెలియజేయుట.

## విషయ సూచిక:


**4.1. ఉపోద్ఘాతం**

**4.2. జానపద గేయం-అర్థం-పుట్టుక**

**4.3. జానపద గేయ లక్షణాలు**

**4.4. జానపద గేయాలు-నిర్వచనాలు**

**4.5. జానపద గేయ సాహిత్యం-వర్గీకరణ**

**4.6. జానపద గేయాలు-పరిచయం**

**4.7. నమూనా ప్రశ్నలు**

**4.8. ఆధార గ్రంథాలు**


## 4.1. ఉపోద్ఘాతం:

జానపద సాహిత్యంలో ఎక్కువ భాగం గేయ సాహిత్యమే కనిపిస్తుంది. సాధారణంగా సంఘంలో ఒక సభ్యుడుగా ఉంటూ, ఉన్నతమైన సమాజ నిర్మాణానికి పునాదులు వేసే గ్రామీణుల సమూహం జానపదం. అలాంటి జానపదుడు సృష్టించిన అద్భుత సాహిత్యం ఇది. పగలంతా పొలం పనులతో తీరికలేకుండా ఉండే జానపదుడు పని ఒత్తిడి నుండి ఉపశమనం కోసం సాయంత్రం వేళల్లోనో, పనిచేస్తున్నప్పుడో సరదాగా ఆలపించే పాటలు ఈ గేయాలు. జానపదులు తమ మానసికోల్లాసం కోసం, తమ భావోద్వేగాలను ఈ పాటల రూపంలో వ్యక్తం చేసేవారు. ఆదిమ స్థితి నుండి ఆటవికుడిగా ఉన్న కాలంలో తనలోని భావోద్వేగాలను అరుపుల రూపంలో వ్యక్తం చేసే స్థితి నుండి భాష ఏర్పడిన తరువాత ఆ అరుపులకి ఒక రూపాన్నిచ్చి, పాటగా మార్చాడు. ఈ పాటకు మంచి సంగీతం కూడా తోడయితే ఒక మంచి గేయ సాహిత్యమే ఏర్పడుతుంది.

## 4.2. జానపద గేయం-అర్థం-పుట్టుక:

పాట అనేది చాలా ప్రాచీనమైనది. అది ఈ కాలంలో పుట్టిందని నిర్ధారించుట చాలా కష్టము. గేయమంటే పాడుకోవడానికి వీలుగా ఉండేది. ఈ పాట పద్యం కన్నా ముందే పుట్టింది. పాటలో పాడబడిన పదాల నిర్మాణం బట్టి కొన్ని గేయాలకు కాల నిర్ధారణ చేసేందుకు ప్రయత్నించవచ్చు. కాని కాలం మారుతున్న క్రమంలో కొన్ని కొన్ని పదాలు విపరిణామం చెంది పాత పదాల స్థానంలో క్రొత్త పదాలు చేరిన సంఘటనలు ఉంటాయి. ఇలా రూపు మార్చుకున్న పాటలు ఎన్నో ఉంటాయి. పాటలు పాడేవారు కూడా కొన్ని కొన్ని పదాలు వారికి అసంగతంగా తోచి తొలగించే అవకాశం కూడా లేకపోలేదు. ఆ క్రమంలోనే

కొత్త పదాలు చేరి ఉండవచ్చు. నన్నయ్యకు ముందే తెలుగులో ఎన్నో జానపద పాటలు వాడుకలో ఉన్నాయి. "వెన్నెల పదాలు, చంద్ర పదాలు, తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు మొదలగు ఎన్నో పదాలు బహుళ ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది". పాటకు స్పందించని వారుండరు. అందుకే "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణి" అని ఆర్యోక్తి. శిశువుల నుండి పశువుల వరకు అందరూ గానాన్ని ఆస్వాదిస్తారు. ఈ పాట పలు సందర్భాల్లో పలు పేర్లతో పిలువబడింది. పాట, గేయము, గీతము, పదము అని పలు రకాలుగా ఉచ్చరింపబడింది. ఇవేకాక "కీర్తనము, గాథ, గానము, గాయము, గీతము, గీతి, గేయము, పదము, ప్రగీతము" అనే పర్యాయపదాలు కూడా సమాన అర్థాన్ని కలిగి ఉన్నాయి. పేరు ఏదయినా అది పాడుకోదగినదే. పాట పుట్టుక విధానం గురించి బిరుదురాజు రామరాజు అభిప్రాయంలో "నాగరికత ప్రారంభంలో నాట్యం పుట్టింది. మనుషులు పగలంతా కష్టపడి రాత్రి నలుగురూ ఒక చోట ఉల్లాసంగా కాలము గడిపేటప్పుడు నాట్యము ప్రారంభమవుతుంది. క్రమేణ మౌనరాగము బయలుదేరుతుంది. ఆ తరువాత మనస్సులో మాట బయటకి అనేటప్పుడు లయ యేర్పడుతుంది. ఆ శబ్దజాలము పాట ఔతుంది". పాట పలానా సంవత్సరంలో పుట్టిందని చెప్పటం అసాధ్యం. దీని గురించి అన్వేషించాలంటే రాతి యుగపు మనిషి జీవితం నాటి నుండి పరిశీలించాల్సి ఉంటుంది. "మొట్టమొదటి మనిషి నోట వెలువడిన పాట ఎటువంటిదో చెప్పడం అసాధ్యం. అయినా పనికి, పాటకు ఉండే సంబంధాన్ని బట్టి మొట్టమొదటి పనిపాటలు (Work songs) వెలువడి ఉండవచ్చునని పిస్తుంది". నాటి కాలంలో మనిషికి ప్రధాన వృత్తి వేట కాబట్టి వేటాడిన తరువాత ఫలితం లభించిన ఆనందంతోనో, లభించకపోతే బాధతోనో కూనిరాగాలు తీసి ఉండవచ్చు. ఆ విధంగా రాను రాను కాలంతో పాటు పాట ఏర్పడి ఉండవచ్చు. తమ జీవితంలో ఎదురైన సుఖ దుఃఖాలను గురించి జనులు ఇతరులలో కాని, తమతోనే కాని, ప్రకృతి శక్తులకు విన్నవించుకునేటప్పుడు నాటి మనుషులు లయాత్మకంగా వీటిని ఆలపించి ఉంటారని మాత్రం ఊహించవచ్చు. అయితే తెలుగులో జానపద గేయాలు ఎప్పటి నుండి ఉన్నాయి అనే ఆలోచన వచ్చినప్పుడు మూల ద్రావిడ భాష నుండి తెలుగు ఎప్పుడు వేరు పడిందో ఆ నాటి నుండి ఉండి ఉంటాయి. అంటే "తెలుగు జానపద గేయ సాహిత్యం ఎంత లేదన్నా రెండు వేల ఏళ్ళ నాటిది ఆధారాల వేళ్ళు వెతుక్కుంటూ వెళ్తే దొరికేది శూన్యమే. గాథాసప్తశతిలో వచ్చే పల్లెపదాల ప్రసక్తి తెలుగు గీతాలను గురించిందైతే ఆంధ్రులకు అంతకంటే సంతోషించే విషయం ఉండదు." గాథాసప్తశతిలో వాటి గురించి ప్రస్తావించారంటే అంతకు ముందు నుండి ఆ పాటలు వాడకంలో ఉన్నట్లే కదా! అదే విధంగా అనంత కాలంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన రచయితల / కవుల గ్రంథాల్లో కూడా జానపద గేయాలను గూర్చి ప్రస్తావన కనిపించింది. దాని గురించి ముందు అధ్యాయాలలో ప్రస్తావించాను. రోకటి పాటలు, జాజర పాటలు, గౌడు గీతాలు, వెన్నెల గుడి పాటలు, ఉయ్యాల పాటలు వంటివి నాటి సాహిత్యంలో కనిపిస్తాయి.

### 4.3. జానపద గేయ లక్షణాలు:

జానపద సాహిత్యం గురించి అమూలాగ్రంగా పరిశీలించాలంటే దాని లక్షణాలను తెలుసుకోవటం ఎంతగానో అవసరం. మనిషికైనా, వస్తువులకైనా, పశువులకైనా, పక్షులకైనా సరే వాటికంటూ ఉన్న భిన్నత్వాన్ని ప్రత్యేకతను చాటుకునేలా కొన్ని లక్షణాలుంటాయి. జానపద సాహిత్యంలో ప్రధాన భాగమైనది గేయ సాహిత్యం. రచనతో సంబంధం లేకుండా ఆశువుగా అప్పటికప్పడే కల్పించుకుని పాడగలిగే నైపుణ్యం గల జానపదుల సుమధురమైన రీతికి ఇది నిదర్శనం. జానపద సాహిత్యంలోని పాట లలిత సంగీతం, శాస్త్రీయ సంగీతాల వంటి ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది. చక్కని లయ, తాళంతో వాటిని మైమరపించే రమణీయ ధోరణి కనిపిస్తుంది. జానపదులు పాడుకునే ఈ పాటలో వారి రసైక్య జీవనవిధానం స్పష్టంగా

కనిపిస్తుంది. సంగీత, స్వర శాస్త్రాలను చదువుకోకపోయినప్పటికీ జానపదులు భావ రమణీయమైన పాటలను పాడగలరు, ఆస్వాదించగలరు. జానపదులు పాడుకునే పాటల్లో హృదయ స్పందన గోచరిస్తుంది. జానపద గేయం అనేది జానపద సాహిత్యంలో అంతర్భాగంగా ఉంది. కాబట్టి జానపద సాహిత్యానికి వర్తించే లక్షణాలు అన్ని దీనికి వర్తిస్తాయి. అయితే ప్రత్యేకించి పాటకు మరిన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. డా॥ జి.యస్. మోహన్ గారు జానపద విజ్ఞానం మొత్తానికి వర్తించేలా జానపద విజ్ఞానాధ్యయనంలో మూడు లక్షణాలను పేర్కొంటూ, వాటిని సార్వత్రిక లక్షణాలు అని ప్రకటించారు. అవి: –

**అ. సాంప్రదాయక వ్యాప్తి (Traditional circulation):**

జానపద సాహిత్య విశేషాలు అన్ని ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించే విజ్ఞాన భాండాగారం. ఇవి జానపదుల యొక్క అవధాన శక్తి మీద ఆధారపడి, ఇవి ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతాయి. జానపదులలో ఉండే జ్ఞాపకశక్తి, వినికిడి, పునరుద్ఘాటన అనే అంశాలపై ఈ జానపద సాహిత్యం ఆధారపడుతుంది. ఈ సాంప్రదాయక వ్యాప్తిలో రెండు ఉప లక్షణాలు ఉన్నాయి.

**(ఎ) మౌఖిక సంప్రదాయ ప్రసరణం:** దీనిలో జానపద సాహిత్యాంశాలు అన్నీ ఒకరి నోటి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతాయి. అంటే ఒకరు చెప్పిన దానిని మరొకరు విని, వారు ఇతరులకు అందించటం. ఇది శాబ్దిక అంశాలకు, కళలకు సంబంధించినది.

**(బి) వీక్షణ సాంప్రదాయ ప్రసరణం:** ఇది శాబ్దికేతర లేదా దృశ్య కళలకు సంబంధించింది. సాహిత్యేతర విషయాలకు చిత్రకళ, వాస్తుకళ, నృత్యం వంటివి ఒకరి నుండి మరొకరు తెలుసుకుని వ్యాపింపచేయటం వంటివి. ఇవి రెండు జానపదుల యొక్క సాహిత్య, సంబంధమైనవి.

**ఆ. విభిన్న పాఠాంతరాలు (Different versions):**

జానపద సాహిత్యంలో జానపదులు తాము సృష్టించిన కథలుగాని, పాటను గాని తమ జీవిత కాలంలో అనేకసార్లు అనేక సందర్భాలలో వాటిని పునరుద్ఘాటించేటప్పుడు మొదటగా చెప్పినట్లే చెప్పటం కష్టం. ఎందుకంటే మధ్యలో అనేక కల్పనలు చేరే అవకాశం ఉంది. అవసరాన్ని బట్టి వాటిలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటూ, ఇతరులకు ఆనందాన్ని కలిగించే ప్రయత్నం చేస్తుంటారు. దీన్నే విభిన్న పాఠాంతరం అంటారు.

**ఇ. సార్వజనీనత (Popularity):**

జానపద సాహిత్యం ఏ జాతి ప్రజలలోనైనా తన ఉనికిని నిలుపుకోగలదు. ఒక జానపదుడు తాను చెప్పిన అంశం అందరికీ ఆమోదయోగ్యమైనప్పుడు మాత్రమే అది వ్యాప్తి చెందగలదు, తరాలుగా నిలిచిపోగలదు. ఈ మూడు ప్రధాన లక్షణాలే కాకుండా మొత్తం జానపద సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు మరికొన్ని ముఖ్య లక్షణాలను బిరుదురాజు రామరాజు గారు 'తెలుగు జానపదగేయ సాహిత్యం'లో పేర్కొన్నారు.

**ఈ. అజ్ఞాత కర్తృత్వం:**

జానపద సాహిత్యంలో గేయాలు, కథలు అనే తేడా లేకుండా మొత్తం అన్ని అంశాలకు వర్తించే లక్షణం ఇది. జానపదులకు సంబంధించిన సామెతలు, పొడుపుకథలు, ఇతర విషయాలైన పండుగలు, జాతర్లు వంటావార్పులు ఏవైనా సరే జానపదులలో పలాన వ్యక్తి దీనిని కనుగొన్నాడని, రూపొందించాడని చెప్పలేం. కాబట్టి జానపద సాహిత్యం అనే దానికి కర్త ఉండదు.

**ఉ. అవిదిత కాల నిర్ణయం:**

జానపద సాహిత్యంలో మరొక ముఖ్య లక్షణం కాల నిర్ణయం. జానపద సాహిత్యంలో కాని, మొత్తం జానపద వ్మాయంలో కాని ఏ విషయమైనా సరే ఏ కాలంలో చెప్పారో నిర్ణయించటం కూడా కష్టం. అదే శిష్ట సాహిత్యంలో అయితే కవి తన కృతిని ఎవరి కాలంలో రాస్తున్నాడో ఆనాటి సమకాలీన విషయాలు, రాజుల చరిత్రలు వంటి విషయాలు ప్రస్తావిస్తారు. కాని జానపదులు ఆ నియమం పాటించరు. వారికి కేవలం భావ వ్యక్తీకరణే ముఖ్యం. కాబట్టి కాలాన్ని అంచనా వేయలేం. చారిత్రక నేపథ్యం ఉన్న సంఘటనల విషయంలో కొంత అంచనా వేయవచ్చు కాని, నిర్దేశిత తారీఖున వచ్చిందని చెప్పలేం.

**ఊ. ఆశు విధానం:**

జానపద సాహిత్యంలో భాగంగా జానపదులు తమలోని భావోద్వేగాలను, ఏ రూపంలోనైనా అంటే పాట రూపంలోనో, మాట రూపంలోనో, పొడుపు కథ రూపంలోనో మరేదైనా కావచ్చు. అప్పటికప్పుడే సందర్భోచితంగా ప్రయోగిస్తారు. జానపద సాహిత్యం అంటేనే మౌఖిక వ్మాయం కదా. కాబట్టి జానపదుడి నోటి నుండి ఇవి అప్పటికప్పుడే ఆశు రూపంలో వెలువడుతాయి. అంతే కాకుండా ఇవి మౌఖిక ప్రసరణతో కూడుకున్నది. జానపదుల్లో విద్యా గంధం లేకపోయినా భావ వ్యక్తీకరణలో శిష్టులతో సమానులే. వారిలాగా రాయలేకపోయినా తమ మనో భావాలను చక్కగా అప్పటికప్పుడు వ్యక్తీకరించగలరు.

**ఋ. స్థిర రూప రాహిత్యం:**

జానపద సాహిత్యంలో ఏదైనా సరే స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఒక అంశంలో వివిధ తరాలలో, అనేక సందర్భాలలో ఎన్నో కొత్త అంశాలు చేరిపోతుంటాయి. కొంత భాగం, మూలంలో చేరటం లేదా మూలం నుండి కొంత భాగం తీసివేయటం వంటివి జానపదుల్లో మనకు కనిపిస్తుంది.

**ౠ. జనజీవన అభివ్యక్తం:**

జానపద సాహిత్యం ప్రజల జీవనానికి అద్దం పట్టేది. నాటి జనుల జీవనశైలిని స్పష్టీకరిస్తుంది. ఐతిహ్యాలైనా, పురాణాలైనా, సమాజంలో జరిగే సంఘటనలైనా సరే ఆనాటి జానపదుల జీవనాన్ని వ్యక్తం చేస్తాయి. అదే విధంగా జానపదులు కూడా తాము ఏం చెప్పినా దానిలో ప్రజా జీవన విధానాన్ని సాహిత్యంలో ప్రతిబింబింపజేస్తారు.

**ఎ. పునరుక్తి:**

జానపద సాహిత్యానికి మరో లక్షణం ఈ పునరుక్తి. కథకు పటుత్వంవే రావడానికి జానపదుడు చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పేటప్పుడు మూల కథను చెప్తుంటాడు. ఈ పునరుక్తి లక్షణమే దీనిలో కనిపిస్తుంది.

**ఏ. శైలి నిరాడంబరం:**

జానపదుల భాషలోనూ, వారి వ్యవహార శైలిలోనూ సౌందర్యం ఇమిడి ఉంటుంది. స్వరూపం అనేది బాహ్య రూపానికి చెందిందయితే, శైలి అంతర రూపాన్ని ప్రతిబింబిస్తుంది. జానపదుల సాహిత్యంలో స్వచ్ఛత, నిరాడంబరం కనిపిస్తాయి. వారికే సొంతమైన జాతీయాలు, సామెతలు, పలుకుబడులు మొదలైన వాటితో జానపదుల భాష రమణీయంగా ఉంటుంది.

**ఐ. మానవ స్వభావం చిత్రణ:**

జానపద సాహిత్యంలో మానవ సహజ స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది. కల్లా కపటం లేని జానపదుల మనస్సు, వారి భావాలు కనిపిస్తాయి.

**ఒ. అద్భుతాలావిష్కరణ:**

జానపద సాహిత్యంలో ఉన్న మరో ముఖ్య లక్షణం అద్భుతాలు సృష్టించటం. అద్భుతాలకు అవకాశాలు లేని జీవితాలను అద్భుతంగా తీర్చిదిద్దినట్లుంటుంది జానపద సాహిత్యం. మనిషి చేయగలిగే వాటిని, చేయలేని వాటిని జంతువులకి, పక్షులకి, చెట్లకి ఆపాదించటం, చిన్నవి పెద్దవిగా, పెద్దవి చిన్నవిగా మార్చివేయటం వంటి ఎన్నో అద్భుతాలు జానపదులు చేయగలరు.

## 4.4. జానపద గేయాలు-నిర్వచనాలు:

జానపద విజ్ఞానమంతటిలో సాహిత్యానికి ఎంత ప్రాధాన్యత ఉందో, సాహిత్యంలో జానపద గేయానికి అంత ప్రాముఖ్యత ఉంది. జానపద గేయ కవిత్వం అనేది శిష్ట సాహిత్యం కన్నా భిన్నమైనది. దీనిలో ప్రతిభకు, పాండిత్యానికి అవకాశం లేదు. సహజంగా జానపదుడి మనసులోంచి భావస్ఫోరకంగా వచ్చే కళ. ప్రపంచ వ్యాప్తంగా జానపద సాహిత్యం పైన పరిశోధనలు విస్తృతంగా, జరుగుతున్న తరుణంలో అందులో భాగమైన జానపద గేయాలదే అధికపాత్ర అనడంలో సందేహం లేదు. ఈ జానపద గేయాలను గురించి పలువురు ప్రముఖులు ఈ విధంగా నిర్వచించారు.

**అ. Krappe:**

A folk song is a lyric song which originates among illiterate (జానపద గేయాలు అనేది సాహిత్య రూపం ఉన్నటు వంటి పాట. అది నిరక్షరాస్యుల నుండి ఉద్భవించినదని వీరు నిర్వచించారు)

**ఆ. Cecil J. Sharp:**

The song created by the common people as against the song which has been composed by the educated. (వీరి నిర్వచనంలో చెప్పిన దానిని బట్టి ఏ పాటైతే విద్యావంతులతో కాకుండా సామాన్య ప్రజల చేత సృష్టించబడి, పాడబడుతుందో అదే జానపద పాట అవుతుంది అని పేర్కొన్నారు).

**ఇ. బిరుదురాజు రామరాజు:**

"జనపదములందున్న యనాగరిక హృదయము నుండి వెలువడునదే జానపద గీతము".

**ఈ. G.S. మోహన్:**

వీరి ఉద్దేశం ప్రకారం "వ్రాత కోతలతో నిమిత్తం లేని జానపదులు రసోద్రేకులై ఆలపించు సుమధుర భావ నిర్ఘర గీతాలే జానపదగీతాలు". జానపదులకు లిఖిత పూర్వకంగా చేయటానికి వారు నిరక్షులు. గనుక దానికే అభిప్రాయపడ్డారు. అవసరం లేదు. చెప్పదలచుకున్న భావాన్ని రసవంతంగా ఆలపిస్తారు అని

**ఉ. డా॥ ఎ. అనసూయ దేవి:**

"జానపదులు పాడేవి అచ్చంగా భూగర్భంలోంచి పొడుచుకు వచ్చి మొలుచుకుపోయే చెట్లూ, చేమలూ, లతలూ, పూతలు వంటివి ఈ జానపద గేయాలు". వీరి ఉద్దేశం ప్రకారం జానపద పాటలు సహజ సిద్ధంగా పుట్టేవిగా కనిపిస్తున్నాయి. భూగర్భంలోని విత్తు మొలిచినట్లుగా ఇవి జానపదుల హృదయాల నుండి పుడతాయని నిర్వచించారు.

**ఊ. నార్ల వెంకటేశ్వరరావు:**

"బ్రతుకు నుంచి బాహిరిల్లేది జానపద గేయం". వీరి నిర్వచనం ప్రకారం పాట ఏదైనా అది వ్యక్తి జీవితాలనుభవం

నుండి పుడుతుంది. జానపదుల విషయంలో ఇది బహిర్గతం. వారి బ్రతుకులోని అనుభవాల నుండి బయటకు వచ్చేది జానపద పాట అని వీరి ఉద్దేశం.

## 4.5. జానపద గేయ సాహిత్యం-వర్గీకరణ:

జానపద గేయ సాహిత్యాన్ని పలువురు పరిశోధకులు పలు రకాలుగా వర్గీకరించారు. వారిలో పాశ్చాత్యులు, స్వదేశీయులు ఉన్నారు.

**అ) R.S. బాగ్స్ వర్గీకరణ:**

జానపద విజ్ఞానం మీద విశిష్ట పరిశోధన చేసి, దానిలోని పలు అంశాలను వివిధ అంశాలుగా విభజించిన పరిశోధకుడు బాగ్స్. వీరు జానపద గేయ సాహిత్యాన్ని ఈ క్రింది విధంగా విభజించారు.

1. భావోద్వేగ గేయాలు (Emotion)
2. దైనందిన జీవిత గేయాలు (Daily Life)
3. జీవిత చక్రంలోని ముఖ్య సన్నివేశాల గేయాలు (Crucial Movements in Life Cycle)
4. పిల్లల పాటలు (Childrens Songs)
5. ధార్మిక గేయాలు (Religious Songs)

ఇలా ఐదు శీర్షికలలో వారు గేయాలను విభజించారు.

**ఆ) Hen Barua-వర్గీకరణ:**

Hen Barua భారతదేశంలోని జానపద గేయాలను సేకరించి, వాటిని ఐదు శీర్షికలలో పేర్కొన్నారు. అవి:

(ఎ) ప్రకృతి గీతాలు (Nature Songs)

(బి) ప్రేమ గీతాలు (Love Songs)

(సి) సంసారిక గీతాలు (Marriage Songs)

(డి) జోలపాటలు (Lullabies Songs)

(ఇ) శ్రామిక గీతాలు మరియు పండుగ పాటలు (Work Songs and Festival Songs).

**ఇ) Ulli Beir – వర్గీకరణ:**

వీరు ఆఫ్రికా నందలి జానపద గేయాల్ని సేకరించి వాటిని ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

(ఎ) మత గీతాలు (Religious Songs)

(బి) మరణ గీతాలు (Elegiac Songs)

(సి) ప్రశంసా గీతాలు

(డి) ప్రేమ గీతాలు (Love Songs)

(ఇ) జంతు గీతాలు (Animals Songs)

(ఎఫ్) యుద్ధ గీతాలు (War Songs)

(జి) ప్రజా గీతాలు (Peoples Songs)

(హెచ్) శిశు గీతాలు (Children Songs)

**ఈ) శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావు–జానపద గేయ వర్గీకరణ:**

కామేశ్వరరావు అనేక జానపద గేయాలను సేకరించి వాటిని ఈ క్రింది విధంగా విభజించారు. అవి:-

1. జంగం కథలు
2. పౌరాణిక గేయాలు
3. పూర్వాచీన పదములు
4. స్త్రీల పాటలు
5. అర్వాచీన పదములు
6. వాగ్గేయములు
7. తత్వములు
8. ఖండ గేయములు
9. జంగం చరిత్ర కథలు

**ఉ) బిరుదురాజు రామరాజు – జానపద గేయ వర్గీకరణ:**

బిరుదురాజు రామరాజు గారు గేయ సాహిత్యంపై విశేష కృషి చేసి, నాటి ఉమ్మడి రాష్ట్రంలోని చాలా జానపద గేయాలను సేకరించారు. వీరు సేకరించిన పాటలననుసరించి వాటిని ఈ క్రింది విధంగా విభజించారు.

1. పౌరాణిక గేయాలు–రామాయణ సంబంధ, భారత సంబంధములు, భాగవత సంబంధమైనవి.
2. చారిత్రక గేయాలు–చారిత్రములు, అస్పష్ట చారిత్రములు.
3. మత సంబంధ గేయాలు–శైవమత సంబంధమైనవి, వైష్ణవ మత సంబంధమైనవి.
4. పారమార్థిక గేయాలు–భక్తి గేయాలు, వేదాంత సంబంధమైనవి, కర్మ మార్గ సంబంధమైనవి.
5. స్త్రీల పాటలు
6. శ్రామిక గేయాలు
7. పిల్లల పాటలు
8. శృంగార గేయాలు
9. అద్భుత రస గేయాలు
10. కరుణ రస గేయాలు
11. హాస్యపు పాటలు

**ఊ) కృష్ణ శ్రీ జానపద గేయ సాహిత్య వర్గీకరణ:**

పల్లెపదాలు శీర్షికతో ఆంధ్ర రాష్ట్రంలోని జానపద పాటలను సేకరించిన కృష్ణశ్రీ తన గ్రంథంలో వాటిని ఈ క్రింది విధంగా విభజించారు.

1. పని పాటలు
2. ఆట పాటలు
3. వీర గాథలు
4. బ్రతుకు పాటలు
5. వినోద గేయాలు
6. ఈల పాటలు
7. పడవ పాటలు
8. వేదాంతపు పాటలు.

**ఋ) త్రివేణి-ఆంధ్రదేశ జానపద గేయాలు-సంకలనం-గేయాల వర్గీకరణ:**

బిరుదురాజు రామరాజు, శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి, నేదునూరి గంగాధరం, తుమాటి దోణప్పలు కలసి సేకరించిన పాటల సమూహారానికి 'త్రివేణి' అని నామకరణం చేశారు. దీనిలో వీరు పాటలను ఈ క్రింది విధంగా వర్గీకరించారు.

1. పిల్లల పాటలు
2. వేడుక పాటలు
3. స్త్రీల పాటలు
4. శ్రామిక పాటలు
5. వలపు పాటలు
6. హాస్యపు పాటలు
7. కన్నీటి పాటలు
8. పారమార్థిక గేయాలు

**ఋ) R.V. S. సుందరం జానపద గేయ సాహిత్యం-వర్గీకరణ:**

R.V.S. సుందరం జానపద వ్మాయ విశేషాలన్నింటిని గురించి తన పరిశోధన గ్రంథమైన 'ఆంధ్రుల జానపద విజ్ఞానం'లో వివరించారు. అందులో జానపద గేయాలను గురించి ఈ క్రింది విధంగా వర్గీకరణ చూపించారు. వీరు 'జానపద కవిత్వం' అనే పేరుతో గేయాలు, కథా గేయాలను వర్గీకరణలో చూపించారు.

1. పని పాటలు
2. పారమార్థిక గేయాలు
3. బాంధవ్య గీతాలు
4. పిల్లల పాటలు
5. వేడుక పాటలు
6. వలపు పాటలు
7. హాస్య గీతాలు
8. కన్నీటి పాటలు

**ఎ) డా॥ వడాల రామకృష్ణారెడ్డి - జానపద గేయ వర్గీకరణ:**

జానపద గోదావరి సీమ ప్రాంత వాసుడైన డా॥ వడాల రామకృష్ణారెడ్డి ఆ ప్రాంతంలోని విజ్ఞాన సంపదను సేకరించి తన పరిశోధన గ్రంథమైన గోదావరి సీమ, జానపద కళలు, వేడుకలులో పొందుపరిచారు. వీరు జానపద సాహిత్యాంశాలన్నింటినీ 'జానపద వాఙ్మయం' అనే భాగంలో సూచించారు. అందులోనే గేయాలను కూడా పలురకాలుగా చూపించారు. చాలా మంది రచయితలు, పరిశోధకులు వ్యాయం అనే పదానికి, సాహిత్యం అనే పదానికి వ్యత్యాసాన్ని పాటించారు. వీరి ప్రకారం జానపద గేయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. జోలపాటలు
2. బాలానందం
3. పెళ్ళి పాటలు
4. భక్తి గీతాలు
5. దంపుళ్ళు పాటలు
6. శ్రమజీవుల పాటలు
7. శృంగార గీతాలు
8. తత్వాలు
9. హాస్యం పాటలు
10. పారమార్థిక గేయాలు
11. వీర గేయాలు

**ఏ) G.S. మోహన్ జానపద గేయ సాహిత్య వర్గీకరణ:**

మోహన్ తన 'జానపద విజ్ఞాన వ్యాసావళి' లో జానపద గేయాలలో కనిపించే వైవిధ్యాన్ని బట్టి గేయాలను నాలుగు విధాలగా విభజించారు.

1. పురుష గీతాలు
2. స్త్రీల పాటలు
3. ఉభయుల (స్త్రీ-పురుషుల) గీతాలు
4. పిల్లల పాటలు

ఈ విధంగా పరిశోధనా సౌలభ్యం కోసం జానపథ గేయాలను ఎన్నిరకాలుగా అయినా విభజించుకోవచ్చు. అయితే డా॥ ఆర్.వి.ఎస్. సుందరం జానపథ గేయల వర్గీకరణ ఎక్కువ మంది పరిశోధకుల ఆమోదం పొందింది. వీటి గురించి సూక్ష్మంగా తెలుసుకుందాం.

## 4.6. జానపద గేయాలు-పరిచయం:

### 4.6.1) పని పాటలు / శ్రామిక గేయాలు:

పనిచేసేటప్పుడు పాడే పాటల్ని పనిపాటలు అంటారు. అలా శ్రామిక గేయాలకు మారుగా పని పాటలనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. పనిచేసేటప్పుడు ఉపకరణాల శబ్దాలనే ఉపశ్రుతిగా చేసుకొని వీటిని పాడుతుంటారు. పని చకచకాసాగి పోతుంటే పాట కూడా చకచకా సాగిపోతుంటుంది. పనిభారం నెమ్మదిగా సాగుతుంటే, పాట కూడా నెమ్మదిగా సాగుతుంది. పని పాటల్లో గీత గాయకుని పాత్ర చెప్పుకోదగ్గది. పనిపాటల్లో వేట పాటలు, వ్యవసాయం పాటలు, పడవ పాటలు, కార్మిక గేయాలు ఇంటి పనుల పాటలు వంటివి ప్రధానమైనవి. ఉదాహరణకు కింది కపిల పాటను గమనించండి-

"బట్ల బట్ల చీర గట్టి-బానగిరికి నేనేపోతే
బాసగిరిలో బొజ్జయ్య కొడుకా మామ
నీలగిరి రంగయ్య బావా
నిన్ను జూసి కన్నూ నిల్చుమా
ఆశిపోసి విల్లుగట్టి-అడ్డ పింట్లో నన్నే బెట్టే ॥ ఆశ ॥
వాడు బోయే వానీ బేరము-ఓ
నీలగిరి రంగయ్యా బావా
కొత్త కొత్త కడవా నెత్తి-మెట్లబాయి నీళ్ళకొచ్చే
మెట్టు జారీ ముట్టా నిలిచెరా మామ-ఓ నీలగిరి రంగయ్యా బావ కొంత కుండా కొడుకే బట్టే మామ"

ఈ విధంగా జానపద గేయాల్లో ఎన్నో పని పాటలు చోటు చేసుకొన్నాయి.

**4.6.2) పారమార్థిక గేయాలు:**

పరమాత్ముని చేరుకోడానికి భక్తి జ్ఞాన కర్మ మార్గాలను జానపదులు అనుసరిస్తారు. భగవంతుడు లేందే ఈ లోకం లేదని విశ్వసిస్తారు. దైవాజ్ఞ ప్రకారమే తమకు మంచి చెడులు కలుగుతూంటాయని నమ్ముతారు. అందుకని తమకు మంచి జరగాలనే ఉద్దేశ్యంతో దేవుణ్ణి స్తుతించడం, పూజలు, వ్రతాలను, పండుగలు, ఉత్సవాలను జరపడం, తాత్విక చింతనతో గడపడం వంటివి చేస్తారు. ఇలా దేవుళ్ళను ఆరాధించి పాటలను పాడి తమ భక్తి ప్రదర్శిస్తారు. ఉదాహరణకు కింది పారమార్థిక గేయాన్ని చూడండి-

గణనాధా గణనాధా గణానాధ దేవ కదళి వాసవిలోల ॥ గణా ॥
మురయుచు దక్ష యోగమునకు పోయినవాడు కరివరద నీవే కాదా ॥ గణా ॥
పలుమారు కోదండ పట్టణాదీశుడవైన కనుగొంటి నిన్ను నేను ॥ గణా ॥
అనుదినము నీ పాద మనమున వేడిన ఘనుడవు నీవే కాదా ॥ గణా ॥
పరమేశ్వరునకు పార్వతి దేవికి పట్టికుమారుడవు ॥ గణా ॥
సురులు ముక్కోటి మునులు దేవతులకు ముందు నిలిచితివో ॥ గణా ॥
ధరను తిరుమాల కొండపురమున వెలసిన దైవ వినాయక ॥ గణా ॥
రామ రాఘవ రాజీవలోచన కామిక వరుధా కరి వరుధా ॥ గణా ॥
గణానాధ గణానాధ గణానాద దేవాకదళి వాసవిలోల ॥ గణా ॥

పాట కూడా చకచకా సాగిపోతుంటుంది. పనిభారం నెమ్మదిగా సాగుతుంటే, పాట కూడా నెమ్మదిగా సాగుతుంది. పని పాటల్లో గీత గాయకుని పాత్ర చెప్పుకోదగ్గది. పనిపాటల్లో వేట పాటలు, వ్యవసాయం పాటలు, పడవ పాటలు, కార్మిక గేయాలు ఇంటి పనులు పాటలు వంటివి ప్రధానమైనవి. ఉదాహరణకు కింది కపిల పాటను గమనించండి-

"బట్ల బట్ల చీర గట్టి-బానగిరికి నేనేపోతే
బాసగిరిలో బొజ్జయ్య కొడుకా మామ
నీలగిరి రంగయ్య బావా
నిన్ను జూసి కన్నూ నిల్చుమా
ఆశిపోసి విల్లుగట్టి-అడ్డ పింట్లో నన్నే బెట్టే ఎఎ ఆశ
వాడు బోయే వానీ బేరము-ఓ నీలగిరి రంగయ్య 'బావా
కొత్త కొత్త కడవా నెత్తి-మెట్లబాయీ నీళ్ళకొచ్చే
మెట్టు జారీ ముట్టూ నిలిచెరా మామ-ఓ నీలగిరి రంగయ్యా బావ
కొంత కుండా కొడుకే బట్టే మామ"

ఈ విధంగా జానపద గేయాల్లో ఎన్నో పని పాటలు చోటు చేసుకొని ఉన్నాయి.

**4.6.3) పారమార్థిక గేయాలు:**

పరమాత్ముని చేరుకోడానికి భక్తి జ్ఞాన కర్మ మార్గాలను జానపదులు అనుసరిస్తారు. భగవంతుడు లేందే ఈ లోకం లేదని విశ్వసిస్తారు. దైవాజ్ఞ ప్రకారమే తమకు మంచి చెడులు కలుగుతూంటాయని నమ్ముతారు. అందుకని తమకు మంచి జరగాలనే ఉద్దేశ్యంతో దేవుణ్ణి స్తుతించడం, పూజలు, వ్రతాలను, పండుగలు, ఉత్సవాలను జరపడం, తాత్విక చింతనతో గడపడం వంటివి చేస్తారు. ఇలా దేవుళ్ళను ఆరాధించి పాటలను పాడి తమ భక్తి ప్రదర్శిస్తారు. ఉదాహరణకు కింది పారమార్థిక గేయాన్ని చూడండి-

"గణనాధా గణనాధా గణానాధ దేవ కదళి వాసవిలోల ॥ గణా ॥
మురయుచు దక్ష యోగమునకు పోయినవాడు కరివరద నీవే కాదా ॥ గణా ॥
పలుమారు కోదండ పట్టణాదీశుడవైన కనుగొంటి నిన్ను నేను॥ గణా ॥
అనుదినము నీ పాద మనమున వేడిన ఘనుడవు నీవే కాదా ॥ గణా ॥
పరమేశ్వరునకు పార్వతి దేవికి పట్టికుమారుడవు ॥ గణా ॥
సురులు ముక్కోటి మునులు దేవతులకు ముందు నిలిచితివో ॥ గణా ॥
ధరను తిరుమాల కొండపురమున వెలసిన దైవ వినాయక ॥ గణా ॥
రామ రాఘవ రాజీవలోచన కామిక వరుధా కరి వరుధా ॥ గణా ॥
గణానాధ గణానాధ గణానాద దేవాకదళి వాసవిలోల ॥ గణా ॥"

**4.6.4) బాంధవ్య గీతాలు:**

సంసార జీవనంలో వివిధ వ్యక్తుల మధ్య ఉండే సంబంధాలను బాంధవ్యం అని అంటారు. వివాహం, కుటుంబం అనే

సామాజిక వ్యవస్థకు మూలం అవుతుంది. కానపద గేయాల్లో దర్శనమిస్తాయి. వీటినే స్త్రీల పాటలు, కౌటుంబిక గేయాలు అని కూడా అంటారు. తల్లి-కూతుళ్ళు, అత్తా-కోడళ్ళు, బావా-మరదళ్ళు, అన్నా-చెల్లెళ్ళు వంటి బాంధవ్యాలకు సంబంధించి అనేక విషయాలు ప్రస్తావించబడి ఉంటాయి. వీటిలో మన ఆచార వ్యవహారాలు, జీవన విధానాలు, అలవాట్లు, అభిరుచులు ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. బాంధవ్య గీతాలలో మన సమాజం యధాతథంగా చిత్రీకరింపబడి ఉంటుంది. ఉదాహరణకు కింది బాంధవ్య గీతాన్ని చూడండి-

"కలవారి కోడలు కలికి కామాక్షి, కడుగుచున్నది పప్పు కడవల్ బోసి
అప్పుడే వచ్చే ఆమె పెద్దన్న, కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీరు నింపె

**అన్న:** ఎందుకు కన్నీరు ఏమి కష్టాలు, తుడుచుకో చెల్లెలా ముడుచుకో కురులు ఎత్తుకో
బిడ్డను ఎక్కుఅందలము, పెట్టుకో సొమ్ములు కట్టుకో చీరె చేరి మీ యత్తా మామలకు చెప్పిరావమ్మ

**కోడలు:** కుర్చి పీట మీద కూర్చున అత్త, మాయన్నలొచ్చారు మమ్మంపుతార

**అత్త:** నేనెరుగ నేనెరుగ నీమామనడుగు

**కోడలు:** పట్టె మంచము మీద పడుకొన్న మామ, మాయన్నలొచ్చారు మమ్మంపుతార

**మామ:** నేనెరుగ నేనెరుగ నీ బావ నడుగు

**కోడలు:** భారతం చదివేటి బావ పెదబావ-మాయన్నలొచ్చారు మమ్మంపుతార

**బావ:** నేనెరుగ నేనెరుగ మీ యక్క నడుగు.

**కోడలు:** వంటలు చేసేటి ఓ యక్కగారు మాయన్నలొచ్చారు మమ్మంపుతారా

**తోడికోడలు:** నేనెరుగ నేనెరుగ నీ భర్తనడుగు

**కోడలు:** రచ్చలో కూర్చున రాజేంద్ర భోగి, మాయన్నలొచ్చారు మమ్మంపుతార

**భర్త:** పెట్టుకో సొమ్ములు కట్టుకోచీర-పోయిరా సుఖముగా పుట్టినింటికి

**కోడలు:** ఇరుగు పొరుగులారా ఓ అమ్మలార- చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు సేవించబోయి మరుదుల
పెళ్ళికి మంచి వచ్చేను- ఇరుగక్క పొరుగక్క ఇదె పోయివత్తు"

ఈ విధంగా బాంధవ్య గీతాలు జానపద గేయాల్లో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొని ఉన్నాయి.

### 4.6.5) బాల గేయాలు:

వీటినే పిల్లల పాటలని కూడా అంటారు. ఇవి మామూలు జానపదగేయాల కంటే భిన్నంగా ఉండడం వల్ల వీటిని ప్రత్యేక శాఖగా విభజించడమైంది. పిల్లల పాటలు రెండు రకాలు అవి:-

1) పెద్దలు పిల్లలు కోసం సృష్టించినవి,

2) పిల్లలు చేతనే సృష్టించబడినవి.

అలాగే పెద్దలు పిల్లల కోసం సృష్టింపబడిన వాటిని తిరిగి రెండు రకాలుగా విభజింపవచ్చు. పిల్లలను లాలించే లాలిపాటలు, నిద్రపుచ్చే జోలపాటలు ఒక రకం, పిల్లలనే వస్తువుగా తీసుకొని ఏదైనా విషయాలకు చేర్చి పిల్లల్ని ఆడించేందుకు

పాడేవి ఇంకోరకం. ఇలా పిల్లలు పాటలు ఎన్నో జానపద గేయాల్లో అలరారుతున్నాయి. ఉదాహరణకు కింది పిల్లల పాటను పరిశీలించండి.

"ఊగాడమ్మా ఊగాడు
ఊగే చిలుకా ఊగాడు
బంగరు బొమ్మ ఊగాడు.
తంగెడు పువ్వా ఊగాడు
కులదీపం బా ఊగాడు.
గుడి పావురమా ఊగాడు.
చిన్నెల అంచా ఊగాడు.
కన్నుల వెలుగా ఊగాడు.
సొగసులు గువ్వా ఊగాడు.
శుకమా పికమా ఊగాడు.
చక్కని నెమలీ ఊగాడు
చక్కెర బొమ్మా ఊగాడు"

ఈ విధంగా ఎన్నో పిల్లల పాటలు జానపదగేయాల్లో దర్శనమిస్తుంటాయి.

**4.6.6) వేడుక పాటలు:**

వేడుకలనగానే సమాజంలో జరిగే పెళ్ళిళ్ళు, పండుగలు, నోములు, వ్రతాలు వంటి వాటిని చెప్పుకోవచ్చు. ఇవన్నీ కర్మ సంబంధాలుగా ఉండి క్రమంగా వేడుకలై పోయాయి. పెళ్ళిళ్ళలో నలుగు పెట్టడం, తలంబ్రాలు పోయడం, వసంతాలు, పూలచెండ్లాడడం, తలుపు దగర పాటలు పాడడం వంటివి సంతోషంతో పాడుకునే పాటలు. అలాగే పండుగలు. పబ్బాలలో కూడా పాటలు పాడుకుంటుంటారు. వీటిని కూడా వేడుక పాటలని అంటారు. పెళ్ళిళ్ళలో కార్యక్రమం చివరలో మంగళ హారతులు పాడుతుంటారు. పెళ్ళిలో, భోజనాల దగ్గర మగపెళ్ళి వారి ఎత్తి పొడుపు మాటలకు పిల్లనిచ్చిన వారు తలవంచక తప్పదు. ఇక మగపెళ్ళి వాళ్ళను ఆటపట్టించడానికి పిల్లనిచ్చిన వారు మంగళహారతులను వేదికగా చేసుకొని డబ్బులు గుంజుతారు. ఉదాహరణకు కింది మంగళ హారతి పాటను గమనించండి-

"వానలు గురవంగ-వానలు గురవంగ
వంకలే సాగంగ-కారైన మొబ్బులే కమ్ముకోంగ
కంచెంత పట్నాల కలిమి వానలే గురిసె
కంచి కామాక్షమ్మ నీకారతి
జయమంగళం జయ శుభ మంగళం
ఎసికెలో గుడి గట్టి-విసికెలో గుడికట్టి
వీతాకు దడి యిల్లు-రంగైన బొమ్మకే రవిక దొడికి

చిక్కు చీరలు గట్టి సిరిగంద మొడిగట్టి
సీతానే పెండ్లాడు శ్రీరాములు
జయమంగళం జయ శుభ మంగళం
కట్టమీద రెండు కానగమాకులే
వానగాలి వచ్చి వంగులాడు
మాయన్న పెండ్లాడి నగరెల్లి రాగానె
బంగారె బాస్కెము సుంగుతాడు
జయమంగళం జయ సుభ మంగళం
దిక్కులు చూడొద్దు గుక్కెల్లు మింగద్దు
తలయెత్తి నా మొగము చూడరన్నా
తలగొడ్లో వున్నదీ తెల్లటి వరహాలు
విప్పి పళ్ళెములోన వెయ్యరన్నా
జయ మంగళం జయశుభ మంగళం
కొడలూ నల్లన-గోప్రాలు తెల్లన
కొండ చిక్కుడు గాయి పిండొంటలు
నాలుగాళ్ల మండపము కాడ
నచ్చత్రం కోనేట్లో-తెల్లదామర పువ్వు తెప్పాడెనో
జయమంగళం జయ శుభ మంగళం"

ఈ విధంగా ఎన్నో వేడుక పాటలు జానపద గేయాల్లో చోటు చేసుకొన్నాయి.

**4.6.7) వలపు పాటలు / శృంగార గేయాలు:**

వీటినే వలపు పాటలని కూడా అంటారు. జానపద గేయాల్లో అత్యధిక శాతం వలపు పాటలే చోటు చేసుకొని ఉన్నాయి. ఇలా శృంగార రసానికి అధిక ప్రాధాన్య మీయడానికి జానపదుల మనస్తత్వమే కారణం కావొచ్చు. పనిలో తాము పడుతున్న కఠినాతికఠినమైన కాయ కష్టాన్ని మరచిపోవడానికి వలపు పాటలను పాడుకోవడం ఒక కాణరం కావొచ్చని పండితుల భావన. ఇలా జానపదులు శృంగారానికి అగ్రతాంబూల మిచ్చి ఎన్నో వలపు పాటల్ని పాడు కున్నారు. కొంత మంది పండితులు జానపద గేయాల్లోని శృంగార మంతా నీచమని, దుష్టమని పేర్కొన్నారు. ఇది చాలా తప్పు భావన. జానపద గేయాల్లో శిష్టులు వాంఛించే ధర్మ నిరతి గల శృంగారాన్ని చూడాలనుకోవడం మన భ్రమ. జానపదులు ఎవరేమనుకున్నా తమకు నచ్చిన వారితో శృంగారాన్ని గడపడానికి వెనుకాడరు. ఇది అధర్మ శృంగారమైనా జనజీవన స్రంవతిలో కలిసిపోయింది. అలాగని అందరూ అలాంటి వాళ్ళేనని చెప్పడానికి వీలులేదు. జానపదుల వలపు పాటల్లో సంయోగ, వియోగాలుంటాయి. ఈ వలపు పాటల్లో సున్నితమైన శృంగారం నుండి బూతు శృంగారం వరకు చోటు చేసుకొని ఉంది. ఇలా జానపద గేయాల్లో ఎన్నో వలపు పాటలు కోకొల్లలుగా ఉన్నాయి. ఉదాహరణకు కింది వలపు పాటను గమనించండి.

"నూగు నూగు మీస మోడ-నూగు సేని కావిలోడ
బరిగెసేను బాట చెప్పరా ఓరికి-రగసేను బాట చెప్పరా ॥ నూగు ॥
సెనిగ పూసె సెనిగ కాసె ॥ సెనిగ ॥
సెనిగ జాగె బాలుడాయె
సెందమామ పేరు బెడదామా ఓరెరికిలీ
సెందమామ పేరు బెడదమా
సెనిగ బుడతల సేనికాడ ॥ సెనిగ ॥
సేటు నిద్ర పోయె పాప
నీకు నిదర నాకు దుక్కమే ఓరెరికిలీ
సెరుగుదీయె మొగము జూతమూ ॥ నూగు ॥
సాలుగొట్టి ఇల్లు కట్టి ॥ సాలు ॥
వుట్లనింట్లో నన్ను బెట్టి
వాడుబోయె వాడ బేరము ఓరెరికిలీ
వాడుబోయె వాడ బేరము
మల్లెపూల దండ గుట్టి
మంచానికేల గట్టి
వాడు బోయె వాడ బేరము ఓరెరికిలీ
వాడుబోయె వాడ బేరము
అంచులంచుల బాయికాడ
మంచినీళ్ల బాయి కాడ
నల్లటి మాయన్న చావన ఓరెరికిలీ
వుంగరాలు మరచి వస్తిరా
ఎండగానే బండలపైన ॥ ఎండ ॥
చెక్కగొట్టె మామకొడక
చెక్కవచ్చి చెంపదగిలెరా ఓరెరికిలీ
ఎగడలేని దుక్క మొచ్చెరా
నిమ్మమానికి నిచ్చెనేసి
నిమ్మ పూలు కోయబోతే
నిమ్మముల్లు రొమ్ము నాటెరా ఓరెరికిలీ
రకముడి రగతమాయెరా ॥ నూగునూగు ॥

ఈతమాను విల్లుగాదు ॥ ఈత ॥

తాటిమాను తావు కాదు

తగులుకున్నోడు మొగుడుకాదురా ఓరెరికిలీ

తగరమే బంగారు కాదురా ॥ నూగునూగు ॥

ఈ విధంగా వలపు పాటలెన్నో జానపద గేయాల్లో చోటు చేసుకొని ఉన్నాయి.

**4.6.8) హాస్య గేయాలు:**

జానపదులు హాస్యానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చారు. నవ్వించడానికి పాడేవే హాస్యగీతాలు. సుఖదుఃఖాలకు ప్రతీకే నవ్వు-ఏడుపు. హాస్యగీతాలు కూడా పనిలో ఉండే కష్టాన్ని మరచిపోవడానికే పాడుకుంటుంటారు. అలాగే తీరిక సమయాలప్పుడు వినోదం కోసం కూడా పాడుకుంటారు. మనిషి మనుగడకు హాస్యం ఎంతైనా అవసరం. హాస్యం వికృతమైన వేషం వల్ల, చేష్టల వల్ల, మాటల వల్ల కలుగుతుందని అలంకారికులన్నారు. జానపదగేయాల్లో వక్రోక్తి, అధిక్షేపాల వల్ల కూడా హాస్యం కలుగుతుంది. జానపద గేయాల్లో హాస్యం ఎన్నో రకాలుగా ఉంటుంది. మన శిష్ట సాహిత్యంలో హాస్యం పాలు తక్కువే. అయితే జానపదులు మాత్రం తమ గేయాల్లో హాస్యాన్ని బాగానే పండించారు. ఉదాహరణకు కింది హాస్యగేయాన్ని చూడండి-

"కాలూ సేతులు లేని కుమ్మరి

చేసెను రెండు బాండములు

ఒకటికి అడుగే లేదే

ఒకటి అంటే లేదే ఎఎ ఒకటికి ఎఎ

అడుగు అంచులేని వానిలో

చేసిరి వంటకములు

ఒకటి ఉడికినది ఒకటి వుడకనే లేదు

వుడికి వుడకని వంటకోసము

వచ్చిరి ఇద్దరు చుట్టాలు

ఒకడికి కడుపే లేదే

ఒకడికి నోరే లేదే

పండీ పండని చేను కోసము

వచ్చిరి ఇద్దరు దొంగాలు

ఒకడు కదలా లేడు

ఒకడు మెదలా లేడు

కదలీ కదలని దొంగ కోసం వచ్చిరి ఇద్దరు పోలీసోళ్ళు

ఒకడికి చేతులే లేవే- ఒకడికి కాళ్ళే లేవే".

ఇలా హాస్య గీతాలు జానపద గేయాల్లో ఎన్నో చోటు చేసుకొని ఉన్నాయి.

**4.6.9) కన్నీటి పాటలు / కరుణ రస గేయాలు:**

వీటినే 'కన్నీటి పాటలని' కూడా అంటారు. జానపదులు శృంగారం తర్వాత కరుణరసానికే అధిక ప్రాధాన్యమిచ్చారు. మానవ జీవితం సుఖ దుఃఖాలు సమానం. నిజానికి జీవితంలో సుఖంకన్నా దుఃఖమే అధికంగా ఉంటుంది. మనిషికి బాధలు కౌమార్య దశలోను, యవ్వన దశలోను, వృద్ధాప్యంలోనూ ఉంటాయి. కన్నీటి పాటలు లేని భాషలేదు. అలాగే ఆత్మీయులు మరణించినప్పుడు మరణ గీతాలను పాడ్తారు. ఈ గీతాలు మన పక్క రాష్ట్రమైన తమిళనాడులో ఉన్నాయి. అయితే ఇవి తెలుగులో లేవనే చెప్పాలి. తెలుగు జానపద గేయాల్లో కన్నీటి పాటలు ఎన్నో రకాలుగా ఉన్నాయి. ఎడబాటు వల్ల కష్టాల వల్ల, మరణం వల్ల ఇలా అనేక రకాలైన కన్నీటి పాటలున్నాయి. ఉదాహరణకు కింది కన్నీటి పాటను గమనించండి–

"ఏటికేతం బెట్టి ఎయి పుట్లు బండించి
ఎన్నడూ మెతుకెరుగరన్నా–నేను గంజిలో మెతుకెరుగరన్నా ॥ ఏ ॥
కాల్చేయి కడుక్కొని కట్టమీద కూసుంటే
కాకి దాన్నిపాయెరన్నా కాకి పిల్లదన్నీ పాయెరన్నా ॥ ఏ ॥
పోరుకూ చాల్లేక పొయికాడ కూసుంటె
పోరిదన్నీ పాయెరన్నా పోరి తల్లీ దన్నీ పాయెరన్నా ॥ ఏ ॥
చుక్క పొద్దున లేచి బొక్క నెత్తుక పోంగ
బొక్క బోర్లాబడితిరన్నా–నేను పక్కలిరగాబడితిరనా ॥ ఏ ॥
నాదేటి బ్రతుకాయెరన్నా–నేను నా చావకపోతిరన్నా ॥ ఏ ॥

ఈ విధంగా కన్నీటి పాటలెన్నో జానపద గేయాల్లో చోటుచేసుకొని ఉన్నాయి.

## 4.7. నమూనా ప్రశ్నలు:

1) జానపద గేయ సాహిత్యం గురించి రాయండి?

2) జానపద గేయ సాహిత్యాన్ని వర్గీకరించి సోదాహరణంగా వివరించండి?

## 4.8. ఆధార గ్రంథాలు:

1. తెలుగు జానపద గేయ సాహిత్యము – డా.॥ బిరుదురాజు రామరాజు.

2. ఆంధ్రుల జానపద విజ్ఞానం – డా॥ ఆర్వీయస్ సుందరం.

3. జానపద విజ్ఞాన వ్యాసావళి – డా॥ జి.యస్. మోహన్.

**- డా॥ బలరామ్ కచ్చళ్ళ**

## పాఠం - 5 భక్తి గేయాలు-కన్నీటి పాటలు

**5.0. లక్ష్యం:**

విద్యార్థులు భక్తి గేయాలు మరియు కన్నీటి పాటల గురించి తెలుసుకుంటారు.

**విషయ సూచిక:**

**5.1. ఉపోద్ఘాతం**

**5.2. భక్తి గేయాలు-వర్గీకరణ**

**5.3. కన్నీరు పాటలు**

**5.4. నమూనా ప్రశ్నలు**

**5.5. ఆధార గ్రంథాలు**

### 5.1. ఉపోద్ఘాతం:

భక్తి గేయాలని పారమార్థిక గేయాలని కూడా పిలుస్తారు. పుట్టిన ప్రతి మనిషి సుఖపడాలని కోరుకుంటాడు. దాని కోసం రాత్రింబవళ్ళు ఆరాటపడతాడు. మనిషి కోరుకునే సుఖం రెండు విధాలు, అవి:

1) లౌకికం

2) అలౌకికం.

ఇల్లు, ఇల్లాలు, సంతానం, వస్తు వాహనాలు, ఆహార పానీయాలు ఇతర భోగ భాగ్యాలు లౌకిక సుఖంలోకి వస్తాయి. పారమార్థిక చింతన, దైవభక్తి, మోక్ష ప్రయత్నం వంటి వాటి వల్ల కలిగే ఆనందం అలౌకిక సుఖం కిందికి వస్తాయి. అలౌకికాన్ని పారలౌకికమని, పారమార్థికమని కూడా వ్యవహరిస్తారు. పరలోకంలో సిద్ధించాల్సిన వసతులు, పరలోకానికి సంబంధించిన ఆలోచనలు పారలౌకికంగా పరిగణింపబడతాయి. పరమ అర్థం మోక్షమే. కాబట్టి దానికి సంబంధించిన అంశాలన్నీ కూడా పారమార్థికంగానే వ్యవహరింపబడతాయి. జ్ఞానం, వైరాగ్యం, ఉపాసనా విధులు, పరబ్రహ్మకు సంబంధించిన ఆలోచలన్నీ కూడా పారమార్థికంలోకే వస్తాయి. సామాన్య జానపదుడికి పారమార్థిక స్పృహలేక పోయినా అతనికి సంక్రమించిన కొన్ని విశ్వాసాల వల్ల దైవరాధన పాటిస్తాడు. దైవ చింతనకు దైవారాధనకు దోహదం చేసేవి పారమార్థిక గేయాలు.

### 5.2. భక్తి గేయాలు-వర్గీకరణ:

1. మేలుకొలుపు పాటలు
2. పూజ పాటలు
3. ప్రార్థనా గేయాలు
4. నోము పాటలు
5. వైరాగ్య ప్రబోధకాలు
6. భక్తి ప్రభోదకాలు

7. తాత్విక గేయాలు

8. భజన పాటలు.. అని ఎనిమిది రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

**5.2.1. మేలు కొలుపు పాటలు:**

ఆధ్యాత్మిక చింతన భిన్న పద్ధతుల్లో సాగుతుంది. వాటిలో విగ్రహ పూజ ఒకటి. విగ్రహ మూర్తిని భగవంతునికి ప్రతిరూపంగా భావించి అర్చిస్తారు. ఉపాసిస్తారు. భగవంతుణ్ణి ఒక మానవునిగా ఊహించి సుప్రభాతం లేదా మేలు కొలుపులు వినిపించి రోజూ నిద్రలేపి, అతనికి చేయాల్సిన ఉపచారాలన్నీ చేస్తారు. ఉదాహరణకు ఒక పాట. ఇది చిత్తూరు జిల్లా మొగిలి పుణ్యక్షేత్రానికి సంబంధించిన శివుని మేలికొలుపుపాట–

మొగిలిశ్రీరంగా మొగబాయి నీళ్ళు
మొగము కడిగే వేళాయ లేవోయి స్వామి
ఎంత జెప్పిన గాని లెయలేదే సామా
మొగిలి పూరంగా కలుబాయి నీళ్ళు
కాళ్ళు కడిగే వేలాయ లేవోయి సామీ
బళ్ళారి నించొచ్చా బళ్ళారి నూనె
తలదువ్వే వేళాయ లేవోయి సామీ
గోదారి నింటిచ్చా గోదుమ రొట్టె
బోంచేసే వేళాయ లేవోయి సామి...

ఈ మేలు కొలుపు పాట జానపదుల్లో ప్రచారంలో ఉంది. ఇది రోజూ దేవాలయంలో అర్చకులు పాడే పాట కాదు. మొగలి క్షేత్రంలో శివుడు వెలసి ఉండగా 'మొగిలి శ్రీరంగా' అని శివుణ్ణి సంబోధించడం జానపదులు శివ కేశవుల్ని అద్వైత భావంతో చూడడమే అవుతుంది.

**5.2.2. పూజ పాటలు:**

దేవుడు ఒక్కడే అయినా ప్రజలు బహురూపాలుగా భావించుకొని పలు రకాలుగా ఆరాధిస్తారు."ఏకం సద్విప్ర బహుధా వదంతే" అన్న వైదికోక్తే దీనికి ప్రమాణం. ఇది ఆధ్యాత్మిక ప్రగతిలో ప్రాథమిక దశ ప్రజలు తమకు నచ్చిన దేవతామూర్తుల్ని వాళ్ళు పూజిస్తారు. శ్రీరాముడు, వేంకటేశ్వరుడు లాంటి పురుష దేవుళ్ళని, లక్ష్మి, పార్వతి, సరస్వతి, గంగమ్మ లాంటి స్త్రీ దేవతల్ని పూజిస్తారు. తులసి, రావి, వేప, మొదలైన చెట్లను, గోవు, నాగులు లాంటి జంతువుల్ని కూడా దైవ సమానంగా భావించి పూజిస్తారు. జానపదుల్లో దైవ పూజలకు సంబధించినపాటలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు రెండు మూడు పూజ పాటల్ని పరిశీలిద్దాం–

**శ్రీరామ పూజ:**

జానపదులకు రామభక్తి అధికం. ఒక జానపద స్త్రీ తాను నమ్మిన శ్రీరామచంద్రుణ్ణి పూజించడానికి పూజాద్రవ్యాల్ని సమకూర్చుకోవాలనుకుంటుంది. ఏ వస్తువుతో పూజించాలన్నా అది మలినమైనదిగా భావించి బాధపడుతుంది. శ్రీరామ చంద్రునికి ఇలా నివేదిస్తుంది–

పువ్వులు నేసి పూజ చేతామంటే
రామ పువ్వుల్లా పురుగెంగీలె
ఎంగి లెంగి లాని ఎగ్గుపట్టరు జనులూ
రామ జగమెల్లా ఎవరెంగీలే-
ఆకూలూ నేగోసీ తలిగ వేదామంటే
రామ ఆకెల్లామే కెంగీలే ॥ఎంగి॥
ఇల్లలికి ముగ్గుపెట్టి తలిగవేదామంటే
ఈ గెంగీ లే ॥ఎంగి॥
రామ సెంబు ఎత్తుకోని పాలు పిండను బోతే
రామ పొదుగెల్లా దూడెంగీ లే ॥ఎంగి॥
తపిల ఎత్తుకోని సెరువు నీళ్ళకుబోతే
రామ సెరువెల్లా సేపెంగీలే ॥ఎంగి॥

**తులసి పూజ:**

మానవుడు ప్రాథమిక దశనుంచీ ప్రకృతిని ఆరాధిస్తూనే ఉన్నాడు. రావి, జమ్మి, మారేడు, తులసి, వేప వంటి చెట్లను పూజించే ఆచారం నేటికీ ఉంది. రావి విష్ణు అంశ అని వాళ్ళ విశ్వాసం తులసి లక్ష్మి అంశఅని తెలుగు తులసి మహాత్యాన్ని తెలిపే కథ శివ పురాణంలో ఉంది. ఇది జానపదులలో కూడా ప్రచారంలో ఉంది. తులసి మహాత్మ్యం పతివ్రతలకు ఆదర్శప్రాయమైంది. కాబట్టి స్త్రీలు తులసి పూజను విధిగా చేస్తారు. లక్ష్మి అంశ అయిన తులసి కన్నె పిల్లలకు మంచి భర్తల్ని ముత్తైదువులకు సంపదల్ని, వితంతువులకు కైవల్యాన్నిస్తుందని కూడా ప్రజల నమ్మకం. తెలుగువాళ్ళ ఇంటి ప్రాంగణాల్లో తులసి మొక్కను పెంచుకోవడం సర్వ సాధారణం. దీన్ని తులసి కోట అని అంటారు. స్త్రీలు మంగళ, శుక్ర వారాల్లో స్నానం చేసి తులసి పూజ చేసి పాటలు పాడతారు. ఒక పాట-

తులసెమ్మా తులసెమ్మా తులసివనమేడ
సుట్టుకోటలు గట్టి కోటమరించి
సన్న నాగారారి సన్న నాగారి
నేతి గన్నెరి సెట్టు శ్రీతులసి సెట్టు
ప్రాతకాలము లేసి గోమయము దెచ్చి
తులసి సెంతా అలికి ముగ్గులిడితేనూ
మూడులోకాలికి ముక్తి పొందేరూ
నిత్యంబూ సెంటుతో ఉతకములు పోయా
ఏగ్రముతో శ్రీ తలసి ఏరులై పారా
శగ్రముతో శ్రీ తులసి సిగురులై వేసు

మోక్షముతో శ్రీ తులసి మొగ్గలే బుట్ట
పుణ్యంతో శ్రీ తులసి పువ్వులే బుట్టు
ముత్తైదు శ్రీ తులసి ఏమి వరమిచ్చు
కోటి సంపదలిచ్చు కొదవలేకుండా
కన్నెలకు శ్రీ తులసి ఏమి వరమిచ్చా
మంచి పురుషుడు గలిగి మైరాజ్యమేలు
విధవలకు శ్రీ తులసి ఏమి వరమిచ్చు
కైలాసం ముందుగా వచ్చు వరమిచ్చు

**నాగపూజ:**

పశువుల్ని, పాముల్ని పూజించడం ఎప్పటినుంచో అనూచానంగా వస్తూ ఉంది. పశువుల్ని సంపద కోసం పూజిస్తారు. పాముల్ని సర్పదోష నివారణకోసం, వాటివల్ల హాని కలుగకుండా ఉండడం కోసం పూజిస్తారు అంతేకాదు పాముల్ని పూజిస్తే సస్యాభివృద్ధి జరుగుతుందనే నమ్మకం కూడా ఉంది. నాగ పూజకు సంవత్సరంలో ముఖ్యమైన రోజు రెండు. ఒకటి ప్రావ్ శుద్ధ పంచమి. దీన్నే నాగ పంచమి అంటారు. రెండోది కార్తీక శుద్ధ చవితి. దీన్నే నాగుల చవితి అంటారు. చాలా మంది నాగుల చవితినే ఎక్కువగా పాటిస్తారు. చవితినాడు స్త్రీలు ఉదయాన్నే స్నానాదికాల్ని ఆచరించి

పుట్ట దగ్గరికో, నాగ ప్రతిమలున్న చోటికో వెళతారు. పసుపు, కుంకుమ, నూలు, పూలు, పళ్ళు, కాయ, కర్పూరం, వక్క, ఆకు, నానబియ్యం లాంటి వస్తువులతో పుట్టకు పూజ చేస్తారు. పుట్టలో పాలు పోసి నాగేంద్రుని వేడుకొంటారు-పుట్ట ఏడుసుట్లు దిరిగి పుట్టేఏడు సుట్లు దిరిగి

పూజ కొచ్చుండా నాగన్నా మనవి కొచ్చిండా
ఎల్లి రావయ్యా నాదేవా పూజలందేవ
పక్కా వార్త నీళ్ళూ, వక్కాకు వార నీళ్ళూ
పూజ తెచ్చిండా నాగన్నా మనవి కొచ్చుండా ॥ఎల్లిరా॥
టెంకాయ నానబియ్యం టెంకాయనాన బియ్యం
పూజ తెచ్చుండా నాగన్నా మనవి కొచ్చుండా॥ఎల్లిరా॥
సూటొక్క నిమ్మపండ్లూ నూటొక్క నిమ్మ పండ్లూ
పూజ తెచ్చుండా నాగన్నా మనవి కొచ్చండా ॥ఎల్లిరా॥
నూటొక్క కోడిగుడ్డు నూటొక్క కోడిగుడ్లూ
పూజ తెచ్చుండా నాగన్నా మనవి కొచ్చుండా ॥ఎల్లిరా॥

**5.2.3. ప్రార్థనా గేయాలు:**

మానవులు అన్ని విధాలా తమకు మంచిని చేయమని భగవంతుని ప్రార్థించే గేయాలు కూడా జానపద గేయాసాహిత్యంలో

ఉన్నాయి. జానపదులు ప్రత్యేకించి ఒకే దేవుణ్ణి పూజించి ప్రార్థించరు. అందరి దేవుళ్ళను పూజించి ప్రార్థిస్తారు. ఎందరు దేవుళ్ళను కొలిచిన మొట్టమొదట కొలిచే దేవుడు మాత్రం విఘ్నేశ్వరుడే వినాయకుణ్ణి వినుతిస్తే విఘ్నలు నశిస్తాయని విస్వాసం. వినాయకునికి ఎలుక వాహనం కాగా జానపదులు అతనికి నందివాహనాన్ని కూడా యిచ్చారు. కింది ప్రార్థనా గేయమే అందుకు సాక్ష్యం-

"రావే గ్యానన్నాయికా మము కావే గ్యానన్నాయికా
విద్యాలకెల్లా నీవే ఓ విరాగ్యానన్నాయికా
తొండముతో నీళ్ళూ దెచ్చి తోరంపూ బొజ్జయుకడిగి
తండ్రి సీతా పూజా గొనవే ఓ వీరాగ్యానన్నాయికా ॥రావే॥
అల్లమూను అంటి పండ్లు బెల్లమూనూ ఉంట్లూ బట్టి
తెచ్చీనీకిచ్చే దామయ్యా ఓ సామి గ్యానన్నాయికా ॥రావే॥
బొల్లి ఎద్దునెక్కినావు బొద్దూ గంటల్ కట్టినాపూ
వెళ్ళివయ్యా కంచీ వరదలు ఓ వీర గ్యానన్నాయికా ॥రావే॥

మరో గేయంలో రంగనాథ స్వామిని తమ కష్టాల్ని పోగొట్టి కాచి రక్షించమని కోరడం కన్పిస్తుంది.

ప్రణవంతు మయ్య మిము రంగనాథా
మాకు దారి సూప్ మమ్ము బ్రోవు రంగనాథా
మము కాచీ రక్షింపు వయ్యారంగనాథా
సేవకులము బాలకులము రంగనాథా
నీ సేవ జేసె విధము తెలుపు రంగనాథా కరివరదుడేనీవు కావ రంగనాథా
మము కానీ రక్షింపు వయ్యారంగనాథా దానులకు దాసుడయ్యా రంగనాథా
మాకు దారి సూచి మమ్ము బ్రోవు రంగనాథా.

### 5.2.4. నోము పాటలు:

హైందవ స్త్రీలకు నోముల పట్ల ప్రీతి ఎక్కువ. వీళ్ళు నోముల్లో లక్ష్మీదేవి నోము, గౌరీదేవి నోము ప్రశస్తమైనవి. నరకచతుర్దశి నాడు కేదార గౌరీ వ్రతం చేస్తారు. నట్టింట గౌరమ్మను నిలిపి అర్చిస్తారు. మార్గశిర మాసంలో సంక్రాంతికి పదుచు పిల్లలు గౌరమ్మను నిలుపుతారు. గొబ్బి తడుతూ పాటలు పాడుతూ గ్రామమంతా నూనె చింతపండు, మిరపకాయలు, పప్పు, బియ్యం మొదలైన కానుకలు సేకరిస్తారు. పశువులు పండుగ మరుసటి రోజు సేకరించిన వాటితో పిండి వంటలు చేసి నైవేద్యంగా పెట్టి గౌరి దేవిని పూజించి పాటలు పాడుతారు. ఒక పాట-

నల్లపూసల గౌరు నయమైన గౌరు
మేడల్లో గౌరు మేలుకోవమ్మా
పచ్చపూసల గరు పాటైన గౌరు
మేడల్లో గౌరు మేలుకోవమ్మా

తెల్లపూసల గౌరు తేటైన గౌరు
మేడల్లో గౌరు మేలుకోవమ్మా
ఎఱ్ఱపూసలు గౌరు ఏదైనా గౌరు
మేడల్లో గౌరు మేలుకోవమ్మా
సద్దెన్ను తెత్తునే గౌరు
సుధకంకుల మింద వత్తువాగౌరు
కలిగి మేడల మింద వత్తు వా గౌరు
కలిగేటి కమ్మలు తెత్తువా గౌరు
ఉగ్గుతో ఉగనాలు గజ్జెలే దోరణాలు.

**5.2.5. వైరాగ్య ప్రబోధకాలు:**

ఈ లోకంలో అన్నీ అస్థిరాలు. దేహాన్ని విడిచి వెళ్ళిపోయేటప్పుడు జీవుని వెంట ఏవీ రావు. అందువల్ల వేటిపైనా వ్యామోహ పడరాదనే భావమే వైరాగ్యం. జీవం దేహంలో ఉన్నంతవరకే దానికి మిన్నన, మమత ఉంటుంది. ప్రాణం పోయాక నిర్జీవమైన దేహాన్ని అందరూ ఏవగించుకుంటారు. కనిపెంచిన పిల్లలు భార్య. చివరికి తల్లి కూడా అసహ్యించుకొంటుంది. ఈ విషయాన్నే తెలియజేసేదే కింది గేయం-

ఇల్లు వాకిలి రోశా
ఇల్లాలు కడరోశా
ఇంకెవరు దిక్కెనా రామా
ముక్కు మొకము లేక మురికిలో కొన్నాళ్ళు
మునిగి తేలుతుంటినే రామా
కాళ్ళు సేతులు లేక కడుపులో కొన్నాళ్ళు
కష్టాలు పడితినే రామా
యమిని పాయము నందూయమినికాంతల గూడి
యామారి పోతీనే రామా
పట్టుమంచమూ రోశా పానుపే కడరోశా
పంచలే గతులాయా రావో
కనిపెంచినాతల్లి కన్నెత్తి సూడాదు.
నేనెంత కరుమూనే రామా
తోడబుట్టిన వాళ్ళు అన్నదమ్ములందు
దాయాది మాత్సరంటే రామా

కుండ తడపాలూ ఏయండి బందేలి
ఏయండి యమిలో రామా
ఎతకపోను నలుగురంట ఎంబడి పదుగురంటా
ఎసిరే యమినిలో రామా
ఆయమినీ లోకానా ఏమి తప్పు నేరం
సేసినామని సెప్పి సెంపలే గొట్టిరి రామా.

**5.2.6. భక్తి ప్రబోధక గేయాలు:**

ఎన్నో లంపటాలతో, ఇబ్బందులతో బాధపడే మనసును భగవన్ముఖం చేసి తల్లయం చేస్తే అవి అన్నీ తొలుగుతాయని విశ్వాసం. దీని కోసమే ముముక్షువులు పాటుపడుతుంటారు. మనసును భగవంతుని వైపు మరల్చడానికి మొట్టమొదటి సాధనం భక్తి. భగవంతుని పట్ల కనబరచే అభిమానం, ప్రేమే భక్తి, భక్తిని ప్రబోధించే గేయాలు కూడా ఉన్నాయి. బంధాలన్నీ తెంచుకొని భిక్షుక వృత్తిని చేపట్టి భక్తితో భగవంతుణ్ణి స్మరించే గేయాన్ని చూడండి-

అజాన తాంబుర బుజాన వాంచీ
బిచ్చము లందే దెన్నటికో-శ్రీరాములు కొలిచే దెన్నటికో
హరినారాయణ నామామదిలో నేరుగ నిలిచే దెన్నటికో
సెంబులో తీర్ధము సేతిలో తిరవణి
తానా మాడే దెన్నటికో శ్రీరాముల కొలిచే దెన్నటికో ॥హరి॥
సెప్పుతో గాంధము బొప్పెతోపూలు
వసంత మాడే దెన్నటికో-శ్రీరాములు గొలిచే వెన్నటికో ॥హరి॥
వానలుగురువంగా వంకలు దొల్లంగ
వసంతమాడే దెన్నటికో-శ్రీరాములు గొలిచే దెన్నటికో ॥హరి॥

**5.2.7. త్యాత్త్వికి గేయాలు:**

ఒక వస్తువు తత్త్వాన్ని తెలపడాన్ని తాత్త్వికమని, దానికి సంబంధించిన గేయాల్ని తాత్త్విక గేయాలని అంటారు. తాత్త్విక గేయాలు చాలవరకు గూఢార్థాన్ని కలిగి ఉంటాయి. వైరాగ్యాన్ని, తత్త్వాన్ని బోధించే కింది గేయాన్ని పరిశీలించండి-

హరే రామ రామయో కోదండ రామ రామయో
పరమ పురుషుండేమయో పద్మ యోగం భజనయో
అన్నలంటూ తమ్ములంటా వావిలంట వరుసలంటా
వారి గుణము తెలుసుకోని జ్ఞానులై మెలగండి యో ॥హరే॥
ఓటికుంటా ముసలమ్మా నీటుగా పలికిందయో
వారి గుణమూ తెలుసుకోని జ్ఞానులై నిలవండయో ॥హరే॥
ఏటివారా యావసెట్టు కోపురేగి పూతబూసి
కొమ్మవంచీ కోయబోతే మొగ్గ సిట్లి కొప్పునిండె ॥హరే॥

మరోగేయంలో మానవ జన్మ శ్రేష్ఠత్వాన్ని, లోక ప్రసిద్ధమైన కొన్నింటిని గురించి చెప్పబడింది-

చిన్న చిన్న గజ్జాలు నది గదరన్నా
నాది విన్నావాడు నారయుడన్నా
ఈ జన్మమే మంచిదన్నా
ఈ ఒక్క జన్నాము వెతకాల తండ్రీ
మరు జన్మ మేమంచిదన్నా
బాటబాటంటారు ఏమి బాటన్నా
బాటల్లో కెల్లా స్వర్గం బాటన్నా ॥ఈ జన్మ మే॥
రాయి రాయంటారు ఏమి రాయన్నా
రాయిల్లో కెల్లా ఆకురాయనా ॥ఈ జన్మ మే॥
పండుపండంటారు ఏమి పండన్నా
పండుల్లో కెల్లా ఈ బూది పండూ ॥ఈ జన్మ మే॥
పువ్వు పువ్వంటారు ఏమి పూవన్నా
పువ్వుల్లో కెల్లా తుమ్మిపూవన్నా ॥ఈ జన్మ మే॥
ఆకు ఆకంటా ఏమి ఆకన్నా
అకుల్లో కెల్లా తమలపాకన్నా ॥ఈ జన్మ మే॥
కాయి కాయంటారు ఏమి కాయన్నా
కాయిల్లోకెల్లా నేరేదు గాయా ॥ఈ జన్మ మే॥
కుంటకుంటారు ఏమి కుంటన్నా
కుంటల్లో కెల్లా వైకుంతమన్నా ॥ఈ జన్మ మే॥

గేయ రూపంలోనే కాకుండా పొడుపు కథల రూపంలో కూడా తత్త్వ గీతాలు ఉన్నాయి.

**5.2.8. భజన పాటలు:**

భగవంతుణ్ణి మనసులో ధ్యానించవచ్చు. కళ్ళతో ఆయన దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించవచ్చు. నోటితో భజించి సేవించవచ్చు. కానీ మనసులో ధ్యానించడం, కళ్ళతో దర్శించడం అంత సులభం కాదు. కారణం మనసుకు, కళ్ళకు దాపల్య గుణం ఉంది. ఈ రెండింటినీ బంధించి ఏకాగ్రతతో భగవన్నామ స్మరణం చేయడానికి వాక్కు ఎంతో ఉపకరిస్తుంది. ఈ వాక్కు ద్వారా భగవంతుణ్ణి స్మరించడాన్నే భజన అంటారు. భజనల్లో రాంభజన, పండరి భజన, చెక్క భజన, కులుకు భజన ముఖ్యమైనవి. భజనలు ఎక్కువగా శ్రీరామ నవమి, వైకుంఠ ఏకాదశి, మహా శివరాత్రి వంటి పర్వదినాల్లో, సంక్రాంతి లాంటి పండుగ దినాల్లో ప్రదర్శిస్తారు. భజనల్లో రాంభజన ప్రశాంతంగా సాగుతుంది. ఉదాహరణకు రాంభజనలో పాడే ఒక పాటను చూడండి-

అనంత రంగం సీ వైకుంఠం
రాజ్యమంతా రాంభజనా
రాజ్యంతా రాంభజనా
భూలోకమంతా హరిభజనా ॥అనంత॥
ఏమయ నరుడా జాలము జేసేవు
నవ్వులు కాదిది రాంభజనా
ఎగతాళికాదది రాంభజన ॥అనంత॥
నవ్వులు కాదిది రాంభజనా
ఎగతాళి కాదది రాంభజనా ॥అనంత॥
తలలో గుడ్డలు తీయండి
తలవంచి భజనలు చేయండి.
పల్లెవాటులు తీయండి
పల్లు వంచి భజనలు చేయండి ॥అనంత॥

## 5.3. కన్నీటి పాటలు:

### 5.3.1. ఉపోద్ఘాతం:

మానవ జీవితం ఒక ప్రవాహం లాంటిది. అది సుఖదుఃఖాలనే రెండు దరులను ఒరుసుకొని ప్రవహిస్తూ ఉంటుంది. మానవజీవితంలో సుఖం కన్నా దుఃఖం పాలే ఎక్కువ మనిషికి కష్టం కలిగినపుడు బాధపడడం, తద్వారా కన్నీళ్ళు కార్చడం సహజం. మానవుడు తన జీవితదశల్లో అనేక అనుభవాలకు, అనుభూతులకు లోబడుతాడు. అట్టి అనుభూతుల నుంచి పొందిన స్ఫూర్తిని, స్పందనను తోటి మానవులతో పంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. తన దుఃఖాన్ని ఎదుటి వ్యక్తికి నివేదిస్తే గానీ ఊరట కలుగదు. శోకం శ్లోకంగా ఆవిర్భవించినందువల్లే వాల్మీకి ఆదికవి అయ్యాడు. ప్రాచీన కవుల నవరసాల్లో శృంగార, వీర, కరుణ రసాలకు సమ ప్రాధాన్యత నిచ్చారు. కానీ మహాకవి భవభూతి మాత్రం కరుణరసం ఒక్కటే ప్రధానమని పేర్కొన్నాడు. మానవునికి అధిక ఆనందంగానీ, అధిక దుఃఖంగానీ కలిగినప్పుడు దాన్ని వ్యక్తం చేసేది కన్నీరొక్కటే.

పాశ్చాత్యుల ఆత్మాశ్రయ, కవిత్వంలో 'ఎలిజీ' ప్రధానమైంది. ఈ పదం గ్రీకు భాష నుంచి ఏర్పడింది. గ్రీకు భాషలో 'ఎలిగాన్' అంటే శోకం 16 వ శతాబ్దం నుంచి 'ఎలిజీ' శోక కావ్యంగా ప్రాముఖ్యతను పొందింది. క్రీ.శ. 1579వ సంవత్సరంలో రిచర్డ్ పుటెన్ హామ్ (Richard Puttenham) అనే విమర్శకుడు 'ఎలిజీని' దీర్ఘ శోక గీతం (A Song of Long Lamentation) గా నిర్వచించాడు. ఆ తర్వాత మిల్టన్, షెల్లీ, ఆర్నాల్డ్ లాంటి ప్రముఖ ఆంగ్లకవులు 'ఎలిజీ'ని మరణించిన వ్యక్తులకు సంబంధించి రాయడం వల్ల 'ఎలిజీ' అర్థం అంతవరకే పరిమితమైపోయింది. ఎలిజీ ఎవరైనా మరణించినపుడు రాసే కవితా ఖండిక ఆంగ్ల ప్రభావం కారణంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎలిజీ లాంటి గేయాలు, కొన్ని కవితా ఖండికలు వెలువడ్డాయి. ఎలిజీని తెలుగులో శోక గీతమని, శోక కావ్యమని కొందరన్నారు. తాపీ ధర్మారావు ఎలిజీకి 'కారుణ్యము' అని పేరు పెట్టాడు. కాని ఎలిజీకి సమానార్థకంగా స్మృతి గీతం, స్మృతి కావ్యం అనే పదాలే సమంజమైనవని డా॥ సి. నారాయణ

రెడ్డి గారు అన్నారు. జానపద సాహిత్యంలో కూడా స్మృతి గేయాలున్నాయి. స్మృతి గేయాల్ని పాడుకోవడానికి కారణాన్ని తెలిపే ఒక కథ "Standard Dictionary of Folklore Mythology and Legend" లో ఇలా చెప్పబడింది. ఒక దేశంలో కోయోట్, నేమేట్ అనే ప్రాణ స్నేహితులు ఉండేవారట. "కోయోట్" చనిపోగా, 'నేమేట్ ఆ బాధను తట్టుకోలేక కోయేట్ పక్కనే కూర్చుని పాడుతూ ఏడ్చాడట, పాటను విన్న కోయోట్ సంతోషంతో పైకి లేచి ఆ పాటకు అనుగుణంగా ఆడాడట. అలా శోకంగా పాడి ఏడ్వడం వల్ల చనిపోయిన వ్యక్తి బతికాడు కాబట్టి స్మృతి పాటలకు ప్రచారం ఏర్పడింది చెప్పవచ్చు. వ్యక్తులు మరణించినపుడు దుఃఖోపశమనానికి లేదా స్మృతి చిహ్నంగా పాడుకొనే పాటలన్నీ స్మృతి గేయాలు లేదా కన్నీటి పాటలు అవుతాయి. వ్యక్తులు మరణించినప్పుడే కాకుండా ఆత్మీయుల ఎడబాటు వల్ల గానీ, కష్టాల వల్ల గానీ పాడుకొనే పాటల్ని కన్నీటిపాటలు అనవచ్చు. అయితే స్మృతి గేయాలు అన్నీ పాటలు అవుతాయి. కానీ కన్నీటి పాటలన్నీ స్మృతి గేయాలు కావు. ఈ కన్నీటి పాటలకే కరుణ రస గేయాలు అని కూడా పేరు.

**5.3.2. కన్నీటి పాటలు-వర్గీకరణ:**

కన్నీటి పాటల్ని ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించుకోవచ్చు -

1) ఎడబాటు కారణంగా పాడుకొనేవి.

2) కష్టాలు కారణంగా పాడుకొనేవి.

3) మృతి కారణంగా పాడుకొనేవి.

**5.3.2.1. ఎడబాటు కారణంగా పాడుకొనే పాటలు:**

ఎడబాటుకు సంబంధించిన కన్నీటి పాటల్లో మొట్టమొదట చెప్పుకోదగ్గవి అప్పగింత పాటలు.

**అప్పగింత పాటలు:**

పెళ్ళి పాటలన్నీ వేడుక పాటలు అయినా, అప్పగింతల పాటల మాత్రం అపవాదాలు పెళ్ళి జరిగినన్ని రోజులూ వినోదంగా సాగిపోతాయి. చివరి ఘట్టమైన అప్పగింతలు వచ్చేసరికి అందరి కళ్ళు అశ్రుపూరితాలవుతాయి. హృదయాలు బరువెక్కుతాయి. కాబట్టి జానపద గేయాల్లో ఈ అప్పగింత పాటలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. అరిషడ్వర్గాల్ని జయించిన ఋషి, ఆశ్రమవాసి, తపోగుణ సంపన్నుడైన కణ్వుడు సయితం తాను పెంచిన శకుంతలను అత్తవారింటికి పంపేటపుడు కన్నీరు పెట్టకతప్పలేదు. అంతే కాదు శకుంతలకు కణ్వుడు చెప్పి పంపిన బుద్ధులు ప్రపంచంలో అందరికీ ఆదర్శప్రాయమైనవిగా చెప్పుకోవచ్చు. తల్లి దండ్రులు తమ కూతిరికి పెళ్ళి చేశామని ఒక ప్రక్క ఆనందిస్తూనే మరో ప్రక్క తమకు దూరంగా వెళ్ళిపోతుందన్న ఆవేదనకు లోనౌతారు. ఒక తల్లి తన కూతుర్ని అత్తగారింటికి సాగనంపుతూ చెప్పిన బుద్ధులు ఎంతటి కఠినాత్ములైనా కంట తడి పట్టిస్తాయి.

సేతిలోన నీలంపు గాజులూ సెల్లు సెల్లుమని నవ్ నడవద్దమ్మా
నీ అరిసేతిలో పోయిరావమ్మా సీతా శ్రీలచ్చిమి దేవీ
అయ్యవోద్యకే వెడలి రావమ్మా-
కాలిలోన కంచుమెట్టెలూ గంతేసి నువ్ నడవద్దమ్మా
నీ అరికాలిలో దామర పదము పగలు సుక్కతే రమ్మయ్యా ॥అత్త॥
"ఇరుగమ్మతొ పొరుగమ్మతో నీవు ఇంటి గుట్టలే సెప్పొదమ్మా

సీరలు నగలు నీభరతానీ నీటికి మాటికి అడగొద్దమ్మా ॥నీ అరీ॥ ॥అత్త॥

నలుగురు పోయే దోవలొ నీవు సిగమూడి నువ్ ఇప్పొదమ్మా

అక్కింటికి పక్కింటికి వద్దు అత్త మామల కెదురాడొద్దు ॥నీ అరీ॥ ॥అత్త॥

ఇరుగమ్మల, పొరుగమ్మల మాట ఇష్టపడి నువ్ ఇనవద్దమ్మా

పదిమంది ఉన్నతావునా నువ్ పకపకానీ నవ్వొద్దమ్మా

నీ అరిసేతిలో దామర పడము పగలు సుక్కతే రమ్మయ్యా ॥అత్త॥

**ఇలాంటిదే మరో పాట –**

పోయిరావమ్మా కూతురా పోయిరావమ్మా

'పోయి నీ అత్తింటికి కీర్తి దేవమ్మా

అత్తలమావల ఎదురాడొద్దు

బావతో మరిదితో బదులాడొద్దు

తోడి కోడండ్లను తోసేయవద్దూ

నలుగురుండే చోటు నవ్వొద్దమ్మా

నలుగురుండే చోట కురులిప్పద్దూ

సేద బాయికాడ వక్కా కేయొద్దూ ॥పోయిరా॥

**కూతురి ఎడబాటు:**

తల్లి చనిపోయిన తర్వాత బిడ్డను పెంచి పెద్ద చేయడం తండ్రికి కష్టమైన పని. పైగా పాలు తాగే బిడ్డను సాకి సంతరించడం అంటే మాటలు కాదు. తండ్రి తన కూతురైన 'గంగుల్ని' తల్లిలేని లోటు తెలియనీయకుండా పెంచుతాడు. అపురూపంగా పెంచి పెద్ద చేసిన కూతురు యుక్త వయసు రాగానే పక్కింటి కుర్రాడితో లేచిపోతే ఆ తండ్రి పడే ఆవేదన, అవమానం అంతా ఇంతా కాదు. క్రింది గేయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

నువ్వు పుట్టినా ఆరునెల్లకే గంగులో....

మీ యమ్మా సనిపోయె గంగులూ

పాలు వేళకు పాలు పోసితి గంగులో....

నీళ్ళు వేళకు నీళ్ళు పోసితి గంగులూ

రోడ్డు పనికి నేను బోతిని గంగులో ...

మానుమానుయ్యాల గడితిని గంగులూ

పన్నెండేళ్ళ వయసు వచ్చెను గంగులో..

పంచ కూర్చుండబెడితిని గంగులూ

లడ్డుమిఠాయినేనుదెస్తని గంగులో..

నీకు నేను యిస్తానమ్మా గంగులూ

పక్క ఇంటి రామచంద్రుడు గంగులో.......
నీమీద కన్ను ఏసే గంగులూ
అద్దరేత్తిరి నిద్దరపొద్దున గంగులో....
ఇద్దరేమో లేచిపోతిరి గంగులూ
దిగు బొగ్గున లేసి చూసి గంగులో.....
గుడ్డి సంతా వెతికి నాను గంగులూ
నెత్తినోరు కొట్టుకొంటూ గంగులో....
కడుపు సాలా కొట్టుకుంటూ గంగులూ

**5.3.2.2. కష్టాలు కారణంగా పాడుకొనే పాటలు :**

కష్టాలనేవి మానవునికి సహజంగా వస్తుంటాయి. కానీ వరుసగా కష్టాల మీద కష్టాలు వస్తే భరింపరాని కష్టమవుతుంది. అలాంటి వ్యక్తికి జీవితం మీద రోత పుట్టి ఆత్మహత్యే శరణ్యమవుతుంది. అక్షరాలా ఈ విషయమే లక్ష్మమ్మ అనే పల్లె యువతి జీవితంలో తారసిల్లింది. లక్ష్మమ్మ జీవిత గాథను చిత్రించిన ఈ గేయం ఎంత కరుణ రసాత్మకంగా ఉందో గమనించండి-

బతకదామనీ బాలదామనీ
గుంటడు బాయీ నేనూ దావ్వితే
నా బండె బడెన్నా
ఓయన్నాలార సూసేవాళ్ళకూ యాడిక లాయన్నా
బతకదామనీ బాలదామనీ
గుంటడు సేనూ నేనూ దున్నితే
గుంటడు సేనూ గురుగే మొలసెన్నా ॥ఓయన్నా॥
బతుకదామనీ బాలదామనీ
బావకొడుకును నేనూ సాకితే
బావకొడుకే బాగామడిగెన్నా ॥ఓయన్నా॥
బతకదామనీ బాలదామనీ
సుట్టుగుడిసే నేనే గట్టితే
సుట్టుగుడిసే సూరేన్న మాయె ॥ఓయన్నా॥

కాలం కలిసిరాని లక్ష్మమ్మ జీవితం తానొకటి తలిస్తే దైవ మొకటి తలచు అనేకమైంది. బ్రతుక భారమని భావించిన లక్ష్మమ్మ ఆత్మహత్యకు పాల్పడినపుడు ఇరుగుపొరుగు వాళ్ళు ఆమెను ఓదార్చిన తీరుకూడా గేయం చివర చెప్పబడి ఉంది.

వద్దు వద్దు లచ్చుమమ్మా
నిన్న బుద్ధులు తెచ్చుకోవద్దూ
సక్కని పుట్టుక సావూలేలమ్మా - ఓ లచ్చుమమ్మా

కొన్ని దినములనవరించమ్మా

దురదృష్టం వెంటాడేటప్పుడు తమకు తెలియకనే కష్టాలు ఎదురౌతుంటాయి. నిజంగా ఈ విషయమే ఒక పల్లె వాని జీవితంలో తటస్తపడుతుంది. దురాలవాట్లను కొందరు ప్రయత్నపూర్వకంగా నేర్చుకుంటారు. మరికొంత మంది తమ బాధల్ని పోవడానికి నేర్చుకుంటారు. రెండో కోవకు చెందిన ఒక పల్లెవాడు బాధల్ని మర్చిపోవడానికి అంగట్లో భంగాకు కొంటాడు. సేని దగ్గరికి వెళ్ళి చేతిలో వేసి కలిపి పొగతాగతాడు. నలిపేటపుడు భంగి గింజ నేల మీద పడి వాన చినుకులకు మెలకెత్తి పెరిగి పెద్దదవుతుంది. విషయం ఆ ఊరి రెడ్డి (మునసబు) కి తెలియజేస్తారు. భంగి మొక్కల్ని పెంచడం చట్టరిత్యా నేరం కాబట్టి పోలీసు రిపోర్టు యిస్తాడు. పోలీసులు అతన్ని బంధించి కోర్టులో హాజరు పరచినపుడు, జడ్జిగారితో తన కష్టాన్ని చెప్పుకొన్న తీరును చూడండి–

దేవరా నామనవి యిన రండి
ఆ భంగి మొలకను ప్రేమతో నేపెంచలేదండి
ఆబంగి మొలకను కావంముతో చేయలేదండి
వొల్లు ఉష్ణము దగ్గు గసతో ఎందునా గుడ్డంటు చేతా
అంగడి దిగి పోయినేను దుడ్డు యిచ్చి కొంటినయ్యా ॥దేవరా॥
సేని కవలి పోయినేను సేతులేసి నలుపుతుంటే
ఏళ్ళ సందునజారి గింజా ఎప్పుడో మొలకయ్యి నా దీ ॥దేవరా॥
పై మోడపు సినుకూలాకు పెవలమాయెను పాడు భంగి
ఎవ్వడో దెంరెడ్డి కొచ్చి రెడ్డినెరుకాజేసినాడూ ॥దేవరా॥
అప్పుడే రిపోర్టు రాసి పోలీ సూటేషాను పంపే
ముగ్గురు జవాన్లు వచ్చిమేడా మిందా కట్టివేసి ॥దేవరా॥
వాళ్ళు నూకే నూకటాలకు ఇంటికాడా
ఆడపిల్లలు యలమటించే కాలమాయా ॥దేవరా॥
ఆదివారము నాడు కోర్టు మూతబాడుండాది
సోమవారము నాడు కేసు సోడియై పోయినాది ॥దేవరా॥

**5.3.2.3. మృతి కారణంగా పాడుకొనే పాటలు:**

పల్లెల్లో అప్పుల బాధలు తట్టుకోలేక అవమానంతో ఆత్మహత్యలు చేసుకోవడం కొత్తేమీ కాదు. అలా అత్మహత్య చేసుకొన్న ఒక పేద రైతు వరాల బంగారయ్య సేద్యాన్నే నమ్ముకొని బతుకుబండిని లాగుతూ అప్పుల బాధను భరించలేక ఎండ్రిన్ తాగి మరణిస్తాడు. బంగారయ్య తన నిండు నూరేళ్ళ జీవితాని బుగ్గిపాలు చేసుకొన్న వైనాన్ని, తల్లి ఆవేదనను జానపదులు చిత్రించిన తీరును చూడండి–

పొద్దాపొద్దున్నే లేచినాడూ వరాల బంగరయ్యా
పొద్దున్నే లేచినాడూ మోసగారి సాగరయ్యా
పొద్దున్నే లేచినాడే వరాల బంగరయ్యా

బాయి కాడికొచ్చి నాడే 'మోసగారి సాగరయ్య'

బాయి కాడికి వెళ్ళిన బంగారయ్య మిషను వదలి నారుకు నీళ్ళు పారగడతాడు. తిరిగి ఇంటికి వచ్చి బీరువాలోని పత్రాలు తీసి చదువుతాడు. తాను చేసిన అప్పుల మొత్తాన్ని వడ్డీని చూచి తలగిర్రున తిరుగుతుంది. ఇప్పుడు ఏ విధంగా తీర్చాలో బోధపడదు. మరణమే శరణ్యమనుకుంటాడు. తాను చేసిన అప్పులంతా లెక్క రాసి పెట్టి, తల్లికి తనకు నేటితో ఋణం తీరిపోయిందనుకుంటారు. బజారు కెళ్ళి, ఎండ్రిన్, టెంకాయ కర్పూరం తీసుకొని ఇంటికి వస్తాడు. తల్లితో బావి దగ్గరి కెళ్ళి వస్తానని సెలవు తీసుకుంటాడు. కాయ, కర్పూరం తీసుకొని–

బాయికాడి కెళ్ళినాడే వరాల బంగారయ్యా
గెనెము గెనెము తిరిగినాడే మోసగారి సాగరయ్యా
మావీడీ తోపులోనే వరాలు బంగారయ్యా
తోపల్లా కలదిరిగే మోసగారి సాగరయ్యా
కమ్మిడీ పరిసినాడే వరాల బంగరయ్యా
కర్పూర మెలిగించే మోసగారి సాగరయ్యా
కర్పూర మెలిగించే వరాల బంగరయ్యా
టెంకాయ కొట్టినాడే మోసగాడు సాగరయ్యా
ఎండ్రిన్ తాగినాడే వరాల బంగరయ్యా
ప్రాణములే వదినాడే మోసగారి' సాగరయ్యా.

తన కుమారుడు పొలం దగ్గర మరణించాడన్న వార్త వినగానే తల్లి పరుగు పరుగున బావి దగ్గరికి వెళుతుంది. పొలమంతా తిరిగి చూస్తుంది. మామిడి తోపంతా వెతుకుతుంది. తోపులో ఒక చోట ఎండ్రిన్ తాగి చనిపోయిన కొడుకును చూచి ఆతల్లి పడే ఆవేదన, కొడుకుని దహనం చేసిన తీరును చూడండి.

వరనుండి తపసుండి వరాల బంగరయ్యా
నిన్ను సాల కంటినయ్యా మోసగారి సాగంయ్యా
కట్లెదండమిచినాదో వరాల బంగరయ్యా
కట్టేమో దేప్పించే మోసగాడు సాగరయ్యా
అతిక దండ మించినాదో వరాల బంగరయ్యా
అగేమో దెప్పించే మోసగారి సాగరయ్యా
దీని గానే ఎత్తినాదే వరాల బంగరయ్యా
కాష్టములో బెట్టించే మోసగాడు సారయ్యా

మరో కరుణ రస గేయం బండోళ్ళు గురవలయ్య హత్యా గాథ బండోళ్ళు ఇంటి పేరు గురువలయ్య వ్యక్తి పేరు. చిత్తూరు జిల్లాలో బండోళ్ళూరు అనే గ్రామం ఉంది. ఆ గ్రామ హరిజన యువకుడు గురవలయ్య. చింతపండు, గోగునార వ్యాపారం చేసుకొని, వచ్చిన లాభంతో జీవించేవాడట ఆర్థికంగా బలహీనుడైనా, శారీరకంగా బలవంతుడు, అందగాడు, అతని మీద ఒక రెడ్డి కూతురు మనసు పడుతుంది. ఇద్దరు ఒకటవుతారు. ఆ విషయం అమ్మాయి తండ్రికి తెలుస్తుంది. గురువలయ్య బ్రతికి

ఉంటే సాటి వాళ్ళముందు తాను అవమానపడాల్సి వస్తుందని భావిస్తాడు. గురవలయ్యను అడ్రసు లేకుండా చేయాలని నిశ్చయించుకుంటాడు. గురవలయ్య వ్యాపారం చేసుకొని తిరిగి వచ్చే సమయాన్ని పసిగడతాడు. తన దగ్గర పనిచేసే నలుగురు జీతగాళ్ళను పిలిచి తాగించి కొడవళ్ళను, గొడ్డళ్ళతో చేతికిచ్చి గురువలయ్యను చంపమని ఆదేశిస్తాడు. గురువలయ్య వచ్చేదారిలో చెట్టు చాటున పొంచివుండి గొడ్డళ్ళతో నరికి చంపేస్తారు. హృదయ విదారకమైన దృశ్యాన్ని చూచి అతని తల్లి విలపించిన తీరును జానపదులు ఎలా చిత్రించారో తిలకించండి.

బండోళ్ళు గురవలయ్యా బలమంతుడనుకొంటి
నీ బలము గుంజిరి కొడుకో బండోళ్ళు గురవలన్నా
కటవ కింద బాయి కట్టేది కనికరాయి
తోలేది తిరుగుడు కపిలి నాటిది సిలక నాటు
పాడేది లంజా పాట పండేది గొలక పంట
కోసేది బొంబాయి కోత... ॥బండోళ్ళు॥
రెడ్డిరి. జీతగాళ్ళు గొడ్డండ్లు నూరుకోని
కొడవండ్లు నూరుకొని ఊరికి ఉత్తరాన
ఊడగల్ల మర్రికాడ నీ శిరసు గొట్టిరి కొడుకో
తల శిరసు గొట్టిరి కొడుకో బండోళ్ళు గువలన్నా ॥బండోళ్ళు॥
కారీనరగతమంతా కడవల్ల కెత్తి తల్లి
సింధీన రగతమంతా సీసాల కెత్తి తల్లి
కళ్యాణి యమ్మరాధా కనతల్లి నరుసులమ్మ ॥బండోళ్ళు॥
సరకారు వచ్చినారు సావిట్లో నిలిసినారు.
ఏమాని సెప్పుడు కొడుకో బండోళ్ళు గురవలన్నా
ఇల్లలికి ముగ్గుపెట్టి మల్లేలు వేగజిల్లీ
లేడాని జెప్పు తల్లీ కనతల్లి నరుసులమ్మా ॥బండోళ్ళు॥

## 5.4. నమూనా ప్రశ్నలు:

1. జానపద గేయ సాహిత్యంలోని కరుణ రసాత్మక గేయాలను వివరించండి?
2. జానపద భక్తి గేయాలను వివరించండి?

## 5.5. ఆధార గ్రంథాలు:

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య. బి. రామరాజు
2. తెలుగు - కన్నడ జానపద గేయాలు - ఆర్.వి.యస్. సుందరం
3. చిత్తూరు జిల్లా జానపద గేయాలు సాంఘిక - సాంస్కృతిక పరిశీలన - ఆచార్య కె. మునిరత్నం.

**- డా॥ బలరామ్ కచ్చళ్ళ**

## పాఠం - 6 హాస్య గీతాలు, శృంగార గీతాలు

### 6.0. లక్ష్యం:

విద్యార్థులు హాస్య గీతాలు మరియు శృంగార గీతాల గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**


**6.1. ఉపోద్ఘాతం**

**6.2. హాస్య గీతాలు-వర్గీకరణ**

**6.3. శృంగార గీతాలు**

**6.4. నమూనా ప్రశ్నలు**

**6.5. ఆధార గ్రంథాలు**


### 6.1. ఉపోద్ఘాతం:

నవరసాల్లో హాస్యం ఒకటి, హాస్యానికి స్థాయి హాసం. సుఖానికి బాహ్య చిహ్నం నవ్వు. నవ్వు గురించి విశ్వనాథుడు "వికృతాకార వాగ్వేష చేష్టాదేర్కృర్త కాద్భవేత్ హాస్యోహాస స్థాయీ భావః" అని నిర్వచించాడు. అంటే వికృతాలైన ఆకారం, మాటలు, వేషం, చేష్టలు మొదలైన వాటి వినోదం వల్ల హాస్యం జనిస్తుందని విశ్వనాథుని అభిప్రాయం. హాస్యం మానవీయ లక్షణం. విశ్వజనీనం, హాస్య ప్రవృత్తి ప్రతి మానవుడికి నాగరికుడైనా, ఆటవికుడైనా సహజం. ఏ సమాజంలోనైనా నవ్వని వాడు ఉండడు. ఉన్నట్లయితే అతణ్ణి వింత వ్యక్తిగా చెప్పుకోవచ్చు.

మానవ జీవితంలో సుఖం కన్నా దుఃఖం పాలు ఎక్కువ. కాబట్టి తాత్కాలికంగా నైనా బాధను మరిపించి మనస్సును సుప్రసన్నం చేసేది నవ్వు. ఈ నవ్వు ఎప్పుడెప్పుడు, ఏయే విధంగా జానపదులకు కలుగుతుందో ఈ పాఠ్యాంశంలో తెలుసుకుందాం.

### 6.2. హాస్యగీతాలు-వర్గీకరణ:

1. పెళ్ళిపాటల్లో హాస్యం
2. బువ్వపు బంతి పాటల్లో హాస్యం
3. అత్త అల్లుళ్ళ మధ్య హాస్యం.
4. భార్య భర్తల మధ్య హాస్యం
5. అతిశయోక్తులు వల్ల హాస్యం
6. ప్రగల్భోక్తుల వల్ల హాస్యం
7. అశ్లీల పద ప్రయోగాల వల్ల హాస్యం
8. గూఢార్థపద ప్రయోగాల వల్ల హాస్యం.

ఇలా హాస్యగీతాల్ని ఎనిమిది రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

**6.2.1. పెళ్ళిపాటలో హాస్యం:**

జానపదుల పరిహాసాలకు పెళ్ళి పందిళ్ళు మంచి చోటు. నవ్వు తెప్పించే అంశాల్లో పరిహాసం ఒకటి. పరిహాసంలో గేలి, ఎగతాలి, అపహాస్యం సమ్మిళితమైన ఉంటాయి. సాధారణంగా పెళ్ళిళ్ళలో పాల్గొనే స్త్రీలు రెండు వర్గాలుగా ఉంటారు. ఒకటి మగపెళ్ళి వాళ్ళ వర్గం రెండు ఆడ పెళ్ళి వాళ్ళ వర్గం. ఇరువర్గాలు పెళ్ళి పందిట్లో చేరి పెళ్ళి కూతురిపైన మగపెళ్ళి వాళ్ళు. పెళ్ళికొడుకుపైన ఆడపెళ్ళి వాళ్ళు పరిహాసమపు జల్లులు కురిపిస్తారు. పెళ్ళికూతురు వర్గం వాళ్లు.

నొక సుక్క దక్షిణానొక సుక్క
నట్టనడిమిదైనా నల్లసుక్కా
అన్ని సుక్కల కన్నా మేటమ్మ యీ సుక్క
ఓ సెమ్మ నీ మొగుడు రేసు కుక్కా
జయ మంగళం జయ సుమ మంగళం
కొడుకు వర్గం వాళ్ళు పెళ్ళి కూతుర్ని
అని పెళ్ళి కొడుకును గేలి చేస్తే, పెళ్ళి
ఆ యీది నొక సుక్క ఈ యీది నొక సుక్క
నట్టనడి మిద్దెనా నల్లసుక్కా
కాటు మరిగిన కుక్క కరవసాగిన కుక్క
పెండ్లి కూతురు నీ మొగము పెంటి కుక్క
జయ మంగళం జయ సుభమంగళం అని ఎగతాళి చేస్తారు.

పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకును మాత్రమే కాదు వాళ్ళ తల్లి దండ్రుల్ని గేలి చేస్తూ పాడే పాటలు కూడా ఉన్నాయి. పెళ్ళికూతురు వర్గం వాళ్ళు పెళ్లి కొడుకు తండ్రిని గేలి చేస్తూ-

నూగులూ నుసి బట్టి-గానిగా గసబట్టి
పెండ్లి కొడుకోలబ్బకు పేను బాట్టే
పేండ్లు ఈర్లు ఇలా గుండంగా
ఎనప్పోతు మీసాలు ఎరివిలడగిరీ
జయమంగళం జయ సుభ మంగళం

**దానికి సమాధానంగా పెళ్ళికొడుకు వైపు వాళ్ళు పెళ్ళికూతురు తల్లిపై విసిరిన విసురు చూడండి-**

నూగులూ నూసి బట్ట-నూగులూ నుసిబట్టే
గానిగా గసబట్టే-గానిగాగసబట్టే
పెళ్ళికూతురోలమ్మకూ పేను బాట్టే

దువ్వను దూబాన్లేక–ఈర్చను ఈర్బాన్లేక

గంజి గుంతలో బడి గుంజులాడ్రి

జయమంగళ జయ సుభ మంగళం– అని నవ్వు కొని సంతోషిస్తారు.

**6.2.2. బువ్వపు బంతి పాటల్లో హాస్యం:**

తెలుగువాళ్ళ పెళ్ళిళ్ళలో బువ్వపు బంతి పాటలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. భోజన సమయంలో పాడ పాటలే బువ్వపు బంతి పాటలు. ఈ పాటల్లోని ఛలోక్తులు, సరసోక్తులు, దెప్పి పొడుపులు ఎంతో హాస్యాన్ని, వినోదాన్ని కల్గిస్తాయి. ఈ పాటల్ని భోజన సమయంలోనే కాకుండా హారతి పట్టెటపుడు కూడా పాడతారు.

ఉదాహరణకు ఒక పాట–

ఆగాడపూతకు అతడుండె రవిలికి

తన కొంగు దీసైన తవుడు గట్టి దిక్కులు చూడకా దిగ బొక్కలాడకా

నడిచిరా పెండ్లి కొడుకా నడిదిలోకి

జయమంగళం జయ సుభ మంగళం..

అని పెళ్ళికూతురు వర్గం వాళ్ళు పెళ్ళి కొడుకును ఎగతాళి చేస్తే, పెళ్ళికొడుకు వర్గం నుంచి పెళ్ళికొడుకు చెల్లెలు కాబోయే వదినగార్ని –

ఆసంకా నొక బిడ్డ ఈ సంకనొక బిడ్డ

కడుపులో ఒక బిడ్డ కదలకుండా

ఏడు ముద్దలు సంగటి దిని, ఏడుముంతలు నీళ్ళుదాగి

సాలదని మావదిన సట్టిగోకే

జయమంగళం జయ శుభమంగళం– అని వేళా కోళం చేస్తుంది.

**6.2.3. అత్త అల్లుళ్ళ మధ్య హాస్యం:**

అత్త అల్లుళ్ళ మధ్య హాస్యం చాలా విచిత్రంగా ఉంటుంది. కొత్త అల్లుళ్ళను పండుగ, పబ్బాలకు అత్త గారు ఆహ్వానించడం సహజం. ఇంటికి వచ్చిన అల్లుళ్ళను గౌరవించడం కూడా సహజమే. కానీ కొందరు అత్తగారు అల్లుళ్ళను గౌరవించడంతో పాటు, వాళ్ళను అటపట్టించిన సన్నివేశాలు కూడా జానపద గేయ సాహిత్యంలో కన్పిస్తుంది. కొత్తగా వచ్చిన అల్లుణ్ణి అత్త మరదళ్ళు ఆటపట్టించిన తీరును చూడండి–

అత్తగారింటికి అల్లుడై వస్తేను

కొత్త సున్నము దెచ్చి మెత్తరమ్మా

కొత్త సున్న చేత పొక్కిస్తే గావాలి

సల్లంగ సవిట్నీళ్ళు సల్లరమ్మా

సవిట్నీళ్ళు చేతనే సలిబుట్టిగావాల
వెచ్చంగా వేడ్నీళ్ళు చల్లరమ్మా
లేనీళ్ళ చేతనే వేడెక్కె గావాల
దురదగుండూ దెచ్చి రుద్దరమ్మా
గుండూ చేత దుర్దించిరి గావాల
పల్లేరు గాయలు దెచ్చి పలవరమ్మా
పల్లేరు గాయలతో పరిబుట్టేగావాల
జిల్లేడు గాయలు దెచ్చి జిలవరమ్మా
జిల్లేడు గాయలతో జిలబుట్టిగా వాల
నల్లేరు కాడా దెచ్చి నలవరమ్మా
నల్లేరు కాడతో నసబుట్టె గావాల
గుత్తిగంపా దెచ్చి కొట్టరమ్మా-

**మరో గేయంలో ఒక అత్త అల్లుణ్ణి**

తోటకూర పులుసు గూర
తోకూర తియ్యకూర
తోటకమల పిందె మిరియామూ
కలియ బోసి కాసినారు
కడుపుకేమో పోసినారు
ఇల్లు అంతా పారిపెట్టె ఇప్పుడల్లుడు
ఎత్తి పొయ్యను తట్టలేదు.
తోసిపోయను పొరకలేదు.
బూడిదైన కప్పవయ్య బుద్ధిమంతుడా-
ముంతలేదు చెంబులేదు.
లా అపహాస్యం పాలు చేస్తుంటే గమనించండి-
ముంచి పొయ్యను కడవలేదు.
బాయి కాడికి పట్టండమ్మా బాగ్గెమంతుని-

**6.2.4. భార్య-భర్తల మధ్య హాస్యం:**

భార్యాభర్తలు పరస్పర పరిహాసాలాడుకొనే సన్నివేశాలు కూడా జానపదగేయ సాహిత్యంలో అక్కడక్కడ దర్శనమిస్తాయి. కుటుంబాల్లో భర్త కొంచెం తెలివైనవాడయి భార్య తెలివి తక్కువది అయితే అన్ని విషయాల్లోను భర్తదే పైచేయిగా ఉంటుంది. అలా కాకుండా భార్య తెలివికలిగిందైై. భర్త అసమర్థుడైతే భార్య పెత్తనం సాగిస్తుంది. పల్లెల్లో భార్యాభర్తల మధ్య వేళాకోళాలు ఎలా వుంటాయో ఒకటి, రెండు గేయాల్ని పరిశీలించి చూద్దాం. ఊళ్ళో వచ్చిన చీర, రవిక, కమ్మలు, గొలుసుల్ని కొనిపెట్టమని అడిగి భార్యను భర్త ఏవిధంగా ఎగతాళి చేస్తాడో కింది పాటను చూస్తే తెలుస్తుంది.

"**భార్య:** చీరలొచ్చినాయి మావా ఊళ్ళోకి
మంచి చీరలొచ్చినాయి మావా ఊళ్ళోకి
**భర్త:** ఊరకుండే తిక్కదానా
నీకు కట్టుకోను చేతగాదే పిచ్చిదానా
**భార్య:** రైకలొచ్చినాయి మావా ఊళ్ళోకి
మంచి రైకలొచ్చినాయి మా ఊళ్ళోకి
**భర్త:** ఊరకుండే తిక్కదానా
నీకు తొడుక్కోను చేత గాదే పిచ్చిదానా
**భార్య:** కమ్మ లొచ్చినాయి మావా ఊళ్ళోకి
మంచి కమ్మలొచ్చినాయి మావా ఊళ్ళోకి
**భర్త:** ఊరకుండే ఊరకుండే తిక్కదానా
నీకు పెట్టుకోను చేతగాదే పిచ్చిదానా
**భార్య:** గొలుసులొచ్చినాయి మావా ఊళ్ళోకి
మంచి గొలుసులొచ్చినాయి మావా ఊళ్ళోకి
**భర్త:** ఊరకుండే ఊరకుండే తిక్కదానా
నీకు ఏసుకోను చేతగాదే పిచ్చిదానా..."

**మరో గేయంలో అసమర్థుడైన భర్తను భార్య ఏ విధంగా వేళా కోళంగా చేస్తుందో చూడండి-**

"కద్దరు సాయిబో రా... అందాలా మావయ్యో రా
అందరి మొగుళ్ళు సైకి లేసుకొని సిల్మాకెళుతుంటే ॥2సార్లు॥
నామొగుడేమో సైకిలు తొక్కలేక సరుగుల బడా ॥ కద్దరు ॥
అందరి మొగుళ్ళు సైకిలేసుకొని సిన్మాకెళుతుంటే
నా మొగుడేమో సిత్తురు కెళ్ళి సీదుకుంటొచ్చినాడే ॥ కద్దరు ॥
అందరి మొగుళ్ళు ఐరాల కెళ్ళి అద్దాలు దెస్తుంటే

నా మొగడేమో ఐరాల కెళ్ళి అల్లాడతొచ్చినాడే ॥కర॥

అందరి మొగుళ్ళు పాటూరు కెళ్ళి పావళ్ళు దెస్తుంటే

నా మొగుడేమో పాటూరు కెళ్ళి పాడై వచ్చినాడే ॥కద్దరు॥"

### 6.2.5. అతిశయోక్తుల వల్ల హాస్యం:

అసంభవమైన విషయాల్ని సంభవాలుగా, సాధారణ విషయాల్ని అసాధారణ విషయాలుగా వర్ణించేటప్పుడు అతిశయోక్తుల్ని వాడతారు. అతిశయోక్తుల్ని ఉపయోగించి హాస్యం తెప్పించడం హాస్యోత్పత్తిలో ఒక భాగం. ఇందులో వ్యంగ్యానికి, అధిక్షేపానికి తావుండదు. అతిశయోక్తుల వల్ల జనించే హాస్యం సహజంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక పాట-

"తూరుపూ కొండ్ల నడుమ గొర్రె ఏడు పిల్లలేసే

సెప్పవచ్చిన ముసలిదాన్ని సేపమింగెన్నా

సెప్పవచ్చిన ముసలిదాన్ని సేపమింగేనాని సెప్పి

పారిపోయిన ముసలిదాన్ని పాము మింగెన్నా

పారిపోయిన ముసలిదాన్ని పాము మింగెనాని సెప్పి

సూడ వచ్చిన ముసలిదాన్ని సూది మింగెన్నా

సూడ వచ్చిన ముసలిదాన్ని సూది మింగనాని సెప్పి

దొడ్లో ఉండే ముసలిదాన్ని దోమ మింగెన్నా

దొడ్లో ఉండే ముసలిదాన్ని దోమ మింగెనాని సెప్పి

రోసగారి పందికొక్కు రోలు మింగెన్నా

రోసగారి పంది కొక్కు రోలు మింగెనాని సెప్పి

మోసగారి పంది కొక్కు మొగుణ్ణి మింగెన్నా

మోసగారి పంది కొక్కు మొగుణ్ణి మింగెనాని సెప్పి

ఉసుగ్గుద్ద కోడిపిల్ల ఊరుమింగెన్నా"

### 6.2.6. ప్రగల్భోక్తుల వల్ల హాస్యం:

అసమర్థుడు సమర్థుడుగా సమర్థించుకోవడానిక పలికే ఆడంబరమైన మాటలే ప్రగల్భోక్తులు. చేయశక్యంగాని పనిని చేసినట్లు చెప్పినా, సాధ్యమైన పనిని అసాధ్యమైన పనిగా ప్రగల్భాలుపలికినా ఎవరికైనా నవ్వు వస్తుంది. ప్రగల్భాలు కూడా అతిశయోక్తుల్లాంటివే ఉదాహరణకు ఒక పాటను చూడండి.

"అందమామా యిందామామా సందా మామా

నేను సందమామలో దూరివస్తిరా సాపాట్రామా

సెరువు నిండా నీళ్ళూ వుంటే ఓరి మామా

నేను కటమింద పోయి కటమిందవస్తూ ఓరిమామా
ఏనుగూ ఎరగడ్డ పొట్టూ ఓరిమావా
ఒకడెత్తకనేనే ఎత్తూ కొందూ ఓరిమావా
ఎలికలు గాల్చే ఒలికలు మిట్టా
ఓరిమావా
నేను ఒకడేబోయి ఒకడే వస్తూ ఓరిమావా
గు బళ్ళారి దేశం ఓరిమావా
నేను గువ్వలమ్మే వాణ్ణిరా ఓరిమావా"

మగాడు చందమామలో దూరి రావడం అసంభవం. అలా సంభవం కాని సంబవంగా చెప్పడం వల్ల నవ్వొస్తుంది. చెరువు నిండా నీళ్ళు ఉన్నప్పుడూ కట్టమింద పోయి రావడం, బరువులేని ఎర్రగడ్డ పొట్టుమూటను ఎత్తుకోవడం, ఊరిపక్కనే ఉన్న ఒలికలు మిట్ట దగ్గరికి వెళ్ళిరావడం అనేది కష్టంకాదు. ఇలాంటి సాధారణ విషయాల్ని అసాధారణ విషయాలుగా ప్రగల్భాలు పలికినపుడు ఎవరికైనా నవ్వొస్తుంది. ఇలాంటిదే మరో పాట-

"కుందీ కుందీ నడవబోతే గుదిగాళ్ళు నొప్పి
కుచ్చుంటే పిర్రాలు మంటా-లేస్తే మెకాళ్ళునొప్పి
పడుకొంటే పక్కాలు నొప్పి-
ఐదు ఆమడ అడవినడచి అలసిపోతినీ
అత్తగారింటికి బోతినీ-ఐదు ముద్దలు సంగటి దింటినీ
ఎరివిలి బీడి దాగితీ-ఎంగిలి వక్కా కేసితీ ॥కుందే॥
ఎదురు గొచ్చే ఆడదాన్ని ఎగిసి తన్నెదా
కార్కీ మొకానూసెదా-తో సకపుయ్ జైల్లో తోసేదా ॥కుందే॥
ఐదుమంది దొంగెల బట్టిట అపుడే బొడ్పెదా
మద్రాసు మేలి సూసెదా-దొంగలుండే సాటికోచ్చెదా ॥కుందే॥"

### 6.2.7. అశ్లీల పద ప్రయోగాల వల్ల హాస్యం:

వాడకూడని బూతుపదాల్ని వాడి నవ్వు తెప్పించడమే అశ్లీల పద ప్రయోగాల వల్ల హాస్యం. ఈ బూతు మాటలు విన్నపుడు కొందరు సిగ్గుపడతారు కొందరు కోప్పడతారు మరికొందరు నవ్వుకుంటారు. ఒక పక్క సిగ్గుపడే వాళ్ళు, కోప్పడే వాళ్ళు కూడా మరో పక్క నవ్వుకుంటారు. ఈ బూతు మాటలతో కూడుకొన్న హాస్యం కూచి మంచి జగ్గకవి 'చంద్రరేఖా విలాపం' లో వేమన ఆటవెలదుల్లో, కవి చౌడప్ప శతకంలో కన్పిస్తాయి. 'ఒకింత బూతాడక నవ్వుపుట్టదు దొరకు ధరలో "నీతులు బూతులు లోక ఖ్యాతులురా కుందవరపు కవి చౌడప్ప "అంటాడు కవి చౌడప్ప కింది గేయం లోని బూతు మాటల్ని

చూస్తే ఎవరికైనా నవ్వు వస్తుంది-

"అల్లూమల్లూరి కాడా కల్లూ బాజారు కాడ
కల్లూ బజారు కాడ కలిసింది మనస్సూ ఓ సిన్నదానా
ఇడవనే కొంగు వదలనే కొంగు
ఎఱ్ఱా ఎఱ్ఱాటిదాన ఎత్తూ పిఱ్ఱాలదానా
ఎత్తూ పిఱ్ఱాల మీద ఎండుగుబ్బ లేనే ఓ సిన్నదానా
వంకమ్మిటి పోయేదానా వంకాయ జుట్టుదానా
వంకాయ జుట్ట జసి వొప్పలేదే మనస్సూ ఓ సిన్నదానా
ఈదమ్మిటి పోయెదానా ఇసురుకాళ్ళ పిఱ్ఱదానా
ఇసురు కాళ్ళ పిఱ్ఱజూసి ఇడిసే లేదే ఓ సిన్నదానా
కట్టమ్మిటి పోయేదానా కఱ్ఱిమూతి సిన్నదానా
కఱ్ఱమూతి దాన్ని చూసి కదిలేకి లేదే ఓ సిన్నదానా"

**6.2.8. గూఢార్థ ప్రయోగాల వల్ల హాస్యం:**

గూడార్థం అంటే మరుగుపరచబడిన అర్థం. ఇది చమత్కారంతో కూడుకొని ఉంటుంది. ఒకే మాటకు ఉన్న రెండర్థాలలో మొదటి అర్థం వల్ల అపార్థం, రెండో అర్థం వల్ల విస్మయం కలిసిస్తే అలాంటి చమత్కారం హాస్య స్ఫోరకమవుతుంది. వాక్యమత్కారంతో వికృతిని కల్గించి హాస్యాన్ని పుట్టించే గేయాలు జానపద గేయ సాహిత్యంలో చాలా ఉన్నాయి. ఇవి కొన్ని ప్రశ్నోత్తరాల పద్ధతిలోను, మరికొన్ని పొడుపు కథల రూపంలోను ఉన్నాయి. ప్రశ్నోత్తరాల రూపంలో సాగే ఈ గేయాన్ని చూడండి-

"ఒక కపైనేసి
ఒకనికోసం నేబోతిరా మావా
ఒక కోసం బోతిరా
ఎవర్ని కిందేసి ఎవర్ని పైనేసి
ఎవని కోసం నూబోతివే పిల్లా
ఎవని కోసం నూ బోతివే-
స్త్రీ:
కోడ్ని కిందేసి తట్టనీపైనేసి
కత్తి కోసం నేబోతిరా మావా
కత్తి కోసం నే బోతిరా

ఒకణ్ణి కట్టేసి ఒకణ్ణియిడి సేసి
ఒకణి కోసం బోతి రామావా
ఒకణి కోసం బో తీరా
ఎవర్ని కట్టేసి ఎవర్నీ యిడి సేసి
ఎవనికోసం నూబోతివే పిల్లా
ఎవని కోసం నూబోతివే
ఆవును కట్టేసి దూడ్నీ యిడిసేసి
దుత్త కోసం నేబోతిరా మావా
దుత్తకోసం నేబోతిరా"

**పొడుపు కథల రూపంలో సాగే గేయానికి ఉదాహరణ-**

"ఏసేది ఎందిరా ఎక్కేది ఏందిరా
కట్టెది ఏందిరా కట్టే దానికింద కారేది ఏందిరా
తందన్నా తానే తందనానే తానందన్నా తానే తందనానే".

**సమాధానం:** ఏ సేది నిచ్చెనా ఎక్కేది మానురా

**ప్రశ్న:**

కట్టేది దుత్తరా కట్టేదానికింద కారేది కల్లురా ॥ తందన్నా ॥
బోడిది ఏందిరా బొచ్చుది ఏందిరా
మెడ సుట్టు లింగాల్ది దాని పేరేందిరా ॥ తందన్నా ॥

**సమాధానం:** బోడీది కోడి గుడ్డు బొచ్చుది టెంకాట్
మెడ సుట్టు లింగాలి దానిపేరొంకాయ్ ॥ తందన్నా ॥
అబ్బేది ఏందిరా రుబ్బేది ఏందిరా
కడాసారి పుయ్యేటప్పుడు కడిగేది ఏందిరా ॥ తందన్నా ॥

**సమాధానం:**

అబ్బేది రాయిరా రుబ్బేది పప్పురా
కడసారి పుయ్యేటపుడు కడిగేసి సేయిరా ॥ తందన్నా ॥

## 6.3. శృంగార గేయాలు:

### 6.3.1. ఉపోద్ఘాతం:

శృంగార గేయాల్ని వలపు పాటలు అని కూడా అంటారు. జానపదుల మధురమైన శృంగార భావాల్ని తెలియజేసే గీతాలివి. నవరసాల్లో శృంగార, వీరాలే ప్రధానమైనవని పలువురి లాక్షణికులు అభిప్రాయం. ఈ రెండింటిలో కూడా శృంగారానికే అగ్రస్థానం. విశ్వ సృష్టికి ఆధార భూతం, సకల ప్రాణి కోటికి సమాన ధర్మం అయిన శృంగారం సాహిత్యంలో అగ్రస్థానాన్ని పొందడం సముచితమే. 'శృంగార మేవ మధురం పరప్రహ్లాదనో రసః' అని ధ్వన్యాలోక కర్త ఆనందవర్ధనుడు వచించాడు. అంటే శృంగారమే మధురమైంది. ఆనంద జనకమైందని అతని అభిప్రాయం. శృంగారానికి స్థాయి రతి. దీనికి స్త్రీ, పురుషులు ఆలంబన విభావాలు. చంద్రమలయానిలాదులు ఉద్దీపన విభావాలు స్వేద, రోమాంచాదులు సంచారీ భావాలు. శిష్ట సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన శృంగారం జానపద సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేసింది. అయితే శిష్ట సాహిత్యంలో సాక్షాత్కరించే శృంగారం వేరు.

జానపద సాహిత్యంలో కన్పించే శృంగారం పేరు, జానపదులు తమ శారీరక శ్రమను మరచిపోవడానికి కొత్త ఊపును, ఉత్సాహాన్ని. ఉత్తేజాన్ని పొందడానికి శృంగారాన్ని ఆశ్రయిస్తారు. తమ హృదయాల్లో ఉప్పొంగే శృంగార మధురానుభూతుల్ని, ఆవేశాల్ని, కోరికల్ని చొప్పించి జానపద సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తారు. అందువల్ల జానపదులు శృంగార గేయాలు లాక్షణికుల వచనాలకు అనుగుణంగా ఉండవు. ఈ పాటల్లో లాక్షణికులు చెప్పిన విభావానుభావ వ్యభిచారీభావాదుల పరిపుష్టిని ఆశించడం వృధా, సామాన్యంగా అవి ఏదో ఒక సంచారీ భావాన్ని ఆశ్రయించి ఉంటాయి. అత్యంత ప్రాచీన సమాజంలో ప్రేమకు ప్రాధాన్యం ఉందే కానీ ప్రేమ పాటలకు లేదా శృంగార గేయాలకు ప్రాధాన్యం లేదు. ఈ నాటికీ సజీవంగా ఉన్న ఆదిమమానవ సమాజంలో శృంగార గేయాలకు తావు లేదు. వాళ్ళ జీవితంలో పనికి, పరమార్థానికి మాత్రమే చోటు ఉంది. వేటాడే కాలం పోయి, వ్యవసాయాది ఆహార నిర్మాణ పద్ధతుల్ని నిర్మించుకున్న సమాజంలోనే మనకు ఎక్కువగా శృంగార గేయాలు విన్పిస్తున్నాయి. కన్పిస్తున్నాయి కూడా.

తెలుగు జానపద గేయ సాహిత్యంలో సూచనాపరంగా, వాచ్యాప్తంగా, బూతుపరంగా కన్పించే శృంగార గేయాలులా ప్రచారంలో ఉన్నాయి. వీటిలో కొన్ని స్త్రీలకు సంబంధించినవి. కొన్ని పురుషులకు సంబంధించినవి. మరికొన్ని సంభాషణా రూపంలో ఉండేవీ ఉన్నాయి.

**6.3.2. శృంగార గేయాలు-వర్గీకరణ:**

శృంగార గేయాల్ని ఆరు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి:

1. ప్రేయసి ప్రియుల శృంగారం
2. భార్యాభర్తల శృంగారం
3. ప్రలోభ శృంగారం
4. పంచక శృంగారం.
5. విటవిటి శృంగారం
6. వియోగ శృంగారం.

**6.3.2.1. ప్రేయసీ ప్రియుల శృంగారం:**

జానపద గేయ సాహిత్యంలో ప్రేయసి ప్రియులు పరస్పరం పలకరించుకొని పులకరించే శృంగారం గేయాలు చాలా

ఉన్నాయి. ఉదాహరణకు ఒకటి, రెండు గేయాల్ని పరిశీలిస్తాం. భావ వ్యక్తీకరణ, కలయిక విషయాల్లో పల్లీయులకు, పట్టణ వాసులకు చాలా తేడా కన్పిస్తుంది. పట్టణవాసులైన ప్రేమికులు తమ ప్రేమ కలాపాల్ని మాటల ద్వారానో లేదా ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారానో తెల్పుకుంటూ పార్కుల్లోనో, సినిమాల్లోనో కలుసుకుంటారు. జానపదులు చదువు సంధ్యలు లేని వాళ్ళు కాబట్టి మాటల ద్వారా గానీ, పాటల ద్వారా గానీ తమ ప్రేమ భావాల్ని పరస్పరం తెలియజేసుకొంటూ బావుల దగ్గరనో, పొలాల దగ్గరనో, కలుసుకుంటుంటారు. కింది పాటలో ఒక చిన్నది. చిన్నోడు తమ ప్రేమ భావాల్ని పాట ద్వారా సూచనా ప్రాయంగా ఎలా వ్యక్తం చేసుకొంటారో గమనించండి-

"**చిన్నోడు:** జడ నీకు ఎవరల్లిలో చిన్నదానా
జడనీకు ఎవరల్లిరో
జయ మెడనా కుచ్చుల దండా
జడ నీకు ఎవరల్లీరో-
మానిలో పండుండాదీ చిన్నదానా
మాటలకు మడిరాలునా
చిన్నాదానా మాటలకు మడి రాలునా

**చిన్నది:** దోటి వేసి లాగితే చిన్నవాడా
దోసిట్లో పడ దూకుమ
చిన్నవాడా దోసిట్లో పడ దూకును

**చిన్నోడు:** బాయిలో సేపుండాదీ చిన్నాదానా
బాదా పడితే దొరుకునా
చిన్నాదానాబాదా పడితే దొరుకూనా

**చిన్నది:** గాలమేసీ లాగితే చిన్నవాడా
గెడ్డానా పడుదూకునుట
చిన్నవాడా గెడ్డానా పడదూకును

**చిన్నోడు:** ఏటికి వలలొడ్డితే చిన్నదానా
ఏమేమి మెగమొచ్చూనూ
చిన్నాదానా ఏమేమి మొగమొచ్చును.

**చిన్నది:** రొమ్మున కొమ్మెడితే పాడచువాడా
నమ్మిన మెగమెచ్చునూ...."

ప్రేయసీ ప్రియుల మధ్య సంభాషణాత్మకంగా సాగిన మరో గేయంలో తాను శృంగారానికి అర్హురాలునని తెలియజేస్తూ. తన ఇంటి గుర్తుల్ని చెప్పి రాత్రికి కులుసుకొమ్మని సూచనప్రాయంగా చెప్పిన వైనాన్ని చూడండి-నీదీ ఏ పల్లెరన్న

**“యువతి:** ఏవూరు రన్న నీదీ ఏ పల్లెరన్న నీది
కాసేటి పిండాలో తోలేటి గాలిలో
**యువకుడు:** మావూరు మదరాసూ – నా పేరు రామదాసు
కాసేటి ఎండాలో గొర్లకాడుండాను
తోలేటి గాలిలో మేకల కాడుండాను
మాయమ్మ గారింటికాడా తొలిసమరమైనపుడు
సాకాల మడివిలితో రయిసంగ చెప్పలేదు.
సాకాల మడివిలితో మర్మంగ జెప్పలేదు.
ఉత్తరంగ దోవన్నా దక్షణంగ గుడిసెన్నా
జలదారి బండన్నా బందేరాకుడికన్నా
గురుతూగ జూడన్నా గంగిరేని సెట్టన్నా
గులక రాళ్ళ మిట్టల్లో గొర్లకాడ నీవుంటే
మావూరు ఎతుక్కొని మల్లుకోని రారన్నా
మావూరు ఎతుక్కొనీ మావిటీకి రారన్నా ॥ ఏవూరు ॥
పైడు బీము వండుండా పచ్చడి పెట్టుండా
ఇద్దరాము తీనేసీ ఏకమై పోదామో
ఇద్దరాము తీసేసి ఏకం ఉందాయమా” అని చెబుతుంది.

చిన్నది ఆరోజు రాత్రి బాగా ముస్తాబై ప్రియుని రాక కోసం ‘వాసక సజ్జిక’ లాగా ఎదురుచూస్తూ తనను తన ప్రియుణ్ణి ఎలా భావిస్తుందో గమనించండి–

**“యువతి:** మసక మసక చీకటిలో–మల్లెపూల వాసనలో
వాసనకు వస్తాదమ్మా నారాజు–మోజులన్నీ తీరేనమ్మా ఈ రోజూ ॥ మసక ॥
ఏటి వార యాపసెట్టు–ఇంపుగాను పూతబూసె
కొమ్మవంచి కోయబోతే రాజు. కొమ్మ ఇరిగి కొప్పే నిండే ఈ రోజూ ॥ మసక ॥
వగలు వగలు సిర గట్టి వాలు కొప్పు ఏసుకోనీ
కట్టమీద పోతా ఉంటే నారాజ పోలుసోని కూతురందురూ ఈ రోజు ॥మసక॥
కుడి సేతికి వచ్చి కట్టి ఎడమ చేతిలో గొడుగు పట్టి
రోడ్డమ్మిటి పోతూ వుంటే నారాజు పాలెగాడందూరమ్మా ఈనాడు ॥మసక॥

**6.3.2.2. భార్యాభర్తల శృంగారం:**

భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు చిలిపి తగాదాలు రావడం సర్వ సామాన్యం. ఆ కారణంగా ఇద్దర్లో ఒకరు అలక సాగించడం. మరొకరు అలక తీర్చడం కూడా సహజమే. ఇలాంటి తగాదాలు, అలకలు జానపదుల్లో మరీ ఎక్కువే. భార్య అలిగి ఇంటి తలుపుకు గడిపెట్టి పడుకొన్నప్పుడు వారిద్దరి మధ్య సాగిన శృంగార సంభాషణ ఎంత సున్నితంగా సాగిందో కింది గేయంలో గమనించండి-

"అల్లనేరేడల్లా జంబునేరేడల్లా ఓ... లలన నేరేడల్లా
గెడిదీయే ఓ భామ గెడిదియె నీవు అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
గెడికాడా గంధపు చెక్కులున్నాయి. అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
నట్టింటా పండేను గెడిదీయే నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
నట్టింటా నాగులయ్య శిరసూలున్నాయి. అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
పొయికాడా పండేను గెడిదీయే నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
పొయి మీదా పొన్నారు కాగులున్నాయో అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
నీతలకాడా పండేను గెడిదియే నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల॥
తలకాడా తల్లిసాకిన కురులూ ఉన్నాయో అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
నీ సేతుల్లో సేలారి గాజులున్నాయో అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
సేతుల్లో సేలారి గాజులున్నాయో అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
కాళ్ళకాడ పండేను గెడిదీయో నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల ॥
కాళ్ళకాడ మెట్టాలున్నాయో అల్లనేరేడల్లా ॥ అల్ల॥
సాలీయె ఓ భామ సాలీయె నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల॥
మంచీదే ఓ భామ మంచీదే నీవూ అల్లనేరేడల్లా ॥ అల్ల ॥"

**6.3.2.3. ప్రలోభ శృంగారం:**

ప్రలోభ పెట్టడం అంటే ఆశపెట్టడం. కొందరు పురుషులు తాము వలచిన స్త్రీల పొందుకోసం కమ్మలు, కడియాలు చేయిస్తామని, చీరా రవికలు కొనిపెడతామని, ధన, ధాన్యాలు ఇస్తామని ఇంకా రకరకాలైన వస్తువుల్ని కొనిపెడతామని ఆశ చూపి లొంగ తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకు క్రింది గేయంలో ఒకడు తాను కోరుకొన్న స్త్రీని తనతో రమ్మని ఎలాంటి ఆశల్ని చూపుతాడో చూడండి-

"రావే రావె రావె రావె నా రమణి ముద్దులగుమ్మా
నా రాజ నిమ్మల పండు, నా రమణి ముద్దుల గుమ్మా
కాటికాడ నక్కలా కాచించి ఉంటాను.
ఆకు చాటు పిందెలా ఆణగి మణగి ఉంటాను.

అమ్మతోడు వరసకైనా అబద్దాలు పలకలేను
కాసులు పేరు చేయిస్తా. కడియాలు చేయిస్తా
గుర్రం మీద ఎక్కిస్తా, గుడిసెలన్నీ తిప్పిస్తా
పుల్లి చేత చెప్పిస్తా. ఎల్లి చేత వొప్పిస్తా
వాడకంతా నిన్ను పెద్దదొరసాన్ని చేయిస్తా-

మరో గేయంలో ఒక యువతికి వక్కాకు ఇచ్చి లొంగ దీసుకోవాలనుకుంటాడు ఒక యువకుడు. అపుడా గడుసరి యువతి అతడు ఇచ్చే ఎక్కాను తీసుకుంటే ఏమి జరుగుతుందో ఏకరువు పెట్టే విషయమే క్రింది గేయం-

"**యువకుడు:** ఎవూరు ఏనేల రంగిపిల్లా రంగసానీ పిల్లా
**యువతి:** మాది అగిరి గుంట నగరి మడుగు అప్పామాది నరసప్పా మాది
**యువకుడు:** పక్కిసా ఏసుకో రంగిపిల్లా రంగసానీ పిల్లా
**యువతి:** వక్కిస్తా వంగ మంటారప్పామీరూ నరసప్పా మీరూ
**యువకుడు:** అకిస్తా ఏసుకో రంగీపిల్లా రంగసానీ పిల్లా
**యువతి:** ఆకిస్తే అడగతారప్పా మీరూ- నరసప్పామీరూ..
**యువకుడు:** సున్నమిస్తా ఏసుకో రంగీపిల్లా రంగసానీ పిల్లా
**యువతి:** సున్నమిస్తే సూపమంటారప్పా మీరూ నరసప్పామీరూ
**యువకుడు:** పొవ్వాకిస్తా ఏసుకో రంగిపిల్లా రంగసానీ పిల్లా
**యువతి:** పొవ్వాకిస్తే పొనుకొమంటా రప్పా మీరూ నరసప్పా మీరూ
**యువకుడు:** దుప్పటిస్తా కప్పుకో రంగీ పిల్లా రంగసానీ
**యువతి:** దిప్పటిస్తే దుమ్మురేపతా రప్పా మీరూ నరసప్పా మీరూ"

### 6.3.2.4. వంచక శృంగారం:

వంచన చేయడం అంటే మోసం చేయడం లేదా ఏ మార్చడం, జానపద గేయసాహిత్యంలో జానపదుల శృంగార జీవితానికి సంబంధించి స్త్రీ, పురుషుల మధ్య నయవంచనలతో సాగే గేయాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు ఒకటి రెండు గేయాల్ని పరిశీలిద్దాం.

**పురుషుల నయ వంచన:**

నయవంచన అంటే మోసం, కొందరు మగాళ్ళు తమకు ఏమీ ఆస్థిపాస్తులు లేకపోయినప్పటికీ, ఎంతో ఉందని చెప్పి ఆడవాళ్ళను మోసం చేసి వాళ్ళను లొంగదీసుకొనే వాళ్ళ సమాజంలో లేకపోలేదు. సరిగ్గా ఈ విషయాన్ని తెలియజేసేదే కింది గేయం. ఒక యువకుడు ఒక యువతిని ఎలాగైనా తనదానిగా చేసుకోవాలని తనకు పొలంపుట్రా ఉందని, ఎంతో ధనం ఉందని మాయమాటలు చెప్పి ఆమెను లేపుకపోతాడు. అక్కడికి వెళ్ళేసరికి అతడు చెప్పినవి ఏవీ లేవని గ్రహించి ఆయువతి

ఎలా బాధపడుతుందో, చూడండి–

తూరుపూ సిన్న దంట్రా పిల్లగా తుమ్మిపూలు సాయిదంట్రా
మూడు మడకల సేద్య మంటివి పిల్లగా దున్నే వాళ్ళు లేరంటివి
నమ్మించి నన్ను దెస్తివా పిల్లగా నామాలు బెట్టిస్తివా
నాదండ నాకీయరా పిల్లగా నేబోతామావూరికి
పడమంట సిన్నదంట్రా పిల్లగా పాలపూల సాయిదంట్రా
పెట్టె నిండ సొమ్ములంటివి పిల్లగా పెట్టే వాళ్ళే లేరంటివీ ౹౹నమ్మించి౹౹
ఉత్తరాది సిన్నదంట్రా పిల్లగా ఉల్లిపూల సాయిదంట్రా
ఉత్తరంగ ఇల్లంటివి పిల్లగా ఉండేవాళ్ళు లేరంటివీ ౹౹నమ్మించి౹౹
దక్షిణాది సిన్నదంట్రా పిల్లగా దరణి పూల సాయిదంట్రా
దండెం నిండా కోకలంటివి పిల్లగా కట్టేవాళ్ళు లేరంటివీ ౹౹నమ్మించి౹౹

ఆస్థిపాస్తి, నగా నట్రా ఎర చూపి లొంగదీసుకోవడమే కాకుండా కాయలు, పండ్లు ఆశ చూపి మగువల్ని మోసం చేసే మగవాళ్లూ దర్శనమిస్తారు. మోసపోయే ఆడవాళ్ళూ కన్పిస్తారు. గడ్డికోసం పొలంలోకి వెళ్ళిన ఒక యువతి దోస పండ్లకు మోసపోయిన వైనాన్ని గమనించండి–

"దూరుజుడూ దుర్గం జూడుమావా
దున్నపోతులు బేరీ జూడూ
కందునూరీ కట్టాకిందామావా
కసువుకానీ నేనూ బోతి
దినుసు దినుసులు సీరా గట్టి మావా
ఈనె పూల్లల రయికా తొడగీ నాణెమైనా ససేన్లో మావా
దోసపండ్లకు మోసాపోతీ...."

**స్త్రీల నయవంచన:**

స్త్రీలను వంచించే పురుషులే కాదు, పురుషులను వంచించే స్త్రీలు కూడా జానపద గేయసాహిత్యంలో దర్శనమిస్తారు. కొందరు స్త్రీలు తమ అందాన్ని ఎరగా చూపి పురుషుల దగ్గర నుంచి రకరకాలైన వస్తువుల్ని తీసుకొని వాళ్ళని తమ చుట్టూ తిప్పించుకుంటారు. మరికొందరు తియ్యని మాటలతో పురుషుల్ని తమ ఆధీనంలో ఉంచుకొని సాధ్యమయినంత వరకు వాళ్ళదగ్గర నుంచి గుంజుకొని ఏదో ఒక వంక జెప్పి తప్పించుకొంటూ వాళ్ళని నిరాశపరిచే లేకపోలేదు. క్రింది గేయంలో ఒక యువకుని దగ్గర నుంచి డబ్బు తీసుకొని ఈరోజు, రేపు అని కాలాన్ని వెళ్ళబుచ్చే యువతిని చూడండి–

"ఎర్రకోకా కట్టుకొని
ఏటిగడ్డన పోయెదానా

ఎందుకు నీయందాము
ఏటిలో పడిదూకరాదా.
ఎంత దయలేనిదానీవే
నిన్నడిగీతే ఎనకా ముందర జూసేవా
నాయుడోరి తోటలోనే
నల్లదుమ్మా. పెట్టుకోడా
గునుగూ సెంగాయనాని
గుడ్డతడి కూసున్న దానా ॥ఎంత॥
రూపు రేఖా సూసినేను
రూపాయి పావలా సేతికిస్తే
రేపు మాపో తెలుపనా"

నీకు న్యాయమా నల్లాటిదానా అని మగవాడు ఎగతాళి చేస్తూ బాధపడ్డప్పుడు, ఆయువతి చెప్పిన సమాధానం ఎంత సొగసుగా ఉందో చూడండి–

నేను నల్లం గుండ నాని
నన్ను జూసీ నవ్వబోకు
నల్లజేను దున్ని సల్లితె
తెల్లజొన్నలు పండలేదా ॥ఎంత॥

మరో గేయంలో ఒక మగువ ఒక మగాడి పట్ల తన ఇష్టాన్ని వ్యక్తం చేసి, తనకు కావలసిన అరటిపండ్లు, జామపండ్లు, చీనీ పండ్లు, నిమ్మపండ్లను తెప్పించుకొంటుంది. ఒక రోజు ఆమె సజ్జ చేన్లో గడ్డి పెరుకుతుంటే అతడు రమ్మని పిలిచినపుడు ఆ తళుకు లాడి ఏవిధంగా తప్పించుకుంటుందో కింది పాటను చూస్తే అర్థమౌతుంది–

"ఆ పక్క వొత్తులూరు ఈ పక్క గొల్ల కం
నట్టా నడానా మలోళ్ళ బాయి కాడ
కంబూ చేనల్లో టెంకాయ తోపులోన
కసువూ పెరుకుతుంటే కన్ను సైగ నే జెస్తే
కాక చేసిందంటివే లంజా కారాదు పొమ్మంటివే
నువ్వెంత జారీలకత్తో లంజా నేనెంత ఎర్రివాణ్ణి
ఐదు అరటి పండ్లు ఐదు నిమ్మా పండ్లు

ఐదు గోయా పండ్లు ఐదు సీనీ పండ్లు

రెండిండ్ల సందున అందుకున్నట్లుగాదే

లంజా దొబ్బితిన్నట్లు గాదే ॥నువ్వెంత॥

జారి బండాకాడ జూరి గుండూ కాడ

బంగాకు నలపతా నీ మాట తలసుకుంటే నారా

వెలలేని దుఃఖ మొచ్చా

వెలలేని దుఃఖ మొచ్చా

కన్నీళ్లు కడవాయెనే"

**6.3.2.5. విటవిటీ శృంగారం:**

ఒకరి భర్త ఇంకొకరి భార్యతో గానీ, ఒకరి భార్య ఇంకొకరి భర్తతో గానీ జరిపే శృంగారాన్ని విటవిటి శృంగారం అంటారు. దీన్నే అక్రమ సంబంధం అని రంకుతనం అని కూడా అంటారు. వాళ్ళు లోకంలో ఉండవచ్చునేమో గానీ బొంకాడని వాళ్ళు మాత్రం ఉండరనే చెప్పవచ్చు. ఎంతటివారైనా ఎప్పుడో ఒకప్పుడు అబద్ధమాడాల్సి వస్తుంది. కానీ రంకుతనం నేర్చిన వాళ్ళు ఆడే అబద్ధాలు అన్నీ ఇన్నీ కావు. అసలు రంకుతనమే బొంకును కూడా నేర్పిస్తుంది. అందుకే రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా" అనే సామెత లోక ప్రసిద్ధమైంది. ఒక యువతి ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక శృంగార పరమైన గుర్తుతో తిరిగి వస్తుంది. అది ఏమిటని భర్త ప్రశ్నించినపుడు ఆమె చెప్పే సమాధానాలు ఎలా క్రింది గేయాన్ని చూస్తే తెలుస్తుంది.

**"భర్త:** రెడ్డోళ్ళింటికి బోయి 2 సార్లు మజ్జిగ దెస్తుంటే

ఒళ్లంతా దుమ్మూ లెక్కడిదే లవుడి

తందాన తానందాన పైన గందూడి –

**భార్య:** రెడ్డోళ్ళింటికి బోయి మజ్జిగ దెస్తుంటే

రెడ్డోళ్ళ దున్నపోతు కాల్గిరి రంకేసి దుమ్మాయా మొగుడా ॥ తందాన ॥

**భర్త:** అంగిడిదికి పోయి సెలవాలు దిస్తుంటే

మొగమంతా గిచ్చూ లెక్క దిలవుడి ॥ తందాన ॥

**భార్య:** అంగిడిదికి పోయి సెలవాలు దిస్తుంటే

తక్కెడ పుల్లొచ్చి తగిలెరా మొగుడా ॥ తందాన ॥

**భర్త:** అకిబోయి వాసాలు దెస్తుంటే

**భార్య:** కొప్పునిండా పూలెక్కడివి లవుడి ॥ తందాన ॥

బోయి వాసాలు దెస్తుంటే

కొమ్మ యిరిగి కొప్పునిండేర మొగుడా ॥ తందాన ॥

**భర్త:** అరవై రూపాలిచ్చి సీరన్నానే దెస్తే ఆ సీర సినగిందెట్లాగే లవుడి ॥ తందాన ॥

**భార్య:** ఆ సీర గట్టుకోని కులుపూకు నే బోతే ఊదర కర్రా దగిలి సినిగేర మొగుడా ॥ తందాన ॥

**భర్త:** మాటమాటకు నువ్వు బదులైన సెప్పేవు మంచం కిందుండేది వాడెవడె లవుడి ॥ తందాన ॥

**భార్య:** అల్లీ బిల్లీ గోడు బిల్లు కాదరుగోడు

పిల్లికి జ్వరమని నల్లిపాలకొచ్చుండాడు మొగుడా ॥ తందాన ॥"

అబద్ధమాడినా అతికినట్టుండాలి అంటారు. అబద్ధాలు కూడా కొంతవరకు కొందర్ని నమ్మించ వచ్చుగానీ అందర్ని జీవితాంతం నమ్మించలేరు. ఈ విషయమే పై గేయంలో కనిపిస్తుంది.

మరో గేయంలో ఒక యువతి తన భర్త పొందులేకనే కడుపు పండి బిడ్డను ప్రసవిస్తుంది. తన ప్రమేయం లేకుండా బిడ్డను ఎలా కన్నావని భర్త అడిగినపుడు, ఆరంకులాడి బొంకే బొంకులు వింటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది.

"అవి సెమానీ బాయికి 2 సార్లు నీళ్ళకునేబోతే

అవిశాకు తడదగిలి అంటైతి మొగుడా నీనేడ రంకాడితీ

నీరంకుతనం ఆపరా రాజాత్తి మొగుడా నేనేదరం కాడితీ

మునగ మాని బాయి నీళ్ళాక నేబోతే

మునగాకు తడదగిలి ముట్టైతి మొగుడా నేనేడ రంకాడితే ॥ నీరంకు ॥

కప్పలుండె బాయికి నీళ్ళకు నేబోతే

కప్పా తళ్ళుక్కు మానె కడుపాయమొగుడా నేనేదరంకాడితే ॥ నీరంకు ॥

చాపలుండె బాయికి నీళ్ళకు నేబోతే

దాపా తళుక్కుమనే చంద్రుడే బుట్టే నేనేడ రంకాడితే ॥ నీరంకు ॥"

రంకుతనం నేర్చిన వాళ్ళు బొంకులు బొంకడమే కాదు. తన రంకు మొగిడి కోసం కుటుంబం సర్వ నాశనం అయినా పరవాలేదని కోరుకొనేవాళ్ళు కూడా లోకంలో లేకపోలేదు. ఉదాహరణకు కింది గేయాన్ని చూడండి-

"ఏమి చేతునే యిలముని గౌరీ స్వామి రాకపోయా

వానికి నాకు రుణాల బంధం నేటితో సరిపోయా

నే మొక్కిన మొక్కులు సరిగ ఉంటే

మొగిని కండ్లూ రెండూ పోతే

పోయి కాడుండే పోలేరమ్మకు పొంగలిబెడతా ॥ఏమి॥

నా సంకలో వుండే సంటి బిడ్డకు సెవులరోగమొస్తే

కట్టకింద కాళెమ్మకు నేను జాతర చేయిస్తా ॥ఏమి॥

నాదండుపోయిన బావగారిద్దరు గుండు దగిలిసస్తే తిరుపతి గంగమ్మకు నేను జాతర సేయిస్తా ॥ఏమి॥"

**6.3.2.6. వియోగ శృంగారం:**

పరస్పర దర్శనస్పర్శనాదుల చేత పరమానంద జీవితాన్ని గడిపెడి నాయికా నాయకులు ఏదో కారణం వల్ల విడిపోయి పునస్సంయోగ వాంఛతో బాధపడటాన్ని విప్రలంభ శృంగారం అంటారు. దీన్నే విరహ శృంగారం, వియోగ శృంగారం అని కూడా అంటారు. ఈ విరహ శృంగారం శిష్ట సాహిత్యంలోనే కాదు జానపద సాహిత్యంలో కూడా పుష్కలంగా కన్పిస్తుంది.

రోడ్డు పనిని చేయించే ఒక మేస్త్రి కూలికి వచ్చిన ఒక యువతి మీద కన్ను వేస్తాడు. అందరి కన్నా ఆమెకు ఎక్కువగా కూలి డబ్బుల్ని ఇస్తాడు. అంతే కాదు మేడ కూడా కట్టిస్తానని నమ్మించి తిరునాళ్ళకు తీసుకెళతాడు. అక్కడ తన పబ్బాన్ని గడుపుకొని ఇదే వస్తానని చెప్పి వెళ్ళిపోతాడు. ప్రియుని కోసం ఎదురుచూస్తున్న ఆ విరహిణి బాధ కింది గేయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

"తూర్పు పడమర రోడ్డురానే రోడ్డు పనికి పోతిరా
అందరికీ మూడు దుడ్లు-నాకు నాల్నర దుడ్డురా
ఇల్లుకడతా నన్నడు. బిల్లిల్లు కడతానన్నడూ
ఇల్లు కట్లా పాడు. కట్లా-ఈదిలో వుండి పోతిరా"
కాయి దెస్తానన్నడూ-టెంకాయ దెస్తానన్నడూ
కాయిదేలా పాడుదేలా-కాసుకో నుండి పోతిరా
తేరుకూ రమ్మన్నడే- తిరనాలకూ రమ్మన్న
తేరులోనే నన్ను వదలి-తేటగా వుండి పోయరా
వానెమ్మ మాట వినడే నేమిమాట వినడే
ఎవరి మాటో వాడు వీనీ-వాడుదానాబోయరా"

మరో గేయంలో ఒక యువతి తనను విడిచి వెళ్ళిపోయిన ప్రియుని ధైర్య సాహసాల్ని తలచుకుంటూ పడే తపనను చూడండి-

"బాటంతో పసుపాయా బాలింత ముకమాయా
మనసుంటే పోనిద్దూనా నాసామి -
బుచ్చన్న మాటంటే
పసిబిడ్డాపాలు దాగడే నాసామి-
నిన్నంతా పొద్దుకాడా మోటా బావులకాడా
మనసంతా నీమోదరా నాసామి-
గుత్తీ బళ్ళారి దాకా
మొన్నంత పొదు డా

మనసంతా నీ 'విదరా నాసామి-

మోటా బావులడా

దున్నీనా దుక్కెల్లో... దూడమ్మా గుడికాడా

దుఃఖములే బడిగడితిరా నాసామి -

నవ్ బోయే దోవాలో.... నిలువూరా యొకటుంది

నీరూపు రాసిపోరా నాసామి-

రాకున్నా పోకున్నా రాదారి పడుకున్నా

గోరంత సీటంపారా నాసామి-"

పై గేయంలో చివరి రెండు చరణాలు ప్రియుడు మీద ప్రియురాలికి గల విరహానికి చక్కని ఉదాహరణలు.

## 6.4. నమూనా ప్రశ్నలు:

1) జానపద హాస్య గీతాలను గురించి వివరింపుము?

2) జానపద సాహిత్యంలో శృంగార గీతాల ప్రాధాన్యతను విశదీకరించండి?

## 6.5. ఆధార గ్రంథాలు:

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య. బి. రామరాజు

2. తెలుగు- కన్నడ జానపద గేయాలు - ఆర్.వి.యస్. సుందరం

3. చిత్తూరు జిల్లా జానపదగేయాలు సాంఘిక-సాంస్కృతిక పరిశీలన - ఆచార్య కె. మునిరత్నం.

**- డా॥ బలరామ్ కచ్చళ్ళ**

## పాఠం - 7

# జానపద కథా గేయాలు - లక్షణాలు - వర్గీకరణ

**7.0. లక్ష్యం:**

విద్యార్థులు జానపద కథా గేయాలు, లక్షణాలు మరియు వర్గీకరణ గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**

**7.1. కథా గేయం-నిర్వచనం**

**7.2. కథా గేయాల లక్షణాలు**

**7.3. నమూనా ప్రశ్నలు**

**7.4. ఆధార గ్రంథాలు**

మౌఖిక జానపద విజ్ఞానంలో మన దృష్టిని ఆకర్షింపచేసేది జానపద కవిత్వం. 'జానపద' అనే శబ్దం వినపడగానే ఆంధ్రులు ఆలోచించేది గేయాలను గురించే. ఆ తరువాత వారి మనస్సుకు నచ్చేది రామాయణపు పాటలు, భారతపు పాటలు, వీర గాథలు. వాగ్రూపమైన మౌఖిక జాపద విజ్ఞానంలోని ప్రధాన శాఖలలో జానపద గేయం, జానపద కథా గేయాలు ప్రధానమైనవి.

గేయం నాతి దీర్ఘము, భావ కవితా రూపము, కథా విరహితము, కథా సహిత గేయాలను కథా గేయాలంటారు. గేయం, కథా గేయం రెండూ గేయ రూపంలోనే వున్నాయి. కాబట్టి రెండింటినీ కలిపి గేయమనే ఎందుకు అనకూడదనే సందేహం కలగవచ్చు. కొంతమంది కవులు ఈవిధంగానే 'గేయ' శబ్దం గేయానికి, కథా గేయానికి వర్తించేలా రాశారు. సమస్త మానవ జాతిని గురించి సూచించేటప్పుడు "Men" అనే పదాన్ని వాడుతున్నాం. ప్రత్యేకంగా స్త్రీలను గురించి చెప్పేటప్పుడు "Woman" పురుషులకు గురించి చెప్పేటప్పుడు 'Man' అని వాడటం కూడా ఇలాంటిదే. కథా గేయం (Narrative Song) గేయమే, అయినా దానిని ప్రత్యేకించి చెప్పాలంటూ Encyclopeadia Britannica ఇలా అంటుంది. "Ballads are a variety of folk song; but they are sufficient by a group in themsevles to be classed separately."

కథా గేయాల నుంచి గేయాలను, వేరు చేసే గుణాలలో ముఖ్యమైంది. ఆత్మాశ్రయ ధోరణి లేక భావనిష్ఠగుణం. వీటిలో కథనం వుండదు. జానపద కవిత్వంలో గేయం ఒక ముఖమైతే కథా గేయం మరొక ముఖం. కానీ ఇవి రెండూ ఎడముఖం, పెడముఖంలా ఒకదానితో ఒకటి సంబంధం లేనివి కావు. ఈశ్వరుడే అర్ధనారీశ్వరుడయినట్లుగా గేయమే కథా గేయమూ అవుతుంది. గేయాలలో భావాంశాలు (Psychemes) ప్రధానమైతే, కథా గేయాలలో కథాంశాలు (Narrative Units) ప్రధానంగా వుంటాయి.

### 7.1. కథా గేయం-నిర్వచనం:

ఆంగ్లంలో బాలెడ్ (Balled), ఫోక్ ఎపిక్ (Folkepic), నెరటివ్ పోయమ్ (Narrative Poem) మొదలైన పదాలు వాడుకలో వున్నాయి. బాలెడ్ అనే పదం ల్యాటిన్ నుండి వచ్చిన పదం, ఫ్రెంచ్ భాషలో జర్మన్‌లో (Ballade) అని, రష్యన్

భాషలో (Bylinx) అని వ్యవహరించేవారు. వీటిని సమనార్థక పదాలుగా చెప్పవచ్చు. బ్యాలెడ్ లక్షణాలను ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వివరించారు. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ప్రకారం "చిన్న చిన్న పద్యాలలో జనప్రియ కథను సరళంగా, శక్తివంతంగా చెప్పే కావ్యమే బ్యాలెడ్. ఒకప్పుడు నృత్య గీతానికి మాత్రమే బ్యాలడ్డనీ పేరు ఉండేది. తరువాత ఆంగ్లంలో అన్ని రకాల గీతాల కన్నా బాలెడ్డనే పేరుపెట్టడం జరిగింది. ఈ విధంగా బ్యాలడ్ అనే పదం వలన ఏర్పడిన తికమకలను తొలగించేందుకు అనేక మంది విద్వాంసులు కథా గేయం (Narrative Poem or Song) అనే పదాన్నే ఎక్కువగా వాడారు. బ్యాలెడ్డును ఏ అర్థంలో చూచినా అది కథా గేయం మాత్రమే అవుతుంది. గేయగాథ (నాయని కృష్ణ కుమారి 1977) అన్నది కథా గేయానికి మరోపేరు. "గాథ" అన్నది తప్పు దారి పట్టించే పదం కాబట్టి గేయ కథ లేక కథా గేయం అనేదే సమంజసమైన పేరుగా కనిపిస్తుంది. డా॥ కృష్ణకుమారి గారు తన సిద్ధాంత గ్రంథంలో "కథా గీతం" అనే పేరును ఎక్కువ సార్లు వాడారు. "వీర రస ప్రధానమగు కథను చెప్పుచూ, సంచార గాయక బిక్షువులచే వాడబడు సరళ కథాగాయమే వీరగాథ (తంగిరాల సుబ్బారావు 1972) అనే నిర్వచనం అన్ని కథా గేయాలకు వర్తించదు.

"వాగ్రూపమైన సంప్రదాయం కలిగి, తరతరాలుగా అనేక పాఠాంతరాలతో ప్రచారం పొంది, సామూహిక వికాసం కలిగిన కథా గేయాలే జానపద కథా గేయాలు".

కథా గేయాలలో కథ ప్రధానం అయినా వీటికి గేయాల భావగీతాత్మక (Lyric) లక్షణం వుంటుంది.

నిర్దిష్టమైన కవి ఎవరూ లేకపోవడం గేయాలకు లాగానే కథా గేయాలకు ఉన్న లక్షణం. ఇవేకాక మరికొన్ని లక్షణాలను గురించి బ్లిప్ పెర్రీ అనే విద్వాంసుడు క్రోడికరించి చెప్పాడు.

## 7.2. కథా గేయాల లక్షణాలు:

1. గేయరూపం
2. ఆఖ్యాన రూపం
3. ఆశు కవిత
4. వాగ్రూప ప్రచారం, సంప్రదాయం
5. వస్తు నిష్ఠ
6. వారానువర్తనాలు
7. అనితర సాధ్యమైనవి.
8. వస్తుధైకత
9. వ్యంగ్యం
10. ఓటమి.

### 1. గేయరూపం:

గేయ రూపంలో ఉండడం కథా గేయాల మొదటి లక్షణం. ఇందులో సరళమైన ఛందస్సు, పల్లవి, గానయోగ్యత అనేవి దీని ఉపలక్షణాలు.

**2. ఆఖ్యాన రూపం:**

ఆఖ్యాన రూపంగా ఉన్న ఈ లక్షణానికి నియమితమైన పరిమాణం, యథార్థ సంఘటనా జన్యత్వం, దేశీయ ఇతివృత్తం, నాయకా భేదత, వీర రస ప్రాధాన్యత, కథా సారళ్యం, హఠాతీ ప్రారంభత్వం, సంభాషణా సహితత్వం, గద్య రాహిత్యల, విషాదాంతం అభివర్ధిత పునరుక్తి మొదలైనవి ఉపలక్షణాలు.

**3. ఆశు కవిత:**

గాయక భిక్షువుల ఆశు కవిత (అప్పటికప్పుడు చెప్పునది) గా జనించిన ఈ లక్షణానికి ఉప లక్షణం కవి అప్రధానుడుగా వుండడం.

**4. వాగ్రూప ప్రచారం, సంప్రదాయం:**

వాగ్రూపమైన ప్రచారం, వాగ్రూప సంప్రదాయమైన ఈ లక్షణానికి ఉపలక్షణం జనప్రియత్వం.

**5. వస్తునిష్ఠ:**

కథా గేయాలు వస్తునిష్ఠ Objective Poetry కవిత్వానికి ఉదాహరణలు.

**6. వారానువర్తనాలు:**

జానపద కథా గేయాల భాష, భావం సరళంగా ఉంటాయి. కొన్ని పదాలు, వర్ణనలు పునరుక్తమవుతాయి. వీటిని వారానువర్తనాలు అంటారు.

**7. అనితర సాధ్యమైనవి:**

కథా గేయాలు ఒక్క కవి రాసినవి కావు. ప్రజలలో సహజంగా జనించినవి. అనితర సాధ్యంగా ఉండడం కథా గేయాల ఏడవ లక్షణం.

**8. వసుధైకత (Unique Character):**

ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలలో కనిపించే కథా గేయాలలో ఏకసూత్రత ఉంటుంది. వసుధైక కుటుంబాన్ని నిరూపించే ఈ అద్వితీయ గుణం కథా గేయాల ఎనిమిదవ లక్షణం.

**9. వ్యంగ్యం:**

కథా గేయాలు నీతిని వాచ్యంగా చెప్పవు. వ్యంగ్యంగా చెబుతాయి. విధి బలీయమని బోధిస్తాయి. ఇది తొమ్మిదవ లక్షణం.

**10. ఓటమి:**

ప్రతి జీవితానికీ చివర ఓటమి ఉందనే విషాద విషయాన్ని కథా గేయాలు ప్రతి ధ్వనిస్తుంటాయి. ఇది పదవ లక్షణం.

పై పది లక్షణాలేకాక కథా గేయాలకు మరికొన్ని లక్షణాలు కలవు. వీటిలో ఎక్కువగా వీరరస ప్రధానాలు. వీరం తరువాత కరుణ రసాత్మకమైనవి, అద్భుతరసమైనవి.

వీరుడు తల్లిదండ్రులకు ఆలస్యంగా పుట్టడం ఆట పాటలలో అతను అమిత శౌర్యాన్ని ప్రదర్శించడం కథా గేయాలలో కనిపిస్తుంటాయి. అలంకారాలలో సరైన ఉపమలు, భాషలో కూడా సారళ్యం గోచరమవుతుంది. జానపదులు వాడేది సరళ

దేశీయ భాష. సామెతలు నుడికారాలు సమృద్ధిగా ఉంటాయి. నిఘంటువుల కెక్కని దేశ్యపదాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వైరి సమాసాలు, అన్యదేశాలు ఎన్నో ఉంటాయి.

కథా గేయాల ఛందస్సు లక్షణ గ్రంథాల ననుసరించేది కాదు. గేయాలను గానం చేసేటప్పుడు రాగాలు సంకీర్ణంగా ఉంటాయి. ఒక పాటను అందరూ ఒకే విధంగా పాడాలని లేదు. ఈ విధంగా కథా గేయాలను గురించి చెప్పే లక్షణాలలో సార్వత్రికంగా మనకు కనిపించేవి ఐదు.

1) ఇది కథాఖ్యానమై ఉంటుంది.

2) పాట రూపంలో వుంటుంది.

3) జనపదీయమై ఉంటుంది.

4) ఒక ముఖ్యమైన సంఘటన మీద కథాగేయం కేంద్రీకృతమై వుంటుంది.

5) ఇది వ్యక్త్యతీతమై ఉంటుంది.

సామాన్యంగా ఆఖ్యానాల్లో కనిపించే క్రియ (Action), పాత్రలు (Characters), సంయోజనం (Setting), కథా వస్తువు (Theme) అనే నాలుగింటిలో క్రియకు కథా గేయాలలో ఎక్కువ ప్రాధాన్యం వుంటుంది.

కథా గేయాలు ఎప్పుడు అవతరించాయి? ఎప్పుడు వికాసం చెందాయి అన్నది చెప్పడం చాలా కష్టం. ప్రాథమిక రూపమైన భావగీతానికి కథా కథనం చేరి కథాగేయాలు పుట్టివుండవచ్చు. ఏమైనా జానపద సాహిత్య రూపాలు గ్రంథస్థ సాహిత్య రూపాలకంటే ముందు అవతరించాయనడంలో సందేహం లేదు. వీటిలో కనిపిచే సరళమైన ఛందస్సు, ప్రాచీన మానవుని భావ పరంపర, సంప్రదాయాలు వీటి ప్రాచీనతను నిరూపిస్తున్నాయి. క్రీస్తు పూర్వం కొన్ని వేల సంవత్సరాలకు చెందిన వేదాలలోనే కథా గేయాలకు బీజాలున్నాయి. రామాయణ, మహాభారతాల రచనకు జానపద కథా గేయాలే ఆధారమనే అభిప్రాయంలో ఎంతవరకు నిజం ఉందనేది పరిశీలించవలసి వుంటుంది. ప్రాచీన సంస్కృతులై గ్రీకు, లాటిన్, జర్మన్, హీబ్రూ, చైనా సంస్కృతులలో కూడా కథా గేయాలు పుట్టి ప్రచారం పొందాయి.

గేయం కంటే నృత్యం ప్రాచీనమైనది. అతి ప్రాచీన కాలంలో జానపద సమాజంలో ప్రచలితమై ఉండిన నృత్య సంప్రదాయ అనుబంధంగా కథా గేయాలు ఆశువుగా అవతరించాయని ఒక ఊహ. మధ్యయుగాలలోనే కాక ఇటీవల కాలంలో కూడా కథా గేయాల పుట్టుకను గురించి కొందరు చర్చించడం జరిగింది. గాథాకారులు ప్రయత్న పూర్వకంగా వీటిని రచించారని కొందరి కథనం. ప్రాచీన మానవుని వృత్త గీతాలు భావాత్మకాలై, చిన్నవిగా ఉండి ఉంటాయి గాని కథా కథనంతో కూడిన పెద్ద పాటల పుట్టడం స్వభావ విరుద్ధమనే అభిప్రాయం వుంది. దీనిని బట్టి కథా గేయాలకు బీజప్రాయమైనవి చాలా ప్రాచీన కాలంలోనే పుట్టి వుంటాయన్నది సమంజసమైన అభిప్రాయంగా చెప్పవచ్చు.

వృత్తి గాయకులు (Minstries) మధ్యయుగాలలో కథా గేయాలను రచించారనే అభిప్రాయాన్ని 'గమరి' ఖండిచారు. వృత్తి గాయకులు రచించినవి కథా గేయాలకు భిన్నమైనవని ప్రొఫెసర్ కిట్రిడ్జ్ మొదలైన వారి అభిప్రాయం. సాంప్రదాయకంగా ప్రజలలో ప్రచారంలో ఉన్న కథా గేయాలు ప్రజలు సృష్టించినవే అని చాలామంది అభిప్రాయం. వృత్తి గాయకులు రచించినవి సాంప్రదాయక కథా గేయాలు కావచ్చు గాని, జానపద కథా గేయాలు లేక జనప్రియ కథా గేయాలు కావు. కథా గేయాల చివర కొన్ని సందర్భాలలో రచయితల పేర్లు కనిపించడం వల్ల ఇవి వైయుక్తిక రచనలనే అభిప్రాయం వుంది. ఏమైనా కొన్ని

వైయుక్తిక రచనలే కావచ్చు. "అది ఒక్కరి రచనే అయినా, పలువురి రచన అయినా జనప్రియత్వం, సంప్రదాయం ఏర్పడి కథా గేయం సామూహిక సంపద అయిందంటే దానిని జానపద కథాగేయం అనవచ్చు.

కథా గేయం వికాసం చెందేటప్పుడు ఒక పద్ధతిలో ఇది జరుగుతుంది. దీనినే మహాకావ్య పద్ధతి లేక ఐతిహాసిక పద్ధతి (Epic Process) అంటారు. ఎవరైనా ఒక చిన్న కథను చెప్పినప్పుడు, ఆ కథను విన్న వారు పూర్తిగా వినకున్నా కథా సారాన్ని అర్థం చేసుకుంటారు. ఆ కథనే వాళ్ళు జానపదులకు చిరపరిచితాలైన మూలాంశాల (Motifs) సహాయంతో పునర్నిస్తారు. ఇలా కథ పెరిగి అనేక సన్నివేశాలతో కూడి కథా చక్రంగా పరిణమిస్తుంది. ఇతిహాసాలలో ఈ బృహత్ కథాగేయాలకు ఉండే పోలికను బట్టి కొందరు, వీటిని జానపద ఇతిహాసం అని, జానపద మహాకావ్యం అని పిలుస్తుంటారు.

కథా గేయాల పుట్టుకకు కారణాలను వెదకడం 'ఇసుమున్ తైలంబు తీయటమే. ఎందుకంటే వీటికి ఒక చరిత్ర అనేది లేదు. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే చరిత్రకు తగిన ఆధారాలు వీటిలో కనిపించవు. నిరంతరం మార్పు చెదుతూ వుండడమే జానపద సాహిత్యం లక్షణం. ప్రాచీన కాలంలో జరిగిన అనేక సంఘటనలు, నమ్మకాలు, మూలాంశాలు (Motifs) కథా గేయాల పుట్టుకకు కొన్ని కారణాలు. ప్రాచీన కాలంలో వేట ప్రధాన వృత్తిగా ఉన్నప్పుడు, వేటను గురించిన వృత్తాంతాన్ని తన వారికి లయబద్ధంగా ఆనాటి మానవుడు చెబుతున్నప్పుడే కథా గేయాల ప్రాదుర్భావం జరిగింది. తర్వాత కాలంలో ప్రాదేశికంగా జరిగిన చిన్న చిన్న పోట్లాటలు, యుద్ధాలు కథా గేయాల అవతరణకు కారణమయ్యాయి. సుదీర్ఘమైన కథా గేయాలకు కూడా అప్రధానమైన చిన్న చిన్న యుద్ధాలే ప్రేరణ ఇచ్చాయనేది గమనార్హం.

కథా గేయాల ఛందస్సును బట్టి, కాల ప్రమాణాన్ని బట్టి, గాయకులను బట్టి, వాద్యాలను బట్టి వాటిని అనేక విధాలుగా విభజించవచ్చు. కొన్ని కథా గేయాలు పది, పదిహేను నిముషాలలో ముగిసిపోతాయి. వీటిని లఘు కథా గేయాలు అంటారు. మామూలు కథా గేయాలు అనతి దీర్ఘాలు. కొన్ని బృహత్ప్రమాణం కలవి. వీటిని గేయ కథా చక్రాలని (Ballad Cycles) పిలుస్తారు. వీటినే జానపద మహా కావ్యాలు అని పిలవడం జరిగింది. జానపద గేయ సాహిత్యాన్ని విస్తృతంగా పరిశోధించి వివరించిన డా॥ రామరాజు గారు జానపద గేయాలను కథా గేయాలను వర్గీకరించడానికి కొన్ని పద్ధతులను సూచించారు.

1) వస్తువును బట్టి పౌరాణికాలు, చారిత్రకాలు, అస్పష్ట చారిత్రకాలు, మత సంబంధాలు, సాంఘికాలు మొదలైన భేదాలను గుర్తించవచ్చు.
2) రసానుగుణంగా శృంగార గేయాలు, అద్భుత గేయాలు, కరుణ రస గేయాలు మొదలైనవి ఏర్పడతాయి.
3) ఆలంబనాన్ని బట్టి స్త్రీ పాటలు, పురుషుల పాటలు, స్త్రీ పురుష ఉభయ సంబంధాలు అని ఏర్పడతాయి. కథా గేయాలకు డా॥ రామ రాజు గారి వర్గీకరణను అన్వయిస్తే ఈక్రింది విభాగాలు ఏర్పడతాయి.

అవి:
1. పౌరాణికాలు
2. చారిత్రకాలు
3. మత సంబంధ గేయాలు
4. పారమార్థికాలు
5. శృంగార గేయాలు

6. అద్భుత రస గేయాలు
7. కరుణ రస గేయాలు
8. హాస్య రస గేయాలు

గమరి తన "ది పాపులర్ బ్యాండ్" అనే గ్రంథంలో కథా గేయాలలోని విభాగాలను గురించి చర్చించాడు. పొడుపు కథా గేయాలు (Riddle Ballads) గమరి పేర్కొన్న కథా గేయ రూపాలలో ఉన్నాయి. గేయ రూపంలో ఉండే పొడుపు కథలు మనకు బాగా పరిచయమైనవే. కథా గేయ రూపంలో కూడా కొన్ని ఉన్నాయి. గృహ సంబంధమైన కలతలు మొదలైనవి కొన్ని కథా గేయాలకు వస్తువులు. వీటిని (Domestic Complications) అన్నాడు గమరి. కొన్ని కథా గేయాలలో రాక్షస వివాహం ప్రధానంగా ఉంటుంది. మానవాతీత శక్తులకు కథా గేయాల వస్తువులో ఉండే ప్రాముఖ్యం గమనించదగినది. ఇలాంటివి సూపర్ నేచురల్ బ్యాలడ్స్ (Supernatural Ballads) అనే పేరు కలిగి వున్నాయి. పరివర్తనాత్మక కథా గేయాలు (Transformational Ballads) మంత్ర తంత్రాలతో కూడి వుంటాయి. ఐతిహ్యాత్మక కథా గేయాలన్నవి (Legendary Ballads) మరో రూపం. యుద్ధ సంబంధ కథా గేయాలను కూడా గమరి పేర్కొన్నాడు. ఇవికాక, హాస్య ప్రధానమైనవి, సముద్ర కథనం కలవి, "జర్నలిస్టిక్ బాలడ్స్" మొదలైనవి గమరి చెప్పిన కొన్ని కథా గేయ రూపాలు.

పై విధంగా జానపద కథా గేయాలు, లక్షణాలు వాటి వర్గీకరణలను గురించిన వివరణ ఈ పాఠంలో వివరించడం జరిగింది.

### 7.3. నమూనా ప్రశ్నలు:

1. జానపద కథా గేయాలను నిర్వచించి, లక్షణాలను గురించి వివరించండి?
2. జానపద కథా గేయాలను వర్గీకరించండి?

### 7.4. ఆధార గ్రంథాలు


1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం.
2. తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు.
3. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి - నేదునూరి గంగాధరం.


**- డా॥ కె. లలిత కుమారి**

పాఠం - 8

# జానపద పౌరాణిక, అద్భుత, కరుణ రస కథా గేయాలు

**8.0. లక్ష్యం:**

విద్యార్థులు జానపద పౌరాణిక, అద్భుత మరియు కరుణ రస కథా గేయాల గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**

**8.1. పౌరాణిక గేయాలు**

**8.2. అద్భుత రస గేయాలు**

**8.3. కరుణ రస కథా గేయాలు**

**8.4. ఊర్మిళా దేవి నిద్ర**

**8.5. ధర్మరాజు జూదం**

**8.6. శ్రీకృష్ణుని జననం**

**8.7. బాలనాగమ్మ కథ**

**8.8. లక్ష్మమ్మ కథ**

**8.9. నమూనా ప్రశ్నలు**

**8.10. ఆధార గ్రంథాలు**

## 8.1. పౌరాణిక గేయాలు:

తెలుగులో పురాణాలు (Myths) గద్య రూపంలోనూ ఉన్నాయి. పద్య రూపంలోనూ ఉన్నాయి. తెలుగు వారికి సంబంధించినంత వరకు రామాయణ, మహా భారత భాగవతాలు జ్ఞాపకం వస్తాయి. పురాణాన్ని ఇటువంటి పరమితార్థంలో కాక, ఒక సమాజంలోని నమ్మకాలకు సంబంధించిన ఒక శాస్త్ర విషయంగా తీసుకుంటే అప్పుడు శైవ, వైష్ణవ సంబంధమైన గేయాలను కూడా పురాణాల జాబితాలోకి చేర్చవలసి వుంటుంది. ప్రాచీన కాలంలో ఎప్పుడో జరిగినవని ఒక సమాజంలోని ప్రజలు ప్రగాఢంగా విశ్వసించేవే పురాణాలు. వీటిలో అగ్ర స్థానం రామాయణానిది.

సీతారాములు ఆంధ్ర జానపదుల జీవితంలోనికి చొచ్చుకొని పోయారు. నలుగు పాట పాడినా, కలుపు పాటలల్లినా సీతారాములను తలచుకోకపోతే తెలుగువారికి తృప్తి ఉండదు. తెలుగులో అన్ని రకాల ప్రక్రియలలోను రామాయణ కథ ఉంది. చంపూ, ద్విపద, శతక, యక్షగాన, కీర్తనాదులలో సీతారాముల చరిత్రను తెలుగువారు వర్ణించారు.

జానపద కథా గేయాలలో రామాయణ గాథ ఎన్నో మార్పులకు లోనయింది. వాల్మీకి రామాయణంలో లేని ఎన్నో అంశాలు జానపద రామాయణాలలో కనిపిస్తాయి. దీనికి కారణం ఏమైవుండవచ్చుననే ఊహ కలిగినప్పుడు బహుశా వాల్మీకి కంటే ముందే రామాయణ కథా స్రవంతి భారతదేశంలో ప్రవహిస్తుండేదేమో అనిపిస్తుంది. వాల్మీకి కూడా తన కాలం నాటి జనప్రియ రామాయణ గాథలనే ఆధారంగా చేసుకుని మహాకావ్యాన్ని రాసివుంటాడు. నేడు జానపద రామాయణాల రూపంలో

కనిపించే కథా రూపం కొన్ని విదేశాలకు కూడా వ్యాపించింది. ఈ కారణాల వల్ల తెలుగులోను ఇతర భాషలలోను జానపదుల జీవనంలో ఒకటై ఉండే కథలోని అనేక మూలాంశాలు Mitifs చాలా ప్రాచీన కాలం నుండి జన జీవనంలో వేళ్ళూని స్థిర పడ్డాయనిపిస్తుంది.

తెలుగులోని జానపద గేయాలలో సీత జీవితంలోని వివిధ ముఖాలు ప్రదర్శించబడ్డాయి. అనేక రామాయణ గీతాలు సీత పేరుతోనే ఉన్నాయి. సీత సమర్త, సీత కళ్యాణం, సీత అప్పగింతలు, సీతమ్మ వారి అలుక, సీత చెర, సీత అగ్ని ప్రవేశం, సీతాదేవి వేవిళ్ళు మొదలైనవి కొన్ని పేర్లు మాత్రమే, సీత జననాన్ని గురించి ఆసక్తికరమైన అంశాలు జానపద కథా గేయాలలో లభిస్తాయి. ఇవేకాక రామాయణ కథను సంక్షిప్తంగా చెప్పే జానపద రామాయణాలు కొన్ని ఉన్నాయి. శారద రామాయణం, మోక్షగుండ రామాయణం, సంక్షేప రామాయణం, ధర్మపురి రామాయణం, రామకథా సుధార్ణవం, గుత్తెన దీవి రామాయణం, లంకా సారధి మొదలైనవి ఇలాంటివే వున్నాయి. రామాయణంలోని కొన్ని సంఘటనలను మాత్రం తీసుకొని వర్ణించే కథలు కూడా కొన్ని ఉన్నాయి. పుత్ర కామేష్టి, శ్రీరామ జననం, రాఘవ కళ్యాణం, సుగ్రీవ విజయం, లంకాయాగం, లక్ష్మణ దేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర, కుశలవుల యుద్ధము మొదలైనవి రామాయణంలోని కొన్ని ఘట్టాలను రసవత్తరంగా వర్ణిస్తాయి. కుశ లవ కుచ్చల చరిత్రలో సీతా పరిత్యాగానికి ఒక బలమైన కారణం కల్పించబడినది. చుప్పనాతి సన్యాసిని వేసంలో వచ్చి సీత చేత బలవంతంగా రావణుని చిత్రం వేయించడానికి ప్రయత్నిస్తుంది. సీత రావణుని గోరు మాత్రం చితించగా శూర్పణఖ చిత్రాన్ని పూర్తి చేసి, బ్రహ్మ చేత ప్రాణం పోయించి సీత పడకటింట్లో పెడుతుంది. అది రాముని కంటబడి సీత మీద అనుమానం రావడానికి కారణమవుతుంది. ఇలాంటి కల్పనలు కొన్ని విదేశీ రామాయణాల్లో కూడా కన్పిస్తాయి. లక్ష్మణుడు ఏడు గీతల్ని గీచి వాటిని దాట వద్దని సీతతో చెప్పడం, రావణుడు సీతను తాకకుండా భూమితో పాటు పెళ్ళగించుకొని పోవటం మొదలైనవి జానపదుల కల్పనలు, ఊర్మిళా దేవికి జానపద గేయాలలో పవిత్ర స్థానం కన్పిస్తుంది. సీత అడవులలో కష్టాలను భరించినా, ఆమెకు భర్త సాహచర్యం లభించింది. కాని ఊర్మిళది మూగ వేదన, పెళ్ళి అయిన తరువాత ఆమె అనుభవించింది వియోగం మాత్రమే

రామాయణపు పాటలు చాలా వరకు స్త్రీల పాటలే. కలుపు పాటలో రూపంలో ఉండే రామాయణపు పాటలను గురించి డా॥ దోణప్ప గారు 'జానపద కళా సంపద' లో చక్కగా వివరించాడు. కోలాటం పాటల రూపంలో కూడా రామాయణం ఉంటుందని 'మాయలేడి పాట' నిరూపిస్తుంది.

భారత భాగవతాలకు సంబంధించిన పాటలు కూడా తెలుగులో అధిక సంఖ్యలోనే ఉన్నాయి. భారతానికి సంబంధించిన అనేక కథలు కథా గేయ రూపం దాల్చాయి. ధర్మరాజు జూదం, విరాట పర్వం, సుభద్ర కల, సుభద్రా కళ్యాణం, సుభద్ర సారె, నల చరిత్ర, దేవయాని చరిత్ర మొదలైనవి జానపదుల జీవితంలో భాగమై పోయాయి. ధర్మరాజు జూదం స్త్రీల నోళ్ళలో నానిన కథా గేయం, "రాజు చేతికి జిక్కె కనకమ్ము నేడు, ధర్మరాజుకు జిక్కె బలపమ్ము నేడు" అని సర్వస్వాన్ని కోల్పోయిన ధర్మరాజు స్థితిని వర్ణించారు. జానపదులు సూటియైన ఈటెల వంటి మాటలతో అనుకున్న దాన్ని చెప్పే శక్తి జానపదులకుంది. ద్రౌపది ఆత్మాభిమానాన్ని చెప్పాలంటే ఎక్కువ మాటలు అవసరం లేదు.

"రారాజు తన చేత వేసే పాచికలు, పాంచాలి తన కాళ్ళదోసె పాచికలు" అని నాటకీయంగా ద్రౌపది చిత్రాన్ని మన ముందుంచాడు రచయిత.

శ్రీకృష్ణ జననమనే పాటను ఒక్కసారైనా వినని తెలుగు వారు అరుదు!

'కస్తూరి రంగా రంగా నాయన్న కావేటి రంగా రంగా శ్రీ రంగ' రంగా రంగా నినుబాసి యెట్లు నేమరదుందురా. అని మొదలయ్యే ఈ కథా గేయంలో శ్రీకృష్ణుని వర్ణన అత్యంత మనోహరంగా ఉంది.

"వసుదేవ పుత్రుడమ్మా ఈ బిడ్డ వైకుంఠ వాసుడమ్మా నవనీత చోరుడమ్మా ఈ బిడ్డ నంద గోపాలుడమ్మా సీతకళత్రుడమ్మా ఈ బిడ్డ శ్రీ రామచంద్రుడమ్మా శిరము నా చింతమణి నా తండ్రి నాలుకను నక్షత్రము పండ్లను పరుసవేది భుజమందు శంబుచక్రములు గలవు వీపునా వింజామరా నా తండ్రి బొడ్డునా పారిజాతం అరికాళ్ళ తామరములు అన్నియు వున్నవిక నాదు తండ్రి నీ రూపు నీ చక్కనా ఆబ్రహ్మయేన్నాళ్ళు వ్రాసె తండ్రి. ఇలా!

బాలకృష్ణుని లీలలను తెలిపే మధుర గీతాలు ఆంధ్ర దేశమంతటా ప్రచారంలో ఉన్నాయి.

"గుమ్మడేడే గోపిదేవీ, గుమ్మడేడే కన్నతల్లి, గుమ్మడివి పొద చూపగదవే, అమ్మ గోపెమ్మా" అని అడిగే బాలకృష్ణుని రూపం జానపదులకందరికీ చిరపరిచితమే. రుక్మిణీ కళ్యాణము, రుక్మిణీ దేవి ముచ్చట, రుక్మిణీ దేవి సీమంతము మొదలైనవి రుక్మిణిని నాయికగా చేసుకొని రాసిన కథా గేయాలు.

రాముడు, కృష్ణుడు భారతీయులకు చాలా ప్రియతములైన నాయకులు. రామాయణ భారత భాగవతాలు వీరి చుట్టూ తిరుగుతాయి. విష్ణువుకు సంబంధించిన ఇతర పౌరాణిక గేయాలు కూడ ఉన్నాయి. వీటన్నిటికీ వెనుక ఉన్నది ఒక్కటే – అది నమ్మకం. ఒక సమాజం నమ్మకాన్ని పొందగలిగిన ప్రాచీన కథలే పురాణాలు. విష్ణువుకు సంబంధించిన ఇతర కథా గేయాలలో 'వరద రాజు పెళ్ళి పాట, చెంచీత కథ మొదలైనవి చేరుతాయి. కానీ వీటిలో ఎంతవరకు జానపద లక్షణాలు ఇమిడి ఉన్నాయన్న పరిశీలన అవసరం. ఈ కథా గేయాలకు సామాన్య ప్రజలలో పెద్ద ప్రచారమేమీ లేదు. ఇవి అజ్ఞాత కర్తృత్వాలు కూడా కాదు. రామాయణపు పాటలు, భారతపు పాటలు వంటివి కావివి. అందువల్ల వీటిలో చాలా వాటిని జానపద గేయానుకరణలుగా పేర్కొవచ్చు.

శివునికి సంబంధించిన కొన్ని కథా గేయాలు సామాన్య జనులలో కూడా ప్రచారం చెంది వున్నాయి. పాల్కురికి సోమనాధుని కాలం నాటికే శైవ సంబంధ గీతాలు కొన్ని జనప్రియమై ఉండేవని ఇంతకుముందే చెప్పటం జరిగింది. దక్షయజ్ఞం, మేనకా పార్వతీ సంవాదం, పార్వతీ కళ్యాణం, గంగా వివాహం. సవతుల కయ్యం, గంగా గౌరుల సంవాదం, భల్లాణ రాజుకథ మొదలైనవి శైవ సంబంధ గేయాలలో పేర్కొనదగినవి. వీటన్నిటిల్లో గంగా గౌరి సంవాదం కథ తెలుగునాట అత్యధిక ప్రచారం పొందింది. గౌరి తాను ముడిచిన తరువాత మిగిలిన పూలను గంగమ్మకు పంపగా గంగ తగువుకు వచ్చింది. ఇద్దరూ 'నా సరిదానవా'? అంటే 'నా సరిదానవా' అని తగువులాడుకున్నారు. గంగ అలిగివెళ్ళింది. ఆమె వెళ్ళిన తెల్లవారే గౌరమ్మకు చెంగు మాసింది. స్నాన పానాదులకు నీరు లేకపోగా గౌరి వీరభద్రుడ్ని పాలకావళ్ళు, నేతి కావళ్ళు పంపాడు. గౌరి వాటితో స్నానం చేసి చీమలు, దోమల చేత కుట్టించుకుంది. గౌరి అవమానం దిగమింగుకొని గంగమ్మ దగ్గరికి వెళ్ళే ఆ మహాతల్లి!

పచ్చి చేపలు దెచ్చి పందిళ్ళు వేసె
యెండు చేపలు దెచ్చి తోరణాలే గట్టె
పెద్ద చేపల పంచటరుగులా కట్టె
కప్ప జచ్చిన నీళ్ళు కళాపు జల్లె

గంగ–గౌరి ఇద్దరూ అచ్చమైన జానపద స్త్రీలుగా దర్శనమిస్తారే గాని, పరమేశ్వరుని సతీమణులుగా సాక్షాత్కరించరు. శైవ, వైష్ణవాలు మతాలు కావచ్చు కాని శైవ, వైష్ణవ సంబంధ గేయాలు మాత్రం ఆయా పాత్రలను సామాన్య జనులకు సాధ్యమైనంత దగ్గరగా తెచ్చి ఉంటాయి.

## 8.2. అద్భుత రస గేయాలు:

ఆశ్చర్యకరమైన సంఘటనలు అసంభవం కావచ్చు. కాని జానపదులకు అవి ఉల్లాసకరములు. మాంత్రికులు, మంత్రదండాలు, భూతద్దాలు, అంజనాలు అచ్చమైన జానపద కథన కళకు మూలమంత్రాలు, మూలాంశాలు అయ్యాయి. మానవాతీత శక్తులపైన మానవునికి వున్న నమ్మకం ఈనాటిది కాదు. అది హృదయంలో నుంచి తీసివేయలేనంతగా బలపడిపోయింది. అద్భుత రస గేయాలను గురించి చెబుతూ డా॥ రామరాజు గారిలా రాశారు “అసాధ్యమగు విషయము నాకాంక్షించి అఖ్ఖులు సాచునప్పుడు గాని ఏ మానవాతీతమగు శక్తియో, మంత్రమో యడ్డుపడి చిక్కును మంచు తెరవలె తొలగించిననెంత బాగుండునను కోరిక అసమంజసమైన దైనను మానవ సహజమే. ఇటువంటి కోరికను ఆధారము చేసికొని పాటమరించినచో లేదా వాని ననుసరించియే ఇట్టి కోరికలుద్భవించెనో తెలియదు కాని ఇట్టి యద్భుతములు గల కథలనేకములు ప్రతి భాషయందును గలవు.

అద్భుత రస ప్రధానమైన కథా గేయాలలో తెలుగు దేశంలోనే కాక కన్నడ దేశంలో కూడా బాగా ప్రచారం పొందిన కథ ‘బాలనాగమ్మ కథ’. మాయల ఫకీరు, కార్యవద్దిరాజు, చాకలి తిప్పడు మొదలైన ఇతర పాత్రలతో ఈ కథ రామాయణాన్ని కొంతవరకు పోలివుంది. మాయల ఫకీరు జానపదులకు మానవాతీత శక్తులపై ఉండే నమ్మకాలకు ప్రతీక. రావాణాసురునికి అతడు ప్రతి రూపం. బాలనాగమ్మ భర్త ఏడు గీతలు గీచిపోగా వాటిని దాటి బాలనాగమ్మ భిక్ష వేసింది. జంగము వాడు బాల నాగమ్మను రాగి బెత్తంతో నల్ల కుక్కగా చేశాడు. ఇవన్నీ జానపద మూలాంశాలే.

అద్భుత కథలలో పేర్కొనదగిన మరొక కథా గేయం కాంభోజరాజును గురించిన కథ. ఈ జంగం కథ క్రీస్తు పూర్వం ఒక వెయ్యి నాటిది కావచ్చునని, ఆ కాలంలో ఆంధ్రులు ఉత్తర హిందూ దేశంలో కాంభోజ దేశంలో ఉండేవారిని శ్రీ టేకుమళ్ళ కామేశ్వరరావు ఊహించారు. కాని ఇది ఊహ మాత్రమే. ఈ కథలో కాంభోజరాజు ‘కర్ణాకట భూమియందున శాంబరీ పురి పట్టణాన్ని పాలిస్తుండేవాడు. మామూలుగా జానపద కథలో లాగానే సంతానము లేకపోవడం, దాన ధర్మాలు చేసి, సత్రాలు, గుళ్ళు గోపురాలు కట్టించి, బావులు, చెరువులు త్రవ్వించి చివరికి రామలింగ స్వామిని ప్రతిష్ఠించి, కోనేరు త్రవ్వించి సంతాన ఫలాన్ని సంపాదించటం దీనిలో కూడా ఉంది. సంతానం కలిగినప్పటి నుంచి చెరాబంది రాజుకు పట్టాభిషేకం జరిగే వరకు అలౌకిక, అద్భుత అంశాలెన్నో ఈ కథలో వస్తాయి. పాతివ్రత్యా మహిమను తెలియజెప్పే మరో అద్భుత గేయం ‘ధర్మాంగద పాము పాట’. మంత్రతంత్రాలు, అద్భుత కావ్యాలు ఈ అన్ని కథా గేయాలలో సర్వసామాన్యంగా కనిపిస్తాయి. అశ్చర్యకరమైన వృత్తాంతాలపైన జానపదులకుండే మక్కువను ఈ గేయాలన్నీ నిరూపిస్తాయి.

**కథా గేయాల్లో కథాంశాలు:**

జానపద సాహిత్యంలో మూలాంశాలకు అధిక ప్రాధాన్యం వుంది. కథా గేయాల్లోని మూలాంశాలనే కథాంశాలనవచ్చు. (Narrative Units) కథనంలో ముఖ్యంగా చూడాల్సినవి ఇవే. జానపదులు వీటి ఆధారంతోనే కథల్లుతారు. మామూలుగా జరిగే వాటికి భిన్నమైనవే ఈ మూలాంశాలు – కావ్యంలో వక్రోక్తికి ఎంత ప్రాధాన్యం వుందో జానపద సాహిత్యంలో ఈ

'వక్రాంశాలకు' అంత ప్రాధాన్యం వుంది. ఉన్నది ఉన్నట్లుగా చెప్తే స్వారూప్యం ఉండదు. మామూలు అద్దంలో మనిషి ప్రతిబింబం కనిపిస్తుంది. కాని మాయల మారి అద్దంలో ఎక్కడో సుదూరాన వుండే మనిషి ప్రతిబింబం కనిపిస్తుంది. ఇలాంటి కథాంశాలు శ్రోతలలో ఆసక్తిని రేకెత్తిస్తాయి. కథ మళ్ళీ మళ్ళీ వినాలనేట్లు చేస్తాయి.

కథానాయకుడు తల్లిదండ్రులకు చాలా ఆలస్యంగా జన్మించడం మూలాంశం. సంతతి కోసం వ్రతాలు చేయడం. సప్త సంతాన ప్రతిష్ట చేయించడం, తీర్థ యాత్రలు, చివరికి తపస్సు చేయడం ఈ కథల్లో కనిపిస్తాయి. భగవంతుడో, ఏ మహా పురుషుడో ప్రత్యక్షమై పండో, విభూతో, మంత్ర బలమో ఇవ్వడం బాల నాగమ్మ, వీర నాగమ్మ, గాంధారి, శివకుమారుని కథల్లో కనిపిస్తుంది. చనిపోయిన వాళ్ళ కోరికలు తీరకుంటే వాళ్ళ చితి మండదని, కాకులు అన్నం ముట్టవని జానపదుల నమ్మకం. నల్ల తంగాళ్ కథలో ఈ విధంగా చితి మండక పోగా నల్ల తంగ అన్న నల్ల తంబి ఇలా అంటాడు:

ఏమమ్మా చెల్లె, నీకు ఇంత కోపమేల వచ్చె
కోపము నామీద కొంచెమన్న బెట్టవద్దు
మంటలు లేచెనేని మళ్ళీ పగ దీర్చెదను
నిప్పులేచి మండెనేని నీదు పగదీర్చెదను

అద్భుత రస గేయాలలో జానపద మూలాంశాలు అడుగడుక్కీ కనిపిస్తాయి. మానవాతీత శక్తులే వాటిలో ప్రాధాన్యం వహిస్తాయి. సంతాన ఫలాన్నారగించి సద్యోగర్భమై ఏడు గడియలకే సంతానం కలిగే వృత్తాంతాలు ఇందులో ఉన్నాయి. మాయజంగం ఇచ్చిన సంతాన విభూతి వల్ల తలారి రాముని

జుట్టులో తొమిది వందల మంది బుట్టినారు, నెత్తి గుడ్డదీసి నేలను గొడితేను మూడు వందలు ముందుగ వస్తారు. ఏడుగురి వో భార్యల చెంతాను నాలుగు మూడు వందలున్నారు. (బి. రామరాజు 1978 : 587). కాంభోజరాజు కథను రాస్తూ డా॥ రామరాజు గారు.

“అద్భుత కథలం దన్నింట మండెడు వివిధాద్భుతము లీ యొక్క కథయందున్నవి. ఇట్టి కథలందిది యాదిమ కథయైనచో దీని నుండియే కొన్ని కొన్ని యద్భుత లక్షణము లాయా కథలందు చేరినవని భావింపవచ్చును” అన్నారు. కాంభోజ రాజు పుత్ర సమేతంగా అరణ్యానికి వేటాడబోయినపుడు ముత్యం లాంటి చినుకు రాజు గారి వీపున బడగా వెలగపండంత బొబ్బఅయిందట.

## 8.3. కరుణ రస కథా గేయాలు:

కరుణ రస గేయాలనే కన్నీటి పాటలంటారు. సామాన్యంగా జానపద గేయాలన్నీ శృంగార ప్రధానాలనే తప్పు అభిప్రాయంవుంది. వలపు భావాలకు జానపదులెంత ప్రాముఖ్యం ఇస్తారో, శోకతప్త హృదయాలకూ వారంత ప్రాతినిధ్యం వహిస్తారు. కన్నీటి పాటలు ప్రపంచమంతటా ఉన్నాయి. ఆత్మీయులు చనిపోయినప్పుడు మరణ గీతాలను పాడుతారు. కాని తెలుగులో అటువంటివి చాలా అరుదు. కరుణ రస ప్రధానమైన కవిత్వం తెలుగులో కథా గేయాల రూపంలో కనిపిస్తుంది.

జానపద గేయాలలో అప్పగింతల పాటలను కన్నీటి పాటలలో మొట్టమొదట పాటలుగా చెప్పుకోవచ్చు. వీటిని కొందరు స్త్రీల పాటలలో చేరుస్తారు. వేడుక పాటలలో పెళ్ళి పాటలన్నీ చేరుతాయి కాని అప్పగింతల పాటలు మాత్రం ప్రత్యేకమైనవి. ఇవి సాందర్భిక గీతాలు. అంటే ఒక సందర్భం కోసం ప్రత్యేకంగా వెలువడ్డాయి. ఆ సందర్భం ఎట్టి కఠినాత్మునికైనా

కన్నీరు తెప్పించేది. ఈ క్రింది కోలారు జిల్లా కన్నీటి పాట అనేక విధాల ఆసక్తికరమైనది. ఒక విధంగా పుట్టింటి నుంచి కథలను ఇష్టపడని కూతురి ఆవేదనను ఇది తెలుపుతుంది. దానికి కారణాలనూ కూతురు చెప్తుంది. కాని అత్తవారింటికి కూతుర్ని పంపి తీరవలసిన పరిస్థితి తల్లిది. ఎందుకంటే కూతురు అత్తవారింటికి పోయి ఇంటికి కీర్తి తేవాలన్నది తల్లిదండ్రుల ఆకాంక్ష. గ్రామ జీవనంలో ఏయింటికాయిల్లు వేరుగా ఉండడం సాధ్యం కాదు. సహజంగానే సామాజిక ప్రజ్ఞ గ్రామీణులు ప్రతి ఒక్కరికీ అలవడుతుంది. అందువల్లనే ఈ పాటలో తల్లి 'ఇంటికి కీర్తి తేవమ్మా' అని మరుక్షణమే 'ఊరికి కీర్తి తేవమ్మా అంటుంది.

**తల్లి:** ఆరెకరాల్ చేనిస్తా అంటి మామిడి తోపిస్తా
పోయమ్మా నా కూతురా
పోయింటికి కీర్తి తేవమ్మా
ఆరెకరాల్ చేనిస్తా ఆవులప్పని నీ జతకిస్తా
పోయమ్మా నా కూతురా
పోయూరికి కీర్తి తేవమ్మా

**కూతురు:** పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుట లేదమ్మా
ఆరుమంది అన్న గార్లూ
కడగొట్టోడే గంగులప్ప
వానికి నాకు కాదమ్మా
పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుట లేదమ్మా
ఏడుమంది అక్క చెల్లెళ్ళు
కడగొట్టుది కమలమ్మ
దానికీ నాకు కాదమ్మా
పోనమ్మా నేను పోవమ్మా

**తల్లి:** నాగర బిళ్ళా నేనిస్తా
నాగులప్పను నీ జతకిస్తా
పోయమ్మా నా కూతురా
పోయింటికి కీర్తి తేవమ్మా

**కూతురు:** పోనమ్మా నేను పోనమ్మా
పోతే తిరుగుల లేదమ్మా

గుర్రాల గోపిరెడ్డి, మానంది రెడ్డి, నాగిరెడ్డి మొదలైన వారు విషాద నాయకులు. వీరిలో కొందరు ప్రభుత్వ విద్రోహులు సంఘ విద్రోహులు ఉండవచ్చు. కాని వారి చరిత్రలు ప్రజలకు పాటకట్టి పాడే ఊపునిచ్చాయి. చారిత్రకాలు, అస్పష్ట చారిత్రకాలు అయిన ఈ పాటల్లో చిన్నదైనా సరే కథ సూచ్యంగా ఉంటుంది.

కొన్ని దుర్ఘటనలు కూడా కన్నీటి పాటల ఆవిర్భావానికి కారణం అయ్యాయి. కొన్ని రైలు ప్రమాదాలు జానపదుల హృదయాలను కదిలించి కవిత్వం పుట్టడానికి కారణమైన సందర్భాలున్నాయి.

తెలుగులో స్మృతి కావ్యమనే ప్రక్రియ ఆధునిక కాలంలో వెలువడింది. జానపదులు కల్పించిన ఒక గేయం వీటన్నిటికంటే ముందే వెలువడింది. దీనిలోని భావాలు అపూర్వమైనవి. చిరకాలం హృదయంలో నిలిచేవి. ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకునే దంపతులలో భార్యా వియోగం సంభవించిన భర్త విషాదం గీతంగా రూపుదాల్చిన విధానం.

"సుద్ద బొందలకాడ
నీ సుద్ది దియ్యంగానె
సద్ది దిన్నట్టాయనే సిలకా
సిన్నారి సిలకా
ఇంతెల్ల మెడబాపెనే సిలకా
ఎంత పాపపు దేవుడే సిలకా
సమర్తయి నీవు సాటుకుకూకుంటె
సత్తెబామా వందురే సిలకా-సిన్నారి సిలకా
పనిద్దె నువ్వొక్క పందిట్ల గూసుంటె
పార్వతీ దేవందురే సిలకా-సిన్నారి సలకా
ముత్తైదువై నువొక్క మూలకు గూకుంటె
ముద్దబంతీవందురే సిలకా-సిన్నారి సిలకా
ఇద్దరము తెనేటి ఆ బొద్దు గిన్నెలా
ఒక్కనికి ఒనరాయెనే సిలకా-సిన్నారి సిలకా
ఇద్దరము కప్పేటి మద్దికాయల దుప్పటి
ఒక్కనికి ఒనరాయెనే సిలకా-సిన్నారి సిలకా

కన్నీటి పాటలకే మకుట ప్రాయమనదగినది క్రింది పాట. ఇది ఏ సహృదయుడినైనా కంటతడి పెట్టిస్తుంది. తనతో ఆడుతున్న స్నేహితుడు చనిపోయాడు. అప్పుడొక బాలిక విలపిస్తుంది. పని పిల్లలకు సహజమైన మృదు మధుర భావాలతో హృదయాన్ని కదిలించే విధంగా కల్పించబడిన గీతమిది.

బొంగురాలా డేటి బొగుడల్లా
యాడలెంకిన (వెదకిన) లేదే యెలదారి
చిర్రగోనె లాడేటి చింతల్లా

యాడలెంకిన లేడె యెలదారి

గోటిలాడేటి కోనల్లా

నిన్నమన మాడిన నిమ్మల్ల

మొన్నమన మాడిన మోతుకుల్ల

చెండూలు ఆడేటి చెలుకల్ల

నాయిరా జౌ నాయిరాజా యాడ

నాయిరాజా యాడ

నాయిరాజా యాడ

## 8.4. ఊర్మిళా దేవి నిద్ర:

ఊర్మిళను గురించిన ప్రస్తావన వాల్మీకి రామాయణంలో ఒక్కచోట మాత్రమే కనిపిస్తుంది. సీతను రాముడికిచ్చి పెళ్ళి చేసినప్పుడు సీత చెల్లెలయిన ఊర్మిళను లక్ష్మణుడికి ఇచ్చి పెళ్ళి చేశారు అని వాల్మీకి రామాయణంలో ఉంది. ఆ తరువాత ఊర్మిళ గురించి వాల్మీకం మనకేమీ చెప్పదు. వాల్మీకి వదిలేసిన ఊర్మిళని తెలుగు ఆడవాళ్ళు దగ్గరికి తీసుకున్నారు. ఆవిడని గురించి అందమైన కథలల్లారు. అడవికి రాముడితో పాటు సీత వెళ్ళిపోతుంటే ఊర్మిళ కూడా లక్ష్మణుడితో పాటు వెళ్తానంటుంది. కాని లక్ష్మణుడు అందుకు అంగీకరించలేదు. అలా ఒంటరిగా వదలి వేయబడ్డ ఊర్మిళా, అడవికి వెళ్ళిపోతున్న లక్ష్మణుడూ ఒక ఒప్పందం చేసుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం లక్ష్మణుడు తన నిద్రని ఊర్మిళకిస్తాడు. ఊర్మిళ తన మెలకువని లక్ష్మణుడికిస్తుంది. తన భర్త అడవిలో ఉన్న పద్నాలుగేళ్ళూ ఊర్మిళ నిద్రపోతుంది. లక్ష్మణుడు ఆ పద్నాలుగేళ్ళూ పూర్తిగా మెలకువగానే ఉంటాడు. ఊర్మిళ భర్తృవిరహాన్ని అనుభవించకుండా, లక్ష్మణుడు తన భార్య జ్ఞాపకాన్ని మర్చిపోకుండా చమత్కారమైన ఊహ చేవారు తెలుగు ఆడవాళ్ళు.

స్త్రీల రామాయణపు పాటల నిర్మాణంలో ఓ ప్రత్యేకత ఉంది. అవి మన ఊళ్ళల్లో పెద్ద కుటుంబాల ఇళ్ళ నమూనాలో నిర్మించబడ్డాయి. ఆ ఇళ్ళలో మొదటి భాగంలో మగవాళ్ళే ఉంటారు. ఆడవాళ్ళు కనిపించరు. ఇంటి యజమాన్ని గానీ, సేవకులు గానీ, అక్కడుండే వాళ్ళందరూ మగవాళ్ళే, ఇంటి మధ్య భాగంలో ఆడవాళ్ళు, మగవాళ్ళూ సందర్భాన్ని బట్టి కలిసి కూర్చుంటారు, మాట్లాడుకుంటారు. ఇంటి వెనుక భాగంలోనూ, పెరట్లోనూ కేవలం ఆడవాళ్ళే ఉంటారు. అక్కడికి మగవాళ్ళెప్పుడూ వెళ్ళరు. చాలా అవసరమైనప్పుడు వాళ్ళు అక్కడికి వస్తున్నామని తెలియపరచి మగవాళ్ళు అక్కడికి వెళ్ళే సందర్భాలుండవచ్చు. కానీ ఇంటి వెనుక భాగమూ, పెరడూ పూర్తిగా ఆడవాళ్ళ సామ్రాజ్యం. అక్కడ ఆడవాళ్ళు చుట్టుప్రక్కల అమ్మలక్కలను పిలిచి, విశ్రాంతిగా కబుర్లు చెప్పుకోవచ్చు. పాటలు పాడుకోవచ్చు. వామన గుంటలు, వైకుంఠ పాళీలు ఆడుకోవచ్చు. ఇంటి మగ వాళ్ళతో వచ్చే కష్టాలు ఒకరికొకరు చెప్పుకోవచ్చు. వాళ్ళని నిరభ్యంతరంగా తిట్టిపోయ్యొచ్చు. ఊర్మిళాదేవి నిద్ర సరిగ్గా ఈ విధంగానే నిర్మించబడింది. పాట ప్రారంభంలో శ్రీరాముడి పొగడ్తతో మొదలౌతుంది.

శ్రీరామ భూపాలుడూ పట్టాభిషిక్తుడై కొలువుండగా

భరత శతృఘ్నులపుడూ సౌమిత్రి వరుససేవలు సేయగా

మారుతాత్మజులప్పుడూ రాఘవుల జేరి పాదములొత్తుగా

సుగ్రీవుడా కొలువులో కూర్మితోనగ్రముడై

కొలువుండగా

సకల దేవతలు గొలువా ఉదయాన పుష్పవర్షము గురిసెను.

రామరాజ్యం అంతా సక్రమంగా వుంది అందరూ ఆనందిస్తున్నారు. ఆ సమయంలో సీతాదేవి వచ్చి రాముడి వైపు తిరిగి "రామచంద్రా, మనం అడవికి వెళ్తునపుడు, లక్ష్మణుడితో పాటు ఊర్మిళ కూడా వొస్తానంది". అందుకు లక్ష్మణుడు ఒప్పుకోలేదు. అప్పటి నుండి ఆవిడ నిద్రపోతోంది. లక్ష్మణుడిని వెళ్ళి ఆమెను లేపమనండి అని సవినయంగా మనవి చేస్తుంది. తాము అడవికి వెళ్ళిన రోజు మొదలుకొని ఊర్మిళ నిరంతరాయంగా నిద్రపోతోందని రాముడికి అప్పుడే తెలుస్తుంది. వెంటనే తమ్ముణ్ణి వాళ్ళావిడి దగ్గరికి పంపిస్తాడు. ముందు ఊర్మిళని నిద్రలేపి ఆవిడని సంతోషరచమని, రామాజ్ఞ శిరసావహించి లక్ష్మణుడు అప్పుడు భార్య దగ్గరికి వెళతాడు. నిద్రపోతున్న ఊర్మిళ చీర సవరించి, ఆవిడ పక్కనే కూర్చుంటాడు. ప్రేమగా ఆవిడతో ఈ విధంగా మాట్లాడతాడు.

కొమ్మ నీ ముద్దు మొగమూ సేవింప కోరినాడే చంద్రుడూ

అమృత ధారలు కురియగా పలుకవే ఆత్మచల్లన చేయవే

ఆ నిద్రలో తన గదిలోకి ఎవరో పర పురుషుడు ప్రవేశించాడనుకుంటుంది ఊర్మిళ.

తన్ను తామరచియున్న ఆ కొమ్మ తమకమున వణకదొడగే

ఆవిడ శరీరం భయంతో వణకడం మొదలవుతుంది.

ఇక్కడతో కథ ఒక్కసారిగా మారుతుంది. అంతవరకూ ప్రశాంతంగా వున్న వాతావరణం చెల్లాచెదరై పోతుంది. రామరాజ్య ధర్మం పటాపంచలై పోతుంది. ఊర్మిళ ఆ సందర్భంలో అనే మాటలు వింటే పరపురుషుడి చేత బలాత్కరించబడిన స్త్రీ ఎంత అసహాయ పరిస్థితిలో ఉంటుందో, తాను హింసకు గురై చివరికి అపరాధిలా అందరి ముందూ నిలబడాల్సి వస్తుందో బోధపడుతుంది.

ఊర్మిళ మొదట్లో ఆ ఆగంతక వ్యక్తిని గౌరవంగా 'అయ్యా మీరెవరయ్యా' అంటూ ప్రశ్నిస్తుంది. తరువాత తనకున్న మగతోడు చాలా బలమైనదని నిబ్బరంగా చెప్పి అతన్ని భయపెట్టచూస్తుంది. ఊర్మిళ తన మగతోడుగా చెప్పుకున్న వ్యక్తుల పేర్లు:

మాతండ్రి జనకరాజూ వింటె మిము ఆజ్ఞసేయక మానడూ

మాయక్క బావ విన్నా మీకిపుడు, ప్రాణముల హాని వచ్చూ

మాయక్క మరది విన్నా మిమ్మిపుడు బ్రతకనివ్వరు జగతిలో

ఊర్మిళ మొదట తన తండ్రి జనక మహారాజు పేరు చెబుతుంది. ఆ తరువాత శ్రీరాముడి పేరు చెబుతుంది ఆ తరువాతే తన భర్త పేరు చెబుతుంది. రాముడి పేరూ, తన భర్త పేరు తిన్నగా చెబుతోందా అంటే, చెప్పదు. మా అక్క మరిది అనీ, మా అక్క బావ అనీ గొప్పంగా చెబుతుంది. ఎందుకు? తెలుగు ఆడవాళ్ళు బావగారి పేరూ, భర్త పేరూ చెప్పకూడదు.

ఒక ప్రక్క తాను హింసపడే ప్రమాదం ఎదురుగుండా ఉన్నప్పటికీ కూడా తెలుగు కుటుంబాల ఆడవాళ్ళు ఎంత జాగ్రత్తగా మసలవలసిన నిర్బంధంలో ఉన్నారో ఈ పాట సున్నితమైన మాటల్లో, కొరడాతో కొట్టినంత చురుక్కుమనిపించేలాగ చెబుతుంది. ఆ మాటలవల్ల తనని హింసించబోయే ఆ దుర్మార్గుడు తగ్గే అవకాశం లేదని బోధపడ్డాక ఊర్మిళలో దైన్యం మొదలవుతుంది. ఆ మాటలు కూడా పనిచేయకపోతే ఊర్మిళ తన నిస్సహాయత్వాన్ని, అశక్తతనీ తలచుకుని బాధపడుతుంది.

హెచ్చయిన వంశానికీ అపకీర్తి వచ్చె నేనేమిసేతూ
కీర్తి గల ఇంట బుట్టి అపకీర్తి వచ్చె నేనేమి సేతూ

అంటే ఆ బాధ తన శరీరానికీ మనసుకీ కలుగబోయే దారుణమైన హింసగురించి కాదు. తాను మెట్టిన ఇంటికీ, పుట్టిన ఇంటికీ రాబోయే అపకీర్తి గురించి, స్త్రీ ఇలాంటి హింసకి గురి అయితే, లోకం ఆవిణ్ణే నిందిస్తుంది. అప్పటికీ, ఇప్పటికీ కూడా తెలుగు దేశపు స్థితి ఇదే. ఇక తనకున్న ఒకే ఒక్క అవకాశం ఆ దుర్మార్గుడికి మంచి బుద్ధి కలిగేలా చెయ్యటం.

ఒకడాలి కోరిగాదా ఇంద్రునికి ఒడలెల్ల
హీనమాయే
పరసతిని కోరిగాదా రావణుడు మూలముతో
హతమాయెనూ

ఇంద్రుడికి అహల్యా జారత్వంలో వచ్చిన శాపం ఊర్మిళకి తెలుసునంటే మనకి అర్థమౌతుంది. కాని రావణాసురుడు సీతని ఎత్తుకుపోవడం వల్ల రాముడి చేతిలో మరణించడం ఆవిడకి ఎలా తెలిసిందని తప్పు పట్టకూడదు. ఈ కథ పాట పాడే ఆడవాళ్ళకి తెలుసు. ఇక్కడ కావలసినదల్లా అతన గదిలోకి వచ్చిన ఆ ఆగంతకుడికి తెలివి తెచ్చుకోమని చెప్పడానికి అవసరమైన మాటలు పూర్వపరాల్నీ, కాలక్రమాన్నీ అతిక్రమించిన నిర్మాణదక్షత కవయిత్రిది. ఆ క్రమంలోనే

ఆడతోడా బుట్టరా మావంటి తల్లి లేదా మీకును అని, నీ తల్లీ, నీ చెల్లెలు కూడా నీలాంటి వాళ్ళ చేతిలో హింసకి గురయ్యే ప్రమాదం ఉంది సుమా! అని ఆ ఆగంతుకుడికి జ్ఞాపకం చేస్తుంది.

ఊర్మిళ ఇంకా నిద్రబోతోంది కదా, ఈ మాటలు ఎలా అనగలుగుతోందని ప్రశ్నించకూడదు. తాను స్త్రీగా పుట్టడం వలన వచ్చిన అది భౌతిక బలహీనతని నిద్రలో కూడా మరిచిపోవడానికి వీలులేని కుటుంబంలో నివసిస్తుంది. ఆమె మేలుకొని ఉండగా మళ్ళీ మళ్ళీ మననం చేసుకున్న ఈ మాటలు ఆవిడ అంతరంతరాల్లో గాఢంగా గూడు కట్టుకొని ఉన్నాయి. నిద్రలో కూడా ఆ మాటలే పైకి వచ్చాయి. అందుకనే నిద్రపోతున్న ఊర్మిళ నోటి వెంట ఈ మాటలు పలుక గలిగింది.

లక్ష్మణుడు తాను ఆమె భర్తనని చెప్పడానికి ప్రయత్నిస్తాడు. కాని ఆ మాట నేరుగా చెప్పలేదు. తాను పెరిగిన కుటుంబ మర్యాదలు ఆ మాట భార్యకి నేరుగా చెప్పనియ్యవు. అందుచేత డొంక తిరుగుడుగా చెప్పడానికి ప్రయత్నిస్తాడు. తను రాముడికి తమ్ముణ్ణనీ, సీతకి మరిదిననీ, జనకుడికి అల్లుణ్ణనీ, ఇంకా ఈ పాటలో ఊర్మిళ అంతరంగంలోని మరొక పొర వ్యక్తమౌతుంది. లక్ష్మణుడు అనే మాటలకి ప్రతిగా ఆమె అనే మాటలు వింటే మనకి బుర్ర తిరిగినట్లవుతుంది.

శ్రీరామ తమ్ముండనే అతడనగ సృష్టిలో నొకరు గలరా?
జనకునల్లుని గానటే? భూమిలో జనకులనగానెవ్వరు?
శతపత్రమున బుట్టినా చేడెరో సీతకూ మరిదిగానా?
సీతయనగానెవ్వరూ (చెప్పండీ) సృష్టిలో నేను యెరుగ

లక్ష్మణుడి మాటలూ, వాటికి ప్రతిగా ఊర్మిళ చెప్పిన ఎదురు మాటలూ, ఒకదాని తరువాత ఒకటి చదువరులను ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఎంతో మర్యాద గల కుటుంబంలో చాలా కట్టుబాట్ల మధ్య పుట్టిన శీలవతియైన స్త్రీ ఇలా బరితెగించి మాట్లాడుతుందా! అందులోనూ జనకుడంటే ఎవడు? రాముడంటే ఎవడు? సీతంటే ఎవతె అని తృణీకారంగా మాట్లాడదు.

ఒక్క క్షణం ఆలోచిస్తే, ఊర్మిళ కష్టాలకి కారణమైన వాళ్ళు ఎవరంటే తన కూతుర్ని జాగ్రత్తగా రక్షించగలడో లేదో అనే ఆలోచనైనా లేకుండా ఈ చేతగాని లక్ష్మణుడి చేతిలో పెట్టాడు ఊర్మిళ తండ్రి. అధికార స్థానంలో ఉన్న తన బావగారు రాముడు, తన భార్యని తనతో తీసుకెళ్తున్న పెద్ద మనిషి, తమ్ముడు బానిసలా తనతో పాటు అడవికి వచ్చేస్తుంటే, అయ్యో నీ భార్య ఏమయిపోతుంది, ఆమెను కూడా నీతో బాటు తీసుకొనిరా! అని అనలేక పోయాడు. సొంత అక్కగారు సీత కూడా తన చెల్లెలేమైపోతుందో అనే ఊహ లేకుండా సగర్వంగా భర్తతో అడవికి పరుగెత్తింది. ఊర్మిళను ఒక్కదాన్నీ వదిలిపెట్టవద్దని లక్ష్మణుడికీ, రాముడికీ చెప్పగల స్థానంలో ఉన్నది ఆవిడే. ఈవిధంగా కుటుంబంలో తనని కాపాడగల వాళ్ళందరూ తన మానానికి తనను వదిలేశారు. దీని బట్టి చూస్తే ఆ కుటుంబంలో ఊర్మిళ లోపల్లోపల ఎంత కుమిలిపోయి ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. ఈ సమిష్టి కుటుంబ రాజకీయాలు ఊర్మిళలో నరనరానా జీర్ణించుకుపోయాయి. వాళ్ళ మీద ఆవిడకి పట్టరాని కోపం, చెప్పరాని కక్షా ఉండడంలో ఆశ్చర్యం లేదు. కాని ఆ కోపమూ, ఆ కక్షా గాఢమైన నిద్రలో కలవరింతగానే పైకొస్తాయి. వాళ్ళు తెలియని నిద్రలో కలవరింత రూపంలోనో, మరేదో దెయ్యం పట్టిన కారణం వల్లనో, ఏదో ఒక ముసుగులో తప్ప వాళ్ళ నిజ వ్యక్తిత్వం బయటికి రావడానికి వీల్లేని సమాజంలో వాళ్ళున్నారు. హిస్టీరియా పేరుతో-దాని మాటునే సమిష్టి కుటుంబపు స్త్రీలు తనమీద అధికారం చెలాయించే వారందరినీ నోటికొచ్చినట్లు తిట్టడం మనం చూస్తూ వుంటాము. స్త్రీలలో ఉండే అలాంటి కక్షని, అలాంటి కోపాన్ని, ఊర్మిళా దేవి పాత్ర ద్వారా, ఆవిడ నిద్ర ముసుగులో పలికిన మాటలను మనం గమనించవచ్చు.

లక్ష్మణుడు చేసేదేమీ లేక హఠాత్తుగా ఆవిడకి మెలకువ వచ్చే మాటలు చెప్పడం మొదలుపెడతాడు. నిన్ను ఊర్మిళ అంటారు, కనీసం ఆ మాటకాదనకు అని ప్రాధేయపడతాడు. అడవిలో సీతాదేవిని రావణుసురుడు ఎత్తుకుపోయాడనీ, రాముడూ, తనూ యుద్ధం చేసి సీతను రక్షించామని చెబుతాడు. అలాంటి విపత్కరమైన సంఘటన గురించి హఠాత్తుగా చెప్తే ఆవిడ నిద్ర లేచి మామూలుగా మాట్లాడుతుందని లక్ష్మణుడి ఆలోచన, కానీ ఆ మాటలేవీ ఊర్మిళ మీద పని చెయ్యవు. అప్పుడు లక్ష్మణుడు దీనంగా, "నువ్వు నన్ను వదిలేస్తే నాకు లోకంలో అపకీర్తి వస్తుంది", అంటాడు. ఇది ఆ సమాజంలో ఆడవాళ్ళు అనే మాట. మొగుడు వదిలేస్తే పెళ్ళానికి అపకీర్తి వస్తుంది. మగవాడు హాయిగా ఇంకో పెళ్ళి చేసుకుంటాడు. కానీ ఇక్కడ పూర్తిగా వ్యతిరేకం. స్త్రీ వదిలేస్తే పురుషుడికి అపకీర్తి వచ్చే సమాజాన్ని కోరుకోగలిగిన స్వేచ్ఛను స్త్రీ కోరుకుంది.

లక్ష్మణుడు ఊర్మిళను ఇంకా ప్రాధేయపడతాడు. తాను ఆమె భర్తనని మళ్ళీ మళ్ళీ చెబుతాడు.

నిన్ను బాసినది మొదలూ ప్రాణసఖి నిద్ర
హారము లెరుగనే
నీవు లేవకయున్ననూ ఓ సఖి ప్రాణములు
నిలుపలేనే

స్త్రీలు తమ భర్తల దగ్గరనుండి వినాలని తపించే ప్రియమైన మాటలు ఇవే.

అప్పటికీ ఊర్మిళ కరుణించకపోతే లక్ష్మణుడు చివరికి ఏడుస్తూ తనని తాను చంపుకోవడానికి కత్తి తీస్తాడు. ఆ చప్పుడుకి ఊర్మిళ హఠాత్తుగా నిద్ర లేస్తుంది. లేచి భర్త కాళ్ళ మీద పడుతుంది. ఆత్మహత్య వీర పురుస లక్షణం కాదు. కాని ఊర్మిళా దేవి నిద్ర అనే గేయంలో లక్ష్మణుడు వీర పురుషుడు కాదు.

పాటలో నిద్ర మత్తులో ఉన్న ఊర్మిళ వేరు, నిద్ర మేల్కొన్న ఊర్మిళ వేరు. నిద్ర మేల్కొన్న ఊర్మిళ భార్య లాగ ప్రవర్తించాలి. అయినా ఆ ఊర్మిళ కూడా ఒక ప్రక్క తన భర్త మీద చూపించవలసిన గౌరవాన్ని చూపిస్తూనే తన కోపాన్ని వ్యక్తపరుస్తుంది. ఇప్పుడు చుట్టుప్రక్కల మూడో మనిషి ఎవ్వరూ లేరని, తన పడక గదిలో భర్తతో మాట్లాడుతోందని గమనించాలి. ఈ సందర్భంలో సమిష్టి కుటుంబంలోని స్త్రీలకు కూడా తమ భర్తలతో మాట్లాడటంలో కొంత స్వేచ్ఛ ఉందని అర్థమౌతుంది.

మా తండ్రి జనకరాజూ మిమ్మునమ్మి మరచి
కళ్యాణమిచ్చే
మానవంతల్లుడనుచూ తెలియకామదిని
ఉప్పొంగుచుండే
చిత్తమొక దిక్కునుంచీ సమయమున చిన్నబుత్తురు యింతులా

"మా తండ్రి జనకుడు తెలియక, మీరు చాలా పౌరుషం గల వారని నమ్మి మీకు నన్నిచ్చి పెళ్ళి చేసాడు. మీరేమో ఇంకొకళ్ళు మీద మనసు పెట్టి, నన్ను నలుగురిలో చిన్నబుచ్చారు" అని ఊర్మిళ స్పష్టంగా తన భారాన్ని చెప్తుంది. ఈ ఆరోపణలన్నీ లక్ష్మణుడు తలవంచుకొని వింటాడు. లోలోపల బాధపడతాడు. మళ్ళీ తనకి ఊర్మిళంటే ఎంత ప్రేమో ఆమె నిద్ర పోతున్నప్పుడన్న మాటలే మరోసారి అంటాడు. జరిగిన దానినంతటినీ కర్మపేర తోసేస్తూ తాము ఎప్పుడో పూర్వజన్మలో చేసిన పనికి ఇప్పుడు ఫలితం అనుభవించామంటాడు.

## లక్ష్మణ దేవర నవ్వు:

వేల్చేరు నారాయణరావు గారు రచించిన లక్ష్మణ దేవర నవ్వు అనేది జానపద కథా గేయం. నవ్వు ఒక యోగం, నవ్వకపోతే రోగం, నవ్వించుటే భోగం అని పెద్దలు చెప్పినట్లుగా ఈ లక్ష్మణ దేవర నవ్వు దాని వలన కలిగిన పర్యవసానాలు ఏమిటో ఈ గేయంలో తెలుసుకుందాం.

నవ్వు నాలుగందాల చేటన్నారు
అంటే నాలుగు విధాల అని అర్థం.

ఈ నాలుగు విధాలు ఏమైనా పాత తరం కుటుంబాలలో ఆడవాళ్ళు నవ్వడం తప్పుగా భావించేవారు. ముఖ్యంగా మగవాళ్ళతో మాట్లాడేటప్పుడు ఆడవాళ్ళు నవ్వితే వాటికి వెంటనే తప్పు అర్థాలు వస్తాయని పెద్ద వాళ్ళు ఆడపిల్లల్ని వాదించేవారు. కానీ నవ్వడం విషయంలో మొగవాళ్ళక్కూడా ఈ అదుపులు ఉన్నాయనీ సుమతీ శతకకారుడైన బద్దెన తెలియజేశాడు.

నవ్వకుమ సభలోపల
నవ్వకుమ తల్లిదండ్రి నాథులతోడనే
నవ్వకుమ పరసతితో
నవ్వకుమ విప్రవరుల నయమిది
సుమతీ

మొగవాళ్ళనుద్దేశించిన ఈ మాటకీ, ఆడవాళ్ళు నవ్వకూడదనే మాటకీ చిన్న తేడా ఉన్నట్లు కనిపిస్తుంది. ఆడవాళ్ళు నవ్వడం తప్పు. తప్పు అంటే ఆడవాళ్ళుగా వాళ్ళ శీలానికి కలిగే మచ్చ మగవాళ్ళు నవ్వకపోవడం నీతి. నీతి అంటే లౌకిక వ్యవహారాల్లో ఇబ్బందులు తెచ్చుకోకుండా తెలివితేటలుగా వ్యవహరించే పద్ధతి.

నవ్వు అనేది చాలా రకాలుగా ఉంటుంది. ఎవరితోనైనా కలిసి నవ్వడం, ఎవరినైనా చూపి స్నేహపూర్వకంగా నవ్వడం, వాళ్ళ పట్ల ఆకర్షితులై ఆ సంగతి సూచిస్తూ నవ్వడం, వాళ్ళని సంతోష పరచడానికి నవ్వడం, ఊరికే సరదాగా నవ్వడం, చమత్కారమైన సందర్భం గుర్తు వచ్చి నవ్వడం. ఇవన్నీ ఉత్సాహాన్నీ, మంచితనాన్నీ, ఆకర్షణనీ, అంతరంగాన్నీ తెలిపే నవ్వులు. మరొక రకం నవ్వు అవహేళన చేసే నవ్వు, ఈ రెండింటికీ మధ్యనున్న తేడా చెరిగిపోయిన సందర్భాన్ని విస్తారంగా చెప్పే పాట స్త్రీల రామాయణ పాటల్లో లక్ష్మణ దేవర నవ్వు.

ఈ పాట ఎక్కువ ప్రచారంలో ఉన్నట్టు కనిపించదు. మా అమ్మో, బామ్మో ఈ పాట పాడేది అని చెప్పిన వాళ్ళెవరూ లేరు. ఈ పాటకి ఆధారం ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు ప్రచురించిన స్త్రీల రామాయణపు పాటలు అనే పుస్తకంలో ఉన్న పాఠమే. ఈ పాట పేరు బాలా కొత్త రకంగా ఉంటుంది. దేవరలనే మాట తెలుగులో వాడుకలో లేని మాట కాదు. ఉదాహరణకి మనుచరిత్రలో ప్రవరుడి తల్లిదండ్రులను వర్ణిస్తూ, 'దేవియుందేవరవోలె' అన్నాడు పెద్దన, అంటే పార్వతీ పరమేశ్వరుల లాగా అని అర్థం. కాని, ఇక్కడ దేవర అంటే దేవుడు అనే అర్థం కాదు. దేవర న్యాయం అనేది మనకు తెలిసిన మాటే. అదేంటంటే భర్త వల్ల సంతానం కలగకపోతే అతని తోబుట్టువు ద్వారా సంతానం కనే న్యాయం. దీని గురించి మహాభారత కథ తెలిసిన వాళ్ళకి పరిచితమే. ఇక్కడ దేవర అనే మాటకి మహాభారతంలో లాగా భర్త యొక్క తోబుట్టువు అని అర్థం. లక్ష్మణుడికి ఈ మాట వాడటం స్త్రీల పాటల్లోనే వుంది. దీన్ని బట్టి స్త్రీల పాటల ద్వారా లక్ష్మణుడికి ప్రాధాన్యం ఇవ్వబడిందని తెలుస్తుంది.

ఇంతకీ ఈ పాట (గేయం) ఏమిటంటే లక్ష్మణుడు తన అన్నతో, అన్న భార్యతో అడవికి వెళ్ళేటప్పుడు ఊర్మిళా తానూ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందానికి సంబంధించిన ఊర్మిళ కథ మనం ఊర్మిళా దేవి నిద్ర పాటలో చూడవచ్చు. ఈ లక్ష్మణ దేవర నవ్వు ఆ ఒప్పందానికి సబంధించిన లక్ష్మణుడి కథ.

శ్రీరాముడు రావణ వధ అనంతరం ఆయోధ్యకు చేరుకోవడంతో కథ మొదలైంది. ఆరుబయట వెన్నెల్లో అఖిలాండ కోట బ్రహ్మాండ నాయకుడు, రాముడు కొలువు తీరతాడు. వేల సంఖ్యలో గద్దెలు ఏర్పాటు చేస్తారు. ఆ గద్దెల మీద విభీషణుడు మొదలైన లంకా వాసులు, సుగ్రీవుడు మొదలైన కిష్కింధాపురవాసులు, ఈశ్వరుడు, ఇంద్రాదులైన దేవతలు, వారితో పాటు అయోధ్యాపుర ప్రముఖులు అందరూ కూర్చున్నారు. సభ అంతా నిండుగా గంభీరంగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా లక్ష్మణుడు కిలకిలా నవ్వుతాడు. లక్ష్మణుడు అలా నవ్వే సరికి అందరూ విస్తుపోతారు. ఎవరికి తగినట్లు వారు ఆ నవ్వుకి వాళ్ళకి తోచిన అర్థం చెప్పుకుంటారు.

జాలరి వాళ్ళ అమ్మాయిని, గంగను పెళ్ళి చేసుకొనినెత్తి మీద పెట్టుకున్నానని లక్ష్మణుడు తనను చూసే నవ్వుతున్నాడని అనుకొని శివుడు తల వంచుకుంటాడు.

ఈశ్వరుడి పెళ్ళికి అందరితో పాటు తనూ వెళ్ళగా కాలు మడత పడి క్రింద పడినప్పుడు నడుము విరిగి, ఆ వొంగిన నడుముతోనే ఈ సభకి వచ్చినందుకు తననే చూసి నవ్వుతున్నాడు అని జాంబవంతుడనుకుంటాడు. అలా అనుకొని తలవంచుకుంటాడు. ఆ సభలో ఉన్న ఆదిశేషుడు ఈయన శ్రీ మహావిష్ణువుకి సముద్రంలో శయ్యగా ఉండి సేవ చేసిన వాడు.

కాని ఇప్పుడు విష్ణువుకి పగవాడైన శివునికి సేవకుడిగా ఈ సభకి వచ్చాడు. తనని చూసే లక్ష్మణుడు నవ్వుతున్నాడు అని అవమాన భారంతో ఆదిశేషుడు తలవంచుకుంటాడు.

ఆ సభలో ఉన్న ఇంకొక వ్యక్తి నీలుడు. నీలుడంటే సముద్రం మీద వారధి కట్టడంలో శ్రీరాముడికి తోడ్పడిన ప్రధాన నిర్మాత. అయితే ఈ నీలుడి గురించి తెలుగుదేశంలో ఒక కథ ఉంది. అతడు చిన్నవాడుగా ఉండగా ఇంట్లో ఉన్న అన్ని వస్తువులూ తీసుకెళ్ళి నీళ్ళల్లో పారేసేవాడట. అవి మునిగిపోతే వెతికి తెచ్చుకోవడానికి, ఇంట్లో వాళ్ళు నానాతాపత్రయాలు పడేవారట. ఒకరోజున ఈ అబ్బాయి తన తండ్రి పూజా సామాగ్రిని తీసుకెళ్ళి నీళ్ళల్లో పాడేశాడట. దాంతో ఆ తండ్రి, ఇక నుండి నీవు నీళ్ళల్లో పారవేసిన ఏ వస్తువైనా మునగకుండా తేలుగాక అని వరమిచ్చాడట. శ్రీరాముడు వారధి కట్టించే సమయంలో కోతులు, కొండలనన్నిటినీ పట్టుకువచ్చి సముద్రంలో పడేస్తుంటే అవి మునిగిపోయేవి. ఏం చేయాలో తోచక అందరూ అయోమయంలో ఉంటే నీలుడు వచ్చి తండ్రి తనకిచ్చిన వరం ఈ అవసరానికి పనికొస్తుందనీ, తన చేతుల మీదుగా రాళ్ళను సముద్రంలో వేస్తే అవి మునగవనీ, తేలతాయనీ ఆ రకంగా వారధి తేలికగా కట్టొచ్చని ఉపాయం చెప్తాడు. ఆ తరువాత వరుసగా కోతులు కొండరాళ్ళు పట్టుకురావడం, నీలుడికి ఇవ్వడం, నీలుడు వాటిని సముద్రంలో వేసి వారధి కట్టడం జరుగుతుంది. అయితే స్త్రీల పాటల్లో (గేయాల్లో) ఈ కథ మరొక విధంగా ఉంది. నీలుడు తండ్రి పూజా ద్రవ్యాలని నీళ్ళల్లో పడేసి, అవి తేలకుండా నీళ్ళల్లో నొక్కిపట్టేవాడట. అందుకని తండ్రికి కోపం వచ్చి. నువ్వు నీళ్ళల్లో పడేసే ఏ వస్తూవూ కూడా ఇక మునగకుండా ఉండుగాక అని శపిస్తాడు. ఆ మాట నీలుడు రాముడికి చెప్పలేదు.

తండ్రి ఇచ్చిన శాపాన్ని వరంగా మార్చి అబద్ధంగా చెప్పాడు నీలుడు. ఆ సంగతి తెలిసి లక్ష్మణుడు నవ్వుతున్నాడని, అవమానపడి నీలుడు తలవంచుకుంటాడు. ఆ సభలో ఉన్న అంగధుడు లక్ష్మణుడు తనను చూసే నవ్వుతున్నాడనుకుంటాడు. తన తండ్రిని చంపిన రామునికి, తాను ఈ వేళ సేవకుడయ్యాడు, అది ఎంత అవమానం అలాగే సుగ్రీవుడు కూడా తన అన్న వాలిని అన్యాయంగా రాముని చేత చంపించి, ఆ అన్న భార్యని తన భార్యగా చేసుకుని కన్నూమన్నూ, కానకుండా ప్రవర్తిస్తున్నాడు ఈ సుగ్రీవుడు, తనను చూసే లక్ష్మణుడు నవ్వుతున్నాడని తల వంచుకుంటాడు. విభీషణుడు దాచుకున్న రహస్యం కూడా ఒకటుంది. తన అన్న ఆయువు పట్ల రహస్యంగా రాముడికి చెప్తాడు విభీషణుడు. ఆ రకంగా తన అన్న (రావణుడు) ని చంపించి లంకా రాజ్యానికి రాజయ్యాడని లక్ష్మణుడికి తెలుసు. హనుమంతుడంత బలవంతుడు, గొప్పవాడు, ఒక చిన్న వాడు ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రానికి దొరికి పోయాడు. ఆ అవమానపు కథ లక్ష్మణుడికి తెలుసు. అంచేత తన్ను చూసే లక్ష్మణుడు నవ్వుతున్నాడని తలవంచుకుంటాడు.

ఇకపోతే సీత, లక్ష్మణుడు తనను గురించే నవ్వుతున్నాడనుకునే సందర్భంలో

కారడవిలో దశకంఠుని చేత ।
పట్టుబడ్డట్టి యో సతి తొడలమీద ॥
పెట్టుకొనియున్నాడు సృష్టీశ్వరుడనుచు ।
ఈ అతివయోరు నెలలు బాసి యీ రాజు ॥
ప్రాణములు యెట్టుండెయో కోమలాంగీ ।
ఆడరాని మాటలాడి లెవనుచూ ॥
ఆడవారి మాట నమ్మరాదనుచు ।

తలచి లక్ష్మణ నేడు తానవ్వెననుచు ॥

ధాతిసుత కొలువులో తలవంచుకొనెను ।

**ఈ చరణాలని –**

'కారడవిలో దశకంఠుని చేత పట్టుబడ్డట్టి ఒక సతి (ని) తొడలమీద పెట్టుకొనియున్నాడు సృష్టీశ్వరుడనుచు, ఆరు నెలలు యీ రాజు (ని) బాసి అతివ (నీ) ప్రాణములు యెట్లుండె(ను?) ఓ కోమలాంగీ, ఆడరాని మాటలాడితివి అనుచూ ఆడవారి మాట నమ్మరాదనుచు తలచి లక్ష్మణుడు నేడు తానవ్వెననుచు ధాత్రిసుత కొలువులో తలవంచుకొనెను' అని సవరించుకొని చదివితే వొచ్చే తాత్పర్యార్థం ఇది:

కారడవిలో రావణాసురుని చేత పట్టుబడిన నిన్ను తొడలమీద పెట్టుకొని ఉన్నాడు రాముడు. ఆయన ఒక క్షణం నీ దగ్గర లేకపోతే నీకు ప్రాణాలు నిలవవని అన్నాడు గుర్తుందా, అప్పుడే నన్ను అనరాని మాటలు అన్నావు కదా, మరి ఇప్పుడు ఆరు నెలలు రాముడు లేకుండా ప్రాణాలు నీకు ఎలా నిలిచాయి? ఆడవాళ్ల మాటలు నమ్మకూడదు. ఈ రకమైన వ్యూహాలు మనస్సులో పెట్టుకుని, తనని చూసే లక్ష్మణుడు నవ్వుతున్నాడనుకుండి సీత.

సీత తలవంచుకోవడం చూసి రాముడు కూడా చిన్నబోతాడు. ఇంతకాలంగా ఈ రాజ్యాన్ని ఏలుతున్నాను, అయినా ఈ వేళ ఈ విపరీతమేమిటి అని, లక్ష్మణుడు సభలో నవ్వినందుకు అతని తల తెగవేస్తానని రాముడు కత్తి ఎత్తుతాడు. సభలోని వాళ్ళంతా ఆయన్ని అడ్డుకుంటారు. మహారాజా, లక్ష్మణుడు చిన్నవాడు, అతని తల నరకడం న్యాయం కాదు అని రాముణ్ణి ఆపుతారు. అప్పుడు రాముడు లక్ష్మణుణ్ణి అడుగుతాడు. "ఓ వీరుడా, శూరుడా, తమ్ముడా, సభలో ఎందుకు నవ్వావు చెప్పు' అని.

ఇక్కడ కొన్ని చరణాలు గజిబిజిగా కలిసిపోయి ఉన్నాయి. అయినా సమన్వయించుకొని చదివితే, లక్ష్మణుడు ఇలా అంటాడు. "మనం అడవులకు పోయినప్పుడు, ఆ పర్ణశాలలో మీకు నేను సేవ చేస్తూండగా, రాత్రి రెండు జాముల వేళ నిద్రాదేవి ఏడుస్తూ వచ్చింది. సతి రూపంలో వచ్చిన ఆవిడని నేనడిగాను, 'నీవెవ్వరవు, ఎందుకేడుస్తున్నావు?" అని. అప్పుడు నిద్రాదేవి తాను నిద్రాదేవిననేని, తాను అష్టదిగ్గజాలలోనూ, ఆది ఋషులలోనూ, వైకుంఠనాధునిలోనూ ఉంటాననీ. మానవులెవ్వరూ తన్ను గెలవలేరు కానీ నేను తనని నా దగ్గరికి రానివ్వడం లేదనే ఉంది. ఆమె ఆజ్ఞను తప్పించుకోవడం సాధ్యం కాదని గమనించి, ఆమెకు ముమ్మారు ప్రదక్షిణం చేసి, 'నేను మా అన్నకి, వదినకి ఈ పర్ణశాలలో కాపలా ఉండాలి. అక్కడ అయోధ్యలో నన్ను వదలి నా భార్య ఒక్కత్తే ఉన్నది. ఆవిడ రాత్రీ పగలూ లేవకుండా ఆవిడని ఆవహించు. మళ్ళా మేం తిరిగి ఆయోధ్యకు వచ్చినప్పుడు, రాముడూ, ఆయన సేనలూ మంత్రులూ కొలువై ఉంటారు. అప్పుడు నన్ను ఆవహించు అని ఆమెకు విన్నవించాను. ఆ మాట ప్రకారం, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా నిద్రాదేవి నన్ను ఈ సభలో ఆవహించినందుకు నాకు నవ్వొచ్చింది" అని లక్ష్మణుడు సమాధానం చెబుతాడు. తాను చేసిన పాపానికి పరిహారమేమిటని రాముడు విచారిస్తూండగా, వశిష్టుడు ఆయనతో, "అయ్యా, మీరు చేసిన పని మంచి పని కాదు. దానికి పరిహారంగా లక్ష్మణుడికి మీరు కాళ్లు పట్టాలి," అంటాడు. రాముడు ఆ మాటకి సంతోషించి, సేవకులని పిలిచి లక్ష్మణుడికి పక్క ఏర్పాటు చేయమని ఆజ్ఞాపిస్తాడు.

ఆ తరువాత దాదాపు పదహారు చరణాలు ఆ పక్క పర్ణన. ఆ పక్క మీ మాద మల్లెలూ, చామంతులూ, పారిజాతాలూ, కనకరత్నాలు, కలవపువ్వులూ, జాజిపువ్వులూ అన్ని పరిచి, మొగలిపూరేకుల తలగడలు పెట్టి అందంగా ఏర్పాటు చేస్తారు. అంగదుడూ, హనుమంతుడూ, సుగ్రీవుడూ ఆ పక్క చూసి, ఆ సొంపు చూడడానికి రెండు కళ్ళు చాలవని ఆశ్చర్యపోతారు. తన

పాదాల వద్ద అలసిపోయి పడి ఉన్న లక్ష్మణుణ్ణి రాముడు ఎత్తి పక్క మీద పడుకోబెడతాడు. ఊర్మిళా దేవి తలంటుపోసుకుని, పీతాంబరం కట్టి, నగలు పెట్టుకుని, పైట జారుతూండగా వారచూపులు చూస్తూ భర్త దగ్గరికి వస్తుంది. లక్ష్మణుడు ఆమెను వారించి, నువ్వు రావడానికి ఇది సమయం కాదు అంటాడు. తరువాత లక్ష్మణుడు నిద్రపోతాడు. అలా చాలాసేపు నిద్రపోతూంటే, ఏమిటి తమ్ముడు ఇంతసేపు నిద్రపోతున్నాడని, రాముడు హనుమంతుణ్ణి పంపుతాడు: ఊర్మిళతో సరసాలాడుతున్నాడా, జలక్రీడలాడుతున్నాడా చూసి చెప్పమని. హనుమంతుడు వెళ్ళి వచ్చి, లక్ష్మణుడు నిద్రపోతున్నాడు, తన దగ్గిర ఎవ్వరూ లేరు అని చెబుతాడు. అప్పుడు రాముడు, శతృఘ్నునితో సహా లక్ష్మణుడి పడకగదిలోకి వచ్చి పక్క మీద కూర్చుని, తమ్ముడి పాదాలు తన తొడమీద పెట్టుకొని కాళ్ళు పట్టడం ప్రారంభిస్తాడు. నిద్రలో ఉన్న లక్ష్మణుడు కలగంటున్నాననుకుంటాడు. తీరా కళ్ళు తెరచి అది కల కాదు నిజమే, ఆ కాళ్ళు పట్టేవాడు శ్రీరాముని చూసి, లేచి ఆయన పాదాల మీద పడతాడు. "నేను మీ పాదాలు వొత్తవలసిన వయసువాణ్ణి. సమస్తదేవతలూ మీ పాదాలు పట్టుకుంటారు. అహల్యను పవిత్రురాలిని చేసిన పాదాలు మీవి. బలి శిరస్సు మీదనున్న పాదాలు మీవి. నా పాదాలు మీరు పట్టడం తగదు" అంటాడు లక్ష్మణుడు. తన పాదాల మీది పడిన లక్ష్మణుణ్ణి రాముడు లేవనెత్తి కనక సింహాసనం మీద కూర్చోబెట్టి,

చంద్రుడు లేని రాత్రి యెట్టిదట బోలు ।
తమ్ముడా నీవులేని సభయట్లె బోలు ॥
దీపమ్ము లేనిల్లు యెట్టిదట బోలు ।
తమ్ముడా నీవులేని సభయట్లె బోలు ॥
పతిలేని సతి యెట్టిదట బోలు ।
తమ్ముడా నీవులేని సభయట్లె బోలు ॥
ఉదకమ్ములేని కలశమెట్టిదట బోలు ।
తమ్ముడా నీవులేని సభయట్లె బోలు ॥
చిలుకలేని పంజర మెట్టిదట బోలు ।
తమ్ముడా నీవులేని సభయట్లె బోలు ॥

అని లక్ష్మణుడిని సభకు తీసుకొనివచ్చి, ముత్యాల గద్దె మీద కూర్చుండబెట్టి తాను రత్నసింహాసనం మీద కూర్చుంటాడు. ఇక్కడితో ఈ పాట అయిపోయింది. కానీ అచ్చుపుస్తకంలో పాట ఇంకో పాటతో కలిసిపోయి ఇంకా దీర్ఘంగా సాగుతుంది.

ఇంతకీ ఈ పాట వల్ల మనకి తెలిసేదేమిటి? ఇందులో భాష, మాటల వాడుక, చరణాలు కూర్చే తీరు ఇవన్నీ చూస్తుంటే, ఇది స్త్రీలు పాడుకునే పాటే కాకుండా, ఎవరో స్త్రీ రాసిన పాట కూడా అని తెలుస్తుంది దురదృష్టవశాత్తూ, రకరకాల అనాదరణలు కారణంగా అచ్చులో గజిబిజిగా వచ్చింది. అయినా, పాటలో అర్థం బోధపరచుకోడానికీ అది పెద్ద అడ్డంకి కాదు. అందుకని, ఈ పాట ఉద్దేశించిన సంగతుల్ని బోధపరచుకోవడానికి ప్రయత్నిద్దాం.

నవ్వు నాలుగందాల చేటు అనే మాట వల్ల ఎక్కువగా తమ సంతోషాలని అణగదొక్కకుని లోపలుండే నవ్వుల్ని పెదవుల అంచుల దగ్గరే ఆపేసి ఉంచుకోవలసిన ఆడవాళ్ళు నవ్వు గురించి రకరకాలుగా ఊహించిన పాట ఇది. దాంతో పాటు పైకి ఎంతో గంభీరంగా కనిపించే ప్రపంచంలో చాలామంది నవ్వుని ఎందుకు వెంటనే అపార్థం చేసుకుంటారో మనకి

నవ్వొచ్చేలా చెప్పే పాట ఇది. ఇంకొంచెం ముందుకెళితే ప్రపంచంలో అందరూ, దేవుళ్ళ దగ్గరి నించీ మామూలు మనుషుల దాకా పైకి నిబ్బరంగా కనిపించే వాళ్ళే కానీ, లోపల ప్రతి వాళ్ళకీ, ఏదో ఒక లొసుగు ఉంది. ఆ లొసుగు ఎవరికీ తెలీదనుకుని బతికేస్తుంటారు కానీ, అది తెలిసిపోయిందనే అనుమానం వస్తే వాళ్ళు గాలి తీసిన బుడగల్లా ముడుచుకుపోతారు. ఈ ప్రపంచపు తరహా అది. ఈ సంగతి ఈ ప్రపంచంలో ఆడవాళ్ళకే ఎక్కువ తెలుసు అని చెప్పే పాట కూడా ఇది. వాళ్ళని నవ్వకుండా చేసే ఈ ప్రపంచం ఎందుకు నవ్వకుండా చేసిందో వాళ్ళకర్థమయిందని మరీమరీ చెప్పే పాట ఇది.

ఈ పాట మొత్తం మీద లక్ష్మణుడి నవ్వు వల్ల తలవంచుకోనివాడు రాముడొక్కడే. కానీ ఆ రాముడే అందరి కన్నా ఎక్కువగా తలవంచుకోవాల్సిన తీవ్రమైన కోపాన్ని ప్రదర్శించి చివరికి తమ్ముడి కాళ్ళు పట్టుకోవలసిన శిక్షకి గురి అవుతాడు. నా మాట విని నవ్వండి, నవ్వు వల్ల ఏ చేటూ రాదు. ఎవరి నవ్వూ ఎవరి లోపాన్నీ చూపించదు. మీరు రకరకాల అర్థాలు చెప్పుకోకుండా మీరు నవ్వండి. నవ్వితే అందరూ సంతోషంగా అందంగా ఉంటారు, అని చెప్పే చక్కని పాట ఇది. మరిది లక్ష్మణుడు ఆడవాళ్ళందరికీ దగ్గరవాడు. అతను నవ్వితే లోకమంతా నవ్వుతుంది.

## 8.5. ధర్మరాజు జూదం:

జానపద సాహిత్యంలో రామాయణ, భారత, భాగవతాల్లోని దాదాపు అన్ని ముఖ్యమైన సంఘటనలను పాటలుగా పాడి నీతి బోధలు గాను అనేక విధాలయిన వినోధ సాధనాలు గాను ఉపయోగించేవారు అనేది అందరికీ తెలిసిన విషయమే. అటువంటిదే "ధర్మరాజు జూదము". ఈ జూదమనే వ్యసనం వలన ధర్మరాజు ఏమి కోల్పోయాడు? ఎన్ని ఇబ్బందులు పాలయ్యాడో తెలపటమే ఈ గేయం (పాట) యొక్క లక్ష్యం. ఈ పాటలోని కథ మహాభారతంలోని సభాపర్వంలోని ద్వితీయశ్వాసం లోనిది. అంశం భారతములోనిది అయినా ఇది కేవలము జానపదుల యొక్క ఊహాజనితమయిన కల్పితగాథ. ఈ పాట ధర్మరాజు జూదమాడటానికి హస్తినాపురమునకు బయలుదేరటంతో ప్రారంభము అవుతుంది. అలా బయలుదేరే ముందు ధర్మరాజును సహదేవుడు.

"బింబ కార్యములు చేయబొకయ్యా<br>
ఆడకుమి జూదములు ఓడబొకయ్యా<br>
ఓయన్న యెట్లయినా నా మాట వినుమా<br>
పతులు చూడగా మన సతి చెదబడుద్రు<br>
ఈడ్చుకు బోదురు సభకు రాజల్లు" అని హెచ్చరించాడు.

సహదేవుని జానపదులు ఎంచుకొనటానికి కారణము, అతనికి పశుపక్ష్యాధి భాషలు తెలుసు. సహదేవ పశువైద్య శాస్త్రము బాగా ప్రసిద్ధమైనది. వారి దృష్టిలో సహదేవుడు చావు పుట్టుకలు తెలిసిన వాడని, తామర కొలనులోని భమిడి గుండాన స్నానమాచరించి, తడి వస్త్రాలు ధరించి నిష్ఠతో భవిష్యత్తును అన్నకు చెప్పినట్లు ఇందులో తెలియజేయబడింది. వ్యాస భారతములో కూడా సహదేవుడు అన్నను హెచ్చరిస్తాడు.

వీరు హస్తినకు ప్రయాణం అయినప్పుడు

"నీళ్ళోసి పెంచిన నెలతలను<br>
ఉగ్గోసి పెంచిన యువిదలను<br>
పాలిచ్చి పెంచిన పణతులను" వెంట తీసుకొని వెళ్తారు.

హస్తినలో జూదము ప్రారంభం అయింది. ముందు ధర్మరాజు సింహాసనం మీద, రారాజు లోహ సింహాసనము మీద కూర్చొని జూదమాడగా రారాజు సర్వము కోల్పోతాడు. దీంతో రారాజు చేతిలోని పాచికలను శకుని చేతికిచ్చి జ్యేష్టాదేవి దగ్గరకు వెళ్ళి ఆమెను ప్రార్థిస్తాడు. దీంతో ఆమె తన చెల్లెలు అయిన లక్ష్మీ వద్దకు ప్రయాణం అవుతుంది. లక్ష్మీ ఈమె రాక చూసి

"యెవ్వరిని చెరుపవచ్చేనో అక్క

పొకుడ్డ చాలవే పుట్టిలాజెల్లు

అరిచేత కలహము పెంచుకొని వచ్చె"

అని మదిలో తలచి ఆమెకు ఎదురెళ్ళి మూడుసార్లు ప్రదక్షిణలు చేసి సాష్టాంగ దండ నమస్కారములు చేసి ఆమె వచ్చిన పని ఏమిటని అడుగుతుంది. రారాజు తనను శరణుజొచ్చాడని

"శరణు జొచ్చిన వారిని చెడగొట్టుటకు

మనస్సునొప్పదు నాకు ఓ మాలక్ష్మీ" అని తెలుపుతూ అదేకాకుండా రాజసూయ యాగము చేసే రోజు తాను తన పిల్లలతో యజ్ఞశాలలో భోజనాల పంక్తిలో ఆకులు వేసుకుని కూర్చోగా భీముడు

"ఆడు దానివీ నీవు ఇది నీతి గాదు – మగవారితో కుడువ పాటి లేదనుచు" తనను అవమాన పరచాడని, అప్పుడు తాను శాపం ఇచ్చాను అని ఆ శాపం ఫలించే రోజు నేడు వచ్చింది కనుక తనతో సహకరించి ధర్మరాజును వదిలి రారాజును పొందమంటుంది. కానీ లక్ష్మీ ధర్మరాజు ధర్మం తప్పనివాడని అతడిని వదిలి అధర్మపరుడైన రారాజును పొందడానికి అంగీకరించదు. కానీ అక్క కోపానికి జడిసి ధర్మరాజును విడచి రారాజును చేరుతుంది.

ఈ సారి ధర్మరాజు లోహ సింహాసనం మీద, రారాజు సింహాసనం మీద కూర్చొని జూదమాడతారు. లోహ సింహాసనం శనికి సూచన. జూదములో ఎవరు జయించేది సింహాసనములను బట్టి సూచన జరిగింది. పాచికలు శకుని హస్తాన్ని అలంకరిస్తాయి. ధర్మరాజు ఒక్కొక్కటిగా సర్వసంపదలను, చివరకు ద్రౌపదిని కూడా ఫణంగా పెట్టి ఓడిపోతాడు.

తనను సభకు తోడ్కొని పోవడానికి వచ్చిన దుశ్శాసనునితో ద్రౌపది "వదిన గారిని సుమ్మి పరసతిని సుమ్మి – వావితప్పగ రాదు వరపుత్ర వినుమా" అని పలుకుతుంది. అంతలో దుశ్శాసనుడు నీవు కేవలము దాసివి మాత్రమే అని అరుస్తూ" వదిన గారివి కావు వరుసలు లేవు" అని అంటాడు. వెంటనే ఆమె తను ఋతుస్నాత అని స్నానమయితే గాని సభకు రాజాలను అంటే ఆ దుష్టుడు

"వెండి కాగులతో వేణ్ణీళ్ళు గాచి

భమిడి కాగులతో చన్నీళ్ళు దెచ్చి

వేణ్ణీళ్ళు చన్నీళ్ళు సమముగా తొలిపి

పాపకర్ముడు బోసే పాంచాలీ మీద"

ఈ విధంగా ధర్మరాజు తనకున్న జూదము అనే వ్యసనం వలన సర్వం కోల్పోయాడు.

## 8.6. శ్రీకృష్ణుని జననం:

శ్రీ కృష్ణుని జననం, ఆయన జీవితం అంతా ఓ అద్భుతం. యుగయుగాలుగా ఆయన తత్వం, ఆయన జీవితం

మానవజాతిని విశేషంగా ప్రభావితం చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని మధురలో కృష్ణుడు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పురాణాల ప్రకారం మధురలో ఉగ్రసేనుడు ఒక ప్రముఖ యాదవ రాజు. ఉగ్రసేన మహారాజు వృద్ధుడు కావడం వలన అత్యాశపరుడైన అతని కొడుకు కంసుడు తన తండ్రిని కారాగారంలో పెట్టి అధికారాన్ని చేజిక్కించుకుంటాడు. మరోవైపు కంసుడి చెల్లెలు దేవకి మరొక యాదవరాజైన వసుదేవుడిని వివాహం చేసుకుంటుంది. పెళ్లైన తరువాత కొత్త దంపతులను కంసుడు తన రథంలో తీసుకువెళ్తున్నప్పుడు ఆకాశవాణి భవిష్యత్తు పలుకుతుంది. "ఓ కంసా! నీ చెల్లెలి పెళ్ళి తరువాత నువ్వు ఎంతో ఆనందంగా ఆమెను తీసుకువెళ్తున్నావు. నీ చెల్లెలికి పుట్టే ఎనిమిదవ శిశువు నిన్ను వధిస్తాడు. ఇదే నీ అంతం" అని చెబుతుంది. కంసుడు ఒక్కసారిగా ఉగ్రుడవుతాడు "ఓహో ఆమె ఎనిమిదో బిడ్డ వచ్చి నన్ను చంపుతుందా? నేను ఆమెను ఇప్పుడే చంపేస్తాను. ఆమె తన ఎనిమిదో బిడ్డకు ఎలా జన్మనిస్తుందో నేనూ చూస్తాను" అని హూంకరిస్తాడు.

అక్కడే కత్తి తీసి తన చెల్లెలి తల నరకబోయాడు. పెళ్ళి కొడుకైన వసుదేవుడు కంసుడిని అర్థిస్తాడు. "దయచేసి ఆమె ప్రాణాలు తీయకు. ఆమె ఎనిమిదో సంతానమే కదా నిన్ను చంపేది. నేను మాకు పుట్టిన పిల్లలనందరిని నీకు ఇస్తాను. నువ్వు వాళ్ళని చంపవచ్చు కానీ దయచేసి నా భార్యను వదిలిపెట్టు" అని కంసుడుతో వసుదేవుడు ఒక ఒప్పందం కుదుర్చుకుంటాడు. కానీ కంసుడు తన ప్రాణం మీద ఉన్న తీపితో చెల్లెలిని, భావను గృహ నిర్బంధంలో వుంచి ఎప్పుడూ కాపలా ఉండేటట్లు చేస్తాడు.

మొదటి బిడ్డ పుట్టగానే కాపలవాళ్ళు కంసుడికి ఈ వార్తను చేరవేస్తారు. ఆయన రాగానే దేవకీ వసుదేవులు "ఎనిమిదవ సంతానమే కదా నిన్ను చంపేది, ఈ బిడ్డను ప్రాణాలతో వదిలేయమని" ఏడ్చి ప్రాధేయపడతారు. కంసుడు వారి వేదనను పట్టించుకోకుండా బిడ్డను తీసుకుని కాళ్ళు పట్టుకొని ఒక రాయికేసి బాదుతాడు. ప్రతిసారీ ఒక శిశువు జన్మించటం, ఆ తల్లిదండ్రులు కంసుడిని ఎన్నో విధాలుగా ప్రాధేయపడినా, ఆయన ఎవరినీ ప్రాణాలతో వదిలేయకపోవటం. అది ఇలా జరుగుతూనే వస్తుంది.

ఎనిమిదో బిడ్డ బహుళ పక్షం అష్టమి రోజున ఉరుములతో వర్షం పడుతున్నప్పుడు జన్మిస్తుంది. అప్పుడు ఒక అద్భుతం జరుగుతుంది. కారాగారం తలుపులు వాటంతట అవే తెరుచుకుంటాయి. కాపలా వాళ్ళు అందరూ నిద్రలోకి జారిపోతారు. వసుదేవుడు ఇదంతా దైవలీలగా భావిస్తాడు. వెంటనే ఆయన బిడ్డను ఎత్తుకుని, ఏదో మార్గ నిర్దేశం జరిగినట్లు యమునా నది వైపుకు నడుస్తాడు. ఆ ప్రదేశమంతా వరదతో మునిగి ఉన్నా ఆశ్చర్యకరంగా ఆయన నదిని దాటే మార్గం తెరచుకునే ఉంటుంది. వసుదేవుడు నదిని దాటి నంద, యశోదల ఇంటికి వెళ్తాడు. యశోద అప్పుడే ఒక ఆడపిల్లకు జన్మనిస్తుంది. అది ఎంతో కష్టమైన ప్రసవం కావటం వల్ల ఆమె స్పృహలో ఉండదు. వసుదేవుడు ఈ ఆడపిల్ల స్థానంలో కృష్ణుడిని వుంచి, ఆ ఆడపిల్లను తీసుకుని తిరిగి కారాగారానికి వచ్చేస్తాడు. అప్పుడు ఆ ఆడపిల్ల ఏడుస్తుంది. కాపలా వాళ్ళు వెళ్ళి కంసుడికి వార్త చేరవేస్తారు. కంసుడు అనుమానంతో కాపలా వాళ్ళను ప్రశ్నించగా వారు భయపడి తామంతా చూశామని ఆడపిల్లే పుట్టిందని చెబుతారు.

"ఇది కేవలం ఒక ఆడపిల్ల. ఒక ఆడపిల్ల నిన్ను చంపలేదు. అదే ఒక మగ పిల్లాడు అయ్యుంటే అతను నిన్ను చంపగలిగేవాడేమో, కాని ఇది ఒక ఆడపిల్ల. ఈ పాపను వదిలిపెట్టు" అని కంసుడిని దేవకీ వసుదేవులు అర్థిస్తారు. కానీ కంసుడు కనికరించడు. ఆ బిడ్డ కాళ్ళను పైకెత్తి నేలకేసి కొట్టబోతాడు. అప్పుడు ఆ బిడ్డ కంసుడి చేతినుంచి జారిపోయి ఎగిరి బయటకు వెళ్ళి "నిన్ను చంపేవాడు మరెక్కడో ఉన్నాడు" అని చెప్పి మాయమవుతుంది. ఆ విధంగా గోకులం చేరిన కృష్ణుడు,

రాజు కొడుకే అయినా ఒక సాధారణమైన గోవుల కాపరి లాగానే పెరిగాడు. శ్రీ మహావిష్ణువు ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణుడు జన్మించిన అష్టమినే కృష్ణాష్టమిగా నేడు జరుపుకుంటున్నాం.

ఈ విధంగా శ్రీకృష్ణుని యొక్క జననం (జన్మించటం) జరిగింది.

## 8.7. బాలనాగమ్మ కథ:

జానపద కథలలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న విచిత్రమైన కథ 'బాల నాగమ్మ కథ'. తెలుగు రాష్ట్రాల్లో బుర్ర కథలు చెప్పేవారికి బాగా అలవాటైన కథ. జానపద కథల పట్ల నేటి తరాలకు మమకారం తగ్గిపోతున్నా, ఇంకా అనేక ప్రాంతాల్లో ఆదరణ పొందుతున్న కథల్లో ఈ కథ ఒకటి.

భూచక్రపురం అనే రాజ్యాన్ని పూర్వం నవబోజ రాజు అనే చక్రవర్తి పరిపాలిస్తుండేవాడు. ఆయన భార్య భూలక్ష్మీ దేవి, ఈ దంపతులకు సంతానం లేకపోవడంతో ఓ మహర్షి సలహా మేరకు రాజ్యానికి సమీపంలో వున్న పరమేశ్వరుడి ఆలయంలోని మామిడి చెట్టుకి కాసే పండ్లను తింటే సంతానం కలుగుతుందని నమ్మి అక్కడికి ఒంటరిగానే వెళ్తుంది భూలక్ష్మీదేవి. అయితే కేవలం ఒక పండుతో మాత్రమే సరిపెట్టుకోమని చెబుతాడు మహర్షి. కానీ రాణి అత్యాశకు పోయి ఇష్టం వచ్చినట్లు పండ్లను కోయడంతో ఆ చెట్టు క్రిందనున్న పుట్టలో నుండి నాగేంద్రుడు బయటకు వచ్చి రాణిని కాటువేయబోయాడు. కానీ ఆమె అతణ్ణి వేడుకుంటుంది. కనీసం తనకు పిల్లలు పుట్టి, వారి ఆలనా పాలనా చూసే వరకైనా తనను ప్రాణాలతో విడిచిపెట్టమని ఆమె కోరుకుంటుంది. నాగేంద్రుడు ఆమె కోరికను మన్నిస్తాడు. ఆ తరువాత ఇంటికి వెళ్ళిపోయిన రాణికి ఏడుగురు కుమార్తెలు జన్మిస్తారు. వారందరిలో ఆఖరి కుమార్తె పేరే బాలనాగమ్మ.

తనకు పుట్టిన బాలికలందరినీ అల్లారు ముద్దుగా పెంచిన మహారాణి ఒక రోజు తన భర్తతో నాగేంద్రుడి ఆదేశం గురించి చెబుతుంది. నవభోజరాజు తన భార్యను నాగేంద్రుడి బారి ఉండి కాపాడాలని ప్రయత్నిస్తాడు. ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు. కానీ అవన్నీ వ్యర్థమవ్వడంతో పాము కాటుకి ఆమె మరణిస్తుంది. తన భార్య మరణించాక నవభోజరాజు మరో వివాహం చేసుకుంటాడు.

కానీ సవతి తల్లి తన బాధ్యతలను విస్మరిస్తుంది. రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని భావిస్తుంది. అందుకే మహారాజును వశీకరణ విద్య ద్వారా వశ పరచుకొని, పిల్లలను అడవిలో వదలిపెట్టి రమ్మంటుంది. మహారాజు అలాగే పిల్లలను అడవిలో వదిలిపెట్టి వస్తాడు. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న పానుగంటి ప్రభువు, భూలక్ష్మీదేవి అన్న అయిన రామవద్దిరాజు తన కుమారులను అడవికి పంపిస్తాడు. బాలికలను రక్షించమంటాడు. అప్పటికే అడవిలో బాలికలు ప్రకృతి మాత ఒడిలో పెరుగుతుంటారు. ఆ బాలికలను రామవద్దిరాజు కుమారులు ఒప్పించి తమ రాజ్యానికి తీసుకెళ్తారు. పెద్దయ్యాక ఆ ఏడుగురు యువతులను, ఏడుగురు రాకుమారులు వివాహం చేసుకుంటారు. బాలనాగమ్మను కార్యవద్దిరాజు వివాహం చేసుకుంటాడు.

అయితే సుఖ సంతోషాలతో విరాజిల్లుతున్న పానుగంటి రాజ్యం గండికోట యుద్ధం రావడంతో ఆ రాజ్యానికి సహాయంగా వెళ్తుంది. అదే సమంలో ఓ బిడ్డను కని.... తన ఆలనా పాలన చూస్తున్న బాలనాగమ్మను తను ఇంట్లో లేని సమయంలో కూడా రక్షించేందుకు ఓ మంత్రించిన గీతను తన ఇంటి ముందు గీస్తాడు కార్యవద్దిరాజు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ గీతను దాటి రావద్దని తన భార్యను కోరతాడు. ఆ ఇంటికి తలారి రాముడిని కాపలాగా పెడతాడు. అయితే అనేక రోజుల నుండి బాలనాగమ్మపై వ్యామోహాన్ని పెంచుకున్న మాయల ఫకీరు అదునుచూసి జంగమ దేవర వేషంలో కార్యవద్ది కోటకు

వస్తాడు. బాలనాగమ్మను తస్కరించాలని భావిస్తాడు. బిక్షాందేహి... అంటూ తనకు భిక్ష వేయమంటాడు. బాలనాగమ్మ గీత దాటకుండానే... ఫకీరుకు భిక్ష వేయాలని అనుకుంటుంది. కానీ తాను అంగీకరించడు. గత్యంతరం లేక లోక ధర్మాన్ని పాటించి ఆమె గీత దాటుతుంది. ఇంకేముంది... ఫకీరు ఆమెను కుక్కగా మార్చేసి తన కోటకు తీసుకుపోతాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్యవద్దిరాజు తన భార్యను విడిపించుకోవడానికి ఫకీరు కోటకు వెళ్లి అక్కడ అతడి చేతిలో శిలగా మారిపోతాడు.

ఈ సంఘటనలు జరిగిన పదిహేను సంవత్సరాల తర్వాత బాలనాగమ్మ కుమారుడు బాలవద్దిరాజు తన తల్లిదండ్రుల రహస్యం తెలుసుకుని..... వారిని తిరిగి రాజ్యానికి తీసుకొచ్చేందుకు తలారి రాముడి సహాయం తీసుకొని ఫకీరు కోటకు వెళ్తాడు. మార్గ మధ్యంలో అనేక సాహసయాత్రలు చేస్తాడు. ఓ రాజ్యంలో పులిని చంపి వీరుడిగా కితాబునందుకొని.... ఆ దేశ యువరాణిని వివాహం చేసుకుంటాడు. అలాగే గండభేరుండ పక్షితో పోటీపడి ఓడిస్తాడు. ఇలా అనేక సాహసాలు చేసి ఆఖరికి ఫకీరు కోట ఉన్న ప్రాంతం వద్దకు వెళ్తాడు. ఫకీరు కోటలోకి పూలు తీసుకెళ్లే ముసలమ్మను వచ్చిక చేసుకొని.... ఆమె వద్దకు పనిలో చేరి... ఆ తర్వాత ఆమె సహాయంతో కోటలోకి వెళ్తాడు. కోటలోకి వెళ్లి... ఫకీరును మభ్యపెట్టి తన తల్లి సహాయంతో ఫకీరు మరణ రహస్యం తెలుసుకుంటాడు. ఏడు సముద్రాలు దాటాక వచ్చే ఊరిలోని మొదటి మఱ్ఱి చెట్టు తొర్రలో ఉండే చిలుకలో ఉంటుందట ఆ ఫకీరు ప్రాణం. ఆ ప్రాణాన్ని తీయడం కోసం ఆ ఏడు సముద్రాలూ దాటుతాడు బాలవద్దిరాజు. ఆఖరికి ఆ చిలుక ప్రాణాన్ని తీసి... తన తల్లిదండ్రులను తిరిగి కాపాడి రాజ్యానికి తీసుకురావడంలో ముగుస్తుంది బాలనాగమ్మ కథ.

పూర్తి కల్పితమైన ఈ కథలో పాత్రలు చలా విచిత్రంగా ఉంటాయి. ఊహకు అందని విధంగా రచయిత ఈ కథను రాసిన తీరు జానపద కళాకారులను సైతం ఎంతగానో ఆకర్షించింది. బుర్ర కథలు చెప్పే వారికి ఈ కథ ఖచ్చితంగా తెలుస్తుంది అనడంతో అతిశయోక్తి లేదు. ఎన్నో తరాలు ఈ కథను వినే పెరిగాయి. తర్వాత బాలనాగమ్మ కథ ఆధారంగా సినిమాలు కూడా వచ్చాయి. 1959వ సంవత్సరంలో వేదాంతం రాఘవమ్మ దర్శకత్వంతో ఎన్టీఆర్, అంజలీదేవి నటించిన "బాల నాగమ్మ" చిత్రం గొప్ప సూపర్ హిట్ చిత్రంగా నిలిచింది.

## 8.8. లక్ష్మమ్మ కథ:

జానపదుల ప్రీతి విశ్వాసాలను గడించిన మరొక జానపద కథ లక్ష్మమ్మది. వివాహం అయినప్పటి నుండి అత్త ఆరళ్ళు, ఆడపడుచుల ఆగడాలు ఎన్నో భరించిన లక్ష్మమ్మ చివరికి మరణిస్తుంది. ఎంతో సుగుణవతి, మహా పతివ్రతయైన లక్ష్మమ్మ చితి చల్లారగానే శిలయై పోయి దేవతగా మారింది. మహాసాధ్వి కనుకనే ఆమెను పెట్టిన హింసలకు ప్రతిఫలంగా భర్త వెంకయ్యకు, అత్తకు, ఆడబిడ్డలకు కళ్ళు పోతాయి. లక్ష్మమ్మ వంటి వారికి మహిమలు వాటంతట అవే అబ్బుతాయి అని భావించే జానపదులు ఈ నమ్మకాలే మూఢనమ్మకాలై వారి జీవితాలలో పెనవేసుకుపోయాయి లక్ష్మమ్మ-

"నూటవొక్క గుడిలో వేయమ్మ
పూజలైనను కొంటూ వున్నదమ్మ
సంతులేకుంటె సంతు యిచ్చునమ్మ
బిడ్డలు లేకున్న బిడ్డలిచ్చునమ్మ"

అని కొలవబడే లక్ష్మమ్మకు ప్రతి ఊరిలో గుళ్ళు లేపడంలో ఆశ్చర్యం లేదు.

## 8.9. నమూనా ప్రశ్నలు:

1) జానపద పౌరాణిక అద్భుత రస గేయాలను గురించి వివరించండి?

2) జానపదంలోని కరుణ రస గేయాలను గురించి వివరించండి?

3) ఈ క్రింది కథా గేయాలను గురించి వివరించండి?

అ) ఊర్మిళా దేవి నిద్ర

ఆ) లక్ష్మణ దేవర నవ్వు

ఇ) ధర్మరాజు జూదం

ఈ) బాల నాగమ్మ కథ, లక్ష్మమ్మ కథ

ఉ) శ్రీకృష్ణుని జననం

## 8.10. ఆధార గ్రంథాలు:

1) ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్‌విఎస్ సుందరం.

2) తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు

**- డా॥ కె. లలిత కుమారి**

**పాఠం - 9**

# జానపద వీరగాథలు

**9.0. లక్ష్యం:**

విద్యార్థులు జానపద వీరగాథలు గురించి తెలుసుకుంటారు.

**విషయసూచిక:**

**9.1. వీరగాథలు, స్వరూప స్వభావాలు**

**9.2. జానపద వీరగాథలలో ప్రధానమైనవి**

**9.3. నమూనా ప్రశ్నలు**

**9.4. ఆధార గ్రంథాలు**

## 9.1. వీరగాథలు, స్వరూప స్వభావాలు:

ఐతిహ్యం (Legend), కథ (Tale), పురాణం (Myth) ఈ మూడు గద్య కథనాలలో ప్రధానమైనవి. పురాణాలే గేయ రూపంలో ఉండే పౌరాణిక గేయాలవుతాయి. ఐతిహ్యాలు గేయరూపంలో ఉంటే వీరగాథలవుతాయి. ఐతిహ్యాలలో కొన్ని చరిత్రకెక్కిన చరితార్థుల కథలై ఉండవచ్చు కాని ఐతిహ్యం ఒక్కొక్కసారి చారిత్రకం అయ్యే అవకాశం వుంది. ఇవన్నీ వీరరస ప్రధానాలు, ఐతిహ్యాత్మకాలు, అస్పష్ట చారిత్రకాలు, చారితక్రాలు అన్న మూడు రకాలనూ వీరగాథలుగా పరిగణించవచ్చు.

తెలుగులో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలవగలిగిన వీరగాథలు అనేకం ఉండడం నిజంగా గర్వకారణం. పల్నాటి వీర కథ, కాటమ రాజు కథ, బొబ్బిలి కథ, దేసింగు రాజు కథ, ముగ్గురు మరాటీల కథ, సర్వాయి పాపడు కథ, చిన్నప రెడ్డి కథ, సదాశివ రెడ్డి కథ, కొమార రాముడి కథ మొదలైనవి తెలుగు దేశంలో ప్రజల్ని ఉత్తేజితుల్ని, ఉత్సాహవంతుల్ని చేసిన వీరగాథలు.

వీరగాథలలో సుదీర్ఘాలైన వీరగాథాచక్రాలుండడం తెలుగులో విశేషంగా గమనించదగిన విషయం. అతి దీర్ఘ కథలే కాక వీరగాథానికలూ తెలుగులో ఉన్నాయి. గుర్రాల గోపిరెడ్డి, మానంది రెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళ రెడ్డి, ధర్మవరం నరసింహుడు ఈ గాథానికల నాయకులు.

పల్నాటి వీరగాథ రచనకు మూలమైన కథ పన్నెండో శతాబ్దంలో జరిగింది. జానపద కథాగేయాలు ఒక సంఘటన జరిగిన తరువాత చాలా కాలానికి రూపొందేవి కావు. ఐతిహాసిక క్రమం (Epic Process) సమకాలీనం గానే ప్రారంభమవుతుంది. జానపద ఇతిహాసం సంపూర్ణ రూపం పొందటానికి మాత్రం కొంతకాలం పట్టవచ్చు. అందువల్ల పలనాటి వీరగాథా చక్రంలోని ఒక్కొక్క కథాగేయానికి బీజాలు 12వ శతాబ్దంలోనే పడి వుంటాయి. పన్నెండో శతాబ్దానికి ముందు అసలు ప్రపంచంలోనే ఎక్కడా వీర గాథలు లేవని కొందరు విమర్శకులు భావించారు. పలనాటి వీరకథ బ్రహ్మనాయిణ్ణి అవతార పురుషునిలాగ చిత్రించింది. నాయకురాలు నాగమ్మ అసామాన్య ప్రజ్ఞా పాటవాలు గల స్త్రీ, పల్నాటి వీర చరిత్ర అనే పేరుతో మనము ఈనాడు చెప్పుకుంటున్న కథ అసలు సిసలైన జానపద వీరగాథ కాదు. అందులో ఉండే అనేక కథలు అసలు కథకు సంక్షిప్త రూపాలు మాత్రమే. ఇవి నమ్మదగినవి కావని, వీటికి జానపదులలో ప్రచారంలో వున్న పల్నాటి వీరగాథలను ఏవిధమైన

సంబంధము లేదని వీరగాథలను గూర్చి సమగ్రంగా పరిశోధన చేసిన డా॥ తంగిరాల సుబ్బారావు గారంటారు, జానపద గాథల్ని పాడేవాళ్ళు "వీర విద్యావంతుల" ని, వీరినే 'పల్నాటి వారం' టారని ఈయన చెప్పారు.

పల్నాటి వీర గాథల వలె తెలుగులోని ప్రచారం పొంది ప్రపంచంలోని అత్యుత్తమ కథాగేయాలలో పోటీపడినది. కాటమ రాజు కథాచక్రం, వీటిని గురించి తెలుగులోనే ఎక్కువ ప్రచారం జరుగక పోవటం వలన ఇతరులకు తెలియ చేయటం కష్టమైంది. ఇందులో 32 వీరగాధలున్నాయని పరిశోధించిన వారు డా॥ తంగిరాల. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు కాటమ రాజు కథల రెండు బృహత్సంపుటాలను ప్రచురించి మహోపకారం చేశారు. ఈ జానపద ఇతిహాసంలో కాటమరాజు పితామహుడైన ఆవుల నలురాజు నుంచి కాటమరాజు వరకు మూడు తరాలకు సంబంధంచిన కథలున్నాయి. పల్నాటి వీర చరిత్రను శ్రీనాథుడు రచించాడనే అభిప్రాయం ఉన్నట్లే, కాటమ రాజు కథా చక్రాన్ని కూడా శ్రీనాధుడే రాశాడని అభిప్రాయం ప్రజలలో ఉంది. అయితే శ్రీ నాధుడి పేరుతో ఏ కథా చక్రంలోనూ ఏ కథాగేయమూ లేదు.

ఈ కథాచక్రాలను నెలల తరబడి పాడవచ్చు. అనతి దీర్ఘాలైన వీరగాథలు రెండు మూడు రాత్రులలోనే ముగిసిపోతాయి, ఈ గేయాలలో చెప్పుకోదగిన గేయం కుమార రాముని కథ. ఇందులో చారిత్రకాంశం అయినా కథ ఎక్కువగా ఉంటుంది. ఈ కథ తెలుగు కన్నడాలలో సమాన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. తెలంగాణాలో పుట్టి ఇతర ప్రాంతాలకు కూడ వ్యాపించి బాగా ప్రచారమైన కథలలో 'సర్వాయి పాపని కథ ఒకటి, విదేశీయుడైన జె.ఎ. బోయల్‌ను ఆకర్షించిన జానపద కథాగేయమిది. చరిత్ర, పుక్కిటి పురాణం కలిపి చక్కని జానపద కల్పనలతో రూపొందిన కథాగేయం ఇది. 'సర్వాయి పాపని గూర్చి సాధికారికమైన వృత్తాంతాలను సేకరించి, సవివరంగా, సచిత్రంగా ప్రకటించిన ఘనత డా॥ బి. రామ రాజు గారిది. (1978 : 243-251).

"తెలుగు దేశమును గడగడ లాడించుటయే కాక ఢిల్లీ చక్రవర్తికి సైతము తీరని సమస్యగా పరిణమించినాడన్న అతని ధైర్య సాహసములు వీర విక్రమములు కొనియాడదగినవి' అని సర్వాయి పాపని గూర్చి రామరాజు గారు చెప్పిన మాటలు ఈ జానపద నాయకుని గొప్పదనాన్ని చాటుతున్నాయి.

దేశింగు రాజు కథ తమిళ దేశం నుంచి తెలుగు దేశానికి వచ్చిన చారిత్రక గేయం. ఇందులో కథా స్థలం తమిళదేశం నుంచి తెలుగుదేశానికి వచ్చిన చారిత్రక గేయం. తమిళంలో కూడా ఇదే పేరుతో ఈ కథ ప్రసిద్ధమైంది. తెలుగు వారి ధైర్య సాహసాలను, ఆత్మాభిమానాన్ని చాటి చెప్పే అసమాన కథాగేయం 'బొబ్బిలి కథ'. జానపద కథా గేయాలకు అందులోనూ వీరగాథలకు ఉండవలసిన లక్షణాలు మూర్తిమత్వం వహించిన కథ బొబ్బిలి కథ.

"రామరామయణంత కాలము రాజ్యమేలలేము. జగము వుండు కాలము వరకు మనము వుండ బోము' అనే నిరాశావాదము బొబ్బిలి వారి యుద్ధ నినాదమైనా, కార్య సాధనకు, వీరాభి వ్యక్తికీ ఈ కథ ప్రతీకగా రూపొందింది. రంగారావు తాండ్ర పాపయ్య ఆంధ్ర పౌరుషానికి మచ్చుతునకలుగా భాసిస్తారు. బొబ్బిలిలో జన్మించిన పశు పక్ష్యాదులు కూడ పౌరుషము కలవిగా చెబుతారు. కోడిపందెము లాడేటప్పుడు 'చావంటెను మీరు భయపడవద్దు బారా కోడీరా! యెన్నాళ్ళు బ్రతికినా చావు సిద్ధము బారా కోడీ రా। బొబ్బిలియందున పుట్టినావురా బారా కోడీరా' అని పురికొల్పడం ఆ గడ్డ మీద పుట్టిన వారి పౌరుష గుణాన్ని తెల్పుతుంది. యుద్ధ సమయంలో ఆదమరచి నిద్రబోతున్నా సరే తెలుగు బిడ్డలు గుర్రపు సందడి వినగానే పడక లోనే దట్టి గట్టే వారని చెబుతారు. రంగారాయునికి 'ముంజేతికి మీసమున్నద'న్న జానపదుని కల్పనా శక్తిని అద్భుతంగా భావించాలి,

చరిత్ర స్పష్టంగా తెలియని గేయాలలో బంగారు తెమ్మ రాజు కథ ఒకటి ప్రసిద్ధమైనది. బహుళ ప్రచారం పొందిన

మరొక కథాగేయం ఆరు మరాఠీల కథ, నిజానికి ఈ కథను ఆరె మరాఠీల కథ, ఆరెవారు మరాఠీలలో ఒక తెగ, ఆరె భాష మాట్లాడే వాళ్ళు పాల్కురికి సోమనాథుని కాలం నుంచి తెలుగు వారికి పరిచితులే. (వృషాధిప శతకం శ.58) తోలు బొమ్మ లాటలు మొదలైన జానపద కళలను వీరు ఆంధ్రదేశంలో ప్రచారం చేశారు. మనకు దొరుకుతున్న వీరగాథలన్నిటిలో అత్యంత ఉదాత్తమైన కథాగేయం సదాశివరెడ్డి కథ. చాలా కథలలో దాయాదుల పోరాటాలే ప్రధాన కథా వస్తువుగా కనిపిస్తాయి. కాని సదాశివ రెడ్డి కథలో ఉదాత్త ధర్మ కీర్తన ఉండడం వలన "నిజమైన వీరగాథ ఒక్కటే" అని విమర్శకుల మెప్పు పొందింది.

## 9.2. జానపద వీరగాథలలో ప్రధానమైనవి:

1. పల్నాటి వీర చరిత్ర
2. కాటమ రాజు కథ
3. బొబ్బిలి యుద్ధం
4. సర్వాయి పాపని కథ

మొదలైనవి. వీటిని పరిశీలిద్దాం

### 9.2.1. పల్నాటి వీర చరిత్ర:

ఈ పల్నాటి వీర చరిత్ర అనేది 12 వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలో జరిగిన యుద్ధం. ఈ పల్నాటి యుద్ధం ఆంధ్రదేశంలోని పల్నాడు ప్రాంతంలో 1182 వ సంవత్సరంలో జరిగింది. మహాభారతానికి పల్నాటి వీరుల చరిత్రకు దగ్గరి పోలికలు ఉండటం చేత దీనిని ఆంధ్ర భారతం అని కూడ అంటారు. పల్నాటి యుద్ధం 12వ శతాబ్దంలో ఆంధ్రదేశంలోని రాజకీయ, సాంఘిక, మత సంబంధమైన మార్పులకు దోహదం చేసిన కీలక యుద్ధం. ఈ యుద్ధం తీరాంధ్ర లోని రాజవంశాలన్నిటిని బలహీన పరచి కాకతీయ సామ్రాజ్య విస్తరణకు మార్గం సుగమం చేసింది.

**చారిత్రకత:** సా.శ. 1176-1182 మధ్యకాలంలో కారంపుడి వద్ద పల్నాటి యుద్ధం శైవులు, వైష్ణవుల మధ్య జరిగింది. ఈ యుద్ధంలో సంభవించిన అపారమైన, జన, ఆస్తి నష్టం వలన ఆంధ్ర ప్రాంతంలోని రాజులందరూ బలహీనులయ్యారు. ఇటువంటి పరిస్థితులలో ఓరుగల్లు కాకతీయులు ఇక్కడున్న రాజులందరినీ ఓడించారు. పల్నాటియుద్ధం ఆంధ్ర దేశంలో ఎంతో ప్రాచుర్యం పొందిన యుద్ధం. అయినప్పటికీ సమకాలీన శాసనాలలో గానీ, ఆ తరువాత శాసనాలలో గానీ ఈ యుద్ధం యొక్క ప్రస్తావన ఎక్కడా లేదు. శాసనాలలో పేర్కొనక పోయినా ఈ యుద్ధం జరగలేదని భావించటానికి వీలులేదు. క్రీడాభిరామంలో పలనాటి యుద్ధ గాథలను పేర్కొనటమేకాక ఓరుగల్లు నగరంలో వీర చరిత్రను గానం చేయటం, ఆ ప్రాంతానికి చెందిన యువకులు ప్రేరణ పొందడం, ఓరుగల్లులోని ప్రజల నివాసాలలో పలనాటి యుద్ధానికి సంబంధించిన చిత్రాలు చిత్రించబడి వుండటం గమనించవచ్చు.

ఈ క్రీడాభిరామానికి మూల సంస్కృత గ్రంథమైన ప్రేమాభిరామాన్ని రావిపాటి త్రిపురాంతక కవి పలనాటి యుద్ధం జరిగిన తరువాత 50-60 సంవత్సరాలకు రచించాడు. పలనాటి యుద్ధంలో ఓడిపోయిన బ్రహ్మనాయుని అనుయాయులు ఓరుగల్లు చేరి కాకతీయులు కొలువులో చేరారు. కాబట్టి ఓరుగల్లులో పలనాటి వీరగాథ బాగా ప్రచారంలోకి వచ్చింది.

**యుద్ధం జరిగిన ప్రాంతం:**

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కారంపూడిలో పల్నాటి యుద్ధం జరిగింది. యుద్ధంలో మరణించిన వీరులకు ఈ

ప్రాంతంలో గుడి కట్టబడి వుంది. మరణించిన వీరులకు ప్రతి సంవత్సరం పేరు పేరునా పూజలు జరుగుతూవుంటాయి. కనుక పలనాటి యుద్ధం యధార్థ చారిత్రక సంఘటనగా పేర్కొనవచ్చు.

**పల్నాడు శబ్దం-వ్యుత్పత్తి:** వెల్నాడు, పల్నాడు, పొల్నాడు, వేగినాడు, కోర్నాడు – ఇలా అన్ని నాడులు ఆంధ్ర రాష్ట్ర భాషతో బాటు అమలు లోకి వచ్చిన పేర్లు. వెల్నాడు 'వలనాడు' గా

పల్నాడు 'డాపలనా' డై

'డా' పోయి 'పల్నాడు' అయి వుండవచ్చు.

వేగినాడు అనే పదానికి వేడినాడు అనే అర్థంతో మిట్ట మధ్యాహ్నం అని భావిస్తే 'పలపల' అనే పదానికి 'తెల్ల వారు' అనే అర్థంలో 'పలపలనాడు' మేలుకొన్న ప్రదేశమనో, వెలుగున్న ప్రదేశమనో అనే అర్థాన్ని సూచిస్తుంది, దీంతో ఒక పల పోయి పలనాడు మిగిలిందని చెప్పవచ్చు. అర్థం ఏదయినా వీర చరిత్రను బట్టి చూస్తే పలనాడు మంచి నాగరికత వైభవంలో తులతూగిన సామ్రాజ్యమని చెప్పక తప్పదు.

**పల్నాడు:** చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగలేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులును తేళ్ళు
పల్లె నాటి సీమ పల్లెటూళ్ళు. ఇది

శ్రీనాథ కవి సార్వభౌముని విరచితం. 'పలనాడు వెలలేని మాగాణిరా' అని వలుపుల వెంకట శివయ్యా గారు అన్నారు.

**వీరారాధనోత్సవాలు:** మహాభారతం వలెనే దాయాదుల పోరుగా పల్నాటి యుద్ధం జరిగింది. నాటి యుద్ధానికి సాక్షీభూతంగా నిలిచిన కారంపూడి (కార్యమపూడి) లో శతాబ్దాల నుంచి యుద్ధంలో అమరులైన వీరులను స్మరిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. పల్నాడు వీరారాధ నోత్సవ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కారంపూడిలో వీరారాధనోత్సవాలు జరుగుతుంటాయి. 11 వ శతాబ్దంలో పల్నాటి యుద్ధం జరిగిందని చరిత్రకారులు నిర్ధారించారు. సమ సమాజ స్థాపన కోసం బ్రహ్మనాయుడు హరిజన, గిరిజన ఆలయ ప్రవేశం చేయించాడు. తన ఆశయ సాధనకు చెన్నకేశవాలయ అర్చకులుగా మాల దాసరులైన పిడుగు వంశీకులను, చాకలి, మంగలి, గొల్లలను సేవకులుగాను నియమించాడు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాడు. మాల కన్నమ దాసును దత్తపుత్రునిగా స్వీకరించి సైన్యాధ్యక్షుడిగా నియమించాడు. ఉత్సవాల్లో మందపోరు, కోడి పోరు, కళ్ళి పాడులుగా అలనాటి చరిత్రను కథకులు గానం చేస్తుండగా అప్పటి సన్నివేశాలైన కోడి పోరు, లంకన్న ఒరుగు, కత్తి సేవలను నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ఆచారవంతులు తమ తమ కొణతాలతో ఉత్సవాలలో పాల్గొని మొక్కులు చెల్లించి కత్తి సేవ చేసి వెళ్తుంటారు. కార్తీక అమావాస్య నాడు వీర్ల దేవాలయంపై ఎర్రజెండా ఎగరువేసి పీఠాధిపతి ఉత్సవాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తాడు. ఆచార వంతులు అర్థరాత్రి నుంచి తమ కొణతాలతో వీర్ల దేవాలయం వద్దకు చేరతారు.

**బాలుడే వీర్ల దేవాలయ పీఠాధిపతి:** ప్రపంచంలో అమర వీరులకు ఆరాధనలు రోమ్ తరువాత కారంపూడిలోనే నిర్వహిస్తారు. ఇంతటి ఘన చరిత్రకు 12 ఏళ్ళ బాలుడైన పిడుగు తరుణ్ చెన్నకేశవ పీఠాధిపతి వంశ పారంపర్యంగా వస్తున్న ఆచారాన్ని నిలబెడుతూ ఉత్సవాలను నిర్వహిస్తున్నాడు. సంతానం కోరే మహిళలు ఉత్సవాల్లో వీర్ల కొణతాల జలదరింపు కోసం బారులు

తీరతారు. కొణతాల జలదరింపులో పూల రేకులు వడిలో పడితే వాటిని ఆరగిస్తే సంతానం కలుగుతుందనే నమ్మకంతో వందలాదిగా మహిళలు వేచి వుంటారు.

**నాయకురాలు నాగమ్మ:**

జన్మ స్థలం గామాల పాడు. నేటికీ ఈ గ్రామం ఉంది. అక్కడ నాగమ్మ కోట, శివాలయం ఉన్నాయి. వీరత్వం ఉప్పొంగి చనిపోయిన ఇద్దరు ముస్లిం సైనికుల సమాధులు సైతం వీరుల గుడిలో పూజలందుకోవడం విశేషం. శంకుతీర్థ మండపం నాగులేటి సమీపంలో ఉంది. వీరులు యుద్ధానికి వెళ్ళేముందు బ్రహ్మన్న ఇచ్చిన తీర్థం తాగిన వెంటనే వీరత్వం ఉప్పొంగేదని వీరగాధ చెపుతోంది.

**పల్నాటి యుద్ధం:**

పల్నాటి వీరుల చరిత్రను తొలిసారి శ్రీనాథుడు మూడు వందల సంవత్సరాల తర్వాత మంజరీ ద్విపద కావ్యంగా రచించాడు. ఇది ఆయన చివరి రచన. శ్రీనాథుని తర్వాత కొండయ్య మల్లయ్య (16వ శతాబ్దం) అను కవులు రచించారు. ఆ తర్వాత 1862 ప్రాంతంలో ముదిగొండ వీరభద్ర కవి ఈ కథను వీర భాగవతం అను పేరుతో మనోహరమైన పద్యకావ్యంగా రచించాడు. పల్నాటి వీర చరిత్రలో బాల చంద్రుని యుద్ధ ఘట్టం మాత్రమే శ్రీనాధుడు రచించాడని పరిశోధకుల అభిప్రాయం. మిగిలిన కథా భాగాలు కొండయ్య, మల్లయ్య రచించినవి. శ్రీనాథుడు పూర్తి గ్రంథం రచించి వుంటే అది కాల గర్భంలో కలిసి పోయిందేమో తెలియదు. అక్కిరాజు ఉమాకాంతం మొట్టమొదటి పల్నాటి వీర చరిత్ర యొక్క ప్రతులు సంపాదించి, సంస్కరించి 1911వ సంవత్సరంలో అచ్చు వేయించాడు. కొండయ్య, మల్లయ్య రచనలను కూడా చేర్చి సంపూర్ణ గ్రంథాన్ని సంస్కరించి 1961వ సంవత్సరంలో ఆచార్య పింగళ లక్ష్మీ కాంతం ప్రచురించాడు.

**పలనాటి యుద్ధం చరిత్ర:**

పలనాటి వీర చరిత్రలో కథ మొత్తం నవలలాగ నడుస్తుంది. ఒక చోట చెప్పిన మాట మరోచోట చెప్పలేదు. వర్ణనలో, పునరుక్త్యం లేదు. సూటిగా యుద్ధానికి కారణం మొదటి పంక్తిలోనే సూచించబడుతుంది. 'మేడపిలో అలరాజు చావు' ఈ చావును గురించి వెనుక ముందు అక్కడక్కడ ప్రస్తావించబడింది. మరీ విశ్లేషించి రాయలేదు. మలి దేవుడు మేడపిలో పాట్టం గట్టి నలగామునితో పోరాడటానికి కారంపూడి (కార్యమపూడి) కథన రంగానికి 'జయ ముహూర్తం' పెట్టించుకొని వెళ్తాడు. దండు ప్రయాణించటం దారి పొడుగునా వినిపిస్తూనే వుంటుంది. డమాయిలు, కాహళలు, మురజలు, బూరలు, శంఖాలు, మురళి జయం, తప్పెటలు, రుంజలు, డోళ్ళు, చిరు గంటలు మొదలైన వాయిద్యాలతో కూడిన వర్ణనల్లో మలి దేవ భూపతి, బ్రహ్మన్న దివ్య స్వరూపాలుగా మూర్తీభవించి వుంటారు. ఇందులో శ్రీనాథుడి కథనా చాతుర్యం అసమానం.

అంతకుముందు ఆంధ్ర గ్రంథాలలో గానీ, సంస్కృత గ్రంథాలలో గానీ వినియుండని విషాదాంత గాథకు కవి మంచి కళా సౌందర్యాన్ని ఆపాదించాడు. ఇందులో బాగా పేరుగాంచిన రస ఖండిక 'బాలచంద్ర యుద్ధం'. ఇందులో బ్రహ్మన్నను యుద్ధానికి హెచ్చరిస్తున్నట్లు ముందుగా తెలుపబడింది. బ్రహ్మన్న ప్రార్థన, బ్రహ్మన్న సంధి ప్రయత్నం, నలగాముని వైభవ వర్ణన ఇందులో చక్కగా వర్ణించబడింది.

'ఓ విశ్వమానవ మూర్తీ ! ఓ విశ్వకర్త!
ఓ లోకపావన యో

జగర్భరణ

యో శాంభవీ దేవీ యో

జగన్మాత!

సమరంబునకు నీవు

సాక్షివైయుండు'.

బాల చంద్రుడు బంగారు బొంగరాల ఆట ఇందులో ప్రధానమైనది. బాలచంద్రుడు తన తండ్రి, తన ప్రభువు యుద్ధానికి వెళ్ళినప్పుడు బొంగరాలు ఆడుతూ ఓ భోగం కులానికి చెందిన స్త్రీ ఇంట్లో నిదురపోతూ ఉంటాడు. ఆటుపై బొంగరాల ఆట ఆడేటప్పుడు అన్నమ్మ అనే వైశ్యకాంత యొక్క బొంగరం బాలచంద్రుని బొంగరానికి తగుల్తుంది. అలా తగలడం వలన కోపానికి గురే ఆమె 'ఆ చక్కటి కోమటి జల జాయతాక్షి' బాలచంద్రుని తిడుతుంది. తిడుతూ బాల చంద్రుని ఎగతాళి చేస్తుంది.

'మీ యయ్య లెల్లను మించిన బలిమి

జేరి వైరులతోడ

శీయుద్ధ భూమి నుప్పొంగుచున్న వా

జేరి వెరులతోడ నుప్పొంపచున్న వా

రుర్వీశు నెదుట

వారిలో గలియు నీవడి

కానవచ్చు'.

అని పురిగొల్పుతుంది. కారంపూడి (కార్యమ పూడి) వెళ్ళారని చెప్పదు, దాంతో బాలచంద్రునికి నిజం తెలుసుకోవాలని కుతూహలం కలుగుతుంది. తల్లి అయిన ఇతాంబను ఆడుగుతాడు. ఇతాంబ ఎన్నో నోములు నోచి కన్న బాల చంద్రునికి నిజం చెప్పదు. కాని బాల చంద్రుడు వినడు. దాంతో తల్లి బాలచంద్రుడిని యుద్ధ విముఖుణ్ణి చేయడం తన వల్ల కాదని ఆలోచించి ఆ తల్లి ఆ తనయుణ్ణి గందు వారింటికి పంపుతుంది. గందు వారంటే బాల చంద్రుని అత్తగారు, గందు కన్నమ కుమార్తె అయిన మాంచాలను బాలచంద్రునికిచ్చి పెళ్ళి చేస్తారు. కాని వీరిద్దరి మధ్య సఖ్యత ఉండదు. అప్పటి సంప్రదాయం ప్రకారము యుద్ధంకి వెళ్ళేముందు భార్య దీవెన కోసం వెళ్ళాలి.

'సంపెంగ తైలంబు చయ్యన దెచ్చి

మగువకు శిరసంటి

మంచి గంధమున

నటకవి రాచిరి

యానూనె పోవ

బంగారు బిందెల పన్నెరు

దెచ్చ

స్నానమాడించిరి

సంతసం బొప్ప

ఆమె ఎన్ని చేసినా బాల చంద్రుడు

కొదవు సింహంలా మెరిసిపోతూ భార్యను ఆశీర్వదించమంటాడు. అప్పుడు ఆమె దీవించి 'ఆయుధం' చేతికిచ్చి యుద్ధానికి పంపుతుంది. పంపేముందు సలహా చెబుతుంది. ఆనపోతు అనే బ్రాహ్మణ వీరుని వెంటపెట్టుకు పోవద్దంటుంది. ఎందుకంటే ఆ అనపోతు అనే బ్రాహ్మణుడు యుద్ధంలో చనిపోతే తన భర్తకు బ్రహ్మ హత్యా దోషం పట్టుకుంటుందని భయంతో చెబుతుంది. వాస్తవానికి ఈ అనపోత బాల చంద్రునికి వరసకు అన్న గారు. ఎలాగంటే బాలచంద్రుని తల్లి సంతానం కోసం నిమ్మ చెట్టును ఒక సంవత్సరం పాట పూజిస్తుంది. అప్పుడు ఆ నిమ్మ చెట్టు ఒక ఫలం ఇస్తుంది. ఆ ఫలాన్ని ఇతాంబ ఎనిమిది ముక్కలుగా చేసి తొలి ముక్క విస్తకాంతకు పెడుతుంది. మిగిలిన ఏడు ముక్కలు తాను, తన ఆరుగురు సవతులు తింటారు. ఈ విప్రకాంత కుమారుడే అనపోతు, అనపోతు అన్నంత పనీ చేయగల సమర్థుడు.

బాలచంద్రుడు మాంచాల మాటను విని అనపోతును వెనక్కు పంపిస్తాడు. పంపి అక్కడ వున్న ఒక రావి చెట్టుకు ఓ చీటి కట్టి ఆ రావి చెట్టు దాటి తిరిగి రావద్దని చెబుతాడు. కాని ఆనపోతు తిరిగి వచ్చి, మాయ గ్రహించి తాను యుద్ధానికి వెళ్ళ లేనప్పుడు ఇక బ్రతకటమెందుకు అని బాధతో ఆ రావి చెట్టు క్రిందే పొడుచుకుని చనిపోతాడు. చనిపోయే ముందు 'మాదచి' అనే ఓ దారిన పోయే చిన్న దాన్ని పిలచి ఆమె ద్వారా తన నెత్తురు జందెం, తన బిరుదు బాలచంద్రునికి పంపుతాడు.

ఈ జందెం, ఈ బిరుదు అనపోతు ఆ సమయంలో వీరులందరూ సంధి చేసుకొని ఆగ్మహత్య గురించి బాలచంద్రునికి తెలుస్తుంది. ఆ సమయంలో వీరులందరు సంధి చేసుకుని విందు చేసుకునే ప్రయత్నంలో ఉంటారు. వెంటనే బాలచంద్రుడు తన తండ్రితో యుద్ధం చేసి నరసింగు తల నరికి తీసుకువస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

"వీరులు దొరలును వేగమె లేచి

సంధి కార్యము మాని

జాహ్నవికేగి

యామడ్గులో వేసి రన్న

మంతయును".

ఆ తరువాత బాల చంద్రుడు నరసింగుని తల నరకటం తండ్రి పాదాల దగ్గర పెట్టటం, తరువాత సంకుల సమరంలో బాల చంద్రుడు అభిమన్యునిగా వీర మరణం చెందడం జరుగుతుంది.

ఈ విధంగా రణరంగంలో ఒక ప్రక్క బాల చంద్రుని చావు, మరొక ప్రక్క నాయకురాలు నాగమ్మ బంధింపబడడం, యుద్ధంలో విషాద సన్నివేశాలు, నాయకురాలు నాగమ్మ బాల వితంతువు అవటం జరిగింది. నాగమ్మది మారుమూల పల్లెటూరు. ఆమె నలగామ రాజు వద్ద మంత్రిగా పని చేసింది. పల్నాటి చరిత్రలో ఆమె విదుషీమణి, వీరనారీమణి. యుద్ధ భూమిలో మలి దేవుడు మరణించటం, చివరికి నల గామ రాజు, బ్రహ్మనాయుడు మాత్రమే మిగిలి పోరు నష్టం పొందు లాభం 'అనే మార్గాన్ని అవలంబించడం వలన ఏక రాజ్యంగా, రామరాజ్యంగా గురజాలను రాజధానిగా చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

**9.2.2. కాటమ రాజు కథ:**

ఎందరో రాజుల కథలు మరెందరో వీరాధివీరుల గాథలు మనం చరిత్రలో విని వున్నాము, చదివి ఉన్నాము.

ఇటువంటి కథలు కాల గర్భంలో కలిసి పోయినా జానపద గేయాల్లో అటువంటివి కథావస్తువులుగా నిలిచాయి. ఆలాంటి వాటిలో పదమూడో శతాబ్దికి సంబంధించిన వీరోచిత గాథ కాటమ రాజు కథ.

కాటమరాజు యాదవరాజు. ఇతడు నెల్లూరు సమీపాన గల కనిగిరి ప్రాంతాన్ని పరిపాలించాడు. ఇతని కోట కనిగిరి దగ్గర పంచలింగాల కొండ దిగువన ఉండేది. ఇతడు మహా పరాక్రమ సంపన్నుడు. ఏడు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడే తండ్రి పగ తీర్చటానికి వాలికేతు రాజును సంహరించి విజయం సాధించాడు. ఇతనికి విస్తారమైన పశు సంపద ఉండేది. కాటమ రాజు "ఆవుల మంద కుదిరితే ఆరామడ, చెదిరితే పన్నెండామడ" అని ప్రతీతి. పద్మ రాఘవుడు కాటమ రాజు మంత్రి, అతనిని పద్మనాయకుడని కూడ పిలుస్తారు. తన భుజ బలానికి పద్మ నాయకుని నీతి బలం తోడు కాగా కాటమ రాజు నేర్పుతో రాజ్యాన్ని పరిపాలించాడు. అతని పశు సంపద మూడు పువ్వులు-ఆరుకాయలుగా అభివృద్ధి చెందింది.

కనిగిరిలో ఒకానొక సమయంలో వర్షాలు లేక కరువు కాటకాలు పీడించాయి. పచ్చలు పొదిగినట్లున్న పచ్చిక పట్టులన్నీ ఎండిపోవటం వలన పశువులు మేత కోసం అల్లాడాయి. ఆవులు, ఎద్దులు, కోడె దూడలు, లేగలు అన్ని ఆహారం కోసం మలమల మాడి పోయాయి. డొక్కలు బక్కచిక్కి పోయాయి. పశువుల దీన స్థితిని చూచిన కాటమరాజు కడుపు చెరువయింది. రంగంతో కోసినట్లు ఏదో చెప్పరాని బాధ అతనిని వెంటాడింది. తన మంత్రి పద్మ నాయకునితో కలిసి తను చేయవలసిన కర్తవ్యం గురించి ఆలోచించాడు. "నెల్లూరి సీమలో పచ్చిక బీళ్ళు, అడవులు విస్తారంగా ఉన్నాయి. నెల్లూరును పరిపాలిస్తున్న నల్ల సిద్ధిని తను ప్రార్థించి అక్కడి పచ్చిక బయళ్ళలో ఆవుల మందలను మేపుతూ గండం నుంచి బయట పడవచ్చు. అందుకు ప్రతిగా ఏటా మనం కొన్ని కోడె దూడలను రాజు కివ్వవచ్చు" నని పద్మ నాయకుడు తెలిపాడు. కాటమ రాజుకు ఈ ఉపాయం నచ్చింది. వెంటనే అతను నెల్లూరికి సపరివారంగా ప్రయాణ మయ్యాడు.

ఆనాటి నెల్లూరి ప్రభువు మనుమ సిద్ధి కుమారుడు నల్ల సిద్ధి రాజు. ఆయన దగ్గర సేనాపతిగా ఖడ్గ తిక్కన. ప్రధానామాత్యుడుగా బింకర్ల భీమినీడు ఉండేవారు. కాటమ రాజు నల్ల సిద్ధిని దర్శించి తమకు వచ్చిన ఆపదను తెలిపి సహాయం కోరాడు. నల్ల సిద్ధిరాజు అందుకు అంగీకరించి అనుమతి పత్రం రాయించి కాటమ రాజుకిచ్చాడు. అడవులలో పచ్చిక బయళ్ళలో పశువులను మేపినందుకు ప్రతిగా ప్రతి సంవత్సరం మందలోని కొన్ని కోడె దూడలను ఇవ్వాలన్నది వారి ఒప్పందం. కాటమ రాజు సంతోషంతో తిరిగి వెళ్ళాడు.

కాటమ రాజు ఆలమందలు పచ్చిక మేసి బలంగా తయారవ్వటం వలన పాడి కొరత లేకుండా పోయింది. కానీ అడవుల్లో జీవించేవారి భృతికి ఈ ఆలమందలు, వాటిని కాసేవారు అడ్డు వచ్చారు. చిలకలు అరుపులకి ఆవులు బెదిరి పోయాయి. వెంటనే వాటిని బాణంతో పడగొట్టాడు పద్మనాయకుడు. వాటిలో నల్ల సిద్ధి రెండో రాణి కుందమా దేవి పెంపుడు చిలుక ఒకటి. ఇది తెలిసిన కుందమాదేవి గోవులను చంపండని ఆటవికులను ఆజ్ఞాపించింది. ఇందుకు కోపేతుడైనా కాటమరాజు ఏడాది దాటినా నల్లసిద్ధికి పుల్లరి పంపలేదు. గోనష్టం జరిగిన సంగతి నల్లసిద్ధికి తెలియదు. కానీ పుల్లరి చెల్లించవలసిందని రాయబారిగా ఒక భట్టును పంపించాడు.

ఆ రాయబారి కాటమ రాజు గుడారాల వద్దకు వెళ్ళాడు. నలభై నాలుగు స్తంబాల శిబిరంలో కాటమ రాజు కొలువు దీరి వున్నాడు. భట్టు మాటలు విని "మీ రాజు చేయించిన గోనష్టానికి మేము చెల్లించవలసిన పుల్లరీకి సరిపోయింది." పొమ్మన్నాడు. రాయబారం చెడినందుకు చింతిస్తూ భట్టు వెళ్ళి పోయాడు. కాటమ రాజు పద్మనాయకునితో "రాయబారం చెడింది. నల్ల సిద్ధి మనపై ఎప్పుడైనా దండెత్తవచ్చు. మనం యుద్ధానికి సిద్దంగా ఉండటం అవసరం, మన వారందరికీ

కమ్మలు రాయించి యుద్ధ సన్నద్ధులై రావలసిందని కబురు కబురు పెట్టమన్నాడు. మంత్రి తగిన ఏర్పాట్లు చేయించాడు.

రాయబారి తిరిగి వచ్చి కాటమరాజు పుల్లరి చెల్లించ నిరాకరించాడని చెప్పగానే నల్లసిద్ధి ఉగ్రుడయ్యాడు. ముఖం జేవురించింది, కన్నులు నిప్పులు కక్కుతుండగా "పుల్లరి చెల్లించ నిరాకరించి కాటమ రాజు కయ్యానికి కాలు దువ్వుతున్నాడు. మనం మన మగతనాన్ని చూపించవలసిన తరుణం ఆసన్నమైంది. రణరంగంలోకి దూకి మీ పరాక్రమాన్ని ప్రకటించండి" అని హెచ్చరించాడు. మంత్రి చింకర్ల భీమినీడు యుద్ధ రంగంలో సాయం చేయవలసిందని కోరుతూ సామంత రాజులందరికీ లేఖలు రాయించాడు. వెంటనే నెల్లూరి పరిసరాలు సైన్యాలతో నిండి పోయాయి. దండ నాయకుడు ఖడ్గ తిక్కన ఎర్రగడ్డ పాటి యుద్ధభూమిలో కాటమ రాజు సైన్యాలను ఎదిరించాడు. రెండు దళాల మధ్య జరిగిన సంకుల సమరంలో ఖడ్గ తిక్కన సైన్యం నేలకూలింది. ఖడ్గ తిక్కన ఏకాకిలా మిగిలాడు. తిక్కన చింతించి మళ్ళీ సైన్యాలతో వచ్చి శత్రువులను నాశనం చేయవచ్చునని నెల్లూరుకు తిరిగి వచ్చాడు.

తిరిగి వస్తున్న తిక్కనను పౌరులు ఎగతాళి చేశారు. ముదుసలి అయిన తిక్కన తండ్రి సిద్ధన "పగరక, వెన్నిచ్చి పిరికి పందలా పారి వచ్చావు నీ బ్రతుకు వ్యర్థ" మని తూలనాడాడు. భార్య చానమ్మ భర్త స్నానం కొరకు మంచం అడ్డుగా వుంచి పసుపు ముద్ద నీళ్ళు పెరటిలో పెట్టింది. "ముగురాడు వారమై తిమి" అని వెక్కిరించింది. తల్లి పుత్రునికి విరిగిన పాలిచ్చి "పశువులతో పాటు పాలు కూడా విరిగిపోయాయి" అన్నది. ఈ నిందలు భరించలేక ఖడ్గ తిక్కన సైన్య సమేతంగా వెళ్ళి మళ్ళీ తలపడ్డాడు. కాటమ రాజు పక్షాన బ్రహ్మ రుద్రయ్య అనే వీరుడు తిక్కనతో ఘోరయుద్ధం చేసి తిక్కనను చంపి తానూ చనిపోయాడు.

ఖడ్గ తిక్కన మరణ వార్త విన్న నల్లసిద్ధి రాజు అపారమైన సైన్యాలతో కాటమ రాజును ఎదుర్కొన్నాడు, సంకుల సమరం జరిగింది. అప్పుడు కాటమ రాజు కృష్ణుని అవతారంగా భావించిన బొల్లావును పూజించి నల్ల సిద్ధి సేనలను తరిమేయమని ప్రార్థించాడు. బొల్లావు ఎందరో శత్రువులను హత మార్చింది. అయితే నల్ల సిద్ధి మాయోపాయంతో చంపించాడు. కాటమ రాజు నిరుత్సాహ పడ్డాడు. కానీ అతని సేనలు వెన్ను చూపలేదు. వారిలో ఒకడైన బీరినీడు ఒకే దెబ్బకు మద్దిమాను నరికి తన కత్తికి పదును చూసుకొని నల్లసిద్ధి సైన్యాన్ని ఊచకోత కోశాడు. కానీ అతను కూడ వీర మరణం పొందక తప్పలేదు. బాల వీరుదు పోచయ్య విజృంభించి పోరాడి వీరస్వర్గం చేరుకున్నాడు. కాటమరాజు సైన్యం బలహీన పడింది.

అప్పుడు కాటమరాజు మంత్రాలోచన చేసి నల్లసిద్ధి సైన్యం పైకి ఆవులను, ఎద్దులను పంపాలని నిర్ణయించాడు. యాదవులు ఆవులను అశ్వాల పైకి, ఎడ్లను గజబలం మీదకి ఉరికించారు. అవి కాళ్ళబలంతో కూడా ఘోర యుద్ధం చేసి మరణించాయి. కాటమరాజు స్వయంగా నల్లసిద్ధిని ఎదుర్కొన్నాడు. వారి ద్వంద్వ యుద్ధం "దక్షుండు శంభుండు తారసిల్లినట్లు, రామ రావణులు కలసినట్లు, మత్స్యంబు మొసలియు మాట్లాడినట్లు, వారిధి వారిధితో, మేరువు మేరువుతో తాకినట్లు" జరిగింది. కాటమ రాజు చేతిలో నల్లసిద్ది నిహతుడయ్యాడు. అతని సైన్యం కాలికి బుద్ధి చెప్పింది. ఈ ఘోర రణం కాటమరాజు విజయంతో ముగిసింది. ఈ కథకు యాదవులు భారతమని పేరు.

### 9.2.3. బొబ్బిలి యుద్ధం:

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక ప్రముఖమైన ఘట్టం ఈ బొబ్బిలి యుద్ధం. 1757 జనవరి 24న బొబ్బిలి సంస్థాన సైన్యానికి, ఫ్రెంచి, విజయనగర సంస్థాన సంయుక్త సైన్యానికీ మధ్య జరిగిన యుద్ధమే బొబ్బిలి యుద్ధంగా పేరుగాంచింది.

బొబ్బిలి కోట విశాఖపట్నానికి ఈశాన్యంగా 140 మైళ్ళ దూరంలో ఉండి, 18వ శతాబ్ది మధ్యకాలంలో బొబ్బిలి

జమిందారుగా ఉన్న రాజు గోపాల కృష్ణ రంగారావుకు, విజయనగర సంస్థానం ప్రభువు పూసపాటి పెద విజయ రాజుకూ మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం వుండేది. రెండు రాజ్యాల సరిహద్దుల వద్ద ఉన్న వాగుల్లోని నీటిని బొబ్బిలి ప్రజలు బలవంతంగా తీసుకు వెళ్ళేవారు. తన బలం చాలనందున విజయ రామ రాజు ఈ దోపిడీని ఎదుర్కొనలేక పోయేవాడు. ఫ్రెంచి కమాండర్ ఇన్ చీఫ్ బుస్సీ వద్ద తనకున్న పలుకుబడిని ఉపయోగించుకుని, పక్కలో బల్లెంలా వున్న తన పొరుగు రాజును ఇక్కడి నుండి తరిమి కొట్టాలని పెద విజయ రామరాజు భావించాడు. బొబ్బిలి పాలకులు మిగిలిన జమీందార్ల లాగ ఫ్రెంచి వారితో సత్సంబంధాలు నెలకొల్పుకోక, తమ చర్యల ద్వారా ఫ్రెంచి కమాండర్ ఇన్ చీఫ్, మార్క్ శత్రుత్వాన్ని పెంచుకున్నారు. ఈ చర్యలన్నిటి పర్యవసానమే బొబ్బిలియుద్ధం. భారతదేశ చరిత్రలో అంతకుముందెప్పుడూ చూడని సంఘటనను ఆవిష్కరించిన యుద్ధం ఇది. అనేక జానపద గాథలకు ప్రాణం పోసిన బీభత్సకాండ ఈ యుద్ధంలో జరిగింది.

**బొబ్బిలికి, విజయనగరానికి మధ్య జరిగిన ఘర్షణలు:**

18వ శతాబ్దంలోని బొబ్బిలికి విజయనగరానికీ మధ్య అనేక ఘర్షణలు, యుద్ధాలూ జరిగాయి ఎక్కువగా బొబ్బిలి సంస్థానమే విజయం సాధిస్తూ ఉండేది, వాటిలో ప్రధానమైనవి:

1. పెద విజయరామరాజు, నారాయణ పట్నాన్ని ఆక్రమించేందుకు సాగి నారాయణరాజు నేతృత్వంలో సైన్యాన్ని పంపించాడు. ఆ సైన్యం బొబ్బిలి పరగణా గుండా పోతున్నప్పుడు, బొబ్బిలి సైన్యం అడ్డగించి ఓడించి వెనక్కు పంపింది.
2. రాజు తన కింద వున్న పాలెగాళ్ళను కూడ గట్టి పెద్ద సైన్యంతో బొబ్బిలిపై దాడి చేశాడు. మళ్ళీ బొబ్బిలి సైన్యం చేతిలో ఓడిపోయాడు. బొబ్బిలి సైన్యం రాజును వెంటాడగా, అతడు పారిపోయి కమిలీ కోటలో తలదాచుకుంటాడు.
3. రాజు పార్వతీపురానికి దగ్గర్లోని బెలగం వద్ద కోటను నిర్మించి నారాయణ పట్నాన్ని ఆక్రమించాడు. అక్కడి నుండి బొబ్బలిపై దాడి చేసాడు గాని విఫలుడయ్యాడు. ఈ యుద్ధాల్లో గానీ, నారాయణ పట్నంలో మురికి నీళ్ళు తాగడం వలన వచ్చిన రోగాల వలన గానీ 4,000 మంది దాకా సైనికులను కోల్పోయాడు. నారాయణ పట్నం ప్రభువు తన తప్పును అంగీకరించి క్షమించమని అడిగాక పరిహారం వసూలు చేసి అతడి రాజ్యాన్ని అతడికి ఇచ్చివేశాడు.
4. విజయ రామరాజు మళ్ళీ తన సైన్యాన్ని కూడగట్టి బొబ్బిలిపై దాడి తలపెట్టాడు. ఈ సారి అతడు దేశస్తులను కూడగట్టాడు. దేశస్తులంటే ఐరోపా వారితో యుద్ధాల్లో పాల్గొన్న దేశీయులు. కానీ బొబ్బలిని ఓడించడం సాధ్యం కాని పని. వారు రాజును హెచ్చరించారు. తన దీవాను బుర్రా బుచ్చన్న సలహా మేరకు తాను కాక, పూసపాటి రామ చంద్ర రాజు సారధ్యంలో సైన్యాన్ని దాడికి పంపించాడు. బొబ్బిలి సైన్యం వారిని ఓడించి, రామచంద్ర రాజు తలను నరికి, దానికి తిరునామాలు పెట్టి, విజయనగరానికి పంపారు.

ఎన్ని ప్రయత్నాలు చేసినా బొబ్బిలిపై పై చేయి (విజయం) సాధించలేక పోయాడు విజయరామరాజు.

**యుద్ధానికి దారి తీసిన సంఘటనలు:**

హైదరాబాద్ నిజాంసలాబత్ జంగ్ బుస్సీని ఉద్యోగం నుండి తొలగించిన వార్త తెలిసిన తరువాత విజయ నగరం రాజులు తప్ప, ఉత్తర కోస్తా జమీందారులందరూ ఫ్రెంచివారికి శిస్తులు చెల్లించటం మాని వేశారు. బుస్సీ నిజాముతో రాజీ కుదుర్చుకొని సర్కారు జిల్లాల పర్యటనకు వచ్చాడు. 1757వ సంవత్సరంలో బుస్సీ నిజాము సంస్థానము నుండి బయల్దేరి మచిలీపట్నం మీదుగా రాజమండ్రి చేరుకొని కోటిపల్లి వద్ద మకాం వేశాడు. పాలెగాళ్లను, జమీందార్లను, సంస్థానాధీశులను

వచ్చి తనను కలవమని కబురు పంపాడు. బొబ్బిలి పాలకుడు రంగారావు తప్ప, విజయ రామరాజుతో సహా అందరూ వచ్చి కలిశారు. విజయ రామరాజు దీన్ని అవకాశంగా తీసుకొని రంగారావుకు వ్యతిరేకంగా బుస్సీ వద్ద, అతడి దివాను హైదర్ జంగు వద్దా ఆరోపణలు చేశాడు. మీరంటే వారికి లెక్కలేదని అందుచేత మీ వద్దకు వచ్చి కలవలేదనీ, ఫ్రెంచి వారికి ఇవ్వాల్సిన శిస్తు సరిగా చెల్లించడం లేదని వారికి నూరి పోసాడు. వారి రాజ్యానికి పొరుగున వున్న తనకు అనేక రకాల ఇబ్బందులు కలుగ జేస్తున్నారని వారిని బొబ్బిలి నుండి వెళ్ళగొట్టి, దాన్ని తనకు స్వాధీనం చేస్తే శిస్తు సక్రమంగా చెల్లిస్తాననీ అతడు బుస్సీకి చెప్పాడు. దాంతో బుస్సీ బొబ్బిలి వదలిపెట్టి పోవాలని రంగారావును ఆదేశించాడు. బొబ్బిలి స్థానంలో అంతకంటే పెద్దదైన వేరే స్థలానికి పోయి రాజ్యాన్ని స్థాపించుకోవచ్చని ప్రతిపాదించాడు. రంగారావు దాన్ని అవమానంగా భావించాడు.

విజయ రామరాజు తాను బుస్సీకు కట్టాల్సిన కప్పం పది లక్షలూ కట్టేశాడు. అంతేకాక, మూడు లక్షల లంచం హైదర్ జంగుకు ఇచ్చి, బుస్సీకి బొబ్బిలిపై మనను విరిచేందుకు సహకరించమని చెప్పాడు, హైదర్ జంగు అందుకు అంగీకరించాడు.

**ఫ్రెంచి సిపాయిల వధ:** కొన్ని రోజుల తరువాత బుస్సీ కొందరు సిపాయిలను ఒక దూర ప్రదేశానికి పంపించాల్సి వచ్చింది. వాళ్ళు బొబ్బిలి రాజ్యం గుండా వెళ్ళవలసి వచ్చినప్పుడు అందుకు తగిన అనుమతులు కూడ తీసుకున్నారు. విజయ రామరాజు కుటిల రాజకీయ చాతుర్యం కావచ్చు, రంగారావు ప్రణాళిక కావచ్చు. ఆ సిపాయిలపై దాడి జరిగింది. 30 మంది చనిపోయారు, అనేక మంది గాయపడ్డారు. బొబ్బిలి సంస్థానంపై చర్య తీసుకోవాల్సిన అవసరాన్ని బుస్సీకి తెలియజేయడానికి విజయ రామరాజు ఈ సందర్భాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. బొబ్బిలిని అణగ దొక్కేసి, పాలెగాళ్ళను అక్కడి నుండి తరిమెయ్యాలని బుస్సీ నిర్ణయించుకున్నాడు.

**ఇబ్రహీమ్ ఖాన్ ఉదంతం:** ఇబ్రహీం ఖాన్ శ్రీకాకుళంలో ఫ్రెంచివారి తరపున ఫౌజుదారు, బుస్సీకి నిజాముతో సంబంధాలు దెబ్బతిన్న సమయంలో అతడు బుస్సీపై తిరుగుబాటు చేశాడు. రాజమండ్రి కోటలో సైనికులను రెచ్చగొట్టి తిరుగుబాటు చేయించాడు. ఫ్రెంచివారు వసూలు చేసిన శిస్తులు వెనక్కి ఇచ్చేయాలని అతడు డిమాండ్ చేశాడు. బుస్సీ రాజమండ్రి చేరుకోగానే అతడు భయపడి పారిపోయి, బొబ్బిలి రాజుల వద్ద శరణు కోరాడు.

ఈ సంఘటనలన్నీ బుస్సీకి బొబ్బిలిపై ఉన్న కోపాన్ని పెంచి, వారి పట్ల అతడికి ఉన్న శత్రు భావనను మరింతగా పెంచి, అతణ్ణి యుద్ధం దిశగా నడిపించాయి.

**యుద్ధాన్ని నివారించేందుకు బొబ్బిలి చేసిన ప్రయత్నాలు:** యుద్ధాన్ని నివారించేందుకు బొబ్బిలి సంస్థానం ప్రయత్నాలు చేసింది. విజయ రామరాజు తన కంటే ముందే బుస్సీ వద్ద చేరాడని, ఇప్పుడు తాను వెళ్ళి అనవసరమైన ఘర్షణ అవుతుందని భావించి బుస్సీని కలవడానికి వెళ్ళకూడదని రంగారావు నిశ్చయించుకున్నాడు. కానీ అది బుస్సీకి అతడి దివానుకూ కోపం కలిగించిందని గ్రహించిన రంగారావు ఆ సంగతిని బుస్సీకి వివరించాలని అతడు ప్రయత్నించాడు.

హైదర్ జంగుకు, రాజుకూ మధ్య జరిగిన లంచం ఒప్పందం తన వేగుల ద్వారా రంగారావుకు తెలిసింది. హైదర్ జంగుకు విషయం తెలియచెప్పేందుకు రంగారావు తన రాయబారి పంతెన బుచ్చన్నను పంపించాడు. జంగు మన మాట వినకపోతే, మచిలీపట్నం వెళ్ళి అక్కడి ఫ్రెంచి అధికారి ఎం. కమాండరును కలిసి విషయం చెప్పమని అన్నాడు. కమాండరు మన గురించి, మన ఆత్మాభిమానం గురించి తెలిసినవాడు. అతడు మనకు సాయం చేస్తాడు అని బుచ్చన్నకు చెప్పి ఇద్దరి పేరునా ఉత్తరాలిచ్చి పంపించాడు .

బుచ్చన్న పెద్దాపురం చేరుకుని హైదరు జంగును కలిశాడు, అతడు బుచ్చన్న చెప్పే విషయాన్ని వినలేదు. నువ్వు ఇక్కడికెందుకు వచ్చావ్? మీ ప్రభువు ఇక్కడికి రావాల్సిన అవసరం లేదని, మాతో స్నేహం చేయాల్సిన అవసరం లేదని అనుకున్నాడు గదా, నువ్వు నీ ప్రభువు దగ్గరికే పో అని చెప్పాడు. మా దొర కంటే ముందే మా శత్రువు విజయరామరాజు బుస్సీ వద్దకు రావడంతో ఆయన రాలేదని, విజయ రామరాజుకు ఇచ్చిన గౌరవమే మా ప్రభువుకూ ఇస్తామని మీరు చెప్తే రావడానికి ఆయన సిద్ధంగానే ఉన్నాడని బుచ్చన్న చెప్పాడు, అతడు రానవసరం లేదు, ముందు మీరు కోట ఖాళీ చేసి వెళ్ళండి అని హైదర్ జంగు చెప్పాడు. మా ఒంట్లో ఊపిరుండగా కోట ఖాళీ చెయ్యడం జరుగదు అని చెప్పి బుచ్చన్న వెళ్ళిపోయాడు.

బుచ్చన్న అక్కడి నుండి నేరుగా మచిలీపట్నం వెళ్ళి కమాండరును కలిసి, ఉత్తరం ఇచ్చి జరిగింది చెప్పాడు. కమాండరు బుస్సీకి తాను ఉత్తరం రాసి, తన అనుచరుణ్ణి బుచ్చన్నకు తోడిచ్చి పెద్దాపురం పంపించాడు, బొబ్బిలి ప్రజలు మంచివాళ్ళని, విజయ రామరాజు చెప్పుడు మాటలు వినవద్దని ఆ ఉత్తరంలో రాశాడు. బుస్సీ ఆ ఉత్తరాన్ని చదిని సానుకూలంగానే మాట్లాడాడు గానీ, అతని చర్యల్లో ఆ సానుకూలత కనిపించలేదు.

ఆ సాయంత్రం విజయ రామరాజు హైదర్ జంగును కలిసి, చూసారా నేను చెప్పిందే నిజమైంది. రంగారావు మిమ్మల్ని కలవడానికి రాకుండా, కమాండరు ద్వారా బుస్సీకి ఉత్తరం పంపించాడు, అతడికి మీరంటే లెక్కలేదు అని అతణ్ని రెచ్చగొట్టాడు. బుస్సీ కశింకోట నుండి బయలు దేరి దేవులపల్లిలో మకాం పెట్టినప్పుడు రంగారావు చెలికాడు అయిన వెంకయ్య ద్వారా గౌరవంగా అతడివద్దకు పాన్ సుపారీ పంపించాడు. హైదర్ జంగు అతణ్ణి మీ దొర కోటను వదలి పెట్టి వెళ్ళాడా? లేదా? అని గద్దించాడు. మాకు కోటను విడిచి వెళ్ళే అవసరం లేదని, వెళ్ళే ప్రసక్తే లేదని అతడు తెగేసి చెప్పి వెళ్ళిపోయాడు.

బుస్సీ అక్కడి నుండి సైన్యంగా వెళ్ళి కోట ఎదురుగా శిబిరం విడిచాడు, అప్పుడు కోట గోడపై నుండి వెలమ దొరలు మొగలు చక్రవర్తి తమకు బహూకరించిన నౌబత్తును (దుందుభి భేరి వంటి పెద్ద చర్మ వాయిద్యం) మోగించారు. హైదర్ జంగుకు అది విని ఆగ్రహం కలిగింది. హుసేన్ అలీఖాన్‌ను రాయబారిగా కోటలోకి పంపించాడు. నౌబత్తును ఆపి, కోటను ఖాళీ చేసి వెళ్ళమని రాయబారి రంగారావుకు చెప్పాడు.

**సర్వాయి పాపన్న కథ: (Sardar Sarvai Papanna)**

పూర్వపు వరంగల్ జిల్లా, ప్రస్తుత జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం, ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి పేరు నాసగోని ధర్మన్న గౌడ్. చుట్టు పక్కల గ్రామస్థులు గౌరవంతో ధర్మన్న దొర అని పిలిచేవారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోయారు. అతని తల్లి పేరు సర్వమ్మ, అందరు అతన్ని పాపడు అని పిలిచేవారు. పాపన్న ఎల్లమ్మకు పరమ భక్తుడు. అతను శివున్ని కూడ ఆరాధించేవాడు. తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు.

**జననం, బాల్యం, స్నేహితులు:**

ధూళిమిట్ట శాసనం ప్రకారం ఆగష్టు 18, 1650వ సంవత్సరంలో పాపన్న వరంగల్ జిల్లాలో గౌడ్ కులంలో జన్మించాడు. గౌడ చరిత్రలో ముఖ్యమైన స్థానం ఉన్న వ్యక్తి ధూల్మిట్ట. వీరగల్లు శాసనంలో ఇలావుంది. "బండిపోత గౌడ షాపూర్ ఖిలా పులి గౌడ యేబడి రొడ్డి షబ్బారాయుడు, పౌదరు పాపడు.

బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గమనించేవాడు. తల్లి సర్వమ్మకు ఒక్క కొడుకు కావడంతో గారాబంగా పెంచింది. పాపన్న వంశం శైవ మతస్థులై (శివ భక్తులు) (గౌడ కులం వారు అందరు) నిత్యం పూజలు సంప్రదాయాలను తరాలుగా వస్తున్న సంప్రదాయ జీవితాన్ని యుక్త వయస్సు వచ్చే నాటికి క్రమక్రమంగా

వ్యతిరేకించాడు. ఇతర కులాల వారితో తిరిగేవాడు. వీరిలో చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కల పెరుమాళ్ళు, దూదేకుల పీరు, కొత్వాల్ మీరు సాహెబ్ పాపన్న ప్రధాన అనుచరులు. తల్లి సర్వమ్మ కోరికతో తాటి చెట్లు ఎక్కి (కలాలి) కల్లు గీయడం, కులం పని చెయ్యడం స్నేహితులు, పాపయ్య కల్లు తాగడం, లోకం తీరు, చుట్టుప్రక్కల జరుగుచున్న విషయాల గురించి గంటల తరబడి మాట్లాడుకునేవారు.

**హైదరాబాద్ తురుష్క ఆగడాలు:**

పదహారవ శతాబ్దంలో బహమనీ సుల్తానే ఐదు చిన్న రాజ్యాలుగా విడిపోయింది. గోల్కొండ కుతుబ్ షాహి రాజ వంశం నియంత్రణలోకి వచ్చింది. వారు పరిపాలించటానికి చాలా తేలికైన ప్రాంతాన్ని వారసత్వంగా పొందారు. తురుష్క సైనికులు భూమి పన్నుల (రకాలు, శిస్తు) వసూలు విధానంలో ప్రజలను చాలా హింసాత్మకంగా ఇబ్బందులకు గురిచేస్తూ, పీడించి, రకరకాల పేర్లతో శిస్తులు వసూలు చేసేవారు. కులాల మతాల పేర్లతో కూడా శిస్తులు వసూలు చేసేవారు. అలాగే గౌడ కులం వారికి తాటి చెట్లకు పన్ను వేశారు. తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని వెళ్ళే దారిలో పాపన్న కల్లు అమ్ముకునే మండువాలో తురుష్క సైనికులు కల్లు తాగి డబ్బులు ఇవ్వకుండా హేళనగా నవ్వుకుంటూ వెళ్ళేవారు. రెండు, మూడు సార్లు అలాగే జరిగింది.

**మొదటి తిరుగుబాటు:** తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని, కల్లు తాగి డబ్బులు ఇవ్వకున్నా పాపన్న పెద్దగా పట్టించుకునేవాడు కాదు. తురుష్క సైనికులు నా దగ్గర కల్లు తాగుతున్నారు. రాజు గారి సైనికులు అంటే చాలా గౌరవనీయులు. అయినా సైనికులు రాజు గారికి శిస్తుల లెక్కలు అప్పగించాలి కదా, కల్లుకు డబ్బులు ఇచ్చిన లెక్క తగ్గగు కదా పోనీలే అనుకునే వాడు. ఒక రోజు సైనికులు పాపన్న వద్ద కల్లు తాగి వెళ్ళటానికి సిద్ధం అవుచండగా, కల్లు మండువాకు వస్తున్న పాపన్న స్నేహితుడు ఒకడు 'ధనరాసులు ఉన్నా కల్లు తాగి డబ్బులు ఇవ్వలేని నిరుపేద తురుష్క సైనికులు వెళ్ళిపోవుటకు సిద్ధం అయ్యారా" అని సరసంగా అన్నాడు.

అందుకు తురుష్క సైనికుల్లో ఒకడు, కోపంతో పాపన్న స్నేహితుడిని తన్నటానికి కాలు ఎత్తాడు. అది చూచి ఆ క్షణంలో కోపోద్రిక్తుడైన పాపన్న తన వద్ద కల్లు గీయడానికి ఉపయోగించే గీత కత్తి, మారు కత్తిలో ఒకదానితో ప్రాణ స్నేహితుణ్ణి తన్నటానికి కాలు ఎత్తిన సైనికుడి మెడ నరికాడు. దాంతో మిగతా సైనికులు పాపన్న మీదికి యుద్ధానికి రావడంతో, ఎంతో బలవంతుడైన పాపన్న వారిని కూడా అంత మొందించాడు. ఇక అక్కడ మిగిలింది పాపన్న ప్రాణ స్నేహితులు, సైనికుల గుర్రాలు, వసూలు చేసిన రాజు గారి ధనరాసులు మాత్రమే. పేదవారిని పీడించి వసూలు చేసిన డబ్బులు వారికీ ఉపయోగించాలి అంటు పాపన్న స్నేహితులతో, గుర్రాలతో డబ్బులతో ఇంటికి చేరాడు. తురుష్క రాజ్యంలో విప్లవ కారుడు అయ్యాడు.

అప్పటినుండి తురుష్క సైనికులు శిస్తులు వసూలు చేసుకొని వెళ్ళే దారిలో పాపన్న అతని స్నేహితులతో కలిసి తిరుగుబాట్లు ప్రారంభించాడు. అలా మొదలైన తిరుగుబాటులో ఆయుధాలు, గుర్రాలు, డబ్బులు కూడా సమకూర్చుకున్నాడు. యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు. పేదవారికి డబ్బులు సహాయం చేయడంతో పాపన్న పేరు జనగాం ప్రదేశంలో మారుమ్రోగింది. గ్రామాల్లోని యువకులు పాపన్న వద్ద సైనికులుగా చేరారు. వారికి యుద్ధ విద్యలు నేర్పించి, అతి తొందరలోనే 3,000 మందిని సొంత సైనికులుగా సమకూర్చుకున్నాడు. వారి దాడుల వల్ల కలిగే నష్టం కారణంగా వారిని స్థానిక జమీందార్లు (వంశ పారంపర్య ఆధిపతులు, భూస్వాములు) ఫౌజుదార్లను తరిమి కొట్టారు.

**భువనగిరి కోటపై తిరుగుబాటు:**

తెలంగాణాలో మొఘల్‌రాజు అప్పటి పాలకుల, అంతకంతకు పెరుగుతున్న ముస్లింల ఆధిపత్యాన్ని అంతం చెయ్యాలని, తాబేదారులు, జమీనుదారులు, జాగీర్దారులు, దొరలు, భూస్వాములు చేసే దురాగతాలను గమనించి గోల్కొండ కోటపై బడుగువారి జెండాను ఎగుర వేయాలని నిర్ణయించి ఆ దిశగా ప్రస్థానం ప్రారంభించాడు. అయితే పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం కాని, ధనం కాని, అధికారం కాని లేవు, గెరిల్లా సైన్యాన్ని తయారుచేసి, ఆ సైన్యం ద్వారా మొగలు సైన్యంపై దాడిచేసి, తన సొంత ఊరు ఖిలాషాపూర్‌ని రాజధానిగా చేసుకొని 1675వ సంవత్సరంలో సర్వాయి పేటలో తన రాజ్యాన్ని స్థాపించాడు. అతని తరఫున పోరాడటానికి గెరిల్ల సైన్యాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలను పెంచగల సామర్థ్యం సంపాదించాడు. అతడు, 10,000 నుంచి 12,000 వరకు తన సైన్యాన్ని విస్తృత పరిచాడు.

పాపన్న ఛత్రపతి శివాజీకి సమకాలికుడు. శివాజీ ముస్లింల పాలన అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణాలో ముస్లింల పాలన అంతానికి పోరాడాడు. 1687-1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు. పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు. 1678 వరకు తాటికొండ, వేముల కొండలను తన అధీనం లోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు.

ఒక సామాన్య వ్యక్తి శతృదుర్భేద్యమైన కోటలను వశపర్చుకోవడం అతని వ్యూహానికి నిదర్శనం, సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి దాదాపు 20 కోటలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. అతని ఆలోచనలకు బెంబేలెత్తిన భూస్వాములు, మొగలాయి తొత్తులైన నిజాములు, కుట్రలు పన్ని సైన్యాన్ని బలహీన పర్చారు. 1700-1705 మధ్య కాలంలో ఖిలాషా పురంలో మరొక దుర్గం నిర్మించాడు. ఒక్కో మెట్టు ఎక్కుతూ దాదాపు 12 వేల సైనికులను సమకూర్చుకొని ఎన్నో కోటలను జయించి చివరకు గోల్కొండ కోటను స్వాధీన పర్చుకొని 7 నెలల పాటు అధికారం చెలాయించాడు. తెలంగాణలో మొగలాయి విస్తరణను తొలిసారిగా అడ్డుకున్నది. సర్వాయి పాపన్న, అతని సామ్రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, హుజురాబాద్ వరకు విస్తరించింది. పాపన్న ముస్లిం మతానికి చెందిన ఒక స్త్రీని వివాహం చేసుకున్నాడు. ఆమె భువనగిరి కోట ఫౌజురార్ (మిలటరీ గవర్నర్) సోదరి. భువనగిరి కోటను రాజధానిగా చేసుకొని అతను ముప్పై సంవత్సరాలు పరిపాలించాడు. జానపద కళాకారులు తరతరాలుగా 3, 4 వందల ఏళ్ళు గడిచినా, జానపద కథలలో పాపన్న చరిత్ర ఇప్పటికీ స్థానికంగా పాడతారు. జానపద, భాషా శాస్త్రాన్ని ఆధ్యయనం చేసిన సందర్భంలోనే చాలా సాక్ష్యాలు సేకరించబడ్డాయి.

పాపన్న ఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చిన వాడు కనుక అతనికి ప్రజల కష్టనష్టాలన్నీ తెలును. అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు. ఖజానా కొరకు అతను జమిందార్, సుబేదార్లపై తన గెరిల్లా సైన్యంతో దాడి చేయించేవాడు. పాపన్న అనేక ప్రజామోద యోగ్యమైన పనులు చేశాడు. అతని రాజ్యంలో సామాజిక న్యాయం పాటించాడు. తాటికొండలో చెక్ డాం నిర్మించాడు. అతను ఎల్లమ్మకు పరమ భక్తుడు. కనుకనే హుజూరాబాద్‌లో ఎల్లమ్మ గుడి కట్టించాడు. అది రూపం మారినా నేటికీ అలాగే వుంది.

**ఇతరుల కథనం ప్రకారం:**

మొఘలు చక్రవర్తి అయిన షాజహాన్ కుతుబ్ షాహి సుల్తాన్ నుండి ఖచ్చితమైన ఆదేశాలు ప్రారంభించాడు. అతని కుమారుడు ఔరంగజేబును గోల్కొండలో ప్రాతినిధ్యం వహించడానికి పంపాడు. ఔరంగజేబు చివరికి 1687వ సంవత్సరంలో

ఈ ప్రాంతంపై పూర్తి నియంత్రణ సాధించాడు. పాపన్న గెరిల్ల సైన్యంతో మొగల్ సైన్యంపై దాడి చేస్తున్నాడని ఔరంగజేబుకు తెలిసింది. అతడు రుస్తుం దిల్-ఖాన్‌కు బాధ్యతలు అప్పగించాడు. రుస్తుం దిల్ ఖాన్ యుద్ధానికి ఖాసింఖన్‌ను పంపించాడు. షాపూర్ వద్ద ఇరుసైన్యాలు తలపడ్డాయి. నెలల పాటు యుద్ధం జరిగింది. చివరికి రుస్తుం దిల్‌ఖాన్ రంగంలోకి దిగాడు. సువూరు 3 నెలల పాటు యుద్ధం జరిగింది. పాపన్న తన ప్రాణ స్నేహితుడిని కోల్పోయాడు. దాంతో ఆయన యుద్ధాన్ని విరమించుకొని, అజ్ఞాతం లోకి వెళ్ళిపోయాడు. మొగలు సైన్యాలు అతడి కోసం వెతకడం ప్రారంభించాయి. అయితే పాపన్న తన సొంత ఊరు జనగామకు వెళ్ళి అక్కడ గౌడ కులం వారు ఎక్కువగా ఉండే చోట జీవితం గడిపాడు. 1707వ సంవత్సరంలో ఔరంగజేబు మరణించిన తరువాత గోల్కొండలో సింహాసనాన్ని అధిష్టించాడు. కొత్తగా రాజు అయిన తరువాత దక్కన్ పాలకుడు కంబక్ష్‌ఖాన్ బలహీన పాలనను చూసిన పాపన్న 1708 ఏప్రిల్ 1 లో వరంగల్ కోటపై దాడి చేశాడు. అయితే ఈ దాడిలో పాపన్న పట్టుబడ్డాడు. శత్రువు చేతిలో చావడం ఇష్టం లేని పాపన్న తన బాకుతోనే గుండెలో పొడుచుకొని చనిపోయాడు 1710వ సంవత్సరంలో లో పాపన్న తలని గోల్కొండ కోట ముఖద్వారానికి వేళ్ళాడదీసారు.

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లండన్‌లో ఉన్న కేంబ్రిడ్జ్ యూనివర్శిటి పాపన్న మహారాజ్ చరిత్రపై అధ్యయనం చేయించి పుస్తకాలను ముద్రించింది. సర్దార్ పాపన్న ముఖచిత్రంలో కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ రెండు పుస్తకాలలో (ది న్యూ కేంబ్రిడ్జ్ హిస్టరీ ఆఫ్ ఇండియా, ది సోషల్ హిస్టరీ ఆఫ్ ది డెక్కన్) చరిత్రను ముద్రించింది. బ్రిటీష్ ప్రభుత్వం లండన్‌లోని “విక్టోరియా అండ్ ఆల్బర్ట్” మ్యుజియంలో సర్దార్ పాపన్న మహారాజ్ శాశ్వత శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేసింది.

ఇవేకాక పాపన్న చరిత్రపై మరికొన్ని కథనాలు కూడ ఉన్నాయి. ఈ విధంగా సర్దార్ పాపన్న పశువులను కాచే ఒక సామాన్య వ్యక్తిగా, తల్లి యొక్క పెంపకంలో గారాబంగా పెరిగిన పాపన్న ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఆకళింపు చేసుకొని, తురుష్కుల యొక్క ఆగడాలను కట్టిపెట్టటానికి తన స్నేహితులతో కలిసి గెరిల్లా సైన్యంగా ఏర్పాడి తురుష్కులపై తిరుగుబాటు చేసి వారిని జయించాడు. అంతేకాక మొఘలు రాజుల పరిపాలన కాలంలో ముస్లింల ఆధిపత్యాన్ని అంతం చెయ్యటానికి, పేదల పక్షపాతిగా అనేక దానధర్మాలు చేస్తూ, గోల్కొండ కోటపై బడుగువారి జెండాను ఎగురవేయాలని పూనుకొన్న ధీశాలి, తన గెరిల్లా సైన్యంతో అనేక ప్రాంతాలను ఆక్రమించి, సర్వాయి పేట ప్రారంభించి దాదాపు 20 కోటలను స్వాధీనం చేసుకొని ఆనాటి సామాన్య పశువుల కాపరి పాపన్న సర్దార్ పాపన్న గౌడ్‌గా పేరుప్రఖ్యాతలు సంపాదించుకొని చరిత్రలో మిగిలిపోయాడు.

## 9.3. నమూనా ప్రశ్నలు:

1) వీరగాథల స్వరూప స్వభావాలను గురించి వివరించండి

2) వీరగాథలను వర్గీకరించి వివరించండి

3) క్రింది వాటిలో రెండింటిని గురించి వివరించండి?

(1) పల్నాటి వీర చరిత్ర (2) కాటమ రాజు కథ (3) బొబ్బిలి యుద్ధం (4) సర్వాయి పాపని కథ

## 9.4. ఆధార గ్రంథాలు:

1) ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్‌విఎస్. సుందరం.

2) తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు.

- డా॥ కె. లలిత కుమారి

పాఠం - 10

# గద్యాఖ్యానాలు

## 10.0. లక్ష్యం:

జానపద సాహిత్యంలో గద్యాఖ్యానాల కున్న ప్రాధాన్యతను తెలుసుకోవడం. పురాగాథలు, ఐతిహ్యాలు, జానపద కథల గురించి సోదాహరణంగా తెలుసుకోవడం.

**విషయసూచిక:**


**10.1. గద్యాఖ్యానాలు**

**10.2. పురాగాథలు**

**10.3. ఐతిహ్యాలు**

**10.4. జానపద కథలు**

**10.5. నమూనా ప్రశ్నలు**

**10.6. ఆధార గ్రంథాలు**


## 10.1. గద్యాఖ్యానాలు:

మౌఖిక జానపద విజ్ఞానంలోని ప్రధాన శాఖలు జానపద కవిత్వం, గద్యాఖ్యానాలు, సామెతలు, పొడుపు కథలు, జానపద భాష. వీటిలో మొదటిదైన జానపదకవిత్వం-జానపద గేయం, జానపద కథాగేయాలుగా విభజించబడితే రెండవదైన గద్యాఖ్యానాలు - కథలు, ఐతిహ్యాలు, పురాణాలుగా విభజించబడ్డాయి. జానపద సాహిత్యం అనగానే వెంటనే స్ఫురించేవి గేయాలే. గేయాలే కాకుండా గద్య రూపంలో ఉన్న కథలు కూడా జానపదసాహిత్యంలో ఉన్నాయి. గద్య రూపంలో, కథన రూపంలో ఉండేవే గద్యాఖ్యానాలు. ఆఖ్యానం అంటే కథ. వీటిని గద్య కథనాలు అని కూడా వ్యవహరిస్తారు. పేదరాశి పెద్దమ్మ కథలు, చందమామ కథలు, కాకమ్మ కథలు ఇలా అనేక పేర్లతో సామాన్య జనం పిలుచుకున్నా శాస్త్రంగా అధ్యయనం చేసేవారు మాత్రం పురాణాలు, ఐతిహ్యాలు కూడా పరిశీలించారు. అయితే పురాణాలంటే అష్టాదశ పురాణాలు మాత్రమే అనే భావన కలిగిన వారు జానపద సాహిత్యంలోని పురాణ గాథలను "పురాగాథలు" అన్నారు. పురాణం, కథ గురించి జరిగినంత పరిశోధన ఐతిహ్యం గురించి జరగలేదు. పురాగాథ, ఐతిహ్యం, కథ ఈ మూడింటిని వేరువేరుగా చెప్పటం కష్టమనుకున్నవారు పురాణ కథ, ఐతిహ్య కథ అని పిలిచారు. ఏది ఏమైనా ఎక్కువ ప్రజాదరణ పొందిన వాగ్రూపంలో ప్రచారం జరిగిన గద్యరూపమే గద్యాఖ్యానం.

కథ సరళంగా ఉండి, ఆసక్తిని కలిగిస్తూ, కల్పనా చాతుర్యంతో ఎక్కువ మందికి ప్రియంగా ఉంటుంది. ఐతిహ్యం కథ కంటే కొంచెం గంభీరంగా ఉంటుంది. ఇతిహాసం లేక చరిత్ర ఐతిహ్యానికి ఆధారం. కథ అంటే పూర్తిగా కల్పన కావచ్చు. కానీ ఐతిహ్యం అలాకాదు. ఎంతోకొంత చారిత్రికాంశం కలిగి ఉంటుంది. పురాణం మరింత గంభీరమైనది. ఆలోచనాత్మకంగా ఉంటుంది, ప్రజలలో గాఢంగా నమ్ముకొని పోయిన నమ్మకమై ఉంటుంది. పాత్రలు దేవతా మూర్తులుగా ఉంటారు. అందుకే ఐతిహ్యం, పురాణం సాహిత్యానికి కొంతదూరంగా ఉంటాయి. అందువల్ల జానపద సాహిత్యంగా గేయం, కథా గేయం, కథ, సామెత, పొడుపు కథలని మాత్రమే పరిగణిస్తారు. అదే మౌఖిక జానపద విజ్ఞానం అన్నప్పుడు మాత్రమే గద్యాఖ్యానాలని చేరుస్తారు.

## 10.2. పురాగాథలు:

పురాణాలు పూర్వ యుగాల జ్ఞానాన్ని అందిస్తాయి. పురాగాథల్లో, కథల్లో ఈ విజ్ఞానం కనిపించదు. విశ్వసృష్టికి సంబంధించిన ఆలోచనలు, నమ్మకాలు పురాణాల్లో ఉంటాయి. ధార్మిక పురుషులు, సాంస్కృతిక వీర పురుషులు, దేవతావ్యక్తులు పురాణాలలో నాయకులుగా ఉంటారు. ఒక్కోసారి పురాణ పురుషులు ఐతిహ్య వ్యక్తులు కావచ్చు, కొందరు చారిత్రక పురుషులు కావచ్చు. చరిత్రే సాంకేతిక భాషలో వికృత రూపం ధరిస్తే పురాణమవుతుందని విద్వాంసుల ఆలోచన. పురాగాథలలోని వృత్తాంతాలు నిజాలు కాకపోయినా మనిషి మనో వికాసాన్ని అర్థం చేసుకోవడానికి సహాయ పడతాయనడంలో సందేహం లేదు. వీటిలోని అద్భుత విషయాలను తొలగించి, వాటి వెనుక దాగి ఉండే విజ్ఞానాన్ని, సంస్కృతి స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే చరిత్ర పూర్వయుగాలను గురించి ఎన్నో విషయాలు తెలుస్తాయి.

పురాణానికి, మూఢ నమ్మకానికి భేదం ఉంది. పురాణాలలో విశేషమైన నమ్మకాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఒక్కోసారి పురాణాలే మూఢ నమ్మకాలుగా, మూఢ నమ్మకాలే పురాణాలుగా మారవచ్చు. పురాణాలకు, జానపదుల నమ్మకాలకు ఉండే సంబంధం కూడా పరిశీలించాలి. ఒక తరం మనుషులకు ఏదైనా విషయం మీద ఉండే నమ్మకం మరొక తరం వాళ్ళకు పురాణం అవుతుంది. ఈ విధంగా నమ్మకాలే పురాణాలుగా మారవచ్చు. పురాణంలో మత సంబంధమైన నేపథ్యం ఉండాలనే అభిప్రాయం ఉంది. ఒక సాంస్కృతిక ప్రదేశానికి చెందిన ప్రజల అవగాహనకు, మానవాతీత విషయాలను అర్థం చేసుకోవడానికి పురాణాలు సహాయం చేస్తాయని చెప్తూ, అర్థ సంబంధమైన వ్యవస్థకు సంబంధించిన శైలీ సంబంధ విషయాలుగా పురాణాలను నిర్వచించారు.

### 10.2.1. పురాగాథల లక్షణాలు:

జానపద పురాణాలు (పురాగాథలు) సాంప్రదాయకమైనవి. వీటికి చాలా ప్రాచీన సంప్రదాయం ఉంది. ఏ భాషకు చెందినవైనా, ఏ జాతికి చెందినవైనా ఈ పురాణాలు ప్రాచీన కాలం నుంచి ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తూ బాగా పాతబడిపోయాయి. మొదట ఒక వ్యక్తి ఆలోచన నుంచి పుట్టినా జానపద పురాణాలు సామూహిక ఆస్తిగా మారతాయి. ఒక సమాజం సంప్రదాయికంగా వ్యక్తం చేసే నమ్మకాల ఆధారంగా ఇవి ఏర్పడతాయి. ఇది పురాగాథల మొదటి లక్షణమైతే, కథన రూపంలో ఉండటం రెండవలక్షణం. అయితే కథలలాగా ఇవి నిర్దిష్ట రూపం కలిగి ఉండవు. ప్రధానవ్యక్తులు, ప్రధాన సంఘటనలు మాత్రమే ఉంటాయి. కథనమంతా వ్యక్తి, వ్యక్తికీ మారుతుంటుంది. కొన్ని పురాగాథలు చిన్న వాక్యరూపంలో కూడా ఉండవచ్చు. 'గుడ్ మార్నింగ్' అనేది ఒక సూర్యపురాణమే. సూర్యుడు ఉదయిస్తే శుభం కలుగుతుందనే నమ్మకం. పురాగాథలు వివరణాత్మకంగా ఉంటాయనేది మూడవ లక్షణం. కొన్ని వస్తువులను, నమ్మకాలను, ఆధారాలను, సంఘటనలను పురాగాథలు వివరిస్తాయి. దేవతాశక్తులు ప్రధాన పాత్రలుగా ఉండటం, మానవాతీత వ్యక్తుల మీద నమ్మకాన్ని బలపరచడం, సమాజంలోని వ్యక్తుల నడుమ మత సంబంధమైన సంబంధాలను పెంపొందించటం పురాగాథల లక్షణాలే.

### 10.2.2. పురాగాథల విభజన:

డిక్షనరీ ఆఫ్ ఫోక్‌లోర్‌లో ఆర్.ఎస్. బాగ్స్ జానపద విజ్ఞాన వర్గీకరణలో ఈ క్రింది పురాగాథల విభజన కన్పిస్తుంది.

బి 220 సృష్టికర్త, బి 230 దేవతలు, బి 240 విశ్వ సృష్టి, బి 250 మానవ సృష్టి, బి 260 జంతువుల సృష్టి, బి 270 వృక్షజాతుల సృష్టి, బి 280 జంతువుల లక్షణాలు, బి 290 వృక్షజాతుల లక్షణాలు.

**ముఖ్యమైన పురాణ జానపద పురాణ విభాగాలు:**

1. ప్రకృతిలో కాలానుగుణంగా సంభవించే మార్పులకు, ఋతువులకు సంబంధించినవి – వీటిలో సూర్యచంద్రాదులు పాత్రలు. అనేక పురాగాథల్లో సూర్యుడు పురుషుడు, చంద్రుడు స్త్రీ. తెలుగువారికి చంద్రుడు చందమామ – చందమామ రావే జాబిల్లి రావే అని మామను ఒక వస్తువుగానే భావిస్తారు.
2. ప్రకృతి వస్తువులకు సంబంధించినవి – సూర్యచంద్ర నక్షత్రాలు కాలగమనానికి సంబంధించిన ప్రకృతి వస్తువులు. ఇతర ప్రకృతి వస్తువులకు సంబంధించిన సంబంధించిన పురాగాథలివి. నదిని దేవతగా నిరూపించే పురాణాలు తెలుగులోనూ ఉన్నాయి. గోదావరి, కృష్ణమ్మ, కిన్నెరసాని మొదలైన నదులు వాగులు స్త్రీ రూపంగా జానపదుల కల్పనలో కనిపిస్తాయి. వనదేవత ఫలాలను ఇవ్వడం, వరాలను ప్రసాదించడం పరిచితమే.
3. ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించినవి: తుఫాను వచ్చినా, ఉప్పెన వచ్చినా, వాన వచ్చినా, వరద వచ్చినా, అగ్నిపర్వతం బ్రద్దలైనా మానవాతీతకృత్యంగా భావించడం సర్వసామాన్యం. పాతాళంలో ఉండే భయంకర రాక్షసాకార జీవుల వల్లే భూకంపాలు సంభవిస్తాయని కొన్ని పురాణాలు చెప్తాయి. పోలేరమ్మ వంటి దేవతల వల్లనే సాంక్రమిక రోగాలు సంభవిస్తాయని బలమైన నమ్మకం ఉంది. రాహుకేతువుల వల్ల గ్రహణం సంభవిస్తుందనే నమ్మకం.
4. విశ్వ సృష్టి: అనేక ప్రాచీన పురాణాలలో సృష్టిని సంబంధించిన వివరణ కన్పిస్తుంది. భూమి ఒక దేవతగా మన పురాణాలలో ఎన్నో విధాలుగా సాక్షాత్కరిస్తుంది. విశ్వం నీటిలో నుంచి పుట్టినట్లుగా కొన్ని పురాణాలు చెప్తాయి.
5. దేవతల సృష్టికి సంబంధించినవి: శివ, విష్ణు, రామ, కృష్ణ, పార్వతి, గణపతి, కుమారస్వామి మొదలైన వారి జననానికి సంబంధించిన కథనాలు భారతదేశానికంతా పరిచితమైనవే. ఈ దేవతలే కాక ప్రతి ఊరికీ, ప్రతి పల్లెకూ దేవుళ్ళున్నారు, దేవతలున్నారు. వాళ్ళ సృష్టికి సంబంధించిన పురాణాలున్నాయి.
6. మానవసృష్టి ప్రాణసృష్టి: ఈ రెండు పరస్పరం సంబంధం కలవిగా చెప్పబడుతుంటాయి. ఒక్కొక్కసారి మానవులు చెట్ల నుంచి కూడా పుట్టినట్లుగా పురాణాలలో ఉంటుంది. జంతువులకు మనుషులు జన్మించినట్లుగా ఉండే పురాణాలు అధికసంఖ్యలో దొరుకుతాయి.
7. పరివర్తనాత్మక పురాణాలు: రాళ్ళు మనుషులుగా మారటం, ఒక జంతువు మరొక జంతువు కావటం, మనిషి జంతువులుగా పరివర్తన చెందటం, ప్రకృతిలోని వస్తువులు మనుషులుగా మార్పు చెందటం కొన్ని పురాణగాథలలో కనిపిస్తుంది.
8. వీరులను గురించి, దేశాలను గురించి, స్థలాలను గురించి చెప్పేవి: చంద్రవంశం చంద్రుని నుంచి వచ్చినదనటం, సూర్యవంశం సూర్యుడి నుంచి వచ్చిందనటం, స్థల పురాణాలలో దేవతల పాత్రను అద్భుతంగా చెప్పటం కనిపిస్తుంది. వీటిలో అనేకం ఐతిహ్యాల నుంచి రూపుదాల్చినవే.
9. సాంఘిక సంస్థలకు, ఆచారాలకు సంబంధించినవి: సంఘంలోని ఆచారాలను, పద్ధతులను కల్పించినది దేవుడే అని చెప్పటం దానికి సంబంధించిన పురాణాలను చెప్పటం మనకు తెలిసిందే.
10. మరణానంతర జీవితాన్ని గూర్చినవి: మరణానంతర జీవితాన్ని గూర్చిన నమ్మకం ప్రపంచవ్యాప్తంగా ఉంది.

చనిపోయిన వారుండే నరకాన్ని, స్వర్గాన్ని రకరకాలుగా మనవారు ఊహించారు. యమ లోకంలో మనకోసం కాచుకొని ఉన్న దండన రకరకాల పురాణాలుగా ప్రచారంలో ఉంది.

11. రాక్షసులకు, పిశాచులకు సంబంధించినవి: మానవుని కల్పనా శక్తి ఎన్ని విధాల రూపమెత్త గలదో ఇవి నిరూపిస్తాయి. భయంకర రూపాలెన్నో మనిషి మస్తిష్కంలో జన్మ ఎత్తాయి. దేవరాక్షస సంగ్రామాలను అతి సామాన్య రీతిలో సరళంగా కూడా జానపదులు తమ పురాణాలలో వర్ణించారు.

12. ఐతిహాసిక సంఘటనలు: చాలా ప్రసిద్ధమైన ఉదాహరణలు ఏసుక్రీస్తు, బుద్ధుడు, బసవేశ్వరుడు మొదలైన వారికి సంబంధించినవి. వీరందరూ ఐతిహాసిక వ్యక్తులే, అయినా వారి జీవితాలకు ఎన్నో మహిమలను అంటగట్టి మన ప్రజలు వారిని పురాణ పురుషులుగా మార్చారు. ధార్మిక కర్మ మార్గాన్ని నిరసించి నిజమైన కర్మయోగిత్వమే కైలాసమని బోధించిన బసవేశ్వరుడ్ని వంగకాయలు లింగకాయలుగా మార్చే పురాణ వ్యక్తిగా చేశాడు పాల్కురికి సోమన. సోమన కాధారమైన 'బసవ గీతార్థ సమితి' రూపొందిన కాలానికే ప్రజలు బసవనను మహిమలు గల మహావ్యక్తిగా చేసేశారు. ఈ విధంగా కొన్ని చారిత్రక సంఘటనలు కూడా పురాణాలుగా రూపొందాయి.

జానపద పురాణాలు విశ్వవ్యాప్తమైనవి. అనేక ప్రదేశాల పురాణాలలో కూడా సమానాంశాలుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వస్తువులో, వివరణలో కూడా ఈ సమాన గుణాలు కనిపిస్తాయి. సృష్టికి సంబంధించిన పురాణాలు ప్రపంచమంతటా దర్శనమిస్తాయి. పురాగాథలు దివ్యవస్తువుల కథనాల నుంచి పుడితే వీటి వికాసం ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందని విద్వాంసులు భావించి ఆ పద్ధతుల్ని గుర్తించే ప్రయత్నాలు చేశారు.

1. ఒక విషయాన్ని రెండింతలు, మూడింతలు, నాలుగింతలు చేసి పురాగాథల్ని పెంచడం కనిపిస్తుంది.
2. జాతీయస్థాయిలో ప్రసిద్ధమైన పురాణాలను, వేరే భాషల నుంచి స్వీకరించిన పురాణాలను తమ ప్రాంతాలలోని విశిష్ట సంస్కృతి సంప్రదాయాల ననుసరించి మార్పులు చేయడం.
3. కొన్ని మూలకథా వస్తువుల నుంచి వివిధ పురాగాధలను కల్పించడం
4. కొన్ని పురాగాథలను విస్తరించడం.

**10.2.3. తెలుగు పురాగాథలు:**

తెలుగు వారు పుట్టిపెరిగిన వృత్తాంతమే పెద్ద పురాణం. విశ్వామిత్రుని చేత శాపం పొందిన ఆంధ్రులెవరో, ద్రావిడులుగా పుట్టి పెరిగిన తెలుగువారెవరో, వికలాంగులెవరో, ఆంధ్రదేశంలో గురించి నివసిస్తున్న తెలుగువారు ఎన్నెన్ని మూలల నుంచి ఉద్భవించారో ఊహించాల్సిందే గాని, ఖచ్చితంగా నిర్ణయించడానికి ఆధారాలు లేవు. ఎన్నో పురాగాథలు పుట్టాయి. ఆంధ్రదేశానికి నాగజాతికి మొదటి నుంచి సంబంధం ఉంది. మన ప్రాచీన గ్రంథాలలో నాగులను గురించి పురాణాలనేకం సూచించారు. నాగులపాడు, నాగవరం, నాగులేరు, నాగూరు, నాగపట్టణం వంటి ప్రదేశాలెన్నో వెలిశాయి. నాగి, నాగన్న, నాగరాజు, నాగేశ్వర్ వంటి పేర్లు తెలుగువారి పేర్లు అయ్యాయి. నాగుల చవితి పండుగ ఆచారమైంది. అందుకే నాగపూజకు సంబంధించిన పురాగాథ పుట్టింది.

**నాగులకు సంబంధించిన పురాగాథ:**

ధరణికోట వంశంవారికి మగపిల్లలు పుట్టరు. పుద్తారనడానికి ఎన్నో ఉదాహరణలున్నా ఒకటి రెండు కుటుంబాలలో

పిల్లలు పుట్టకపోతే అది విశ్వవ్యాప్తమైన సూత్రంగా భావించడం జానపదులకు మామూలే. ఎవరైనా ధరణికోట ఇంటిపేరుగా కలిగినవారికి దత్తత వెళితే వారికీ సంతానం కలుగదు. ఒకవేళ కలిగినా ఆడపిల్లలే పుడతారు. దీనికి కారణంగా చెప్పే కథ ఒకటుంది. ధరణికోట వంశంలో ఒకరికి పాము పుట్టింది. ఆ పాముకి నాగరాజుని పేరుపెట్టి ప్రేమగా పెంచారు. ఆ పాము ఎవరికీ హాని చేయకుండా ఒకసారి ఇంట్లో ఒక శుభకార్యం జరిగే సమయంలో వంట గదిలో ఒక మూల ముడుచుకొని పడుకున్న ఆ పాముపై సలసలకాగే పాయసం గంగాళాన్ని పెట్టారు. ఆ పాము కమిలి చనిపోయింది. ఆ పాముకు అంత్యక్రియలు జరిపారు. అప్పటి నుంచి ఆ వంశంలో మగసంతానం కలగడం లేదు. అయితే ఇక్కడ ఒక విషయం ఏంటంటే మగపిల్లలు పుట్టకపోతే అసలు ఆ వంశం ఎలా కొనసాగుతుంది అనేది. ఎవరైనా అలా ప్రశ్నిస్తే జానపదుల దృష్టిలో అతి తెలివి చూపించటమే అవుతుంది. ఏది ఏమైనా నాగులకు సంబంధించిన అనేక పురాగాథలు ఆంధ్రదేశంలో చాలాకాలం నుంచి ఉన్నాయనేది నిజం. నాగులే అనార్యులైన ఆంధ్రులని, నాగులు - ద్రావిడులు వేరువేరు జాతులు కారని భావించవచ్చు.

**ఆంధ్రవిష్ణువుకు సంబంధించిన పురాగాథ:**

ఆంధ్రవిష్ణువుకు సంబంధించిన కథ శిష్టపురాణంలోనే కాక పురాగాథలలోనూ కనిపిస్తుంది. ఆంధ్రవిష్ణువు నిశుంభుడనే రాక్షసుడితో పదమూడు మహాయుగాలు యుద్ధం చేసి అతడిని చంపాడని చెప్తారు. ఆంధ్రవిష్ణువు శ్రీశైలం, భీమేశ్వరం, కాళేశ్వరం మధ్యలో ప్రాకారాలు నిర్మించి కోటకట్టి ఆ క్షేత్రాలను మూడు ద్వారాలుగా చేసి ఈశ్వరుడిని కాపలా ఉంచాడని, ఋషులతో కలిసి గోదావరీ తీరంలో నివసించాడని అప్పటి నుండి ఈ దేశం త్రిలింగ దేశంగా వ్యవహరించబడుతుందని గాథ. అయితే ఇది కల్పిత కథో, కాదో కాని నిశుంబుడితో పోరాడటం, శివుడ్ని కాపలా ఉంచటం కలిసి పురాగాథగా అయ్యింది.

ఆంధ్రులకు సంబంధించిన పురాగాథలే కాక దేవతలకు సంబంధించిన పురాగాథలు ఆంధ్రదేశమంతటా అసంఖ్యాకంగా ఉన్నాయి. జానపదుల దేవతలు చాలావరకు స్త్రీలే. యుద్ధ దేవతలు పురుషులు, గ్రామదేవతలు స్త్రీలు. శక్తి దేవతారాధన భారతీయులకు కొత్తేమీకాదు. ఆ శక్తి దేవత విగ్రహ రూపంలో గానీ, శిలారూపంలో గానీ, చిన్న కొయ్య రూపంలో గాని ఉండవచ్చు. ఆంధ్రదేశంలోని గ్రామదేవతలలో ఎల్లమ్మ, మల్లమ్మ, చిన్నమ్మ, పెద్దమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, కలుగోళమ్మ, ఇరగాళమ్మ, నూకాలమ్మ, మైసమ్మ, గంగమ్మ ముత్యాలమ్మ మొదలైన వారికి సంబంధించిన పురాగాథలున్నాయి.

**గంగమ్మకు సంబంధించిన పురాగాథ:**

గంగమ్మకు సంబంధించిన పురాగాథ రాయలసీమలో అనేక చోట్ల ప్రచారంలో ఉంది. ఒక చతుర్థ కులస్థుడు పురాణాలు, శాస్త్రాలు చదువుకొని బ్రాహ్మణుడినని చెప్పుకొని మోసంతో ఒక బ్రాహ్మణ స్త్రీని వివాహం చేసుకున్నాడు. ఒకసారి ఉగాది రోజున పోళీలు వడ్డించగా అతడి కొడుకులు తండ్రి వల్ల వచ్చిన సంస్కారంతో పోళీలు ఎనుబోతు నాలుకలాగా ఉన్నాయి అన్నారంట. అప్పుడా బ్రాహ్మణ స్త్రీ నిజం తెలుసుకొని భర్తను ఎనుబోతు కమ్మని కొడుకుల్ని మేక, గొర్రె, కోడి అయిపొమ్మని శపించింది, ఎనుబోతు ఆమెను తరిమికొట్టింది. ఆమె ఒక పుట్టలో దాక్కోగా ఎనుబోతు రూపంలోని ఆమె భర్త కాళ్ళతో, తలతో పుట్టను కుమ్మాడు. అప్పుడామె కోపం పట్టలేక "నీ తలను నరికించి నీ కుడికాలును నరికి నీ నోట్లో కరిపించి, నీ రక్తం నా నుదుట అలంకరించుకునేంత వరకు నా తాపం చల్లారదు" అని అన్నదంట. ఆమె గంగమ్మ అయ్యింది. ప్రతి సంవత్సరం పుంగనూరు మొదలైన చోట్ల ఉగాదికి ముందు వచ్చే మంగళవారం నాడు గంగమ్మ జాతర జరిపిస్తారు. జాతరకు ముందురోజు గొర్రెల్ని, మేకల్ని ఇతర పశువులను సంతలో అమ్ముతారు. మొక్కుబళ్ళు ఉన్నవాళ్ళు వాటిని కొంటారు. మంగళవారం రోజు

ఎనుబోతును అలంకరించి ఊరేగిస్తారు. ఊరంతా ఊరేగింపు జరిగిన తర్వాత ఎనుబోతును ఒక వేటులో నరుకుతారు.

**ఎల్లమ్మకు సంబంధించిన పురాణగాథ:**

ఆలంపూర్ బ్రహ్మేశ్వరాలయంలో మొండెం, నగ్నత్వం కల ఒక దేవతా శిల్పం ఉంది. తండ్రి ఆజ్ఞననుసరించి పరశు రాముడు తల్లి అయిన రేణుక తలను నరకగా తల మాలవాడలో పడిందని, అక్కడే నిలిచిందని చెబుతారు. ఆ రేణుకనే జానపదులు ఎల్లమ్మ అంటారు. ఎల్లమ్మ కథలు అనేక శతాబ్దాల నుంచి ఆంధ్రదేశంలో కర్ణాటకలో ప్రచారంలో ఉన్నాయి. అవి గేయరూపంలోనే కాక పురాగాథలుగానూ ఉన్నాయి. గ్రామ దేవతగా చాలాచోట్ల పూజలందుకునే ఎల్లమ్మలే కాక ముఖ్యంగా బెల్గాం జిల్లా నవదత్తలో వెలసిన ఎల్లమ్మను గురించి చెప్పుకోవాలి. ఈమెను 'ఏళు కొళ్ళద ఎల్లమ్మ' అంటారు. అంటే ఏడులోయల ఎల్లమ్మ. కొండకు ప్రతి సంవత్సరం లక్షల్లో యాత్రికులు వస్తారు. ఈ ఏడు లోయల ఎల్లమ్మకు జాతర నెలరోజులు జరుగుతుంది. పార్వతి సప్తసంతానాలతో ఎల్లమ్మ కడగొట్టు బిడ్డ అని కొన్ని గాథల్లో చెప్పబడింది. వీరు అక్క చెల్లెళ్ళు, ఏడుగురు పోట్లాడుకొని మరణించగా లోకమంతా వ్యాధులు వ్యాపించాయని, ప్రజలు పూజలు చేసి వేడుకొనగా వారు దేవతలై వెలిశారని కథ ఉంది. ఇది బైండ్ల వాని అక్కల కథతో పోలి ఉంటుంది.

**సూర్యచంద్రులకు సంబంధించిన పురాగాథలు:**

సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు, నదులు జాన పదులలో ఆలోచనలను రేపి జానపద పురాణాల ఆవిర్భావానికి కారణమయ్యాయి. ఆదిమజాతులవారికి సూర్యుడు, కొండల్లో, అడవుల్లో నివసించే చంద్రుడే నాయకులై వర్ణింపబడ్డారు. సూర్యచంద్రులు అన్నదమ్ములని చెబుతారు. గ్రహణాన్ని గురించిన పురాగాథలు ఉన్నాయి. ఒక పాము ఆహారం కోసం వెళ్ళినపుడు కొందరు అల్లరిపిల్లలు దాని గ్రుడ్లను పగులగొట్టారని, వాళ్ళను పాము తరుముకొని పోగా వాళ్ళు సూర్యచంద్రుల వెనుక దాక్కున్నారని, అందుకనే పాము సూర్యున్ని, చంద్రుడ్ని మింగుతుందని ఒక పురాగాథ చెబుతుంది. ఇది గేయరూపంలో కూడా ఉంది.

**నామాలకు సంబంధించిన పురాగాథలు:**

స్థల నామాలను గురించిన కథలు ఐతిహ్యాలే అనే వారున్నప్పటికీ ఇలా జరిగింది అనే నమ్మకమే కాకుండా అలౌకికమైన వాతావరణం, దేవతా వ్యక్తుల ప్రాధాన్యం ఉంటే స్థల పురాణమవుతుంది. తెలుగుదేశంలోని అనేక స్థలాలను గురించి జానపద పురాణాలున్నాయి. ఇవి శిష్టకావ్యాలకు ఎక్కాయి. అలాంటి వాటిలో సుప్రసిద్ధమైంది 'శ్రీకాళహస్తీశ్వర మహాత్యం' సాలెపురుగు, పాము, ఏనుగు శివలింగాన్ని పూజించేవని వాటికి శివుడు ముక్తి ప్రసాదించాడని ఈ జానపద స్థల పురాణం చెబుతుంది. ఇలాంటి స్థల పురాణాలు ఆంధ్రదేశంలోని సామాన్య జానపదాలను గురించి చాలా ఉన్నాయి.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తాలుకాలో ఉండి అనే ఊరుంది. దుందుడు అనే రాక్షసుడుండేవాడని అతడు మరణించినా అతడి పేర 'దుండి' ఊరిపేరై అదే అదే ఉండి అయ్యిందంట.

పరశురాముడు తండ్రి ఆజ్ఞ పాటించడం కోసం తల్లిని హత్య చేసి ఆ దోషనివారణకు తపస్సు చేశాడు. తపస్సు వల్ల అతడి దోషం నివారణ అయిన ప్రాంతం 'హత్యరాల' (హత్యరాలిన చోటు) అయిందని, తర్వాత 'అత్తిరాల' అయిందంటారు.

గయాసురుడనే రాక్షస సంహారం తర్వాత శివుడు కుక్కుటేశ్వర స్వామిగా వెలిశాడు. దేవతలు అక్కడ నిర్మించిన ఆలయంలో ఒక ఉన్నత పీఠంపై అంబికాదేవిని "పీఠాంబిక' అని పూజించారు. అక్కడే ఒక పురాన్ని నిర్మించి 'పీఠికాంబపురం' అని పేరుపెడితే అదే పీఠికాపురంగా, తరువాత పిఠాపురంగా మారిందట.

తన సామ్రాజ్యంలో సంచరిస్తూ కాకతీయ ప్రతాపరుద్రుడు, ఒక ప్రాంతానికి వచ్చాడు. అక్కడ కొన్ని ఇళ్ళు కనిపించాయి. చీకటి పడటంతో ఆ రాజు పరివార సమేతంగా ఆ రాత్రి అక్కడే బస చెయ్యాల్సి వచ్చింది. వాళ్ళకి ఆ ఇళ్ళలో ఒక గుడి కనిపించింది. ఆ గుడిలో దేవుడి విగ్రహం లేదు. అందరూ ఆ రాత్రికి అక్కడే పడుకున్నారు. అర్ధరాత్రిపుట ఒకడికి మెలకువ వచ్చింది. అప్పుడు కనిపించిన భయంకర స్త్రీ ఆకారాన్ని చూసి గట్టిగా కేకేశారు. ఆ కేకతో చాలామంది మేల్కొన్నారు. ఇంతలో అక్కడున్నవారిలో ఒకామెకి ఒక స్త్రీ దేవత పూనింది. అందరూ భయపడ్డారు. ఒకామె ధైర్యం చేసి 'అమ్మా, తల్లీ, శాంతించు, ఏ దివ్యరూపంలేని గుడిలో ఒక దేవిగా కావే అమ్మ' అంది. వెంటనే అక్కడున్న వాళ్ళందరూ చేతులు జోడించి 'కావే అమ్మా' అన్నారు. అప్పుడు ఆ స్త్రీకి పూనిన దేవత నీడ రూపంలో ఆమెను వదిలి, గుడిలో శిలగా నిలిచి పోయింది. అప్పటి వరకూ ఏ పేరూలేని ఆ పేటకు ప్రతాపరుద్రుడు 'కావే అమ్మ పేట' అని పేరుపెట్టాడు. అదే చివరకు 'కావేరమ్మ పేట' గా మారింది.

గద్యరూపంలో ఉన్న ఈ పురాగాథల గురించి తెలుగులో ఎక్కువగా పరిశోధన జరగలేదు. ఇతర దేశాల విద్వాంసుల దృష్టిని అమితంగా పురాగాథలు ఆకర్షించాయి. జానపద విద్వాంసులేకాక మానవ శాస్త్రజ్ఞులు కూడా వీటి అధ్యయనం ద్వారా సంస్కృతిని తెలుసుకున్నారు. ఈ పురాగాథలు విశ్లేషించడం వలన ప్రజల మనోవిశ్లేషణ, సామాజిక వ్యవస్థ విశ్లేషణ కూడా సాధ్యపడుతుంది, ఈ పురాగాథలను అధ్యయనం చెయ్యాలంటే దానికుండే పాఠాంతరాలను సేకరించాలి. ప్రతి పురాగాథని నాలుగు స్థాయిలలో విశ్లేషించవలసి ఉంటుందని ప్రపంచంలోనే అత్యుత్తమ సాంఘిక మానవ శాస్త్రవేత్తలలో ఒకరైన లెవిస్ట్రాస్ సూచించాడు. అవి:

1) భౌగోళిక అధ్యయనం

2) ఆర్థిక అధ్యయనం

3) సాంఘిక అధ్యయనం

4) దేవతా సంబంధమైన అధ్యయనం.

భౌగోళికంగా ఈ పురాగాథలలోని పేర్లు, ఎల్లలు, ప్రదేశాలు పరిచితమైనవే ఉంటాయని చెప్తాడు లెవిస్ట్రాస్. ఆర్థిక సంబంధమైన అధ్యయనం ద్వారా పురాగాథల్లో కూడా సంఘంలోని ఆర్థిక స్థితిగతులు, వృత్తి, సాంఘిక సంబంధాలు చాలావరకు నిజమైనవే ఉంటాయని ఋజువైంది. వివాహం, బాంధవ్యం, కుటుంబం వంటి విషయాలు సగం నిజం, సగం కల్పితాలై ఉంటాయి. దేవతా సంబంధమైనవన్నీ కల్పితాలే. ఈ నాలుగురకాల అధ్యయనం ద్వారా పురాగాథల నిర్మాణం గురించి స్పష్టమైన అవగాహన కలుగుతుంది. పురాగాథలు పూర్తిగా అసత్య కల్పనలు కాదు, మానవ చరిత్రలోని అనేక స్థాయిలలోని మనిషి మనః స్థితిని సూచాత్మకంగా ఇవి తెలియజేస్తాయి.

## 10.3. ఐతిహ్యాలు:

జానపద పురాణాలకు, ఐతిహ్యాలకు ఉన్న తేడాని గుర్తించటం కష్ట సాధ్యం. పురాణాల గురించి అప్పుడప్పుడు వినుంటాం కానీ ఐతిహ్యాలను గురించిన అవగాహన అసలు లేదు. 'డిక్షనరీ ఆఫ్ ఫోక్ లోర్' లో ఐతిహ్యం అనేది నిర్దిష్ట వ్యక్తులకు, స్థలాలకు, వస్తువులకు సంబంధించినదని చెప్పబడింది. జరిగాయని నమ్మేవాటిని ఐతిహ్యాలనవచ్చు. ఇతిహాసానికి, ఐతిహ్యానికి భేదం ఉంది. ఇతిహాసం కొన్ని చారిత్రక సాక్ష్యాధారాలు కలిగి ఉంటుంది. శాసనాలు, సాహిత్యం, నాణాలు మొదలైన వాటి సహాయంతో చరిత్రను తిరిగి నిర్మించవచ్చు. కానీ ఐతిహ్యానికి పరోక్ష ఆధారాలు ఉండవచ్చేమోగానీ, ప్రత్యక్ష ఆధారాలు ఉండవు. మౌఖికమైన ప్రసారం ద్వారా ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తాయి కనుక ఐతిహ్యాలు సత్యమైనవనలేము.

వ్యక్తిని గురించిగానీ, స్థలాన్ని గురించి గానీ, ఏదైనా సంఘటనను గురించి గాని సంప్రదాయికంగా వివరించేది ఐతిహ్యం. పురాణాలలో దేవతా సంబంధమైన పాత్రలు ముఖ్యంగా ఉంటాయి. ఐతిహ్యాలలో వాటి పాత్ర ముఖ్యంకాదు. పురాణాలు జనసమూహం నమ్మకంపైనే ఆధారపడి ఉంటాయి. ఐతిహ్యాలు జరిగాయనే నమ్మకాన్ని జనంలో కలిగించాల్సి ఉంటుంది. పురాణం దైవ, మత సంబంధంగా ఉండటం కారణంగా ప్రజలపై ఒక విధమైన అధికారాన్ని సాధిస్తుంది.

జనపదాలలో ఒక్కొక్క రాయికీరప్పకి, కాలవకూ, కొలనుకు, చెలవుకూ కథ ఉంది, ఐతిహ్యం ఉంది. కొండలకు, బండలకు, వీరులకు, నారీమణులకు సంబంధించిన ఐతిహ్యాలున్నాయి.

**10.3.1. నిర్వచనం-ఉత్పత్తి:**

ఐతిహ్యం అనే పదాన్ని కథల కంటే చిన్నదానికి, గద్య రూపంలో ఉండే పరిమిత పాఠాంతరాల కథనాలకి వాడుతారు. నిర్దిష్ట స్థలం, వ్యక్తి లేక సంఘటనను గురించిన మౌఖిక, సాంప్రదాయిక వివరణమే జానపద ఐతిహ్యం. ఐతిహ్యాలు ఎలా ఉత్పత్తి చెందుతాయన్నది స్థిరంగా చెప్పలేం. మానవుడి విచిత్ర కల్పనాశక్తి ఆధారంగా ఉత్పత్తవుతాయి. ప్రజలకు కొందరు వ్యక్తులు, స్థలాల మీద భక్తి గౌరవాలుంటాయి. అలాంటి వ్యక్తులకు, స్థలాలకు ఐతిహ్యాలలో స్థానం లభిస్తుంది. కలలు కూడా ఐతిహ్యం ఉత్పత్తికి కారణం కావచ్చు. విన్నవి, చూసినవి కలలో అద్భుతంగా పెరిగి పెద్దవై ఎన్నో నమ్మకాలకు దారి చూపుతాయి. ఈ విధమైన అభూత కల్పనలే ఐతిహ్యాల రూపకల్పనకు కారణమవుతాయి. విక్రమార్కుడి సింహాసనం, మహా పురుషుల సమాధులు, ఖడ్గాలు, స్మారక శిలల వంటివి జానపముల హృదయాలలో సుస్థిరమై చిలువలు పలువలుగా పెరిగి వందలాది ఐతిహ్యాల పుట్టుకకు కారణమవుతాయి.

**10.3.2. ఐతిహ్యాల విభజన:**

ఐతిహ్యాలు రెండు రకాలు. అవి:

1) స్థానిక ఐతిహ్యాలు (Local Legends),

2) సంచారి ఐతిహ్యాలు (Migratory Legends).

రహస్య నిధులకు, ఊర్ల పేర్లకు, స్థానిక వీరులకు, మహిమ కలవాళ్ళకు, కొండలకు సంబంధించినవి స్థానిక ఐతిహ్యాలు. ఇవి తమ సరిహద్దులు దాటి బయటకు వెళ్ళవు. ఎక్కడ పుట్టాయో అక్కడే నశిస్తాయి. సంచారి ఐతిహ్యాలు ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి, ఒక్కొక్కసారి ఇంకొక దేశానికి ప్రయాణం చేస్తాయి. ఇవి చిన్నవి, కొన్ని పాఠాంతరాలు ఉంటాయి. ఒక చారిత్రక సంఘటనో, కాల్పనిక సంఘటనో ఆధారంగా దాని చుట్టూ కథనం అల్లబడుతుంది. ఇవి నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట స్థలంలో పుట్టి ఇతర ప్రదేశాలకు వెళ్తాయి. చెరువు నిండడం కోసం, చెరువు కట్ట తెగితే నిలపడం కోసం, కోటగోడ భద్రత కోసం స్త్రీలు ఆత్మబలి చేసుకోవడం ప్రపంచంలోని వివిధ ప్రదేశాల ఐతిహ్యాలలో కనిపిస్తుంది. ఎక్కడో ఒక దగ్గర జరిగిన సంఘటన అనేక రూపాలలో వివిధ ప్రదేశాలకు సంచారం చేయిస్తుంది. కలలో కనిపించిన నిధినుపయోగించి రాజ్యాలను నిర్మించిన రాజుల వృత్తాంతాలు, మోసం చేసిన భార్యను గురించిన ఐతిహ్యాలు సంచారి ఐతిహ్యాలలో ఉంటాయి.

మరికొందరు ఐతిహ్యాలలో 4 రకాలను గుర్తించారు. అవి:

1) వివరణాత్మక ఐతిహ్యాలు

2) చారిత్రక ఐతిహ్యాలు

3) అలౌకిక శక్తులకు సంబంధించినవి

4) మత సంబంధమైనవి. కన్నడ ఐతిహ్యాలపై పరిశోధన చేసిన శ్రీ జి.వి.డి. గారు ఐతిహ్యాలు, వాటి విభాగాల గురించి ఈ క్రింది వివరణ ఇచ్చారు.

**1. స్థానిక ఐతిహ్యాలు:** ఇవి ప్రాచీన సంస్కృతి, సంప్రదాయం, నమ్మకం, కర్మాచరణ మొదలైన వాటి నేపథ్యంలో స్థానికంగా వెలువడుతాయి. భూత ప్రేత పిశాచాలు మానవాతీతశక్తులు మొదలైన వాటిలో ఉండే నమ్మకం వీటిలో ప్రధానంగా ఉంటుంది. ఒక కొలనో, చెరువో ఎక్కువ లోతుగా ఉంటే దాని లోతు చూడటానికి వెళ్ళిన మనిషి మరణించే విషాద కథలు భారతదేశంలో కనిపిస్తాయి.

ఈ స్థానిక ఐతిహ్యాలకు మరికొన్ని ప్రభేదాలున్నాయి.

- **i) నరబలికి సంబంధించినవి:** భారతదేశంలోనేకాక ఐరోపా, జర్మనీలలోను నరబలులున్నాయని తెలిపే విధంగా ఐరోపాలో పెద్ద భవంతుల పునాదుల్లో అస్థిపంజరాలు కనిపించాయి.
- **ii) వీరుల్ని సరిహద్దుల్లో పూడ్చిపెచ్చే కథలు:** ఐరోపా, ఐర్లాండ్, స్కాండినేవియాలలో వీరులు చనిపోతే ఆ దేశం సరిహద్దుల్లో వారిని పూడ్చిపెడితే వారు దేశాన్ని రక్షిస్తారనే నమ్మకముంది. ఆ నమ్మకమే భారతదేశానికి వ్యాపించి చనిపోయిన వారిని పొలాల్లో, తోటల్లో పూడ్చే పద్ధతి వచ్చి ఉంటుంది.
- **iii) యుద్ధ సంబంధాలు:** కొన్ని చారిత్రక సంఘటనల ఆధారంగా ఐతిహ్యాలు రూపొందుతాయి. ఖడ్గ తిక్కనకు సంబంధించిన ఐతిహ్యాలు ఇటువంటివే.
- **iv) కుటుంబ సంబంధాలు:** పిల్లల్ని అనాథలుగా చేసి చనిపోయిన తల్లులు తమ ప్రేమలన్ని వదులుకోలేక భూతరూపంలో వచ్చి పిల్లల చూసుకునే కథలు ప్రచారంలో ఉన్నాయి. దెయ్యాలు కుక్క, పిల్లి, పంది రూపాలలో వచ్చి భయపెడతాయని చెప్పే ఐతిహ్యాలు నమ్మకం ఆధారంగా ఏర్పడినవే.
- **v) భ్రమ వల్ల పుట్టినవి:** మనిషి తాను చూసిన ప్రకృతి వైపరీత్యాలను ఏదో అనుకొని భ్రమించడం వల్ల కొన్ని కల్పనలు పుడతాయి. కొరివి దయ్యాల వంటివన్ని ఇటువంటి భ్రమలే.
- **vi) శబ్ద సంబంధ ఐతిహ్యాలు:** విచిత్ర ధ్వని ఏదైనా వినబడితే దానినొక ఐతిహ్యంగా కల్పించటం కొన్నిచోట్ల జరుగుతుంది. అమావాస్యకు, పౌర్ణమికి లంకెబిందెల శబ్దాలు వినిపిస్తాయనే నమ్మకంతో కొన్ని ఐతిహ్యాలు ఏర్పడ్డాయి.
- **vii) రహస్య నిధికి సంబంధించినవి :** రహస్య నిధులకు పాముల కాపలా ఉంటాయనేది కల్పనే.
- **viii) వంశ కీర్తనలు:** ఏదైనా కుటుంబానికి సంబంధించిన బిరుదులు, ఆ వంశంలోని వారి ఆత్మబలి మొదలైనవాటికి సంబంధించిన మహిమాన్విత గాథలివి.
- **ix) జానపద నిరుక్తి:** కొన్ని ఊర్లకు ఆ పేరెందుకొచ్చిందో తెలియక పోయినా జానపదులు ఏదో ఒక కథ కల్పిస్తారు. ఆ కథ నిజమోకాదో చెప్పే ఆధారాలేమీ ఉండవు. ఒక్కొక్కసారి జానపద నిరుక్తి సరైనదే కావచ్చు. కానీ మధ్యలో ఐతిహ్యాత్మక విషయాలు ఎన్నో చేరి ఉంటాయి.

**2. సంచారీ ఐతిహ్యాలు:** ఒక నిర్దిష్ట స్థలంలో పుట్టి, పెరిగి ఏదైనా నమ్మకానికో, కర్మాచరణకో, మతానికో సంబంధాన్ని కల్పించుకొని ఇతర ప్రదేశాలకు కొన్ని ఐతిహ్యాలు సంచారం చేస్తాయి. ప్రసార దృష్టితో చూసినప్పుడు ఇవి చాలా ప్రముఖమైనవి.

అద్భుత కథల కంటె చిన్నవిగా, కుతూహలకరంగా ఉండటం వల్ల ఇవి త్వరగా ప్రయాణం చేస్తాయి. ఒకచోట ఉన్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన సంప్రదాయాల్ని బాగా అనుసరిస్తాయి. వేరే ప్రదేశానికి వెళ్ళినప్పుడు అక్కడి పద్ధతుల్ని పాటిస్తాయి.

**i) వీరుల భూమికి సంబంధించినవి:** మనందరికీ తెలిసిన ఐతిహ్యం విజయనగర రాజ్యస్థాపనకు సంబంధించినది. హరిహరరాయలు, బుక్కరాయలు వేటకు వెళితే అక్కడ కుందేలు కుక్కను తరమటం చూసి ఆస్థలం విజయాన్నిస్తుందని భావించి అక్కడ విజయనగర రాజ్యాన్ని స్థాపించారని ఐతిహ్యం.

ఇలాంటి కథే సిరియా పట్టణం గురించి కర్ణాటకలో ప్రచారంలో ఉంది. సిరియా పట్టణానికి సంబంధించిన పూర్వీకులు మంచి స్థలాన్ని వెతుక్కుంటూ వెళ్ళి ఒకచోట కుక్కను కుందేలుపైకి ఉసికొల్పగా కొంతసేపటికి ఆ కుందేలే కుక్కను తరిమికొట్టిందంట బెంగుళూరును నిర్మించిన కెంపేగౌడను గురించి కూడా ఇదే ఐతిహ్యం చెబుతారు.

**ii) ఆత్మబలికి సంబంధించినవి:**

ఇవి స్థానిక ఐతిహ్యాలలాగా కనిపించినా అంతర్గతంగా సంచారి లక్షణాన్నే కలిగి ఉంటాయి. ముసలమ్మ మరణం కథ ఇలాంటిదే. ఊరి కోసం తమని తామే అర్పించుకున్న త్యాగమూర్తుల కథలు ఆంధ్రదేశంలోనే కాక ఇతర ప్రదేశాలలోనూ ప్రచారంలో ఉన్నాయి. పాత్రలు వేరైనా మూలాంశం మాత్రం ఒకటి ఉంటుంది.

**iii) శీలవంతుల-శీలవతుల కథలు:**

అన్ని దేశాలలోనూ పతివ్రతలైనప్పటికీ అనుమానించబడి, అవమానించబడి, దేశ బహిష్కరణకు గురైన వారి కథలు అన్ని ప్రచారంలో ఉన్నాయి.

**iv) పౌరాణికాంశాలుండేవి:**

శ్రీనివాస కళ్యాణంలో వచ్చే ఆవుకథ లాంటివి అన్ని ప్రదేశాలలో ఉంటాయి. మాండ్య జిల్లాలోని గుత్తలు అనే ఊరిలో ఒక ఆవు గోపాలకుడి కన్నుగప్పి పుట్టలో పాలు పోసేది. దానిని వెన్నంటి వెళ్ళిన గోపాలకుడు కోపంతో పశువును కొట్టగా అది వెళ్ళి లింగానికి తగిలి లింగం రెండు భాగాలుగా విడిపోయింది. ఒక భాగం వేరే ఊర్లో పడింది. రెండు ఊర్లలోనూ దేవాలయాలు వెలిశాయి.

**v) జన ప్రియమైన నమ్మకాల ఆధారంగా పుట్టినవి:**

పల్లెటూర్లలోనే కాకుండా పట్టణాలలోనూ కొన్ని మూఢ నమ్మకాలుంటాయి. అప్పుడప్పుడు ఈ నమ్మకాలు ఒక్కోసారి ఎక్కువవుతాయి. ఎవరో సన్యాసి వచ్చి తలుపుతట్టి పిలిస్తే బదులు చెప్పినవారు చనిపోతారని ప్రచారం జరిగింది. అలాగే 'ఓ స్త్రీ రేపురా' అని తలుపు మీద రాయటం, తలుపు మీద మూడు నామాలు గీచి ఉంచటం చేస్తే వచ్చినవాళ్ళు వెళ్ళిపోతారని ఇలాంటివి ఆంధ్రదేశంలోనే కాక తమిళనాడు, కర్ణాటకలలోనూ ఉన్నాయి.

పైన చెప్పిన సంచార ఐతిహ్యాలలో కొన్ని ఆంధ్రదేశంలో పుట్టి మిగిలిన ప్రదేశాలకు వ్యాపించినవి కొన్ని, మిగిలిన ప్రదేశాల నుంచి ఆంధ్రప్రదేశ్ వచ్చినవి మరికొన్ని. ఒక్క ఊరిలో వందలకొద్దీ ఐతిహ్యాలు పుడ్తుంటాయి, పోతుంటాయి. కొన్ని అందరి నోట నలిగి పాతపడిపోయాయి. ఏవిధంగా పుట్టినా ఐతిహ్యం నమ్మకం కల్గించేదిగా ఉంటుంది. ఉదాహరణకు నెల్లూరులో అందరూ చెప్పుకొనేది అక్కడ ఏనుగులు బ్రతకవని, ఏనుగులు వస్తే వాటి కలలో సింహాలు కనిపించి అవి బెదరిపోతాయని అందుకే అది "విక్రమసింహపురి' అయింది అనేది ఐతిహ్యం. అలాగే నెల్లి చెట్టు నుంచే నెల్లూరు అనే పేరు వచ్చిందనేది ఐతిహ్యం.

ఇలాంటి ఐతిహ్యాలు ప్రతి ఊరిలోనూ వినిపిస్తాయి. సామాన్య జానపద బాలకుడు ఉట్టి చేతులతో పులితో పోరాడి గెల్చిన కథ, శత్రువుల నుంచి వీరుడు తప్పించుకొని కొండపై నుంచి దూకడం, మహిమాన్విత వ్యక్తుల పాదాల గుర్తులు శిలల మీద కన్పించడం-ఇలాంటివన్నీ ఉత్కంఠను కలిగిస్తాయి. వీటిలో కొంచెం చరిత్రాంశం ఉండవచ్చు కాని ఐతిహ్యాలు ఎప్పటికి చరిత్రకాలేవు.

గుట్టలు, కొండలు, బండలు ఎన్నో ఐతిహ్యాలకు వస్తువులు అయ్యాయి. రాముడు, సీత తిరిగిన ప్రాంతాలుగా ఆంధ్రదేశంలో ఎన్నో స్థలాలను చెబుతారు. అలాగా పాండవులు, ద్రౌపది తిరిగిన ఊర్ల గురించి ఐతిహ్యాలున్నాయి. కుంతి, భీముడ్ని ఎత్తుకొని వెళుతుంటే పొరపాటుగా భీముడు క్రింద పడ్డాడని, ఆ పడినచోట లోయలేర్పడ్డాయనే ఐతిహ్యాలున్నాయి. సారంగధీరుడు ఎక్కడి వాడో గానీ నవనాథ చరిత్రలోని చౌరంగిని సారంగధరుడిగా, రాజరాజనరేంద్రుడి కొడుకుగా మారి ఆంధ్ర ప్రాంతంవాడే అనే నమ్మకం ఏర్పడింది. కన్నడ ప్రజలు ఒక అడుగు ముందుకు వేసి హబ్బూరులో సారంగధరుడి గుట్టని ఏర్పరచుకున్నారు. అక్కడి రాళ్ళ మీద ఎర్రమరకలు చూపి అక్కడే సారంగధరుడి కాళ్ళు చేతులు నరకబడ్డాయని చెబుతారు.

పల్లెటూర్లలో పెద్ద రాతిగుండ కనిపిస్తే అది భీముడు తెచ్చి పెట్టిందేనని, పాదముద్రలు కనిపిస్తే అవి రాముడివో, భీముడివో, బుద్ధుడివో అనే అంటారు. స్థల నామాలకు సంబంధించిన ఐతిహ్యాలు ఆంధ్ర దేశంలో అనేకమున్నాయి. వీటిలో కొన్ని పౌరాణిక అంశ ఉండేవి, కొన్ని చారిత్రక సంఘటనల నేపథ్యంలో వచ్చినవి, కొన్ని నమ్మకానికి సంబంధించినవి.

**ఐతిహ్యాలకు కొన్ని ఉదాహరణలు:**

i) విరాటరాజు ఆవులను కౌరవులు తోలుకు పోతుండగా అజ్ఞాతవాసంలో ఉన్న అర్జునుడు వారితో పోరాడి ఆవులను చేజిక్కించుకున్నాడు. అందుకే అక్కడ 'ఆలమంద' అనే గ్రామం ఏర్పడి తర్వాత అది 'ఆలమండ' గా (విజయనగరం జిల్లా) మారింది.

ii) కృష్ణాజిల్లాలో 'కాకులపాడు' అనే గ్రామం ఉంది. ఆ ఊరి మీదుగా ప్రయాణం చేసేవారు. అక్కడి చెరువు గట్టు మీది చెట్టు క్రింద విశ్రాంతి తీసుకునేవారంట. ఆ చెట్టు మీద ఎప్పుడూ ఒక కాకుల గుంపు ఉండేదంట. ఆ విశ్రాంతి తీసుకొనేవారు 'ఛీ ఛీ కాకుల పాడుగాను' అనేవారంట. అలా అది 'కాకులపాడు' అయ్యింది.

iii) కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు తాలుకాలోని 'ముచ్చు మర్రి' అనే పేరు పూర్వం ముచ్చు కోతులు మర్రిచెట్టు మీద సంసారాలు చేయటం వల్ల వచ్చిందని చెబుతారు.

iv) పూర్వం తెలంగాణలోని చేర్యాల ప్రాంతంలో ప్రజలు చెంచుల దొంగతనాలకు భయపడి రక్షణ కోసం గ్రామానికి సమీపంలో గోడ కట్టుకున్నారంట. చెంచువారి బాధ నుండి తప్పించుకోవడానికి కట్టింది కనుక 'చుంచన కోట" అనే పేరు వచ్చింది.

v) ఏడుగురు అక్కల కథలు ఆంధ్రదేశంలోనే కాక కర్ణాటక దేశంలోను ప్రచారంలో ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 'ఏడు నూతుల' అనే గ్రామాన్ని గురించి ఒక ఐతిహ్యముంది. ఆ ఊరిలో ఏడు అరలున్న బావి ఉంది. దాన్ని ఏడుగురు అక్కా చెల్లెళ్ళు చెల్లించారని చెబుతారు. ఎంత ఎండాకాలమైనా ఆ బావిలో నీరు ఊరుతూనే ఉంటుంది. ఆ బావి పేరు మీదుగా ఆ ఊరు ఏడు సూతుల' అయింది.

vi) పులిని చంపిన సాహసాలు ఐతిహ్యాలలో కనిపిస్తాయి. ఒక చిరుత పులి ఎప్పుడూ ఒక గ్రామం మీద దాడి చేసేది. దాని భయంతో ప్రజలు బయటకు రాకుండా ఇళ్ళల్లోనే ఉండేవారు. తర్వాత ఒక్కొక్కరే ఆ ఊరిని వదిలి వెళ్ళిపోసాగారు.

వారు వెళ్ళిన చోట మరో గ్రామం తయారైంది. చిరుతపులి అక్కడికీ వచ్చింది. ఒక వడ్రంగి ఇంటికి వెళ్ళి తలుపు సందుల్లోంచి తలను ముందుకు పెట్టింది. ఏదో పనిలో ఉన్న వడ్రంగి అది చూసి ఉలిక్కిపడి ఆ తరువాత ధైర్యంగా బాడ్సెతో చిరుత తల నరికాడు. బాడ్సెతో పులిని చంపినందువల్ల ఆ ఊరికి బాడ్సె అని పేరు వచ్చింది. అదే తర్వాత బాడ్సి' అయింది.

**ఐతిహ్యాల ప్రసారం:**

పూర్వం వివిధ దేశాలలో సాహస యాత్రలు చేసే యాత్రికుల వల్ల ఐతిహ్యాల ప్రసారం జరిగేది. ఐతిహ్యాలు ఒక దేశం నుండి మరొక దేశానికి పోవటానికి బౌద్ధులు కూడా కారణం. మతంతో పాటు భారతదేశంలోని ఐతిహ్యాలను ప్రాచ్యదేశాలకు తీసుకెళ్ళి ప్రచారం మత ప్రచారకుల వల్ల ఐతిహ్యాలు ప్రచారం పొందటం అన్ని దేశాలలో జరిగేదే. ఐతిహ్యాల ప్రచారంలో ఇది ఏకోత్పత్తి వాదమైతే, బహుళోత్పత్తివాదం ఇంకొకటి ఉంది. కానీ ఎక్కువ మంది ఆమోదించింది ఏకోత్పత్తి వాదమే.

## 10.4. జానపద కథలు:

జానపద విద్వాంసులనే కాక మానవ శాస్త్రజ్ఞులను, మనస్తత్వ వేత్తలను, భాషా శాస్త్రవేత్తలను ఆకర్షించే ప్రక్రియ జానపద కథ. పేదరాసి పెద్దమ్మ కథలు, అమ్మమ్మ కథలు, తాతయ్య కథలు, కాకమ్మ కథలు అనే పేర్లతో జానపదులకందరికీ సుపరిచితమైన కథలు వారి కల్పనాశక్తికి ప్రతీకలై ప్రచారం పొందుతున్నాయి. జానపద విజ్ఞానానికి సంబంధించిన పరిశోధన ప్రారంభం కావడానికి కూడా కథలే కారణం. జానపదుల మనస్తత్వానికి అద్దం వంటివి ఈ జానపద కథలు. పురాగాథలు, ఐతిహ్యాల కంటే కథలు మనసును రంజింపజేస్తాయి. వీటిలో అద్భుత విషయాలు, రోమాంచక వృత్తాంతాలు, కాల్పనిక సంఘటనలు అనేకం ఉంటాయి. అందుకే ఇవి ఎక్కువ జన ప్రియమైనవి.

### 10.4.1. జానపద కథలు-లక్షణాలు:

1. కథలు ముఖ్యమైన క్రియతో ప్రారంభం కావు, ఉన్నట్టుండి ముగిసిపోవు.
2. పునరావృత్తి ఎక్కువగా ఉంటుంది. అదే నిండుదనాన్ని ఇస్తుంది.
3. ఒకసారి ఇద్దరు పాత్రలే ఒక దృశ్యంలో కనిపిస్తారు. ఎక్కువ పాత్రలున్నా ఇద్దరు మాత్రమే క్రియాశీలురై ఉంటారు.
4. విభిన్న పాత్రల కలయిక ఉంటుంది. నాయకుడు-ప్రతినాయకుడు, శిష్టుడు-దుష్టుడు అలా కలిసి ఉంటుంది.
5. ఒకే రకమైన పాత్రలు రెండు ఉంటే వారు చిన్నవారుగా గానీ అశక్తులుగానే చిత్రించబడతారు. ఒకవేళ ఇద్దరూ శక్తి కలవాళ్ళయితే శత్రువులవుతారు.
6. బలహీనులు మంచివాళ్ళుగా ఉంటారు. సోదరులలో చిన్నవారే సహజంగా విజయం సాధిస్తారు.
7. పాత్రచిత్రణ సరళంగా ఉంటుంది. కథకు సంబంధించిన పాత్రలు, సంఘటనలే ఉంటాయి. పాత్రలకు, కథకు అతీతమైనవేమీ కనిపించవు.
8. కథావస్తువు సరళంగా ఉంటుంది. ఏకకాలంలో ఒకే కథ వివరింపబడి ఉంటుంది.
9. సాధారణంగా అన్ని విషయాలు సరళంగా ఉంటాయి. వైవిధ్యభరితంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం కనిపించదు.

పై లక్షణాలను బట్టి జానపద కథలు సాధ్యమైనంత సరళంగా ఉంటాయని అర్థమవుతుంది,

**జానపద కథలు-పాత్రలు:**

జానపద కథలలో మానవులేకాక జంతువులు, దేవతలు, దయ్యాలు, బ్రహ్మరాక్షసులు, కిన్నరులు, కింపురుషులు, నరసింహులు, నరనాగులు మొదలైన పాత్రలన్నీ కనిపిస్తాయి. నాయకుడు, నాయిక, ప్రతినాయకుడు ముఖ్య పాత్రలుగా ఉంటారు. సామాన్యంగా చిన్న కొడుకు నాయకుడుగా ఉంటాడు. పెద్ద కొడుకు ఇంటి విషయాలు చూసుకుంటుంటాడు. ఒక్కోసారి అప్రధాన పాత్రలే ప్రాధాన్యాన్ని కలిగి ఉంటాయి. నాయకుడికి జంతువుల సహాయం లభిస్తుంది.

**సన్నివేశాలు:**

జానపద కథలలోని సన్నివేశాలు స్వర్గ మర్త్య పాతాళలోకాలలో ఎక్కడైనా జరుగుతాయి. నాయకులకు అన్ని లోకాలతో సంబంధం ఉంటుంది. మంత్రదండాలు, ఉంగరాలు, భూతద్దాలు వంటి వస్తువులు వాడటం కనిపిస్తుంది. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణే ప్రధాన ఉద్దేశ్యంగా ఉంటుంది. ఈ జానపద కథలన్నీ సాధారణంగా సుఖాంతాలు అయివుంటాయి. కథ మొదలుపెట్టడం కూడా 'అనగనగా' అనో 'ఒకానొక కాలంలో' అనో ప్రారంభమవుతాయి, ముగింపులో 'కథ కంచికి మనం ఇంటికి' అనో 'తర్వాత వాళ్ళు సుఖంగా ఉన్నారు' అనో ముగుస్తాయి. చాలా కథలలో సన్నివేశంగా ఉండటం కనిపిస్తుంది.

**మూలాంశం:**

జానపద కథలలో ఎక్కువ ప్రాధాన్యత గలవి ఈ మూలాంశం, మాదిరి అనేవి. మూలాంశం కథా వస్తువుకు సంబంధించింది. మాదిరి కథా నిర్మాణ పద్ధతికి సంబంధించింది. కథలో కనిపించే కనిష్ఠాంశాలే మూలాంశాలు. ఇవి సామాన్యమైనవి కావు, అసామాన్యమైనవి. కథ వినగానే మనస్సుకు హత్తుకునేవి మూలాంశాలు. ఇవి ముఖ్యంగా 3 విభాగాలు. అవి:

**i)** బ్రహ్మరాక్షసి, మాంత్రికుడు, పిశాచాలు, దేవతలు మొదలైనవి పాత్రలు. ఇవి సామాన్య పాత్రలు కావు. తల్లి మూలాంశం కాదు, సవతి తల్లి మూలాంశమవుతుంది. ఇలాంటి పాత్రలు తమ చేష్టల వల్ల మనసుని ఆకట్టుకుంటాయి.

**ii)** కథల్లో కొన్ని వస్తువులుంటాయి. మంత్రదండం, మాంత్రిక విభూతి, భూతద్దం, ఆకాశంలో విహరించటానికి చాప మొదలైన మహిమగల వస్తువులు వస్తురూప మూలాంశాలు.

**iii)** కొన్ని సంఘటనలు-సప్త సముద్రాలను తేలికగా దాటడం, ఎంతటి వాడినైనా, ఎంతమందినైనా సులభంగా ఓడించడం. కొండలు, నదులు, సముద్రాలు దాటి వెళ్ళి ప్రతినాయకుడి ప్రాణాల్ని తీయడం వంటి సంఘటనల రూపంలో మూలాంశాలు ఉంటాయి.

ఈ మూలాంశాలు సహాయంతోనే కథ పెరుగుతుంది. కథ ఏ ప్రాంతానికి చెందింది అనేది స్టిత్ థామ్సన్ తయారు చేసిన "మోటిఫ్ ఇండెక్స్ ఆఫ్ ఫోక్ లిటరేచర్ " అనే మూలాంశ సూచి ఆధారంగా కనిపెట్టవచ్చు.

**మాదిరి:**

'మాదిరి' అంటే స్వతంత్రమైన, స్వయం సంపూర్ణమైన కథ. ఒక మాదిరిలో ఒక మూలాంశమే ఉండవచ్చు లేదా అనేక మూలాంశాలు ఉండవచ్చు. మాదిరి చిన్నదైనా కావచ్చు లేక పెద్దదైనా కావచ్చు. ఒక మాదిరిలో ఒక మూలాంశం ఉందంటే అర్థం అన్ని మూలాంశాలు ఒక్కొక్క మాదిరి అవుతాయని కాదు. ఒక్కో రకం కథ ఒక్కో మాదిరి. ఇలాంటి సమానాంశాల కథల మాదిరులను గుర్తించడానికి ఆంటి ఆర్నె, స్టిత్ థామ్సన్‌లు "ది టైల్స్ ఆఫ్ ది ఫోక్‌టేల్" అనే గ్రంథాన్ని

తయారుచేశారు. ఇది జానపద కథల వర్గీకరణకు, కథా నిర్మాణ పద్ధతిని తెలుసుకోవటానికి ఎంతో ఉపయుక్తం.

**10.4.2. జానపద కథల పుట్టుక – వికాసం:**

కథలు చెప్పడం, వినడం ఈ రోజు మొదలవ్వలేదు. ఎంతో ప్రాచీనమైనది కథ. కథల పుట్టుక గురించి చెప్పుకునేటప్పుడు జేకల్ గ్రిమ్, మిల్‌హెల్మ్ గ్రిమ్ అనే జర్మన్ సోదరులు ప్రచురించిన "కిండర్ అండ్ హౌస్ మార్షెన్" అనే కథా సంపుటాలను గురించి చెప్పుకోవలసిందే. ఇందులో ఇండో యూరోపియన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలో కథలన్నిటికీ ఇండో–యూరోపియన్ కథలే మూలమని సిద్ధాంతీకరించారు. సంస్కృత భాషకు, గ్రీకు భాషకు ఉండే పోలికలను పరిశోధించిన విద్వాంసులు ఇండో–ఆర్యన్, ఇండో–యూరోపియన్ భాషలకు మూలం ఒక్కటే అని చెప్పటం గ్రిమ్ సోదరులకు ప్రేరణ అయ్యింది. గ్రిమ్ సోదరుల కారణంగానే మరొక సిద్ధాంతం కూడా ప్రచారమైంది. అది పురాణ మూల సిద్ధాంతం. ఆర్యుల పురాణలే ముక్కలు చెక్కలై కథలుగా మారాయని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. మాక్స్ ముల్లర్, కాక్స్ మొదలైన వారు ఈ సిద్ధాంతాన్ని సమర్ధించారు.

పై సిద్ధాంతం కారణంగా విద్వాంసుల దృష్టి భారతదేశం వైపు మళ్ళింది. మాక్స్‌ముల్లర్ వేదాలను అధ్యయనం చేశాడు. బెన్ఫె పంచతంత్రాన్ని విశ్లేషించాడు. పంచతంత్ర కథలను ఆంగ్లంలోకి అనువదించాడు. ప్రపంచంలోని అనేక ప్రాంతాలలోని కథలకు భారతీయ కథలే మూలమని 'భారత మూల సిద్ధాంతం' చేశాడు. భారతదేశం నుంచి బౌద్ధుల వల్ల, అరబ్బుల వల్ల కథలు ఇతర దేశాలకు ప్రసారమయ్యాయని బెన్ఫె భావించాడు. కోష్లర్, కాస్క్విన్ వంటి వారు భారతదేశం కథలకు కాణాచి అని, అనేక కథలకు ఈ దేశపు కథలే ప్రేరణ అని అంగీకరించారు. భారత మూల సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన జోసెఫ్ బెడియర్, ఆండ్రూల్యాంగ్ వంటివారు భారత కథల కంటే ఈజిప్టు కథలే ప్రాచీనమని భావించారు.

**జానపద కథల వర్గీకరణ:**

ప్రపంచ జానపద కథలని వర్గీకరించిన వారు జానపద కథలు 2 రకాలన్నారు. అవి:

1) సంకీర్ణ కథలు 2) సరళ కథలు.

మళ్ళీ సంకీర్ణ కథలని కట్టు కథలు, మత సంబంధ కథలు, కాల్పనిక కథలుగా విభజించారు. సరళ కథలని ప్రాణి కథలు, వినోద కథలు, లాక్షణిక కథలుగా విభజించారు. అయితే ఈ విభజన తెలుగు కథలకి అన్వయించదగింది కాదు. అయినప్పటికీ కొన్ని కథా ప్రక్రియలను గురించి తెలుసుకొంటే ఆ తర్వాత తెలుగు జానపద కథలను గురించి తెలుసుకోవటం సులభమవుతుంది.

**i) మార్షెన్ లేక కట్టు కథ:**

సంకీర్ణమైన ఇతివృత్తంతో, అనేకానేక కల్పనలతో విలసిల్లే ప్రత్యేక కథా రూపాన్ని మార్షన్ అనే పేరుతో పిలుస్తారు. ఇది జర్మన్ భాషాపదం. దీనికి సమానార్థం గల ఆంగ్ల పదం లేని కారణంగా కొందరు ఫేరీటేల్ (అద్భుత కథ) కి ఇది సమీపమైనదంటారు. మార్షెన్‌లో అద్భుత విషయాలు, అసహజ ప్రపంచంలోని అసంభావ్య పాత్రలు అనేకం ఉంటాయి. మంత్ర తంత్రాలు, పరకాయ ప్రవేశాలు ఉంటాయి. చిన్న కూతురు సాధారణంగా నాయికై ఉంటుంది. 3 సంఖ్యకు ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. ముగ్గురు కూతుర్లు, మూడు కోరికలు ఇలా ఉంటాయి. మంచి వాళ్ళకు విజయం చేకూరుతుంది. రాజులు, రాజకుమారులు మంచివారై ఉంటారు. రాజు ఒక వేళ చెడ్డవాడైనా రాజకుమారుడు మంచి వాడై ఉంటాడు.

**ii) సాగె (Sage):**

ఐతిహ్యాలకు మరికొన్ని కథలను చేర్చుకొని జర్మన్ భాషలో 'సాగె' అంటారు. జరిగినవని జానపదులు నమ్మిన సంఘటనలు గూర్చిన కథలివి. వీటి ఉద్దేశ్యం సత్య ప్రతిపాదనే కాని నిజంగా సత్యమనుకోకూడదు. సాగెలో వ్యక్తి ఐతిహ్యాలు, స్థల ఐతిహ్యాలు, అద్భుత కథలు, సంఘటన ఐతిహ్యాలు అనే విభాగాలున్నాయి.

**iii) నావెల్లా :**

కాల్పనిక కథలలో ఒకరకం. ఇవి కూడా మార్చెన్ వంటివే. అయితే వాటిలో ఉన్నంత అద్భుత గుణం ఉండదు. నావెల్లా కథలు సాహసోపేతమైనవిగా, శోకాత్మకమైనవిగా, రసవంతమైనవిగా, మానవ స్వభావానికి అద్ధం పట్టేవిగా ఉంటాయి.

**10.4.3. తెలుగు జానపద కథలు:**

తెలుగులో జానపద కథలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అన్ని ప్రదేశాల్లో పర్యటించి, కథలను సేకరించి ప్రకటించినవారు ఎవరూలేరు. గేయాలకు, కథాగేయాలకు ఇచ్చినంత ప్రాధాన్యం గద్యకథలకు ఇవ్వని కారణంగా ఎక్కువ పరిశోధన జరగలేదు.

**తెలుగు జానపద కథారూపాలు:**

తెలుగు జానపద కథలను అద్భుత కథలు (fairy tales), వినోద కథలు (mery tales), ప్రాణి కథలు (animal tales), నీతి కథలు (fables), సమస్యాత్మక కథలు (riddle tales) గా విభజించవచ్చు.

**1) అద్భుత కథలు:** ఆంగ్లంలో ఉన్న ఫేరీటేల్స్‌ను, మానవాతీత కథలను చేర్చి అద్భుత కథలుగా చెప్పవచ్చు. కథాసాహిత్యంలో అత్యధిక ప్రచారం కలవీ కథలు. రాజకుమారులు, మంత్రులు, మంత్రదండాలు, వీటన్నిటికంటే ముఖ్యంగా సాహస ప్రవృత్తి కలిగి ఉండటం ఈ కథల్లో కనిపిస్తుంది. ఎప్పుడో ఒకానొక కాలంలో, ఒకానొక ప్రదేశంలో జరిగినట్లుగా నడిచేవి ఈ కథలు. అక్కడక్కడా హాస్యం కనిపించినా మొత్తం మీద గంభీరంగా ఉంటాయి. యక్షులు, గంధర్వులు, కిన్నరులు, రాక్షసులు, పిశాచాలు సాధారణంగా కనిపించే పాత్రలు. జానపద కథల కల్పనకు ఆధారమైన మూలాంశాలు ఈ కథలలో మనకు వందలకొద్దీ కనిపిస్తాయి. చిన్న పిల్లలను ఎక్కువగా ఆకర్షించేవి ఈ కథలే.

**ఈ కథలకు ఉదాహరణలు:**

i) ఒక ఊరిలో మంత్రతంత్రాలొచ్చిన బ్రాహ్మణుడుండేవాడు. ఒకరోజు ప్రక్క ఊరిలో తన అనుచరుడితో వెళ్ళి పెళ్ళి జరిపించి వస్తుండగా సాయంకాలమైంది. ప్రక్క ఊరికి, ఆ బ్రాహ్మణుడి ఊరికి మధ్యనున్న నదికి ఆ ఒడ్డున, ఈ ఒడ్డున శ్మశానాలున్నాయి. ఆ శ్మశానాల నిండా దయ్యాలున్నాయంటారు. బ్రహ్మణుడితో వచ్చేవాడు పిరికివాడు కాబట్టి అతడికి భయం పెరుగుతుంది. శ్మశానం దగ్గరికి వచ్చేసరికి కాళ్ళు వణకడం మొదలై అడుగు ముందుకు పడటం లేదు. ఏదో ధ్యానంలో వున్న బ్రాహ్మణుడు వేగంగా నడుస్తున్నాడు. కొంతదూరం వచ్చిన తర్వాత వెనక్కి చూస్తే అనుచరుడు కనిపించలేదు. ఇదేదో దెయ్యపు చేష్ట అయి ఉంటుందనుకొని అనుచరుడి కోసం మళ్ళీ వెనక్కి వచ్చాడు. బ్రాహ్మణుడిని అనుసరిస్తున్నవాడు నదిలోకి దిగగానే ఒక నల్లటి గొర్రె అతడికి అడ్డంగా వచ్చింది. గొర్రెను అమ్ముకోవచ్చుననే ఆశతో వాడు దానిని భుజంపైన వేసుకొని బయలుదేరగా అది పోనుపోనూ బరువు పెరిగిపోతుంటే మొయ్యలేక దానిని క్రిందకు విసిరేద్దామనుకోగా అది రాక్షసాకారమై అతడి గొంతు నులమసాగింది. అతడిని వెతుకుతూ వచ్చిన బ్రాహ్మణుడు దయ్యాన్ని మంత్రశక్తితో వెడలగొట్టే సరికి అది వాడితో 'బతికి పోయావు పోరా' అని చెప్పి వెళ్ళిపోయింది.

ii) ఒక ఊరిలో దొర, దొరసాని ఉన్నారు. బిడ్డలు లేనివారు తపస్సు చేయగా దేవుడు ఆడబిడ్డ కావాలా, మగబిడ్డ కావాలా అని అడిగాడు. ఆడపిల్ల కావాలన్నారు. పుట్టిన పిల్లను బాగా చూసుకుంటూ బాగా చదివిస్తున్నారు. బడికి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు వెలుగు కనిపించాలని ముక్కుకు ముక్కర చేయించారు. ఒకరోజు ఆలశ్యంగా నిద్రలేచిన అమ్మాయికి బడికి వెళ్ళవద్దని తల్లిదండ్రులు చెప్పినా స్నేహితులకు, గురువుకు చెప్పి వస్తానని వెళ్ళింది. వచ్చేటప్పుడు ముక్కర క్రిందపడిపోయింది. ఇంటికి వచ్చిన తండ్రి వెలుగుపడలేదు, ముక్కర చూడమన్నాడు. రాయి లేదు. ఎందుకీ బిడ్డ అని పెళ్ళి చేయించి బిడ్డను ఆ పెట్టెలో పెట్టి, తాళాలు వేసి ఎక్కడైనా పడేసి రమ్మన్నాడు. ఊరి దగ్గర రాగిమాను ఉంది. సేవకులు పెట్టెను దానికి తగిలించి వచ్చేశారు.

పట్నంలో ఒక దొర, దొరసాని, వారికొక కొడుకు, ప్రధానికి ఒక కొడుకున్నాడు. మంచి స్నేహితులైన దొర కొడుకు, ప్రధాని కొడుకు రాగిమాను దగ్గరకు వచ్చారు. ఆ పెట్టెను చూసి ప్రధాని కొడుకు పెట్టె నాదనగా దొర కొడుకు పెట్టెలోది నాది అన్నాడు. పెట్టె తెరిచే సరికి వాళ్ళ కళ్ళు చెదిరాయి. ఆ అమ్మాయి నాది అని దొర కొడుకనగా ఏమీ మాట్లాడ లేదు ప్రధాని కొడుకు. వారిద్దరి స్నేహం చెడింది. ఆ పిల్ల పెద్దదయ్యిన తర్వాత దొర కొడుకు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకొన్నాడు. ఆ అమ్మాయికి ఒక అమ్మాయి పుట్టింది. ప్రధాని కొడుకు అంతా కనిపెట్టుకొనే ఉన్నాడు. ఆ అమ్మాయి భర్తతో 'నా తల్లిదండ్రులు నన్నెందుకు పారేశారో తెలీదు, నా తప్పు ఏమిటో తెలుసుకోవాలి' అని సైన్యం తీసుకొనివెళ్ళింది. ఆ సైన్యానికి అధిపతి ప్రధాని కొడుకు, ప్రధాని కొడుకు ఎక్కడెక్కడికో తీసుకెళ్ళాడు. రాత్రికి అడవికి వెళ్ళారు. కూరలో మిఠాయి కలపడంతో అన్నం తిన్న అందరికీ మత్తు ఎక్కింది. ఆమెకు మాత్రం మందు పెట్టలేదు. ఆమె దగ్గరకు వెళ్ళి ఆ రోజు నిన్ను కనుక్కుంది నేను. నీవు దొర కొడుకుని పట్టుకున్నావు, ఇప్పుడు నాతోరా అన్నాడు. ఆమె ఎక్కడికి అంది, ఎక్కడికోరా అన్నాడు. ఆమె బయటికి పోయి వస్తానంది. అతడు ఇక్కడే పో అన్నాడు. నమ్మకం లేకపోతే కొంగు పట్టుకో అంది. వాడు ఆమె చీర పట్టుకోగా ఆమె చీర విడుస్తూ వెళ్ళి చీరను చెట్టుకు కట్టి వెళ్ళింది. ఆమె కూతురు ప్రధాని కొడుకు దగ్గరే ఉంది. అతడు ఆ బిడ్డని నరికేశాడు. పొద్దున అందరూ లేచారు. దొర కొడుకు చూశాడు, ప్రధాని కొడుకు చేసిందంతా తెలుసుకొని దేశం మీదకి వెళ్ళాడు.

అక్కడ నుంచి వెళ్ళిన ఆ అమ్మాయి ఒక పల్లెకు చేరింది. ఆమె చినిగిన చీర, దెబ్బలతో వెర్రిదానిలాగుంది. పల్లెలోని ఒక పేదవాడు, పెద్ద వాడు అయిన వక్కాకు వ్యాపారి ఆమె రాజకళని చూసి ఆమెను ఆదరించాడు. ఆమె అతడికి వండిపెడుతుండేది. ఆ ముసలివాడు పొద్దున పోయి సాయంత్రం వచ్చేవాడు. ఒకడు ఈమెను చూసి నాదానికంటే బాగుంది, జతగా ఉంటుంది అని అక్కడే కాపుకాశాడు. ముసలోడి రాకపోకలు తెలుసుకొని మూడోరోజు ముసలివాడు రాకపోవటంతో వీడు రాత్రి వచ్చి వాకిలి తన్ని, రాకపోతే ప్రాణం తీస్తానన్నాడు. ఆమె వస్తానని కాగితం మీద విషయం రాసి పటం దగ్గర పెట్టి వెళ్ళింది. మూడు నెలలు నోము పట్టానని ఈరోజు తాకితే కాలిపోతావని చెప్పగా వాడు మూడునెల్లే కదా మూడు రోజుల్లాగా అనుకొని సరేనన్నాడు. ఆమె పండగ చేయాలంది. ఆ పండుగ కోసం ఆకాశం మీద దుమ్ము అరసోలడు, నీళ్ళ మీద బుడగలు రెండు, కదలని చెట్టు పండు, నక్క పిట్ట గుడ్లు రెండు తీసుకుని రమ్మంది. అంగట్లో అవన్నీ కావాలని అడుగగా నేలదుమ్మె డబ్బాలో వేసి ఇచ్చాడు. ఊరి బావిలో నీటి మీద బుడగ కోసం ప్రయత్నించి బురదనే ఆ దుమ్ము మీద వేసుకొని వచ్చే సరికి ఆమె అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

పట్నానికి వెళ్ళిన ఆమెకు అక్కడి వాళ్ళు, బాగా మర్యాదచేశారు. రాత్రి ఆమెకు నిద్రపట్టలేదు. అర్ధరాత్రి ఎక్కడ చూసినా తాళాలు వేసున్నాయి. అప్పుడామె నేను సత్యవంతురాలినైతే, పతివ్రతనైతే ఆ తాళాలు క్రింద పడిపోవాలనుకుంది. తాళాలు

ఊడి పడిపోయ్యాయి. అక్కడే ఉన్న గుర్రమెక్కి వేరే పట్నానికి వెళ్ళింది. రాజు లెడక్కడ. ఏనుగుకి అలంకరించి ఉన్నారు. ఆ ఏనుగు పూలహారం ఆమె మెడలో వేసింది. ఆమె రాజయ్యింది. రాజుకు మీసాలు లేవు, ఎవరికీ అడిగే ధైర్యం లేదు. ఒకరోజు మంత్రిని పిలిచి కోనేరు తవ్వించాలంది. బొమ్మలు చేసేవాళ్ళను పిలిపించమంది. వచ్చిన బొమ్మలు చేసేవాడిని లోపలికి రమ్మని తలుపులు వేసింది. చీర, రవిక కట్టుకొని బంగారుబొమ్మలా వచ్చి నిలబడి అలాంటి బొమ్మ చేసి ఇవ్వమంది. అతడు 3 నెలలు తర్వాత ఇస్తానన్నాడు. బొమ్మ పూర్తయిన తర్వాత దానిని బావి దగ్గర పెట్టమంది. ప్రతిమను చూసి మంచి మాట్లాడితే బాగా చూడండి, లేకుంటే కొట్టండని ఆజ్ఞాపించింది. ఆమెకు చిన్నప్పుడు చదువు చెప్పిన గురువు ఆమెను చూసి ఏడ్చాడు. గురువుకు ఆమె సౌకర్యాలు చేయించింది. ప్రధాని కొడుకు బొమ్మను నరకడానికి వెళ్ళాడు. భటులు అతడిని పట్టుకొని రాగా అతడిని చంపమని ఆజ్ఞాపించింది. ముసలివాడు వచ్చి చాలా బాధ పడ్డాడు. అతడిని సత్కరించింది. తర్వాత ఆమెను పిల్చుకు వెళ్ళినవాడు వస్తే అతడికి మరణదండనే. చివరకు భర్త వచ్చాడు. భర్తను తీసుకొని వెళ్ళింది. తర్వాత ఆమె దొరసాని, అతడు దొర అయ్యారు. తల్లిదండ్రులను పిలిచి వైభవంగా ఉన్నారు.

ఈ కథ నాయకుడికి ప్రాధాన్యం లేదు. నాయికకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ కథలాగా ఉండేవి, స్త్రీ సాహసాన్ని వ్యక్తీకరించే అనేక కథలు జానపద కథలలో ఉన్నాయి. ఈ కథలో స్త్రీ సాహసం లేకపోయినా ఎన్నో కష్టాలను ఎదిరించి విజయం సాధించిన సాహసం చక్కగా వ్యక్తీకరించబడింది.

**వినోద కథలు లేక తమాషా కథలు:**

'ఒక తమాషా కథ చెప్పనా' అనగానే పిల్లలు వెంటనే కథ చెప్పే వారి చుట్టూ చేరతారు. ఈ కథల్లో హాస్యం ప్రధానంగా ఉంటుంది. హాస్యం పుట్టించడానికి ఒక్కోసారి అద్భుత పాత్రలు ఉండవచ్చు, జంతువులు ఉండవచ్చు. ఇవి సరళ కథలు. ఇవి సంక్షిప్తంగా, ఆసక్తికరంగా ఉంటాయి. మానవమాత్రులే ఎక్కువగా పాత్రలుగా ఉంటారు. కొన్ని కథలు అసభ్యంగా కూడా ఉంటాయి. సోమరి పోతులు, మూర్ఖులు, మోసగాళ్ళు, దొంగలు మొదలైనవారు పాత్రలుగా ఉంటారు. అయినా వాస్తవ జీవితానికి ఇవి దగ్గరగా ఉంటాయి. కొన్ని కథల్లో హాస్యానికి తోడు నీతి కూడా ఉంటుంది.

**ఉదాహరణ:** ఈక్రింది తమాషా కథ మానవాతీత మూలాంశం ఉన్నా వినోదమే ప్రధానంగా కలది. ఒక ఊర్లో ఒక బ్రాహ్మణుడుండేవాడు. అతడు స్నానానికి వెళ్ళి నమస్కారం చేస్తే సూర్యుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలన్నాడు. భార్యను కనుక్కొచ్చి చెప్తాను, వచ్చే వరకు అక్కడే ఉండమన్నాడా మూర్ఖుడు. భార్యతో సూర్యుడు వరం కోరుకోమన్నాడు, ఏం కోరుకునేది అన్నాడు. 'ఒకటి అనుకుంటే రెండు కావాలి' అని అడగమంది. సూర్యుడిని అదే అడిగాడు. ఇంటికి వెళ్ళి పెట్టె తాళం తీసి రూపాయి తీసుకొని పప్పు, ఉప్పుకొని మూట కట్టుకొని, దట్టికట్టి భుజాన పెట్టుకున్నాడు. రెండు అయ్యాయని, మళ్ళీ భుజాన పెట్టుకొనే సరికి రెండయ్యాయి. ఇలా చేస్తూ పోయాడు ఎన్ని పెట్టుకున్నా రెండు రెండయ్యాయి. ఇంటికి వచ్చాడు, తలుపు తియ్యమన్నాడు. మూటలన్నీ దింపాడు, దాహమియ్యవే అన్నాడు. భార్య మంచినీళ్ళు ఇచ్చింది. అవి రెండు రెండు అయ్యాయి. తొమ్మిది లోటాల నీళ్ళు తాగాడు. పొట్ట పగిలి చచ్చాడు. భార్య తపసించిపోయింది. ప్రొద్దున నలుగురు మగాళ్ళు బిచ్చానికి వచ్చారు. పీనుగును ఎత్తమని చెప్పింది. వాళ్ళు ఎత్తుకుపోయి కాల్చి వచ్చారు. మళ్ళీ ఇంకో శవం ఉంది. మళ్ళీ ఎత్తుకొని పోయి చెరువు నీళ్ళల్లో పారేశారు. మళ్ళీ ఇంకో శవం ఉంది, ఎంతమందిని చంపుతావమ్మా అన్నారు. నాకున్నది ఒకే భర్త అని చెప్పింది ఆమె. సరేనని మళ్ళీ పీనుగను తీసుకుపోయి లోతుగా గుంట తవ్వి బాగా కూరి పూడ్చారు. మళ్ళీ వచ్చే సరికి గుంటలో నుండి లేచి వస్తున్నాడు అతను. నలుగురూ పట్టుకొని తన్నారు. ఇంక మావల్ల కాదని పరుగెత్తి వెళ్ళారు.

పై కథలో కొంత నీతి, కొంత మానవాతీత విశ్వాసాలకు ప్రాధాన్యం ఉన్నా మొత్తం మీద ఎక్కువగా కనిపించేది వినోదమే. ఆంధ్రదేశంలో పరమానందయ్య శిష్యుల కథలు, మిడతంబొట్లు కథలు, మర్యాద రామన్న కథలు ప్రచారంలో ఉన్నవే. మిడతంబొట్లు కథ తెలివితేటలు లేకున్నా పరిస్థితులు అనుకూలించడం వల్ల అదృష్టం కలిసొస్తుందని చెబుతుంది. ఒక ఊరిలో మిడతంబొట్లు అనే అయ్యవారు ఉండేవాడు. పూట గడవటమే కష్టంగా ఉండేది వాళ్ళకు. చదువు బాగా నేర్చుకోకూడదా అని భార్య అంటే నేర్చుకొని వస్తానని వెళతాడు. ఒకచోట కూర్చొని భార్య చేసిచ్చిన కజ్జాలు తిని చుట్టూరా చూశాడు . ఒక దగ్గర పందికొక్కులు తవ్వుతూ ఉన్నాయి. అవి బ్రాహ్మడా, బ్రాహ్మడా ఏం తింటున్నావని అడిగాయి. కజ్జాలు అన్నాడు. కజ్జాలిస్తే చదువు మేం చెబుతా మన్నాయని, కజ్జాలు తిని వెళ్ళిపోయాయి. మరికొంత దూరంలో తాటిమానులున్నాయి. అవి కజ్జాలు మాకివ్వమన్నాయి. తిని పైకి వెళ్ళాయి. పందికొక్కుల్లాగా తోడతారు, తాటి మానులాగా నిలుచుంటారు అని రెండు ముక్కలు మిడతంబొట్లు నేర్చుకున్నాడు. తర్వాత గువ్వలు వచ్చాయి. అవీ తిని పారిపోయాయి. గువ్వలాగా కూచుంటారు అని బ్రాహ్మణుడు నేర్చుకున్నాడు. తర్వాత జింకలు వచ్చి తిని పరుగెత్తిపోయాయి.

బ్రాహ్మడు అటు తిరిగి ఇటు తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ ఊరి దొరకు పెళ్ళి జరుగుతుంది. దొర పెళ్ళికి పోతూ బ్రాహ్మడిని కావలి పెట్టి, తాళాలు వేయకుండా భత్యం ఇచ్చి వెళ్ళిపోయారు. పది రోజులు భత్యం రాలేదు. ఒకరోజు దొంగలు వచ్చారు. ఇంటి వెనుక కన్నం వేసారు. భార్యాభర్తలు పడుకొని ఉన్నారు. భార్య భర్తని నీవు ఏం చదువు నేర్చుకున్నావు అని అడిగింది. పందికొక్కులాగా తోడుతారు అన్నాడు బ్రాహ్మణుడు. ఆ మాటలు దొంగలు విన్నారు. వీడెక్కడ వస్తాడో అని దొంగలు లేచి నిలబడ్డారు, తాటిమానులా నిలుచున్నారు అన్నాడు. దొంగలు కూర్చున్నారు, గువ్వలలాగా కూర్చున్నారు అన్నాడు. పరుగెత్తారు, జింకలాగా పరుగెత్తారు అన్నాడు. దొర పెళ్ళి నుంచి తిరిగి వచ్చారు. పురోహితుడిని పిలిచాడు. దొంగలు పట్టుబడ్డారు. వాళ్ళు బ్రాహ్మడిని పొగిడారు. దొర తక్షణం ముప్పై రూపాయిలిస్తామని అతన్ని ఇంట్లోనే పెట్టుకున్నాడు.

దొర ఎక్కడికో పల్లెకు రమ్మన్నాడు. బ్రాహ్మణుడు దొరతో పాటు వెళ్ళాడు. వెళుతుంటే మిడత దొర మీద కూర్చుంది. చేతిలో పట్టుకొని నా చేతిలో ఉండేది ఏంటి చెప్పలేకుంటే తల తీస్తానన్నాడు. బ్రాహ్మణుడికి చెమటలు పోశాయి. 'నాడు చెడలేదు, నేడు చెడితివి మిడతం బొట్లు' అనుకున్నాడు. రాజు చాలా సంతోషపడి మరో ఐదు ఎక్కువ చేశాడు.

మళ్ళీ ఒకరోజు కంటి, కాలి అనే పేరుగల దాదులు కంటిసరం దొంగతనం చేశారు. రాయి క్రింద దాచిపెట్టారు. మిడతంబొట్లను పిలిచి అడిగారు. చెప్పకపోతే బందిఖానా అన్నారు. 'నేను కంటినందునా, కాలినందునా' అనుకున్నాడు. అది విన్న దాదులు భయమేసి అతనికి చెప్పివేశారు. అతనికింకా ఎక్కువ జీతమైంది. యాభై రూపాయల సంబళంతో మిడతంబొట్లు ఆనందంగా ఉన్నాడు.

ఈ కథల్లో మిడతంబొట్లు గాని, పరమానందయ్య శిష్యులు గాని, మరొకరు గాని నిమిత్త మాత్రులు. అవివేకులను, అనూహ్య సంఘటనలను ఆధారంగా చేసుకొని హాస్యాన్ని పోషించటం జరుగుతుంది.

**ప్రాణి కథలు:**

ఇవి అత్యంత ప్రాచీనకాలం నుంచి ప్రచారంలో ఉన్నాయని చెప్పవచ్చు. ఇవి సంక్షిప్తంగాను, సరళంగాను ఉంటాయి. ముఖ్యంగా ఈ కథలలో జంతువులు, పక్షులు ఉండేవి ఒక వర్గంగాను, పశు పక్ష్యాదులతో పాటు మనుషులు ఉండేవి మరోవర్గంగా భావిస్తారు. మానవుడు రెండు కాళ్ళ ప్రాణే కాబట్టి వీటిని జంతు కథలనడం కంటే ప్రాణి కథలనడం సబబే. జంతువులే కాక పక్షులు, కీటకాలు కూడా పాత్రలుగా ఉంటాయి. ఇవి ప్రతి సంస్కృతిలోను అన్ని దశలలో ఉద్భవించాయి.

జానపద కథలనుకరించే పంచతంత్రం వంటి సాహిత్య కథలకు ప్రాణికథలు ప్రేరణనిచ్చాయి.

ప్రాణి కథల్లో పశుపక్ష్యాదుల మానవీకరణం కనిపిస్తుంది. మనిషి చేసే సాహసాలను ప్రాణులు కూడా చేస్తాయి. చాలా కథల్లో పరస్పరం పాత్రల మధ్య ఘర్షణ సామాన్యంగా కనిపిస్తుంది. మంచి పాత్రలు, చెడ్డ పాత్రలు తప్పకుండా ఉంటాయి. మాయలాడి నక్కో, తోడేలో, మరో జంతువునో మోసం చేయడం ఒక్కొక్కసారి తను తవ్వుకున్న గోతిలో తానే పడడం ఈ కథల్లో కథాంశం. కథల మాదిర్లను పట్టీ చేసిన ఆర్నె థాంప్సన్ తమ సూచిలో ప్రాణి కథల్ని 1) అడవి జంతువులు, 2) అడవి జంతువులు – పెంపుడు జంతువులు, 3) మనిషి – అడివి జంతువులు, 4) పెంపుడు జంతువులు, 5) పక్షులు, 6) చేపలు, 7) ఇతర జంతువులు – ఇతర వస్తువులు అని వర్గీకరించారు. జానపద కథలని, సాహిత్యపు కథలను వేరుచేయడం కష్టం. ఒక్కోసారి సాహిత్యంలోని కథలు జానపదంలోకి, జానపద కథలు సాహిత్యంలోకి చేరాయి.

**ఉదాహరణ:** ఒక మేక ఉరేసుకొని ఉంటే, కాలు చిక్కుకుపోయి ఉంది. నక్క చూసి దాన్ని తినాలని నీ పేరేంటి అని అడిగింది. నక్క తనను తినాలని వచ్చిందని మేక గ్రహించి ఇలా అంది. 'రేపొద్దున కాళికకు పూజ, నూటొక్క పులులు బలికావాలి' మింటికీ మంటికీ టారులెత్తి ఉన్నానంది. నక్క పారిపోతుండగా పులి అడ్డమొచ్చి విషయం తెలుసుకొని మేక దగ్గరకి వచ్చింది. నక్క, పులి కలిసి రావటం చూసి మేక తెలివిగా "ఏమయ్యా, పట్టుకొచ్చావా, నూటొక్క పులి కావాలంటినికదా, ఒకే పులిని తెచ్చావ్ అంది. పులికి భయమేసింది. నక్క ఒక చెట్టు మీద, పులి ఒక చెట్టు మీద పడ్డాయి. నక్కకు మరీ ఆయాసమయ్యింది. నీకు ఆయాసం తీర్చడానికి ఇక్కడ ఉయ్యాలపీట ఉంది. పడుకోబెడతా అని పులి నక్కను పడుకోబెట్టి ఊపింది. నక్క పాట పాడమంది. పులి 'నీ కొమ్ముల్లే గొరుసుల్లే నిన్ను మింగతా' అని పాడింది. నక్క ఆలోచించి నువ్వు పడుకో, నేను పాడతా అంది. పులి పడుకొంది. నక్క ఊపింది. పులి కూడా పాట పాడమంది. 'నీ ఇంటికి తలుపులే దారబందములే, నేనురుకుతా' అని అది పరుగో పరుగు.

ఈ కథలో 'మేకపోతు గాంభీర్యం' కనిపిస్తుంది. పులి ఎలాంటి పరిస్థితులల్లోనూ తన బుద్ధి పోనిచ్చుకోదనేది ఇంకో సత్యం. నక్క ఈ కథలో మోసగాడికి ప్రతీకగా కాక తెలివిగల జంతువుగా, పిరికి పందగా చిత్రితమైంది. పులి దుర్బుద్ధిని పసిగట్టి తెలివిగా తప్పించుకోగలిగింది.

**నీతి కథలు:**

పశుపక్ష్యాదులు పాత్రలుగా ఉండే అనేక కథలు నీతి ప్రధానంగా ఉంటాయి. ప్రాణి కథలే కొంతకాలానికి నీతికథలుగా పరిణమించాయంటారు. ప్రాణి పాత్రల కంటే నీతికే వీటిలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ నీతికథలు సంక్షిప్తంగా ఉంటాయి. నాటకీయంగా, నీతి వాక్యంగా అంతమవుతుంటాయి. నీతి కథల చివర ఉండే వాక్యాలు అనుభవసారాలైన సామెతలను పోలి ఉంటాయి. 'ఈసపు కథ' లే పెక్కు కథలకు మూలమైనవనీ అభిప్రాయముంది. ప్రపంచంలో వివిధ దేశాల కథలకు స్ఫూర్తి నిచ్చిన పంచతంత్రం ఉండనే ఉంది.

పశుపక్ష్యాది పాత్రల ద్వారా మానవ స్వభావాన్ని అత్యంత రమణీయంగా ఆవిష్కరించి చూపే కథల్లో మొట్టమొదట పంచతంత్రాన్ని చెప్పుకోవాలి. బుద్ధుని జాతక కథలలో కూడా జానపద మూలాంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. సామాన్యంగా ఇతర కథల కంటే చిన్నవిగా ఉంటాయి. మూలాంశాల సంఖ్య కూడా తక్కువగా ఉంటాయి. ఆదిమానవుడు పశుపక్ష్యాదుల దేహ నిర్మాణం, స్వభావం మొదలైన వాటిని పరిశీలనా దృష్టితో చూడడమే ప్రాణి కథలు రూపొందటానికి కారణముంటారు.

పెద్దలెవరైనా చనిపోతే వాళ్ళు పశుపక్ష్యాదుల దేహాలలో నివసిస్తారనే నమ్మకము, మానవునిలాగా మిగిలిన ప్రాణులు ప్రవర్తిస్తాయనే భావమూ, నీతి కథలు ఉత్పత్తి కావడానికి కారణాలని విద్వాంసుల భావన. రూడో అనే విద్వాంసుడి ప్రకారం భారతదేశమే నీతి కథలకు పుట్టినిల్లు.

తెలుగుదేశమంతా ప్రచారంలో ఉన్న నీతి కథల్లో పేలపిండి బ్రాహ్మణుడి కథ ఒకటి. ఒక ఊర్లో బ్రాహ్మణుడు ఒకడుండేవాడు. అతడి భార్య పేలపిండి దొంతికుండల్లో అమర్చిపెట్టింది. వాటి దగ్గరగా పడుకున్న బ్రాహ్మడికి ఎన్నో ఆలోచనలు రాసాగాయి. ఈ పేలపిండిని అమ్మాలి. వచ్చిన డబ్బుతో ఒక కోడిని కొనాలి. ఆ కోడి గుడ్లు పెడుతుంది. కొన్ని రోజులకు కోడిపిల్లలు వచ్చి, అవి పెద్దవై మళ్ళీ గుడ్లు పెడతాయి. కోళ్ళనన్నిటినీ అమ్మి ఒక మేకను కొనాలి. మేక పిల్లల్ని కంటుంది. మేకలన్నీ ఎక్కువ కాగానే వాటిని అమ్మి బర్రెల్ని కొనాలి. పాలు అమ్మి డబ్బు చేసుకొని బర్రె దూడల్ని వేస్తే వాటిని పెంచి పెద్దచేసి అన్నిటినీ అమ్మి పొలం కొనాలి. వ్యవసాయం చేసి చేసి భూస్వామై, బాగా ఐశ్వర్యం సంపాదించిన తర్వాత ఇల్లు వాకిళ్ళతో సుఖంగా కాపురం చేస్తుంటాను. సుష్టుగా భోంచేసి పడుకొని తాంబూలం తేవే అని భార్యతో చెప్తాను. భార్య మాట వినక పోయేసరికి నీకెంత పొగరే అని చెప్పి కాలితో ఈడ్చి ఒక తన్ను తంతాను అని ఆ వెర్రి బ్రాహ్మణుడు దొంతి కుండల్ని ఒక్క తన్ను తన్నాడు. పేలపిండి కాస్తా మట్టిపాలయింది. దురాశ దుఃఖం చేటు. ఇలాంటి కథలనేకం జానపద సాహిత్యంలో ఉన్నాయి.

**సమస్యాత్మక కథలు:**

కథా రూపంలో ఉండే పొడుపు కథలని సమస్యాత్మక కథలు అంటారు. పొడుపు కథ అనేది తెలుగులో మనం ఏ అర్థంలో వాడుతున్నా మూలభూతమైన సమస్యగా అది ఎక్కువ వ్యాప్తిని కలిగి ఉంది . కొన్ని సమస్యలు సామెతల రూపంలో, కథాగేయ రూపంలో గద్య రూపంలో, గణిత రూపంలో కూడా ఉంటాయి. సమస్యాత్మక కథల్లో ఏదైనా పొడుపు కథను విప్పవలసిందిగా వధువు వరుణ్ణో, వరుడు వధువునో కోరడం, విప్పితే వరించడం కొన్నిట్లో కనిపిస్తుంది. మరికొన్ని కథల్లో అక్రమ ప్రణయం కూడా వ్యక్తమవుతుంది. భర్త ఉండగా మరొకనితో అక్రమ ప్రణయం నడిపే స్త్రీ సమస్యను పరిష్కరించుకోడానికి చేసే ప్రయత్నాలు ఈ కథల్లో కనిపిస్తాయి.

తెలుగువారి సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే భారత రామాయణాల శిష్టకల్పనల కంటే కథలు, సామెతలు, గేయాలు మొదలైనవే ఎక్కువగా పనికి వస్తాయి.

## 10.5. నమూనా ప్రశ్నలు:

1. జానపద సాహిత్యంలోని గద్యాఖ్యానాల గురించి రాయండి?
2. పురాగాథల ఆవిర్భావ వికాసాలను సోదాహరణంగా వివరించండి?
3. ఐతిహ్యం అంటే ఏమిటి? ఐతిహ్య లక్షణాలు, రకాలను గురించి వివరించండి?
4. జానపద కథలను విశ్లేషించండి?

## 10.6. ఆధార గ్రంథాలు:

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం-డా॥ ఆర్వీయస్ సుందరం.

**- డా॥ ఇరపని మాధవి**

పాఠం - 11

# సామెతలు-పొడుపు కథలు

## 11.0. లక్ష్యం:

విద్యార్థులకు సామెతలు, పొడుపు కథల గురించి తెలియజేయటం.

**11.1. సామెతలు**

**11.2. పొడుపు కథలు**

**11.3. నమూనా ప్రశ్నలు**

**11.4. ఆధార గ్రంథాలు**

## 11.1. సామెతలు:

తెలుగు వారి జీవితంలో భాగం సామెత. నోరు విప్పి మాట్లాడితే ఏదో ఒక సామెత దొర్లుతుంది. జన జీవితానికున్నంత వైవిధ్యం సామెతకుంది. హంగరీ భాషలో పెల్డ బెగెడ్ (Pelda Begged) అని, అరబ్బీ భాషలో మతల్ (Mathal) అని, ఆంగ్లంలో ప్రొవెర్బ్ (Proverb) అని, సంస్కృతంలో సూక్తి లేదా సుభాషితం అని, తమిళంలో పళమొళి (పాత మాట) అని, కన్నడంలో గాదె లేదా నాణ్ణుడి అని అనడం గమనిస్తే ప్రాంతాలు, భాషలకతీతంగా సామెత జన జీవనంలో భాగమైందని గమనించవచ్చు. ఈ 'సామెత' అనే మాట 'సామ్యత' నుంచి వచ్చింది. రోగర్. డి. అబ్రహామ్స్ సామెతను "సామెతలు సంక్షిప్తంగా, వివేకయుతంగా ఉండే సాంప్రదాయిక అభివ్యక్తులు" అని నిర్వచించాడు. వివేకవంతంగా ఉండటం అనేది సామెత పుట్టుకకు, సంక్షిప్తంగా ఉండటం దాని స్వరూపానికి సంబంధించినది.

జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగానే సామెతలు కూడా సాంప్రదాయకమైనవి. సామెతలు సంక్షిప్తంగా ఉంటాయి. సామెతలో ఇరవై పదాల కంటే ఎక్కువ ఉండకూడదని, ఉంటే అది సామెత కాదనే పండితులున్నారు. 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అనే విధంగా సామెతుంటుంది. సామాన్యంగా సామెతలలో ఒక వాక్యముంటుంది. ప్రాచీన కళాత్మక అభివ్యక్తులలో సామెత ముఖ్యమైంది. అయితే సామెతలు ఎప్పుడూ సంక్షిప్తంగానే ఉంటాయనడానికి లేదు. నాతిదీర్ఘమై గంభీరంగా, సూచ్యంగా అనుభవాన్ని అభివ్యక్తీకరించేటట్లయితే అలాంటి వాక్యాలను సామెతలని అనవచ్చు. సామెతలో ఒక వాక్యంగాని, ఒకే పరిమాణం గల రెండు వాక్యాలు గాని ఉండవచ్చు. చివరకి అక్షరాల సంఖ్యలో కూడా పోలిక కనిపిస్తుంది. అంటే సామెతలోని రెండు భాగాల అక్షరాల సంఖ్య సమానంగా ఉంటుందన్నమాట.

**ఉదాహరణ:**

చేసింది పోదు – చేయంది రాదు

చేసేవి లోపాలు – చెప్పితే కోపాలు

నలుగురు నడిచిందే బాట – పలువురు పలికిందే మాట

సామెతల్లో సమాన భాగాలు లేకపోయినా ప్రాసాను ప్రాసలతో కూడిన లయ కనిపిస్తుంది. ఛందోదృష్టితో చూస్తే వీటిలో ద్విపద పాదాలు, తేటగీతి పాదాలు, ఆటవెలది పాదాలు కనిపిస్తాయి. ఆంగ్లంలో, కన్నడంలో, తమిళంలో కూడా ఈ ఛందోబద్ధత కనిపిస్తుంది. లయ అనేది ప్రాచీన కవితా గుణాలలో ఒకటి. ప్రాక్తన మానవుని భాష మామూలుగా లయబద్ధంగానే

ఉండేదని మానవ శాస్త్రం చెపుతుంది. అందుచేత ప్రాచీన మానవ సంస్కృతిని ప్రతిబింబించే సామెతల్లో లయ ఉంటుంది. ఈ లయ సామెతలను గుర్తుపెట్టుకోవడానికి ఉపయోగిస్తుంది, కవితాగుణం సామెతల్లో ఉంటుందని చెప్పవచ్చు. సామెతల లక్షణాలలో మానవుని వికాసాన్ని ప్రతిబింబించేవిగా ఉండటం ఒకటి. ఈ వివేకం ఏదైనా వాక్యరూపంలో రూపొందగానే అది సామెతగా చెప్పడానికి వీలులేదు. అది ఆ క్షణంలో ఒక ఉక్తి మాత్రమే. ఆ ఉక్తి ప్రజల్లో బాగా ప్రచారమై తనదైన ఒక సంప్రదాయాన్ని ఏర్పరచుకొని ఆ తర్వాతే సామెత అవుతుంది.

సామెత నాణెం వంటిది. ఎవరైనా నాణాన్ని ముద్రించగానే అది చలామణిలోకి రాదు. ప్రభుత్వం వారు ముద్రించినా, ప్రజల్లో చలామణి అయిన తర్వాతనే నాణానికి విలువ వస్తుంది. అలాగే సంప్రదాయం, జన ప్రియత్వం లేని ఉక్తులు ఉక్తులుగానే ఉండిపోతాయి, సూక్తులు కాలేవు. పదునైన భావాన్ని పదునైన మాటల్లో చెప్పటం సామెత లక్షణం. చెప్పే విషయాన్ని సాధ్యమైనంతగా చెప్తాయవి. మానవుడి దీర్ఘానుభవం ఆధారంగా రూపుదాల్చిన సంక్షిప్త వాక్యాలు కావడం చేత సామెతలకు ఈ తీక్షణత లభిస్తుంది. చెప్పే విషయం అలంకారికంగా గూడార్థద్యోతకంగా చెప్పడం సామెత మరో లక్షణం. సామెతలలోని భాష సాంకేతికంగా ఉంటుంది. రూపకం, ఉపమ, దృష్టాంతం సామెతల్లో తరుచుగా కనిపిస్తాయి. అయితే స్వభావోక్తులు కూడా కొన్ని ఉన్నాయి. మొత్తం మీద "సంక్షిప్తమైన, వివేక యుతమైన, తీక్షణమైన, సాంప్రదాయికమైన, జన ప్రియమైన, అనుభవ మూల్యమైన అభివ్యక్తి సామెత" అని నిర్వచించవచ్చు.

**11.1.1. ఉత్పత్తి:**

జానపద కథలు, కథాగేయాలు మొదలైనవి పెద్దవిగా ఉంటాయి. కాబట్టి వాటిలో చారిత్రక విషయాలు కొన్నిటికి కొన్నయినా చేరడానికి అవకాశం ఉంటుంది. జానపద సాహిత్యంలో గద్య కథనాలు, పద్య కథనాలు మాత్రమే కొంతవరకు చారిత్రక అధ్యయనానికి లొంగుతాయి, జానపద సాహిత్య రూపాలలో సామెత అన్నిటి కంటే చిన్నది కావడం వల్ల దానిలో చరిత్రకు సంబంధించిన ఆధారాలను వెతకడం చాలా కష్టం. దానివల్ల సామెత పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకోవడమంటే ఇసుకలో తైలం తీసినట్లే.

మౌలికమైన ప్రతిభ కల్పనాశక్తి, అన్వేషణా శక్తి ఉన్న అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడనడంలో సందేహం లేదు. సామెత ఎందుకు పుట్టింది, సామెత ఎందుకు పుట్టింది, ఎక్కడ పుట్టింది, ఎప్పుడు పుట్టింది అనేవే మూడు ప్రశ్నలు. మనో విశ్లేషణ, సిద్ధాంతం, స్వప్న సిద్ధాంతం మొదలైనవి సామెతలు ఎందుకు పుట్టాయి అనే దాన్ని తెలుసుకోవడానికి కొంతవరకు ఉపకరిస్తాయి. మానవ సంస్కృతి వికాసంలోని వివిధ ఘట్టాలలో దేన్నయినా ప్రతిబించించే విషయముంటే దాన్ని అనుసరించి పరిశోధన జరపవచ్చు. 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' అనే సామెత వీధిలో కారుహారన్లు వినిపించే ఈ కాలంలో పుట్టింది కాదనేది స్పష్టమే. 'కాలితో నడిస్తే కాశీకి పోవచ్చునుగాని, తలతో నడిస్తే తలవాకిలి దాటగలమా' అనే సామెత ఈ కాలానిది అని కూడా చెప్పలేం కదా!

సామెత ఒక ప్రదేశంలో పుట్టి మిగిలిన ప్రదేశాలకు వ్యాపిస్తుంది. కొన్ని సామెతలు పురాణాలు, ఐతిహ్యాలు, కథలు మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని ఉద్భవిస్తాయి. పురాణేతిహాసాలు చాలా సామెతలకు ప్రేరణనిచ్చాయి. రామాయణ, మహాభారతాలు, బైబిలు, పంచతంత్రం మొదలైన వాటి నుండి "రామాయణంలో పిడకల వేట", "వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి", రామాయణమంతా విని రాముడికి సీతేమి కావాలని అడిగినట్లు" వంటి సామెతలు పుట్టాయి.

కొన్ని సామెతలు స్థల పురాణాలకు, దేశ చరిత్రకు సంబంధించిన విషయాలను సూచించేవిగా ఉంటాయి. "తిరుపతి క్షౌరం" అనే నానుడి, "రామేశ్వరానికి పోయినా శనేశ్వరం వదలదు", "కాశికి పోయినవాడు కాటికి పోయినవాడు ఒకటే" వంటివి ఇలాంటివే, ఎన్నో చారిత్రక విషయాలు, స్థల ఐతిహ్యాలు సామెతలు పుట్టడానికి కారణమవుతాయి. అనుభవమే సామెతల పుట్టుకకు ప్రధాన కారణం అనే విషయం తెలిసిందే. ప్రతిరోజు జీవితంలో మనం కన్నవీ, విన్నవీ, అనుభవించినవీ సామెతల రూపంలో వెలువడుతాయి. చాలా సామెతలు సరళమైన ఉపమల రూపంలోను, అనుభవసారమైన వాక్యాలుగాను, హాస్యపూరితమైన చెణుకులు గాను వెలువడుతుంటాయి. "రోట్లో తలపెట్టి రోకటి దెబ్బకు జడిసినట్లు" "చిన్న మిరపకు కారం హెచ్చు", "తీటగల వాడికి, తోటగల వాడికి తీరిక ఉండదు", "తిరిగే కాలు, తిట్టేనోరు ఊరుకోవు" వంటి సామెతలు మన జీవనానుభవం ఆధారంగా పుడతాయి.

సామెతలు ఏవిధంగా పుట్టినా సామూహిక వికాసం పొందుతాయనేది సత్యం. సామెతలు పుట్టడం ఒకరి వివేకం వల్ల కావచ్చు కాని, బహుళ ప్రచారం పొందిన తర్వాతనే సామెతలవుతాయి. తరతరాలుగా మనిషి సంపాదించుకున్న అనుభవం ఎవరి నోటిలోనైనా వివేకవంతమైన మాటగా వెలువడుతుంది. దాన్ని ప్రజలు గ్రహించి ప్రాచుర్యాన్ని కలిగించిన రోజు ఆ మాట సామెత అవుతుంది. వేరు వేరు ప్రదేశాల్లోని సామెతల్లో సమానాంశాలుంటాయి. దానికి కారణం ఒకచోట పుట్టిన సామెత మరో ప్రదేశానికి వెళ్ళటం కావచ్చు, ఒకే విధమైన అనుభవం కావచ్చు. అందుకే డా॥ చాంపియన్ "సామెతల గురించిన జ్ఞానం ప్రపంచమంతటా ఒక్కటే. భిన్నత్వం కనిపించేది సామెతల అభివ్యక్తిలో మాత్రమే. మనుష్యులంతా ఒకే పిండి నుంచి చేయబడినవాళ్ళే. మూలభూతంగా ప్రాచ్యులనీ, పాశ్చాత్యులనీ భేదంగాని, తెలుపు నలుపన్న బేధం కాని లేదు. మానవులంతా ఒక్కటే. మానవుని మూలభూత ప్రవృత్తులైన ప్రేమ, ఆకలి, భయం మొదలైనవి సంస్కారులని లేక అందరికీ సమాన గుణాలుగానే ఉంటాయి. మానవుల ఈ మూలభూత ప్రవృత్తులను తరతరాల నాగరికతలేవీ మార్చలేవు" అని చెప్పాడు.

సామెతల్లోకెల్లా అత్యంత ప్రాచీనమైనవి ఏ దేశంలో పుట్టాయి అనే విషయం కూడా విద్వాంసులను ఆకర్షించింది. బాబిలోనియా, ఈజిప్టు, ఇండియా దేశాల అతి ప్రాచీన గ్రంథాలలో కూడా సామెతలు కనిపిస్తాయి. ఏసు క్రీస్తు సువార్తలలో సామెతలను వాడుకొన్నాడు. ముస్లిముల ఖురానులో సామెతలు, సామెతలను పోలిన వాక్యాలు చాలా ఉన్నాయి. వేదాలు, ఉపనిషత్తులలో సుభాషితాలు, నుడికారాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ప్రాచీన కాలానికి చెందిన భారతీయ ఋషులు, అరిస్టాటిల్, ప్లాటో లాంటి తాత్వికులెన్నో సామెతలను వాడారు. ఆచారాలు, ఆదర్శాలు, ప్రకృతి పరిశీలన, స్వభావ పరిశోధన, చారిత్రక స్థలాలు, ప్రాచీన పురాణాలు, నిత్య జీవితంలో చూచి మనం అనుభవించే ప్రతి విషయము సామెతల పుట్టుకకు కారణం కావచ్చు.

### 11.1.2. సామెతల విభజన:

సామెతలను విభజించడానికి రెండు పద్ధతులున్నాయి. ఆకారాదిగా విభజించడం మొదటిది. దీనిలో మళ్ళీ రెండు రకాలున్నాయి. సామెతల మొదటి మాటను తీసుకొని అకారాదిగా అమర్చడం లేక సామెతల్లో ముఖ్యమైన పదాన్ని తీసుకొని ఆకారాదిగా కూర్చడం. సామెతలను వర్గీకరించడానికి రెండే పద్ధతి ఉంది. అది వస్తువును ఆధారంగా చేసుకొని వర్గీకరించడం. మొదటి దాని కంటే ఇదే ఉత్తమమైనదనిపిస్తుంది. లేకుంటే సామెత ఏదైనా కావాలంటే పుస్తకమంతా వెతకవలసి ఉంటుంది. మొదట వస్తువును బట్టి వర్గీకరించి తర్వాత ఒక్కొక్క వస్తువుకు సంబంధించిన సామెతల్ని అకారాదిగా కూర్చవచ్చు. ఇలాంటి

విభజనలో అకారాది పద్ధతిని అనుసరించినా ఉపవిభాగాలుంటాయి. కాబట్టి సులభంగా సామెతల్ని వెతుక్కోవచ్చు.

ఆర్.ఎస్. బాగ్స్ చెప్పే విషయాలని అనుసరించి సామెతల రకాల గురించి "Standard Dictionary of Folklore" లో చెప్పారు.

1) సామెతల్లో కొన్ని సత్యాన్ని గాని, నీతిని గాని చెప్పేవిగా ఉండవచ్చు.

ఉదా: పరుల సొమ్ము పాపిష్టి సొమ్ము

Honesty is the best policy.

2) ఒక సూత్రాన్ని గాని, అనుభవాన్నిగాని చెప్పేవి కొన్ని

ఉదా: మౌనం అంగీకార సూచకం

Silence gives consent.

3) కొన్ని సామెతలు కథలను సూచించేవిగా, పాతకాలపు సంప్రదాయాలను సూచించేవిగా ఉంటాయి. ఈసపు కథలకు, పంచతంత్రం కథలకు సంబంధించినవి అనేకం ఉన్నాయి.

ఉదా: అందని ద్రాక్ష పళ్లు పుల్లన

Sour grapes.

4) కొన్ని సంప్రదాయాలను, ఆచారాలను తెలిపే సామెతలున్నాయి.

ఉదా. Good wine needs no bush.

5) కొన్ని సామెతల అనుకరణలుగా మరికొన్ని పుడతాయి

ఉదా: దేవాలయానికి దగ్గరయ్యే కొద్దీ దేవుడికి దూరం

The nearer the church, the farther from God.

దీని అనుకరణగా "The nearer Rome, the worse Christian సామెత పుట్టిందంటారు.

6) సామ్యతను చెప్పే సామెతలు

ఉదా: కూటి కుండ కుక్క ముట్టినట్లు

కూడిన కొద్దీ కుండలమ్ముకొని తిన్నట్లు

"Enough is as good as feast.

7) వైద్యానికి సంబంధించిన సామెతలు ఉదా: ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చెయ్యదు

An Apple a day keep doctor away.

8) వాతావరణానికి సంబంధించిన సామెతలు

ఉదా: కృత్తికలో విత్తితే కుత్తుకలు నిండవు

ఆరుకార్తెలకు పోతు ఆరుద్రకార్తె

ఆరుద్రకార్తె విత్తనానికి, అన్నం పెట్టిన ఇంటికి సేగిలేదు

ఆరుద్ర కురిస్తే ఆరుకార్తెలు కురుస్తాయి

ఆరుద్రలో అడ్డెడు చల్లితే, పునాసకు పుట్టెడు పండుతుంది

ఆరుద్రలో తడిస్తే ఆడది మగవాడగును

April showers bring may flowers.

9) కొన్ని న్యాయశాస్త్రానికి సంబంధించినవి

ఉదా: చచ్చిన పామును ఎందుకు చంపుతావు?

Don't kick a man when he is down.

సామెతలలోని ప్రధాన రూపాలను అనుసరించి జనప్రియ సామెతలు, గ్రంథస్థ సామెతలుగా వర్గీకరించారు. కొందరు నాగరికుల సామెతలనే మూడో రకాన్ని చేరుస్తారు. జనప్రియ సామెతలు ప్రజల్లో సహజంగా పుట్టినవి. మిగిలినవి చాలావరకు కల్పితమైనవి. ప్రాస, లయ, ఛందస్సు వగైరాలను ప్రయత్న పూర్వకంగా చేర్చి కవులు, విద్యావంతులు అలాంటి సామెతల్ని రూపొందిస్తారు. జానపదుల సామెతలది గ్రామ్య భాష నాగరీకుల సామెతలది గ్రంథస్థ భాష. ఈ గ్రంథస్థ సామెతలు జనబాహుళ్యంలో ప్రాచుర్యాన్ని సంపాదించి జానపద సామెతలుగా పరిణమించవచ్చు. వేమన పద్యాలలో మూడవ పాదాలు చాలా సామెతలుగా చలామణి అవుతుండడం దీనికి నిదర్శనం.

గేయాలు మొదలైన సాహిత్య రూపాలలాగే సామెతల్ని కూడా వస్తువును బట్టి, రచనను బట్టి, భాషను బట్టి, ప్రాసాదులను బట్టి వర్గీకరించవచ్చు. మార్గరెట్ ఎం. బ్రయాంట్ చేసిన విభాగం భాషా శాస్త్రపరమైంది.

1. పూర్తి వాక్యాలు 2. విద్యావంతుల సంగ్రహ వాక్య రూపాలైన సామెతలు 3. అనుప్రాసలు 4. అసంపూర్ణ వాక్యాలు 5. క్రియారహిత అసంపూర్ణ వాక్యాలు 6. ఉపమలు 7. ఉదాహృత వాక్యాలు 8. ఆధునిక సరసోక్తులు.

వస్తువుని బట్టి సామెతలని విభజిస్తే పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘికాలనే రూపాలేర్పడతాయి. కొన్ని సామెతలు స్థల పురాణాలు, వస్తువును బట్టి చేసే వర్గీకరణలో ప్రకృతి వస్తువులను గురించిన సామెతలను చేర్చవచ్చు.

ఈ విధంగా సామెతలలో ఎంత వైవిధ్యముందంటే ఒక్కొక్క సామెత ఒక్కొక్క ప్రత్యేక విభాగమని చెప్పవచ్చు. మానవుని అనుభవానికి, స్వభావానికి సంబంధించిన సామెతలు, వేదాంత పరమైన సామెతలు; సలహాలు, చమత్కారాలు, విజ్ఞానానికి సంబంధించిన సామెతలు; కథలకు తోకలుగా పుట్టుకొచ్చే సామెతలు; శృంగారం, హాస్యం మొదలైన అలంకారికమైన సామెతలు అనే విభాగాలుగా చేయవచ్చు.

అనేక మంది గొప్ప గొప్ప వ్యక్తులు వారి ప్రసంగాలలో సామెతలను ఉపయోగించారు. అన్ని దేశాలలో సామెతలను సేకరించి సంకలనం చేసిన విద్వాంసులున్నారు. సమాజంలో సామెతలకుండే ప్రాధాన్యాన్ని గుర్తించే ప్రాచీన కవులు తమ రచనలలో వాడుకున్నారు. కానీ దీనివల్ల ప్రజాజీవనంలో ముఖ్య పాత్రవహించే సామెతలని గ్రాంథిక భాషలోకి మార్చటం వలన వాటి సహజత్వం పాడుచేశారు. అయినప్పటికీ శిష్ట సాహిత్యంపై జానపద సాహిత్య ప్రభావాన్ని ఇది నిరూపిస్తుంది.

**ప్రాచీనకాలం నుంచి సామెతలు తెలుగు వారి జీవనంలో భాగంగా ఉన్నాయనడానికి ఉదాహరణలు:**

గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్ (నన్నయ)

వృద్ధుల బుద్ధులు సంచలింపవే (॥)

యజమాన భక్ష్యమగు పురోడాశమది కుక్కకర్హమగునే (॥)

లేడి కడుపున పులిపుట్టునె (॥)

కయ్యమున కొండొకరుండిటు లొంటి వచ్చునే (తిక్కన)

పాలలో బడిన బల్లి విధంబున నుండకుండునే (॥)

సడి కంటె చావు మేలనియెడి పలుకు దలంపవలదె (॥)

పతులు మెచ్చని చెటవు నిష్ఫలము గాదె (శ్రీనాథుడు)

చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్ (పెద్దన)

కలంచునే సతులు మాయల్ ధీర చిత్తంబులన్ (॥)

పట్టిన పదడైన పసిడియై వెలిగె (పాల్కురికి సోమన)

ఇవన్నీ ఒక ఎత్తు అయితే వేమనపద్యాలు ఒక ఎత్తు. వేమన పద్యాల మూడవ పాదాలు చాలా వరకు సామెతల వంటివే. వేమన జీవితానుభవంతో కవిత చెప్పినవాడు కావడం చేత అనుభవ ప్రాధాన్యత గల సామెతలు అతడి పద్యాలలో ఉంటాయి. అనే వేమనను ప్రజాకవిగా చేశాయి.

ఉదా: భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు

అనువుగాని చోట అధికులమనరాదు

పదుగురాడు మాట పాడియై ధరజెల్లు

స్థానబలిమికాని తన బల్మికాదయా

చెప్పు తినెడి కుక్క చెఱుకు తీపెరుగునా

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు

విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత

పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా

బొగ్గుపాల గడుగ పోవునా మలినంబు

ఈ విధంగా శిష్టకవుల కావ్యాలలోనే తొంగి చూచే సామెతలు జానపద సాహిత్యంలో అనేకం కనిపిస్తాయనడానికి సందేహం లేదు. గేయాలలో, కథాగేయాలలో, గద్య కథనాలలో సామెతలు చాలా కనిపిస్తాయి.

ఉదా॥ ఉలవలెత్తామంటె ఊళ్ళనడిగెదవు

పేదవాని కోపము పెదవుల తీట

ముంజేయి కంకణ మరయుటకు న్నిటముకురము కావలెనా

చల్లకోసము వచ్చి ముంత దాచంగ నేల మనకూ

ఉసురు వున్న ఉప్పమ్మ వచ్చును ఊరికి పోవన్నా

నాడు సామెతలనెల్ల నేడు నిజమయ్యె

తను గట్టుటకు త్రాళ్ళు తాదెచ్చుకున్నట్లు

ముందు చెవుల కన్న వెనుక కొమ్ములు వాడి

దాసుని తప్పు దండముతో సరి

కడవంత గుమ్మడి కత్తిపీటకు లోకువ

**11.1.3. తెలుగు సామెతల ప్రత్యేకత:**

తెలుగు సామెతలలో సాహిత్యపరమైన సౌందర్యం, సాంస్కృతిక పరమైన విలువ, ఇరుగు పొరుగు సామెతలనే విశేషణాలు ఉన్నాయి.

**సాహిత్యపరమైన సౌందర్యం:**

సామెతలు అర్థ గాంభీర్యం కలవి. అయితే అన్ని సామెతలూ సాహిత్య గంధం ఉండేవనడానికి వీలు లేదు. సామెతల్లో పౌరాణికాలు, చారిత్రకాలు, నీతి సంబంధాలు మొదలైనవి అనేకమున్నాయి. ధ్వని ప్రధానాలై, మనిషిలోని అనుభవసారాన్ని సూచనా ప్రాయంగా తెలిపే సామెతలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. శబ్దాడంబరంతో కూడిన కవిత్వం కన్నా అర్థానికి అర్థం, శబ్ద సౌందర్యానికి శబ్ద సౌందర్యం కల సామెతలు విశిష్టమైనవి.

**ఉదా:** "కాలు జారితే తీసుకోవచ్చునుగాని – నోరు జారితే తీసుకోగలమా" ఏవిధంగా చూసినా మహార్థం భాసించె సామెత ఇది. జీవితంలో మాటకు ఉండే విలువను, సమాజంలో వ్యక్తికి, వ్యక్తికి ఉండే సంబంధాన్ని, సంఘంలో మనిషి తీసుకోవలసిన జాగ్రత్తను ధ్వని ప్రధానంగా చెప్తున్న వాక్యమిది. కాలు జారితే దేహానికి బాధ కలుగవచ్చు. కాని నోటిమాట గాలిలో పయనించేది. ఒకసారి నోటి నుంచి వెలువడితే మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకోవడం సాధ్యంకాదు. మాట ప్రభావం మనసు మీద ఉంటుంది, దేహం మీద కాదు, దేహానికి కలిగే బాధకన్నా మనసుకు కలిగే బాధ గొప్పది. ఇది మాట్లాడే ముందు ఆలోచించమని చెప్పే జీవిత సత్యం.

"పడమట క్రుంకిన పొద్దు తూర్పున లేవదా" అనేది మరో మంచి సామెత. ఈ సామెతలో సూర్యుడు పడమర అస్తమించి, తూర్పున ఉదయిస్తాడనే అర్థం పైకి కనిపించినా తాత్త్వికులకు అది మరణించిన ప్రతివాడు మళ్ళీ ఇంకో దేహాన్ని పొందుతాడని అంటే తిరిగి మళ్ళీ జన్మిస్తాడని అర్థం స్ఫురింపజేస్తుంది. ఇంకో అర్థం కూడా స్ఫురిస్తుంది. నేడు కష్టం కలిగినా అది కలకాలం ఉండదని మళ్ళీ సుఖం లభిస్తుందని, ఆశేజీవిని నిలబెడ్తుంది. ఆ అర్థమే స్ఫురింపజేస్తుందీ వాక్యం.

**సాంస్కృతిక పరమైన విలువ:**

సామెతలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. సంఘానికి, సంస్కృతికి విడదీయరాని సంబంధం ఉంది. సంఘం లేకుంటే సంస్కృతి లేదు, సంస్కృతి లేకుంటే సంఘం లేదు. సంఘంలోని కట్టుబాట్లు, ఆచారాలు, మర్యాదలు, సంప్రదాయాలే సంస్కృతి అనిపించుకొంటాయి. ఒక్కో సామెతకూ సాంస్కృతికమైన విలువ ఎంతో కొంత ఉంటుంది. అత్తకు సంబంధించిన సామెతలే ఒక ప్రత్యేక విభాగమంత ఉన్నాయి. ఆంధ్రుల సామాజిక జీవితంలో అత్తకుండే స్థానం ఎలాంటిదని ఈ సామెతలు తెలియజేస్తాయి. మాతృ ప్రధాన కుటుంబంలో అయితే తల్లికి విశిష్టస్థానం ఉంటుంది. పితృ ప్రధాన కుటుంబంలో అత్తవారింటికి వెళ్ళిన స్త్రీ ఒక విధమైన మానసిక వేదనకు గురవుతుంది. బానిసత్వానికి ప్రతీకగా బ్రతకాల్సిన భారతీయ మహిళ బహుశా తన మానసిక వేదనను కోడలిని వేధించడం ద్వారా తీర్చుకుంటుందేమో. సామాన్యుడి మనసులో అత్తంటే ఉండే భావన జానపద గేయాలు, కథలు, సామెతలే తెలియజేస్తాయి. కుటుంబంలో అత్తగారి పాత్రను వ్యక్తం చేసే సామెతలకు ఉదాహరణలివి.

"అత్త కాలం కొన్నాళ్ళు - కోడలి కాలం కొన్నాళ్ళు

అత్తకు మంచి లేదు, చింతకు పచ్చీలేదు

అత్తకు లేక అటికలు నాకుతూ వుంటే అల్లుడొచ్చి దీపావళి పండుగన్నాడు.

అత్త చేసిన పనికి ఆరళ్ళులేవు

అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు

అత్తవారింటి సుఖం మోచేతి దెబ్బ

సంబంధ బాంధవ్యాలను తెలిపే సామెతలు కొన్నయితే జీవితంలోని సత్యాలను సూచ్యంగా చెప్పేని మరికొన్ని. మానవ జీవితంలో డబ్బుకు ఉండే ప్రాధాన్యం ఇంక దేనికి లేదుకదా. డబ్బుపై వచ్చిన సామెత "ఎన్నడూ దొరకనమ్మకు ఏగాని దొరికితే ఏడుముళ్ళు వేసిందంట" మనుషుల్లోని ఒక్కో గుణాన్ని ఒక్కో సామెత తెలియజేస్తుంది.

"పాడి ఆవును దానం చేసి పాలు తాను పితుక్కునే"

"పాడి గుట్టు - పంటరట్టు"

"పాడి పసరం పసిబిడ్డ ఒకటే"

"పెట్టిన పెళ్ళి గోరు, పెట్టుకున్న చావు గోరు"

మన సంస్కృతిలో పెళ్ళికి ప్రాధాన్యం చాలా ఎక్కువ. పెళ్ళిపై సామెతలు అనేకం కనిపిస్తాయి.

ఉదా: "పెళ్ళి అయిన ఇంట్లో ఆరునెలలు కరువు"

"పెళ్ళికి చేసిన పప్పు పేరంటాండ్రు చవి చూడను సరిపోయింది"

"పెళ్ళికి పోతూ పిల్లిని చంకను పెట్టుకొని పోయినట్లు"

రోజురోజుకీ సమాజంలో వస్తున్న మార్పులను తెలుపుతూ

"కొత్త నీరు వచ్చి పాత నీరు కొట్టుకు పోయినట్లు"

"మేకలే మడకలు దున్నితే ఎద్దులు ఎవరికి కావాల".

వంటి సామెతలు పుట్టాయి.

**ఇరుగు పొరుగు సామెతలు:**

సామెతలు చిన్నగా ఉంటాయి కాబట్టి ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం చేశాయన్నది చెప్పడం కష్టం. సోదర భాషల్లో ఉండే సమానార్థకాలైన సామెతల విషయంలో ఇది ఇంకా నిజం అనిపిస్తుంది. చాలా దగ్గర సంబంధం గల తెలుగు, కన్నడ, తమిళ మొదలైన భాషల్లో సమానార్థకాలైన సామెతలు ఎక్కువగా ఉన్నాయి. ఏ భాషలో వచ్చిన సామెతలు ఆ భాషలో ఉంటేనే ఆ భాష ప్రత్యేకత, నుడికారపు సొగసు తెలుస్తుంది. అందుకే ఒక భాష నుండి మరో భాషలోకి అనువదిస్తే బాగుండవు,

ఉదా: "రాత్రంతా రామాయణం విని రాముడికి సీతేమవుతుందని అడిగినట్లు" (తెలుగు)

"బెళగానె రామాయణ కేళి బెళగ్గె రామనిగె సీతే నాగ బేకంద్వాగె" (కన్నడ)

(పొద్దుటి దాకా రామాయణం రాముడికి విని పొద్దున్నే రాముడికి సీతేం కావాలన్నట్లు).

"పనిలేని మంగలి పిల్లి తల గొరిగాడు (తెలుగు)

"కెలకు విల్లద మురవ హెండతి తలె బోళి సిద (కన్నడ)

(పని లేని మంగలి పెళ్ళాం తల గొరిగాడు)

"నివురుగప్పిన నిప్పులాగ" (తెలుగు)

"బూది ముచ్చిద కెందద హాగె" (కన్నడ)

అనువాదం కన్నా పై చెప్పిన విధంగా కొంచెం మార్పులతో ఉన్నా సామెతలు ఏ భాషలోది ఆ భాషలో ఉంటే వాటి సహజత్వాన్ని కోల్పోకుండా ఉంటాయి.

తెలుగువాళ్ళు సామెతలను సేకరించి భద్రపరచవలసినది అవసరం ఉంది.

## 11.2. పొడుపు కథలు:

జానపద విజ్ఞానంలో ప్రత్యేక శాఖగా పరిగణించదగినంత విస్తృతమైనది పొడుపు కథలు. జానపద గేయాలు, గద్యాఖ్యానాలు, సామెత వైవిధ్యం గల ప్రక్రియలే అయినప్పటికీ వీటన్నిటికంటే ఇంకా వైవిధ్యం కల ప్రక్రియ పొడుపు కథ. పొడుపు కథల్ని జానపద సాహిత్యంలో భాగంగా ఉన్నా వీటిలో కొన్ని గణిత రూపంలో, చిత్ర రూపంలో కూడా చూపించవచ్చు. జానపద గేయ రూపంలో, కథా గేయ రూపంలో, కథా రూపంలో, సామెతల రూపంలో కూడా పొడుపు కథలుంటాయి. వినోదాన్ని, విజ్ఞానాన్ని సమానంగా పంచే గొప్ప ప్రక్రియ అయిన పొడుపు కథ జనుల నిత్య జీవితంలో భాగమై పోయింది. పొడుపు కథలకు జీవితమే మూలధనం. జీవితంలో సమస్య విడగొట్టడానికి మనిషి చేసిన ప్రయత్నమే పొడుపు కథలకి ప్రేరణ అయి ఉంటుంది. ఎదుటివారి బుద్ధి కుశలతకు ఒక పరీక్షగా పుట్టాయి. పొడుపు కథలు, సామాన్య మానవునిలోని బుద్ధి చాతుర్యం, హాస్య ప్రియత్వం, సమస్యలను పరిష్కరించుకోవాలనే మనస్తత్వం పొడుపు కథలను తీర్చిదిద్దుతాయి.

### 11.2.1. పొడుపుకథ – నిర్వచనాలు:

ఆంగ్లంలో పొడుపు కథను 'రిడిల్' (Riddle) అంటారు. దీనికి మూలమైన Racdan అనే పాత ఇంగ్లీషు పదానికి 'సలహా ఇవ్వడ' మని అర్థం. సంస్కృతంలో ప్రహేళికలు వేద కాలం నుంచి ప్రచారంలో ఉన్నాయి. "పొడుచుట, విప్పుటలో ఆనందమును వెల్లివిరియించునవి 'పొడుపు కథలు' అన్నారు నేదునూరి గంగాధరం గారు. కన్నడంలో 'ఒగటు' అంటారు. ఒగటిన కథె అంటే సమస్యాత్మక కథ అని అర్థం. తమిళంలోని 'విడుకత్తె' పొడుపు కథ లాంటిదే. "ప్రత్యుత్తరం తెలియని వారి బుద్ధి కుశలతను పరీక్షించడానికి వారిని తికమక పెట్టడానికి తయారుచేసిన ప్రశ్నలు పొడుపుకథలు" అన్నారు రోగెర్ డి. అబ్రహామ్స్, అలన డండస్‌లు. తెలుగు దేశంలో కోస్తా ప్రాంతంలో పొడుపుకథ అంటే, తెలంగాణాలో 'శాస్త్రం' అంటే, రాయలసీమ ప్రాంతంలో 'మారు కథ' అని ప్రచారంలో ఉంది. ఇచ్చుకత, విచ్చుకత, విప్పుకత, అడ్డకత, అడ్డుకత, ఒడ్డుకత అనే పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.

పొడుపు అంటే పొడవటం, పొడిచినట్లుగా ప్రశ్నించటం అనే అర్థాలను చెప్తారు. పొడుపు కథలో పొడిచి పొడిచి లేక గుచ్చి గుచ్చి అడగడం ముఖ్య లక్షణం కాబట్టి ఈ పేరు వచ్చి ఉంటుంది. నేరుగా చెప్పడానికి 'మారుగా' మరొకటి చెప్పడం వల్ల మారు కథ అనే పేరు వచ్చి ఉండవచ్చు అడిగిన సమస్యను విప్పడం వల్ల విచ్చు కథ, విప్పు కథ అనే పేర్లు వచ్చాయి

పందెం ఒడ్డినట్లుగా సమస్యను ఒడ్డే గుణం ఉండటం వలన ఒడ్డు కత లేక ఒడ్డ కత అని పేరు వచ్చి ఉంటుంది. పొడుపు కథ లోని వైవిధ్యాన్నంతా ఒక నిర్వచనంలో ఇమడ్చటం కష్టం. ఆర్చర్ టేలర్ "పొడుపు కథలో ఒక వస్తువుకు సంబంధించిన అలంకారిక వివరణ, సాహిత్య వివరణ ఉంటాయి. అవి వినే వారిని తికమక పెట్టే విధంగా ఉంటాయి" అంటాడు. టేలర్ పొడుపు కథల్లో ముఖ్యంగా రెండు వివరణాత్మక గుణాలున్నాయంటాడు.

1. రూఢం (Positive)
2. వ్యతిరేకం (Negative).

రూఢంగా ఉండేది వాచ్యంగా ఉండకుండా ఆలంకారికంగా ఉంటుంది.

పొడుపుకథను వివరణాత్మకంగా నిర్వచించటానికి ప్రయత్నించిన వారు "పొడుపు కథ నిజమైన అర్థాన్ని కప్పిపుచ్చేదిగా ఉండవచ్చు. ప్రశ్న రూపంలో ఉండవచ్చు, కాని ఇది జవాబును నేరుగా సూచించదు" అని చెప్పారు.

**11.2.2. పొడుపుకథ – లక్షణాలు:**

పొడుపు కథల్లో ప్రత్యేకంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

**1) గంభీరమైనవిగా ఉండటం:** గంభీరమైనవిగా ఉండటం పొడుపు కథల ప్రధాన లక్షణంగా పేర్కొనవచ్చు. బుద్ధి చాతుర్యానికి వీటిలో అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఊహాతీతంగా కన్పించడం, గూఢంగా ఉండే జవాబు తెలియగానే ఎదుటివాడికి ఆశ్చర్యం కలిగేలా చేయడం పొడుపు కథ లక్షణం. పొడుపు కథను గాంభీర్యం ఉట్టిపడేలా పొడవడం ప్రశ్నించేవాడి పనైతే దానిని ప్రతిభావంతంగా విప్పడం విన్నవాడి పని. ఈ గాంభీర్యానికి సంబంధించిందే అర్థ గోపనం అనే లక్షణం. చెప్పాల్సిన విషయాన్ని రహస్యంగా ఉంచడం ప్రయత్న పూర్వకంగా చేసే సృష్టి. అప్రయత్నంగా వెలువడే జానపద గేయాల వంటి వాటి నుంచి పొడుపు కథను వేరుచేసే లక్షణమిదే. ఎదుటి వ్యక్తి బుద్ధి శక్తిని పరీక్షించడానికి ప్రయత్న పూర్వకంగా వెలువడినవీ పొడుపుకథలు.

**2) రూపకంగా ఉండటం:**

రూపకంగా ఉండటం పొడుపు కథకుండే మరో లక్షణం. ఇది వాచాలత్వానికి సంబంధించినది కాదు. ఏదో ఒక వస్తువును గాని, వ్యక్తిని గాని సూచించే ధ్వని ప్రధాన రూపం ఇది. పొడుపు కథల్లోని అలంకారం, రూపకం, వ్యాజోక్తి, గూఢోక్తి మొదలైన వాటిల్లో ఒకటి. ప్రాచీన సంస్కృతాలంకారికులు వ్యాజోక్తికి, గూఢోక్తికి, వక్రోక్తికి ఇచ్చిన ఉదాహరణలు వివిధ రకాల పొడుపు కథలే. చిన్న పిల్లలు మాట్లాడుకొనే 'క' భాష కూడా ఒక రకమైన పొడుపు కథకు ఉదాహరణే. ఆలంకారికంగా ఉండటం పొడుపు కథకు చమత్కార గుణాన్ని కలిగిస్తుంది. పొడుపు కథ సంస్కృతంలోని ప్రహేళిక నిర్వచనానికి ఉదాహరణ అనవచ్చు. జేమ్స్ ఎ.కెల్సో "పొడుపు కథ అర్థ స్పష్టత లేని రూపకం లేక రూపక సముదాయం" అని చెప్పటం పొడుపు కథకుండే ఆలంకారిక గుణాన్ని తెలియజేస్తుంది. పొడుపు కథకు, రూపకానికి ఉండే సంబంధాన్ని గుర్తించిన వారిలో మొదటివాడు అరిస్టాటిల్. పొడుపు కథల్లో ముఖ్యంగా రెండు భాగాలుంటాయి. ఒకటి ఉపమానం రెండోది ఉపమేయం. ఉపమానం వాచ్యంగా ఉపమేయం సూచ్యంగా ఉంటుంది. ఉపమానాల సహాయంలో ఉపమేయాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. పొడుపు కథల్లోని ఉపమానాలు నిత్యజీవితంలో మనకు పరిచితమైనవే ఉంటాయి.

**3) హాస్యస్ఫోరకంగా ఉండటం:**

పొడుపు కథల్లో ఇంకో గుణం హాస్యస్ఫోరకంగా ఉండటం. కొన్నిటిలో హాస్యం మితిమీరి అశ్లీలమౌతుంది. అయితే

అశ్లీలం పదాల వరకే పరిమితమై ఉంటుంది గాని అర్థంలో కాదు. హాస్యానికి తోడు ఒక్కొక్కసారి వ్యంగ్య గుణం కూడా పొడుపు కథల్లో కనిపిస్తుంది. మనిషిలో సహజంగా ఉండే హాస్య ప్రవృత్తి కొన్ని పొడుపుకథలు రూపొందడానికి కారణం. గాంభీర్యం సూచ్యంగా ఉండటం, హాస్యం వాచ్యంగా ఉండడం పొడుపు కథలకు ఒక వింత అందాన్నిస్తుందనడంలో సందేహం లేదు.

**4) ప్రకృతితో సంబంధం కలిగి ఉండటం:**

ప్రకృతితో సంబంధం ఉండటం పొడుపు కథలకున్న మరొక లక్షణం. ప్రకృతికి సంబంధించిన అనేక వస్తువులు వీటిలో స్థానం సంపాదించుకున్నాయి. ప్రాచీన కాలం నాటి మానవుడు తన జీవితంలో ప్రకృతికి ప్రాముఖ్యాన్ని ఈ లక్షణం తెలుపుతుంది. ప్రకృతి లోని వస్తువుల్ని ఉపమానంగా కొన్నిట్లో ఉపమేయంగా, కొన్నిట్లో జానపదులు ఉపయోగించుకుంటారు. జానపద విజ్ఞానంలోని అనేక ప్రక్రియల్లో లాగే పొడుపు కథలకు సార్వజనీన గుణం ఉంది. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో దొరికే పొడుపు కథలను సేకరించి పరిశీలిస్తే కొన్ని సార్వజనీన గుణాలు కనిపిస్తాయి. మానవ మనస్తత్వం ప్రపంచంలో ఎక్కడైనా ఒకటేనని తెలియజేస్తాయి. మొత్తం మీద చాతుర్యంతో కూడిన, కళాత్మకమైన, లయబద్ధమైన సంక్షిప్త గూఢోక్తిగా పొడుపు కథను చెప్పుకోవచ్చు. ఇది బుద్ధికి కసరత్తునిస్తుంది.

**పొడుపుకథ – పుట్టు పూర్వోత్తరాలు:**

పొడుపు కథ అనేది ప్రయత్న పూర్వకంగా కల్పించబడింది గేయాలు, కథాగేయాలు జానపద సాహిత్యంలో మొదటి దశలో, గద్య కథనాలు రెండవ దశలో, పొడుపు కథలు మూడవ దశలో రూపొందాయి. "ది సైన్స్ ఆఫ్ ఫోక్‌లోర్" లో అలెగ్జాండర్ క్రాప్పె పొడుపు కథ జానపద విజ్ఞానంలో చివరిది అనటం సత్యదూరం కాదు. పొడుపు కథలు మరీ ప్రాచీనమైనవి కాదు, అలాగనే ఆధునికమైనవి కాదు. మానవ మనోవికాసం బాల్యావస్థలో ఉన్నప్పుడే పొడుపుకథలు అవతరించాయి. అయితే అవి జానపద గేయాలు, జానపద కథల కంటే ప్రాచీనమైనవి కాకపోవచ్చు.

కూట రచనలనే పేరుతో సాహిత్య సంబంధమైన పొడుపు కథలు కూడా ప్రాచీన కాలం నుంచే ఉన్నాయి. ఇటువంటివే జానపద సాహిత్యంలోను ఉన్నాయి. సాహిత్య సంబంధమైన పొడుపు కథలు ఎక్కువ గాంభీర్యం కలవి. భారతదేశంలో వేదకాలం నుంచి ఇవి ప్రచారంలో ఉన్నాయి. వేదాలలో అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదంలోని మొదటి మండలంలోనే పొడుపు కథలున్నాయి. "ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యన శ్నన్నన్యో 2 భిచాక శీతి" అనే ఋగ్వేదంలోని ప్రహేళిక సుప్రసిద్ధం చెట్టు మీద రెండు పక్షులున్నాయి. ఒకటి పండును తింటుంది, మరొకటి తినటం లేదు. ఇక్కడ జీవాత్మ పరమాత్మలను ధ్వన్యాత్మకంగా చెప్పాడు వేదఋషి. జీవిత రహస్యాన్ని నిగూఢంగా చెప్పే అభిలాష ఇందులో వ్యక్తమవుతుంది. ఇలాంటి ప్రహేళికలు ఇంకా ఉపనిషత్తులు, పాణిని అష్టాధ్యాయి, భారతం మొదలైన వాటిలో కనిపిస్తాయి. యజ్ఞయాగాల్లో, పెళ్ళిళ్ళల్లో పొడుపు కథలను వాడటం తరతరాలుగా ఆచారంగా ఉంది.

భారతదేశంలో పొడుపుకథలు వేదాల తర్వాత మహాభారతంలో ఎక్కువగా ఉన్నాయి. ప్రకృతికి, నీతికి సంబంధించిన అనేక పొడుపు కథలు భారతంలో ఉన్నాయి. ప్రశ్నోత్తరాల రూపంలో పొడుపు కథలు రావడానికి భారతంలోని యక్ష ప్రశ్నలే కారణమై ఉండవచ్చు. నీతికి సంబంధించిన పొడుపు కథలు జాతక కథలో ఉన్నాయి. వాటిలో కొన్ని సమస్యాత్మక కథా రూపంలో కూడా ఉన్నాయి. రాజు చనిపోయిన తర్వాత మరొకరిని ఎన్నుకోవడానికి పొడుపు కథల ద్వారా పరీక్ష జరిపే విధానాలు జాతక కథల్లో ఉన్నాయి.

ఆంధ్ర మహాభారతంలోనూ యక్ష ప్రశ్నల రూపంలో పొడుపు కథలున్నాయి.

**యక్ష ప్రశ్న:**

"మొనసి నిద్రించియును గన్నుమూయదెద్ది
పుట్టియును జేతనత్వంబుఁ బొరయదెద్ది
యరయ రూపు గల్గియు హృదయంబులేని
దెద్ది వేగంబు కతమున నెద్ది పొలుచు"

**ధర్మరాజు సమాధానం:**

"అనినఁ గన్ను మూయదు సుప్తమయ్యు మీను
పుట్టియును గ్రుడ్డు చేతనం బొరయకుండు
హృదయరహితంబురా రూపుమేఱురయము
కతన వర్తించునని చెప్పెఁ గౌరవుండు"

మన దేశంలో తరతరాల నుంచి పొడుపు కథలున్న విధంగానే ఇతర దేశాల సంస్కృతుల లోను పొడుపు కథలున్నాయి. గ్రీక్, సెమెటికి, బాబిలోనియా సంస్కృతులకు సంబంధించిన కావ్యాలలో చాలా పొడుపు కథలున్నాయి. ప్రాచీన హిబ్రూ కావ్యాలతో, బైబిలులో ఆధ్యాత్మిక చింతన గల సమస్యలు కనిపిస్తాయి. పొడుపుకథలు జానపదులకు వినోద సాధనాలుగా, ఆలోచనను రేకెత్తించే శక్తులుగా నిలిచి ఉన్నాయి.

ప్రాచీన కాలపు పొడుపు కథలను పరిశీలించినప్పుడు అవి కేవలం వినోదం కోసం కాదు ధార్మిక నేపథ్యం కలిగి ఉన్నాయి. పొడుపు కథ పుట్టుకకు మానవుని ప్రకృతి పరిశీలన, ధార్మిక చింతన కారణాలై ఉంటాయి. ప్రకృతి రహస్యాలను అస్పష్ట భాషలో చెప్పడానికి ప్రయత్నించిన ఆదిమానవుడి ప్రయత్నాల వల్ల పొడుపు కథలు అంతరించాయని ఊహించవచ్చు. ప్రకృతిని అర్థం చేసుకోవాలనే కుతూహలం కలిగిన ప్రాచీన మానవుడి మనస్సు పొడుపు కథలను సృష్టించింది. వీటి సమగ్ర పరిశీలన వల్ల ఆదివాసుల జీవితం, అనుభవాలు, ఆలోచనలు మొదలైన వాటిని గురించి ఆసక్తికరమైన అనేక విషయాలు తెలుస్తాయి. పొడుపు కథలు ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో ఉండటం వాటిలో పోలికలు కనిపించటం ఒకే మూలం నుంచి పుట్టడం కారణంగానా లేక మానవుల మనస్సులో ఉండే సమాన గుణం కారణంగానా అనేది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. ఎలా పుట్టినా మనిషి కుతూహలాన్ని, బుద్ధి శక్తిని ఇంకా సంపాదించాలనే ఆలోచనను ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తుంది.

**11.2.3. పొడుపు కథలు-విభజన:**

పొడుపు కథల విభజనకు అనేక విధానాలు అమలులో ఉన్నాయి. పొడుపు కథలలో ముఖ్యంగా జానపదుల పొడుపు కథలు, సాహిత్యపరమైన పొడుపు కథలని రెండురకాలున్నాయి. విభజించేటప్పుడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలోని పొడుపు కథలని దృష్టిలో పెట్టుకొని చేసేది ఒక రకమైతే తెలుగులోని పొడుపు కథలని దృష్టిలో ఉంచుకొని చేసేది మరో రకం. పొడుపు కథల్లో కాకన్ డ్రమ్ (Conundrums), ఎనిగ్మా (Enigma) అనే రెండు రకాలను విద్వాంసులు పేర్కొన్నారు. మొదట దానిలో పదాడంబరం, రెండో దానిలో ఊహాత్మక వివరణ ముఖ్యంగా ఉంటాయి.

ప్రశ్నోత్తర రూపంలో ఉండే పొడుపు కథలు తెలుగులోను, ఇతర భాషల్లోను ఉన్నాయి. ఇవి పాటల రూపంలో ఉండవచ్చు లేక గద్యరూపంలో ఉండవచ్చు. పెళ్ళిళ్ళల్లో ఇలాంటి పొడుపు కథలు ఉపయోగిస్తారు. నేత్రా విధానం మొదలైన

వాటితో పాటు, చిత్రాలతో సూచించే పొడుపు కథలను దృశ్య సంబంధమైన పొడుపు కథలని చెప్పవచ్చు. తర్క సంబంధమైన సమస్యలు బుద్ధికి పదును పెడ్తాయి.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల పొడుపు కథలను భాషా శాస్త్రపరంగా గొలుసుకట్టు పదాలు, సామాన్య వాక్యాలు, సంకీర్ణ వాక్యాలు, వ్యతిరేక వాక్యాలు, పద్యరూప పొడుపుకథలు, కథా రూపంలో ఉండే పొడుపు కథలు అని విభజించవచ్చు.

సంస్కృతంలో పొడుపు కథకు ప్రహేళిక అని పేరు. దండి ప్రహేళికల్లో పదహారు భేదాలున్నాయి. విశ్వనాథుడు సాహిత్య దర్పణంలో చ్యుత దత్తాక్షరాదికము అని పొడుపు కథనన్నాడు. ఎన్ని రకాలని చెప్పలేదు. భోజరాజు చ్యుతాక్షర, దత్తాక్షర చ్యుత దత్తాక్షర, ముష్టిక, బిందుమతి, అర్ధవతి అనే ఆరు రకాలు చెప్పాడు.

**తెలుగు పొడుపు కథల విభజన:**

టేకుమళ్ళ వారి విభజననుసరించి

**1) పద కల్పన:**

ప్రతి చరణంలో చివర చెప్పాల్సిన వస్తువును ఒకే అక్షరం ద్వారా సూచించడం జరుగుతుంది, మిగిలిన అక్షరాలను గ్రహించాల్సి ఉంటుంది.

ఉదా: వంకర టింకర శొ (శొంఠి)
వాని తమ్ముడు అ (అల్లము)
నల్ల గుడ్డ మి (మిరియాలు)
నాలుగు కాళ్ళమే (మేక)

**2) పొడుపు కథ నిడివిని బట్టి చిన్నవి, పెద్దవి అని రెండు రకాలు:**

ఉదా:

చిన్నవి: చిటారు కొమ్మని మిఠాయి పొట్లం (తేనెపట్టు)
గుడి నిండ ముత్యాలు గుడికి బీగం (దానిమ్మ పండు)

పెద్దవి: రాచవారికి నచ్చే చిన్నది
రాజ్యాలెల్ల మెచ్చేనన్నది
బంగారు వారింటి కోడలు
పట్టుకుంటే రాదు చేతులు
చెంతాడుతో తోడకొండ
చెంబుతో ముంచకుండ
నీటుగా కులుకుతున్నది
నీళ్ళు తెస్తానంటు వున్నది (కొబ్బరికాయ).

**3) వచనంలాగా ఉండేవి కొన్ని:**

కొందరు తిందురు ముందు పెట్టుకొని ఏడుస్తారు (ఉల్లిగడ్డ)

**4) గేయాలలాగా ఉండేవి అనేకం:**

చెక్కని స్తంభం, చేతికందదు

చెయ్యని కుండ, పొయ్యని నీళ్ళు

వెయ్యని సున్నం, తియ్యంగా (కొబ్బరి నీళ్ళు)

**5) పొడుపు కథలను గుర్తుంచుకొనేట్లు చేసేవి వాటి అంత్యప్రాసలు:**

వంకర టింకర మాను

వయ్యారి మాను

రాజులెక్కే మాను

కష్ట జీవుల మాను

ఎత్తుకు తిరిగే మాను

ఇతరుల పెండ్లి కౌను (పల్లకి)

**6) ఒకే గేయంలోని ఒక్కొక్క చరణానికి ఒక్కొక్క జవాబుండే పొడుపు కథలున్నాయి.**

వీటిని గొలుసు పొడుపు కథలనవచ్చు.

దిబదిబలాడేవి రెండు (కాళ్ళు)

దిబ్బెక్కి చూచేవి రెండు (కళ్ళు)

ఆలకించేవి రెండు (చెవులు)

ఆదుకునేవి రెండు (చేతులు)

7) వివరణాత్మకంగా ఉండే పొడుపు కథలు కొన్ని.

ఒక విషయాన్ని తెలియజేయడానికి దీర్ఘ వర్ణన అవసరమయ్యేవి:

నూతిలో పాము నున్నని పాము

పొడల పొడల పాము, పొట్టి పొడుగు పాము

వాడ వాడల పాము, వాలైన పాము

చారచారల పాము, చక్కని పాము

పామును పట్టి కూరచేస్తే

పంటికిందికే రాదు (పొట్లకాయ)

8) మనదేశంలో ముఖ్యవృత్తి వ్యవసాయం.

సహజంగానే వందల కొద్ది పొడుపు కథల ఆవిర్భావానికి కారణమైంది. వీటిలో కొన్ని వాతావరణానికి సంబంధించినవి, కొన్ని పంటలకు సంబంధించినవి:

అ) చిత్త చిత్తగించి, స్వాతి చల్ల జేసి
విశాఖ విసరకుంటె, అనూరాధలో
అడిగినంత పండుతాను (జొన్నచేను)

ఆ) వస్తూ ఇల్లు నింపుతుంది, పోతూ పెరళ్ళు నింపుతుంది (అరికె ధాన్యం)

ఇ) స్వాతి కురిస్తే, చల్ల పిడతలోకి రావు (జొన్నలు)

**9) సంబోధనాంతాలైన పొడుపు కథలదొక రకం:**

కుతిక నలుపు గాని శితికంధరుడు గాడు
పాము కాదు, నెమలి పక్షి గాదు
గంతులిడుచు నడుచు గాని కప్పయుగాదు
దీని భావమేమి తిరుమలేశ! (ఊరపిచ్చుక)

**10) కూటములు:**

వేదాంత సంబంధమైన పొడుపు కథలివి. తాత్త్వికార్థం కలిగి ఉంటాయి. ఒక్కొక్కసారి వీటిలో పదాలు అశ్లీలంగా ఉన్నా అర్థం తాత్వికంగా ఉంటుంది. ఇది వీరబ్రహ్మం, సిద్దయ్య సంవాదం రూపంలో ఉంటుంది.

సిద్దయ్య: బోడివాడెవడయ్య ? బొచ్చు వాడెవడయ్య ? .
మొల చుట్టు కత్తులున్న వాని పేరెవరయ్య?
పోతులూరో, శివపోతులూరో ?

వీరబ్రహ్మం: బోడివాడు వెలక్కాయ, బొచ్చువాడు కొబ్బరికాయ
మొలచుట్టు కత్తులున్న వాని పేరు వంకాయ
సిద్దయ్య గారూ, జ్ఞాన సిద్దయ్య గారూ!

సిద్దయ్య: ఊరుకొన్నదేదయా ? ఊగులాడే దేదయ్యా?
కాళ్ళ సందుదే దయా ? కమ్ముకొచ్చే దేదయా?
పోతులూరో, శివపోతులూరో?

వీరబ్రహ్మం: ఊరుకొన్న దావయా, ఊగులాడేది దూడయా
కాళ్ళ సందుది ముంతయా, కమ్ముకొచ్చేవి పాలయా
సిద్దయ్య గారు, జ్ఞాన సిద్దయ్యగారూ!

**11) కొన్ని పొడుపు కథలు విశ్వంలోని ఖగోళ వస్తువులను గురించినవి:**

ఆకాశం, నక్షత్రాలు, చంద్రుడు మొదలైనవాటిని ఉపమేయంగా కలవి.

చాపచుట్టనూ లేము
రూకలెంచనూ లేము (ఆకాశం, చుక్కలు)

కొన్నిటిలో ఆకాశం, చంద్రుడు మొదలైన ప్రకృతి వస్తువులే ఉపమానాలుగా ఉంటాయి. విప్పాల్సిన విషయం వేరే ఉంటుంది.

ఆకాశంలో ఉంటుంది - కాని మేఘం కాదు

తోకతో ఉంటుంది - కాని ఎద్దు కాదు

అటు ఇటు ఎగురుతుంది - కాని పక్షి కాదు

పట్టు తప్పితే చాలు - పరుగులేస్తుంది (గాలిపటం)

మాను గడను బోలు - ఆకు హస్తమును బోలు

పువ్వు చందమామను బోలు - కాయలరసి చూడ

కాయు రుద్రాక్షలై (ఆముదం చెట్టు)

**12) ప్రకృతిలోని చెట్లు చేమలు, ఆహార పదార్థాలు లెక్కకు మించి పొడుపు కథలో దాగి ఉన్నాయి.**

పొడుపు కథల ఉత్పత్తికీ ప్రకృత్యారాధకుడైన మానవుడి మనస్సుకీ సంబంధం ఉందని విద్యాంసుల నమ్మకం ప్రకృతిలో మన చుట్టూ కనిపించే వస్తువులనేకం. వీటిలో కొన్ని అద్భుతమైన వర్ణనలు, మరికొన్ని వస్తువుల గుణాన్ని తెలిపేవి కొన్ని ధ్వని ప్రధానమైనవి.

1) చక్కని స్తంభం
చెయ్యని గుండి
పొయ్యని నీరు
వెయ్యని సున్నం (కొబ్బరికాయ)

2) చింపిరి చింపిరి గుడ్డలు
ముత్యాల వంటి బిడ్డలు (మొక్కజొన్న కంకి)

3) ఓరోరి అన్నరో
నీ వొళ్ళంతా ముళ్ళురా
కారాకు పచ్చురా
నీ కండంతా చేదురా (కాకరకాయ)

4) కుండనిండా ఉండ్రాళ్ళు
కుండకు తాళం (వెలగ పండు)

5) గుడి నిండా ముత్యాలు
గుడికి తాళం (దానిమ్మపండు)

**13) కొన్ని పొడుపు కథల్లో 'తానతందా నితాన' అనే ఊతపదం జానపద గేయాల్లో ఉన్నట్లే పొడుపు కథల్లోనూ కనిపిస్తుంది.**

తానతందాని తాన

తక్కతై తాన తందాని తాన

నల్లనల్లని పక్షి యొకటి

నడినెత్తిన రెక్కలు వచ్చే
చెవుల సందున కొమ్ములొచ్చే ॥తందానతాన॥
దాని పచ్చ రత్నములు
కత్తి కత్తిన కోసి
బ్రాహ్మలన బంటులన
బంతిన భోంచేసిరంట – కాని తందానతానా
ఇంత చెప్పిన వేదశాస్త్రం
తెలియ దాయె దాని భావం
దాని భావం బట్టబయలు (అరటిపండు)

**14) తాత్వికార్థం గల పొడుపు కథల్లో చెప్పే ఉపమానాలు, రూపకాలు సామన్యమైనవిగా ఉంటాయి.** కొన్నిటిలో దీనికి విరుద్ధంగా కూడా ఉండవచ్చు. అంటే లక్ష్యం చేసిన వస్తువు చాలా సామాన్యమైంది. కాని పైకి మాత్రం చాలా గంభీరంగా ఉంటుంది.

ఊరూ రవతల
ఉత్తరానకవతల
జమ్మి చెట్టవతల
జాలా దవతల
పుంజులేని పెట్ట
గుడ్లు పెట్టింది (పుట్ట కొక్కు)

**15) పొడుపు కథల్లో కూడా కవితాంశలేక పోలేదు.** కొన్నిటిలో అద్భుతమైన పదచిత్రాలు కనిపిస్తాయి. ఈత చెట్టును గురించి పొడుపును విసరే జానపదుడంటాడు.

అడవిలో అక్కమ్మ
తలవిరబోసుకుంది

ఇంకో అద్భుత చిత్రం ఈ క్రిందిది

ఒంటి స్తంభం మేడపైన
ఒప్పగు చలిపందిరి
చలువ నీటి కుండల్లో
చవులూరే మీగడ (కొబ్బరి)

**16) గణితానికి సంబంధించినవి, గణితాన్ని ఉపయోగించుకునేవి కొన్ని పొడుపు కథలు.** కొన్నిట్లో ఏదో ఒక లెక్క ఉంటుంది. మరికొన్ని సంఖ్యలను మాత్రం చెప్పి ఏదో విషయాన్ని సూచిస్తాయి.

ఒక గుడిలో
ముగ్గురు దొంగలు (వేరుశెనగ కాయలు)
ఒకటి వచ్చింది
పదహారింటిని తాకింది
నూరై వెలసింది
రెండై పోయింది (పళ్ళు దోము పుల్ల)
పండు పండుకు ముప్పది విత్తులు
15 విత్తులు నలుపు
15 విత్తులు తెలుపు (వెన్నెల-చీకటి)

పొడుపు కథ కాలక్షేపానికి మాత్రమే కాదు. ఇది వినోద సాధనం మాత్రమే కాదు, విజ్ఞాన సాధనం కూడా.

## 11.3. నమూనా ప్రశ్నలు:

1) తెలుగు సామెతల గురించి రాయండి?

2) పొడుపు కథల లక్షణాలను, రకాలను సోదాహరణంగా వివరించండి?

## 11.4. ఆధార గ్రంథాలు:

ఆంధ్రుల జానపద విజ్ఞానం - డాక్టర్ ఆర్వీయస్ సుందరం

**- డా॥ ఇరపని మాధవి**

**మాదిరి ప్రశ్నాపత్రం**

**303TL21**

# జానపద సాహిత్యం

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**ఈ క్రింది ప్రశ్నలలో ఐదింటికి సమాధానాలు రాయండి.**

**అన్నింటికి మార్కులు సమానం.**

1. జానపద విజ్ఞానాన్ని వర్గీకరించి, ప్రయోజనాలు తెలుపండి?
2. జానపద సాహిత్యానికి ప్రాచ్య పాశ్చాత్యులు చేసిన కృషిని విశదీకరించండి?
3. శిష్ట, జానపద సాహిత్యాల తులనాత్మకతను చర్చించండి?
4. జానపద గేయ లక్షణాలు తెలిపి వర్గీకరించండి?
5. వేడుక పాటలు, స్త్రీల పాటలను గురించి వివరించండి?
6. వీరగాథల స్వరూప స్వభావాలను విశ్లేషించండి?
7. అద్భుత, కరుణా రస కథా గేయాల గురించి రాయండి?
8. జానపద గద్యాఖ్యానాలను వర్గీకరించండి?
9. ఐతిహ్యాలు, పురాగాథల గురించి చర్చించండి?
10. సామెతలను సోదాహరణంగా వివరించండి?